సంపుటి: 21
సంచిక : 4

ఫోన్ నెం.
36959

అపరాధ పరిశోధన

డిటెక్టివ్ కథల మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 30 రూపాయలు
ఉచిత చందా డిపాజిట్టు 250 రూపాయలు.

జూన్, 1976

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి
అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల
సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
కంచర్ల రమణ
ఏ. వీ. మోహన్రావ్

తొలిమాట

నమస్కారము. "అపరాధ పరిశోధన"ను పూర్తిగా క్రైమ్ కథల పత్రికగా తీర్చిదిద్దటం అనేకమందికి నచ్చితే, కొంతమంది ఆగ్రహం కూడా వెలిబుచ్చారు. వారికి మా మనవి ఒక్కటే. "అపరాధ పరిశోధన"ను ప్రారంభించిన కొత్తలో సామాన్యంగా ఏ పత్రికకు శీర్షికలు వుండేవి కావు. అటువంటప్పుడు "అపరాధ పరిశోధన" రకరకాల శీర్షికలు ప్రారంభించి పాఠకులకు కొత్త అనుభూతులు కల్గించింది.

ఇప్పుడు పత్రికలు చాలా అయ్యాయి. ప్రతి పత్రికలోను లెక్కకు మించి శీర్షికలు వుంటున్నాయి. అందువలన ఇక "అపన"లో శీర్షికలు అవసరం లేదని భావించాము. అయినా కథలకు ఆటంకం కల్గించని విధంగా కొన్ని శీర్షికలను, పోటీలను ప్రచురిస్తూనే వున్నాము. ఎప్పుడూ కొత్తదనం, వెరైటీ అందించాలనేదే "అపన" తపన.

కొందరు పాఠకులకు చిన్నటైపు వాడటం నచ్చలేదు. వారి కోరిక ప్రకారం యీ నెల పెద్ద టైపునే వాడాము. గెటప్‌లో కూడా మరికొద్ది మార్పు తీసుకువచ్చాము. ఉత్తమ స్థాయి కథలు అందించాలన్నది మా ప్రయత్నం.

గతనెల "సప్లిమెంట్"లో నిర్వహించిన బ్యాలెట్‌లో శ్రీ సుజనశ్రీగారి నవల 'వజ్రాల వేట' ఉత్తమ నవలగా అత్యధిక మెజారిటీతో ఎన్నికైనదని తెలుపుటకు సంతోషిస్తున్నాము. రచయితకు రు. 116/-లు బహుమతి అందజేయబడినది. సెలవా మరి—

మీ

—శ్యామ దామోదర్ రెడ్డి

ఈ నెలలో....

కథలు (మాసపత్రిక)

4. పగటి దొంగ — కురుమద్దాలి విజయలక్ష్మి.
33. మంచులోయల్లో - మరణగండం
—డా॥ పెందుర్తి మాస్టర్జీ.
46. ఖైదీ రాంబాబు—ఏ. వీ. మోహన్రావ్.
61. అపాయాలను జయించాలి—కె. విజయశేఖరరెడ్డి.
73. జుమీలియా—ముద్దా సురేష్.
100. మన్నుతిన్న పాము—బెల్లంకొండ నాగేశ్వరరావు.
110. లోకంతో పనిలేదు—వి. ఎస్. తెన్నేటి.
121. దిగంబర శవాలు—డాక్టర్ పెందుర్తి మాస్టర్జీ.
154. శత్రుశేషం—మిస్. సురేఖ.
181. పరలోక ప్రాప్తి (సీరియల్)—రమణశ్రీ.

నవలలు (సప్లిమెంట్)

3. ప్రాణాలకు పదిలక్షలు—శ్యాంబాబు.
66. తెరవెనుక న్యూస్—సుజనశ్రీ.
112. తిరిగిరాని ఖైదీలు—సంపత్.
147. నా పేరే భగవాన్—కురుమద్దాలి విజయలక్ష్మి.
187. ఖైదీ (సీరియల్)—ఏ. వీ. మోహన్రావ్.

ఇవికాక—చెప్పుకోండి చూద్దాం, అపరాధ పరిశోధన పోటీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, సప్లిమెంట్ పోటీ, క్రైమ్‌లో తమాషాలు, జోక్స్, మరెన్నో ఆకర్షణలు!!!

పగటి దొంగ

కురుమద్దాలి విజయలక్ష్మి

"పట్టపగలే దొంగలు పలురకాల వేషాలతో తిరుగుతున్నారు. దొంగెవరో, పెద్దమనిషెవరో తెలుసుకోలేకుండా ఉన్నాము. జాగ్రత్త విమలా! మీ పక్క భాగం వాళ్ళుకూడా లేరనుకుంటాను?" అంది సరళ.

"తిరుపతి మొక్కు తీర్చుకోటానికి వెళ్ళారు. అయిదు రోజులదాకా రారు," అంది విమల.

"మీవారు ఉన్నారా? క్యాంప్ కెళ్ళారా?"

"వారు లేరు. క్యాంప్‌కి నిన్ననే వెళ్ళారు. అయిదు రోజులదాకా రారు."

"మరి ఒంటరిగా భయం వెయ్యదే విమలా! ఎలా ఉంటావ్?"

"ఫరవాలేదు. రాత్రిళ్ళు పడుకోటానికి ఆఫీసు జమాను కొండయ్య వస్తున్నాడు. పగలేం భయముంటుంది?"

"ఇప్పుడు రాత్రిళ్ళు దొంగలు రావటం లేదు. పగలే బైలుదేరారు దొంగలు."

విమల నవ్వి ఊరుకుంది.

"ఎగతాళి కాదు విమలా? మొన్న పరంధామయ్యగారింట్లో మిట్టమధ్యాహ్నం ఏం జరిగిందో తెలుసా? దొంగతనం....ట్రాన్‌సిష్టర్ రేడియో, టెర్‌లిన్ బట్టలు పోయాయి."

"ఏం ఇంట్లో మనుషులు లేరా!"

"మనుషులా? అరడజనుమంది ఉన్నారు. అందరి కళ్లలో కారం కొట్టి మతి చలించిన మనిషిలా ఓ చుట్టంలా ప్రవేశించి పిచ్చిగా వాగుతుంటే, నిజంగా మతిలేని మనిషనుకున్నారుట ఆ దొంగని. జాగ్రత్త! ఎవరినీ నమ్మటానికి లేదు ఈ రోజుల్లో."

"ఓ మనిషి ఓ మనిషిని మోసం చెయ్యాలంటే అవతలివారు తెలివితక్కువ వారయి ఉండాలి. నేనంత తెలివితక్కువదాన్ని కాదులేవే సరళా!"

విమల నవ్వుతూ అంటుంటే సరళ విసుక్కుంది.

పట్టపగలు ఏఏ వీధిలో ఎవరెవరి ఇళ్ళల్లో ఎలా దొంగ ప్రవేశించి ఏవిధంగా ఇంటివాళ్లను మస్కా కొట్టి, ఎలా దొంగతనం చేసి పారిపోయింది, వివరంగా చెప్పింది సరళ.

"సరెలే, నా జాగ్రత్తలో నే ఉంటాను. పగలే కాబట్టి పరవాలేదు. రాత్రిళ్ళు పడుకోటానికి ఎలాగూ జమాను కొండయ్య వస్తాడు," అంది విమల.

"జాగ్రత్తగా ఉండవేవ్ విమలా!" మరోసారి హెచ్చరించి విమల స్నేహితురాలు సరళ వెళ్ళిపోయింది.

శాంతారాం పిక్చర్ "స్త్రీ" లాస్ట్ డే ఆ రోజు.

ఇంటికి తాళంవేసి, మ్యాట్నీకి వెళదామనుకున్న విమల, సరళ చెప్పిన పగటి దొంగల దొంగతనాలు విని, పిక్చర్‌కి వెళ్లటం విరమించుకుంది.

ఇంట్లో మనిషి ఉన్నది వేరు. ఇంటికి తాళంకప్ప వేలాడుతూ ఉండటం వేరు.

సొంత కొంప కావటంవల్ల అందమైన చిన్న డాబా చుట్టూ ఖాళీ జాగా ఎక్కువతో తనిష్టప్రకారం కట్టించాడు భర్త బలదేవ్. రక రకాల చెట్లు, కూరల పాదులు, పూల చెట్లలో ఓ పాతిక రకాలు. ఓ పక్క అయిదు రకాల రంగుల గులాబీ పొదలు. చెట్టూ చేమలతో కళకళలాడుతూ కిక్కిరిసి ఖాళీ ప్రదేశం కాస్తంత కూడా లేకుండా చేసింది తను. కాంపౌండ్ చూడబోతే ఆరడుగుల ఎత్తులో ఇంటి చుట్టూ ఉంది.

ఇంటి వెనుక ఎవరో ఏనాడో కొని పడేసిన ఖాళీ స్థలం ఆరొందల గజాలది పిచ్చిమొక్కలతో ఉంది. ఓ పక్కగా వున్న ఇంట్లో ఆఫీస రెవడో ఉన్నాడు. కొత్తగా బదిలీ అయి వచ్చాడు. ఫామిలీని తీసుకురాలే దింకా. ఈ పక్కగా ఉన్న ఇంట్లో కాలేజీ స్టూడెంట్స్ నలుగురు కలిసి ఉంటు న్నారు. వాళ్ళు నలుగురు ఏ టైమ్‌లో ఇంటిపట్టు నుంటారో ఆ నలుగురిలో ఒక్కడికీ తెలియదు.

తన ఇంటి మూడువైపులా పరిస్థితి ఇలా ఉంటే ఇంటి ఎదుట రోడ్డు. రోడ్డు దాటంగానే ఎదుటి ఇంట్లో ముస్లిమ్స్ ఫామిలీ ఉన్నారు. ఘోషా, బైటకు కనపడరు.

వంటరిగా తోచదని పక్క పోర్షను అద్దెకిస్తే, వాళ్ళు తిరుపతి వెళ్ళారు! భర్తకి క్యాంప్‌కి తప్పదు కాబట్టి ఉద్యోగ

ధర్మం ప్రకారం వెళ్లాడు.

ఈ ఇంటి పరిస్థితులు ఇలా ఉండగా, సరళ చావు కబురు చల్లగా, పట్టపగలే దొంగతనాలు ఎక్కువయ్యాయని చెప్పి వెళ్ళింది.

తను ఇంటికి తాళం వేసి మ్యాట్నీకెళ్ళి ఇంట్లో అడుగు పెట్టేసరికి ఇల్లంతా ఊడ్చిపెట్టేసి పోతే? అమ్మో? ఇంకేమయినా ఉందా? పిక్చర్ మళ్ళీ వచ్చినప్పుడు చూడొచ్చు. సామాను పోతే మళ్ళీ ఈ కరువు రోజుల్లో మళ్ళీ కొనగలమా.

ఆలోచించి విమల పిక్చర్‌కి వెళ్ళటం విరమించుకుంది.

సర్దిన సామానే సర్దటం, తుడిచిన వస్తువునే తుడవటం, ఎల్లవేళలా ఇల్లు నీట్‌గా ఉంచటం విమల అలవాటు.

శుభ్రంగా ఉన్న ఇంటిని మరోసారి శుభ్రం చేయటం మొదలుపెట్టింది.

పనంతా అయేటప్పటికి మధ్యాహ్నం రెండయింది.

విమలతోపాటే వాళ్ళ ముద్దుల పంట, ఐదేళ్ల రాజు తోకలా తిరుగుతూ చిన్నచిన్న సామాన్లు అందిస్తూ కబుర్లు చెప్పాడు.

ఎండా కాలం కావటంవల్ల, అంతవరకూ కాసేపన్నా కూర్చోకుండా పని చేయటంతో విమలకు వళ్లంతా చీదరగా అనిపించింది.

ఓ గంట రెస్టుగా ఏ పుస్తకమో తిరగేస్తూ పడుకోవాలని పించినా, స్నానం చేసి పడుకుంటే హాయిగా ఉంటుందని, వీధి తలుపు గడియవేసి, రాజుతో చెప్పి ఇంటి వెనుకవైపు ఓ పక్కగా కట్టించిన బాత్‌రూంలో దూరింది విమల.

2

ముందు గదిలో కూర్చుని అర్థం కాకపోయినా ఆ నెల "అపన" ముఖచిత్రం తీవ్రంగా చూస్తున్న రాజుకి చటుక్కున ఏదో ఆలోచన తట్టి "అపన" చేత్తో పుచ్చుకుని సరాసరి దొడ్లోకి వచ్చి బాత్ రూమ్ వద్దకు వెళ్ళాడు.

విమల స్నానం చేస్తున్న నీటి చప్పుడు రాజుకి వినిపిస్తున్నది.

"మమ్మీ!" చిన్నగా పిలిచాడు రాజు.

"దేనికి రాజూ?" విమల బాత్ రూమ్‌లోంచి అడిగింది.

"మరి....మరి....ఈ బుక్ మీద బొమ్మ ఇలా వేశారేంటి? తలకాయలన్నీ చెట్టుకి వేళ్లాడుతున్నాయి."

"ఏ బుక్ మీద?" విమల లోపలినుంచి అడిగింది.

రాజు "అపరాధ పరిశోధన" పేరు చెప్పలేకపోయాడు. కాన్వెంట్‌లో ఇంగ్లీషు మీడియం రాజు చదివేది. ఇప్పుడిప్పుడే విమల తెలుగక్షరాలు యింట్లో చెప్తుంటే కూడబలుక్కుంటూ చదవటానికి ప్రయత్నిస్తున్నాడు రాజు.

"మమ్మీ! మమ్మీ! ఈ బుక్ మీద మొదటక్షరం అ" అన్నాడు రాజు.

రాజు అపన ముఖచిత్రంమీద బొమ్మ చెప్పంగానే, రాజు చేతిలో ఉంది అపరాధ పరిశోధన మాసపత్రిక అని తెలుసుకుంది. కాని....తెలీనట్లు "ఏ బుక్ మీద?" అని అడిగింది.

"మొదటి అక్షరం "అ" అయితే మరి రెండో అక్షరం పేరు చెప్పు" అంది విమల.

రాజు "ప" అక్షరంని రెండు నిమిషాలు తదేకంగా చూచి దీర్ఘంగా ఆలోచించాడు. ప....అక్షరాన్ని "ప"

అంటారా? "బ" అంటారా? కరెక్ట్‌గా చెప్పకపోతే మమ్మీ నవ్వుతుంది.

"రెండో అక్షరం తెలియలేదురా రాజూ?" విమల స్నానం అయింది. టవల్‌తో వళ్ళు తుడుచుకుంటూ అడిగింది.

రెండో అక్షరం "ప" మమ్మీ! రాజు అవునా, కాదా? సందిగ్ధావస్థలోనే వుండి "ప" అని చెప్పాడు.

"గుడ్, కరెక్ట్‌గా చెప్పావు రాజూ!" విమల సంతోషంతో అంది లోపలినుంచి.

రాజు ఆనందంతో పొంగిపొయ్యాడు. తను కరెక్ట్‌గా "ప" అక్షరం చెప్పగలిగినందుకు.

రాజు "ప" అక్షరం గురించి ఆలోచిస్తున్నప్పుడు, ఓ చేతిలో అపన పుస్తకం ఉంది. రెండో చెయ్యి బాత్‌రూమ్ తలుపు బోల్టుమీద ఉంది. బోల్టుని అటూ ఇటూ తిప్పుతూ "ప" గురించి ఆలోచిస్తుండగానే బోల్టు పడిపొయ్యింది.

రాజు గమనించలేదు, బాత్‌రూమ్ బైట బోల్టు తనేసినట్లు.

విమల చీర చుట్టుకుని, బాత్‌రూమ్ తలుపు లోపలి బోల్టు తీసి తెరవబోయింది తలుపులను.

బాత్‌రూమ్ తలుపులు తెరుచుకోలేదు. తలుపులు లాగి చూచింది విమల. రాలేదు.

"రాజూ!" విమల కంగారుగా పిలిచింది.

"ఏంటి మమ్మీ?"

"తలుపులు వేశావా?"

"ఏ తలుపు మమ్మీ?"

"బాత్‌రూమ్ తలుపు బైట బోల్టు వేశావా? చూడు."

రాజు చూచాడు,

"బోల్టు వేసుంది మమ్మీ!"

"ఎందుకేశావ్? తియ్యి తొందరగా," గదమాయించింది విమల.

రాజు బోల్టు పైకి ఎత్తబోయాడు. బోల్టు పైకి రాలేదు.

బాత్‌రూం తలుపులకి కొత్తరకం బోల్టులు పెట్టించారు. బోల్టు వేసేటప్పుడు తీసేటప్పుడు వత్తి లాగితే గాని బోల్టు లింక్ ఊడదు. తలుపులు రావు. రాజుకి తెలియదు. బోల్టుని పట్టుకుని లాగుతున్నాడు. ఊడి రావటంలేదు అది.

బాత్‌రూమ్‌లోంచి బైటకు రావటానికి మరో మార్గం లేదు. బాత్‌రూమ్ పై వైపు స్లాబ్‌తో చేసి మూసివేసిన మోడల్‌ది. చిన్న కిటికీ మాత్రం గోడ పై వైపు ఎత్తుగా వుంది అంతే. బాత్‌రూమ్ తలుపులు గట్టివి.కొత్తగా పెట్టించినవి, ఓ పట్టాన విరగ్గొట్టినా విరగవు.

"బోల్టు రావటం లేదు మమ్మీ?" రాజు ఏడ్పు స్వరంతో భయం భయంగా అన్నాడు.

లోపల ఉన్న విమల, రాజుకి కనపడటంలేదు. అయినా అర్థమయే విధంగా ఓ చేత్తో నొక్కి బోల్టు తీస్తే గాని తలుపులు రావని వివరంగా చెప్పింది.

రాజు బోల్టుని విమల చెప్పిన విధంగా నొక్కాడు. అయితే బోల్టు పైకి ఊడివచ్చే విధంగా కాదు నొక్కింది. బోల్టు రాకుండా బాగా బిగిసిపోయేటట్లు నొక్కాడు. పెద్ద వాళ్ళు బలంగా లాగితే తప్ప బోల్టు రాదు.

విమల చెప్పిన ప్రకారం రాజు రాక్షసి బొగ్గులు కొట్టే చిన్న సుత్తితో బోల్టుమీద కొట్టాడు. చెయ్యి జారి సుత్తి రాజు కాలిమీద పడింది.

రాజు "కేవ్" మని కేకపెట్టాడు.

"ఏమయింది రాజూ?" విమల భయము, కంగారుతో అరిచింది.

"కాలిమీద సుత్తి పడింది. నెత్తు రొస్తున్నది" రాజు ఏడుస్తూ చెప్పాడు.

విమలకు ఏడుపు వచ్చింది. తల గోడకేసి కొట్టుకుందామా, అనిపించింది.

"రాజూ! ఏడ్వకు. తలుపు తీసి ఎవరినన్నా పిలుచుకురా. ఎవరినన్నా అంటే రోడ్డుమీద పోయేవాళ్ళను కాదు. ఎదురింట్లో వాళ్ళను గాని ఎవరు వుంటే వాళ్లను పిలుచుకురా, మమ్మీ బాత్‌రూమ్‌లో ఉండిపోయింది. నాకు తెలియక బైట బోల్టు వేశాను. బోల్టు తీద్దామంటే రావటంలేదు, అని వివరంగా చెప్పు. వాళ్ళొచ్చి బోల్టు తీయంగానే బైటకొస్తాను. నీ కాలి దెబ్బకు మందు రాస్తాను," విమల చెప్పింది.

"అలాగే మమ్మీ!" అన్నాడు రాజు. రెండు చేతులతో కళ్ళు తుడుచుకున్నాడు. కుంటుతూ ఇంట్లోకి వెళ్ళాడు.

రాజు కాలిమీద ఇనుప సుత్తి పడటంవల్ల బాగా నెప్పి, నెత్తురు రావటము ఎక్కువయింది. ఎవరైనా వచ్చి బాత్ రూమ్ బోల్టు తీస్తే "మమ్మీ" బైటకు వస్తుందనే ఆనందంతో కాలి బాధ మరిచిపోయాడు తాత్కాలికంగా.

3

రాజు వీధి తలుపు గడియ తీశాడు.

రాజు నడిచినంత మేర ఇంట్లో రక్తం అయింది.

రాజు తలుపు తీయంగానే ఎదురుగా మంచి దుస్తుల్లో శుభ్రంగా ఉన్న గోవర్ధన్ చేత్తో సంచీ పట్టుకుని కనిపించాడు.

రాజు ఎప్పుడూ గోవర్ధన్‌ని చూడలేదు.

గోవర్ధన్, రాజుని చూచి తెల్లబోయాడు.

గోవర్ధన్ ఎత్తుకు తగిన లావుతో హుందాగా ఉంటాడు. చురుకైన చూపులు, నల్లని ఉంగరాల రింగుల క్రాపు, సైడ్ లాక్స్. చామనఛాయ, టినోపాల్ ఏజంట్‌లా తళ తళ, మిలమిలలాడే తెల్లని దుస్తులు. రచయిత్రులు రాసే నవలలో హీరోలా ఉంటాడు.

అయితే, గోవర్ధన్ నవలా నాయకుడు కాదు. సినిమా హీరో కాదు. దొంగ. మామూలు దొంగ కాదు, పగటి దొంగ. చాకచక్యంగా మాటలు చెప్పగలడు. తన మాటలు వింటున్నవాడిని బుట్టలో పెట్టి వారెదురుగుండానే వారి సామాను సంగ్రహించి మాంత్రికుడిలా మాయం కాగలడు.

గోవర్ధన్ కొండను ఢీకొనే ఆవేశంతో వెనకా ముందూ చూడకుండా పనిలో దిగడు. ఏ పని చేసినా ప్లాన్ ప్రకారం చేస్తాడు.

దొంగతనానికి తనెన్నుకునే ఇంట్లో జనాభా ఎక్కువ లేకుండా చూస్తాడు. ఆ ఇంట్లో ఎవరి ప్రవర్తన ఎలాంటిది? ఏఏ సమయాలలో మనుషులు ఆ ఇంటికి వచ్చి పోతుంటారు. అన్ని వివరంగా ముందే ఎంక్వయిరీచేసి....ఏ వేషంతో తానా ఇంట్లో ప్రవేశిస్తే పనవుతుందో ఆ వేషంతో వెళ్ళి, విజయం సాధించివస్తుంటాడు.

దొంగతనానికి ఈ తఫా విమలా వాళ్ళ ఇల్లు ఎన్ను కున్నాడు. విమల భర్త బలదేవ్ క్యాంప్‌కి వెళ్ళి వారం రోజులదాకా రాడని....విమల కొడుకు రాజు ఉదయం ఎని మిదింటికి కాన్వెంట్ కెళ్ళి సాయంత్రం అయిదుగంటలకు

తిరిగి వస్తాడని....విమల వంటరిగా ఇంట్లో ఉంటుందని.... సాధారణంగా మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత మూడు లోపల ఇంటికెవరూ రారని.... తెలుసుకున్నాడు.

ఇంటి చుట్టుతా చెట్లు, పూలమొక్కలు ఉన్నాయి కాబట్టి ఇల్లాలి అభిరుచి తెలుస్తూనే ఉంది. గోవర్ధన్ అందమైన చేతి సంచీతో వచ్చాడు, పరికరాలతోసహా.

తలుపు తట్టంగానే విమల తలుపు తీస్తుంది. "ఎవరండీ మీరు? ఎవరికోసం వచ్చారు?" అంటుంది.

"జూ అండ్ జా ఫ్లవర్స్ కంపెనీ ఏజంట్‌ని. మా జూ అండ్ జా కంపెనీ కొత్తరకం యాసిడ్స్ కనిపెట్టింది. మల్లె చెట్టుకి మావద్ద ఉన్న కలర్ యాసిడ్‌ని నీటిలో నాలుగు చుక్కలు కలిపి చెట్టు మొదట్లో పోస్తే, తెల్లని మల్లెపూవు మీరు కోరిన కలర్‌లో పూస్తుంది. అలాగే పూల రంగులు మార్చవచ్చు. లేని పరిమళాలు తెప్పించవచ్చు. ఇప్పుడున్న సైజు పూవుకి డబల్ పూవు పూయించవచ్చు.

మీరు ముందుగా మాకేం డబ్బు ఇవ్వక్కరలేదు. మీకు పూలచెట్లపై అభిరుచి ఉంటే ఏ పూలచెట్టుకి కలర్ మారే విధంగా మీరు కోరిన కలర్‌పూలు పూచేటట్లు మా యాసిడ్‌ని మీ కళ్ళముందే నీటిలో కలిపి చెట్టు మొదట్లో పోసిపోతాను. నెక్స్ట్‌మంత్ ఇదేరోజు మీ ఇంటికి వస్తాను. నేను చెప్పిన విధంగా కలర్ మారి పూలుపూస్తే మీరు చేయవలసింది, నావద్ద ఉన్న మా జూ అండ్ జా ఫ్లవర్స్ కంపెనీది కలర్ యాసిడ్ బాటిల్ ఒకటి కొనవలసింది. బాటిల్ టూ రుపీస్ మాత్రమే. మీకు ఇష్టం లేకపోతే వద్దని చెప్పవచ్చు.

మా కంపెనీ మోసంది కాదని తెలియజేయటానికి, ముందుగా....ఫ్రీగా....మీలాంటి పూలచెట్లపై అభిరుచి ఉన్న

వారికి, మా ఖర్చుతో ప్రయోగం చేసి చూపిస్తాము." గబ గబ పాఠం చెప్పినట్లు చెపుతాడు.

విమల బుట్టలో పడిపోతుంది ఆశ్చర్యంతో "నిజంగానా? ఏదీ చూపించండి." అంటుంది.

గోవర్ధన్ తన సంచీలో ఉన్న చిన్న బాటిల్ తీసి, "ఇదే మా కంపెనీ తయారుచేసిన యాసిడ్. స్మెల్ కూడా తమాషాగా ఉంటుంది చూడండి." అంటాడు.

సీసాలో ఉన్నది మత్తుమందు. విమల పీలుస్తూనే స్పృహ తప్పి పడిపోతుంది. వెంటనే చకచక ఇంట్లో వున్న వస్తువులు సంగ్రహించి వెళ్ళిపోతాడు. విమలకి రెండు గంటల తర్వాత స్పృహ వస్తుంది. లబోదిబో అంటుంది.

ఈ ప్లాన్ ప్రకారం తయారయి వచ్చాడు గోవర్ధన్.

సెకండ్ సాటర్ డే కావటంవల్ల రాజు ఇంట్లో ఉంటాడని గోవర్ధన్ మరచిపోయ్యాడు. ఎంత తెలివిగలవారయినా ఏదో చిన్న విషయంలో పొరపడతారు.

"ఇవాళ బడికి వెళ్ళలేదా? ఇంట్లో వున్నావేం?" గోవర్ధన్ తనేం అడుగుతున్నాడో తెలుసుకోకుండా అడిగేశాడు.

వచ్చినతను మమ్మీకి తెలిసి ఉండొచ్చు అందుకే తన గురించి అడుగుతున్నాడు అనుకున్నాడు రాజు.

విమలకు తెలిసినవాళ్ళు, బలదేవ్‌కి తెలిసిన మిత్రులు వస్తే, వాళ్ళను "అంకుల్" అని పిలవమని చెప్పేవారు రాజుతో.

గోవర్ధన్‌ని చూడంగానే "అంకుల్" అనిపించింది రాజుకి. బహుశా మమ్మీకి తెలిసిన అతనై ఉండొచ్చని తలిచాడు. "అంకుల్! నీకు తెలియదా? ఈరోజు సెకండ్ సాటర్ డే." రాజు అన్నాడు.

రాజు ఇంట్లో ఉన్నాడు. రాజు తల్లిగాక ఇంకెవరయినా ఇంట్లో లేరుకదా? ఇంకెవరైనా ఉంటే తనొచ్చిన పని విఫలం అవుతుంది. రాజు ఒక్కడే అయితే ఫరవాలేదు. ఉపాయంతో తనొచ్చిన పని సఫలం చేసుకుపోవచ్చు.

"ఏంటి అంకుల్ ఆలోచిస్తున్నావు?" గోవర్ధన్‌ని పరీక్షగా చూస్తూ అడిగాడు రాజు.

"ఇంట్లో నీవూ, మీ అమ్మాగాక యింకెవరైనా వున్నారా?"

"డాడీ క్యాంప్ కెళ్ళారుగా? నేనూ మమ్మీ మాత్రమే ఉన్నాము."

"మమ్మీ ఎక్కడుంది?"

రాజుకి అప్పుడు గుర్తుకొచ్చింది.

"అంకుల్! మమ్మీ బాత్‌రూమ్‌లో ఉంది. స్నానం చేస్తుంటే నాకు తెలియక బైట బోల్ట్ బిగించాను. ఎంత తీసినా రాలేదు. ఎవరినన్నా పిలుచుకురమ్మని చెప్పింది. అంకుల్, నువ్వొచ్చావుగా బోల్ట్ తీయి, మమ్మీ బాత్‌రూమ్ నుంచి బైటకు వస్తుంది. సుత్తితో కొట్టినా బోల్ట్ రాలేదు. సుత్తి నా కాలిమీద పడింది. చూడు నెత్తురు కూడా వస్తున్నది."

గోవర్ధన్‌కి అర్థమయిపోయింది.

"అరెరె. బాగా నెత్తురు వస్తున్నది. నావద్ద మంచిమందు ఉంది వేస్తాను, పద మమ్మీని ముందుగా బాత్‌రూమ్ లోంచి బైటకు విడిపిద్దాము."

రాజు లోపలికి నడిచాడు.

గోవర్ధన్, రాజు వెనుకనే బైలుదేరుతూ వీధి తలుపులు లోపల గడియ వేశాడు.

గోవర్ధన్, రాజు పెరట్లోకి వచ్చారు.

పెరట్లో కూరల పాదులు వున్నాయి. ఓ మూలగా బాత్ రూమ్, లెట్రిన్ ఉన్నాయి.

"అదిగో, అదే బాత్‌రూమ్." రాజు వేలుతో చూపిస్తూ చెప్పాడు.

"నేనో తమాషా చేస్తాను. చూడు," గోవర్ధన్ సంచీ లోంచి మత్తుమందు బాటిల్ తీస్తూ అన్నాడు.

గోవర్ధన్ ఆగి సంచీలో చెయ్యిపెట్టి చిన్న బాటిల్ తీయటం చూచాడు రాజు.

"అదేంటి అంకుల్?"

"ఇది .... ఇది .... కొత్తరకం మందు. బోల్ట్ ఊడి రాదనుకో దానిమీద ఓ చుక్క వేస్తే బోల్ట్ లూజ్ అయి ఊడి వస్తుంది. స్మెల్ చూడు స్వీట్‌గా ఉంటుంది." బాటిల్ మూత తీసి అన్నాడు గోవర్ధన్.

రాజు పసితనం వుషారుతో బాటిల్‌లో ఉన్న మత్తు మందుని వాసన చూచాడు. మందు పనిచేసింది. రాజు కళ్ళు మూతలు పడ్డాయి. తూలి పడబోయాడు. గోవర్ధన్ చటుక్కున రాజుని పట్టుకుని నేలమీద పడుకోపెట్టాడు.

బాత్‌రూమ్ బోల్ట్ తీస్తే విమల బైటకు వస్తుంది. అప్పుడు తను బలవంతానా గాని లేక మాటలు చెప్పిగాని మత్తు మందు వాసన చూపించి పని పూర్తి చేయించుకోవాలి. విమల తనని చూడడంవల్ల తర్వాత ఎప్పుడయినా గుర్తు పట్టే ప్రమాదం ఉంది. కాబట్టి విమల తన పని పూర్తయిందాకా బాత్‌రూమ్‌లో వుండటమే క్షేమం.

గోవర్ధన్ ఆలోచించాడు. బాత్‌రూమ్‌వైపు నడిచాడు.

బాత్‌రూమ్‌లో వున్న విమలకి దూరంగా చిన్నగా

మాటలు వినపడ్డాయి. బాత్ రూమ్ బోల్ట్ తీయటానికి రాజు ఎవరినన్నా తీసుకొస్తున్నాడనుకుంది.

బాత్ రూమ్ దగ్గరగా వచ్చి ఆగిన అడుగుల చప్పుడు వింది విమల.

"రాజూ!" అంది విమల.

"దయచేసి నే చెప్పేది జాగ్రత్తగా వినండి. నేను పగటి దొంగను. మీ ఇంట్లో ఏమయినా ఎత్తుకెళదామని వచ్చాను. మీ అబ్బాయి తలుపు తీశాడు. మీరు అరచి గోలచేసినా చుట్టుపట్ల వినిపించి సహాయంరారు. ఖర్మకాలి మీ అరుపులు విని ఎవరైనా వచ్చినా రావచ్చు. మీ అబ్బాయి క్షేమం, మీ శరీరక్షేమం కోరే వారయితే, నాపని పూర్తయ్యిందాకా నోరు మెదపక బాత్ రూమ్‌లో ఉండండి. నాకు కావలసినవి తీసుకుని వెళ్ళిపోతాను." అన్నాడు గోవర్ధన్.

బాత్ రూమ్‌లో ఉన్న విమల భయంతో బిగుసుకుపోయింది.

"నే చెప్పింది వినపడిందా?" గోవర్ధన్ గద్దించి అడిగాడు.

"వినపడింది .... వినపడింది .... రాజూ ఏడీ?" విమల ఏడుపుస్వరంతో అడిగింది.

"మీ అబ్బాయికి ఏ ప్రమాదం లేదు. కొద్దిగా ఈథర్ క్లోరోఫామ్ వాసన చూపించాను. బెడ్ రూమ్‌లో హాయిగా నిద్రపోతున్నాడు. గంటలో నిద్రలేస్తాడు. అప్పటికి నా పని పూర్తవుతుంది."

"రాజుని నావద్ద ఉంచి మీ పని చేసుకోండి, నే అడ్డం రాను."

"తలుపు తీస్తే నన్ను చూస్తారు. గుర్తుపడతారు. అదేం లాభంలేదు. మీకు గాని, మీ అబ్బాయికి గాని అపకారం

చేయను. ఎట్టి పరిస్తితులలోను అరవనని చెప్పండి. క్విక్. నా పని పూర్తిచేసుకు వెళ్ళిపోతాను. కాదంటే మీ కళ్ళ ముందే మీ అబ్బాయి ప్రాణం తీసి, మీ శరీరాన్ని నలిపేసి పోతాను," కఠినంగా అన్నాడు గోవర్ధన్.

విమల నిలువెల్లా వణికిపోయింది భయంతో.

"మీ ఇష్టమొచ్చినన్ని సామానులు మూటగట్టుకుపోండి. ప్లీజ్....రాజుని ఏమీ చేయవద్దు. వాడు లేకపోతే నే బ్రతక లేను."

"మేడమ్. నేను దొంగనుమాత్రమే, హంతకుడినికాదు. నా పనికి అడ్డం వచ్చి నాకు కోపం తెప్పించి నన్ను రాక్షసుడిలా మార్చవద్దు. అంతే నే కోరేది. మీ అబ్బాయికి ప్రమాదం ఏమీ జరగదు. నన్ను నమ్మండి. వెళుతున్నాను. పని పూర్తి కాంగానే బాత్ రూమ్ తలుపుతీసి, చెప్పివెళతాను."

గోవర్ధన్ అడుగులు చప్పుడుచేస్తూ అక్కడనుంచి రాజు వద్దకు వచ్చాడు. రాజుని భుజంమీద వేసుకుని బెడ్ రూమ్ లోకి వచ్చి బెడ్ మీద రాజుని పడుకోబెట్టాడు. ఆ తర్వాత ఇల్లంతా ఓసారి చక్కబెట్టి వచ్చాడు.

4

వంటగదిలో వెండి కంచాలు మూడు, ఓ వెండి మట్టు గిన్నె, వెంకటేశ్వర స్వామి పటం ముందు వెండిదీపం కుందులు జత, ఖరీదుగలవి తీసుకెళటానికి వీలయినవి కన పడ్డాయి. వాటిని సంచీలో సర్దేశాడు గోవర్ధన్.

బెడ్ రూమ్ రో ఖరీదైన మినీట్రాన్ సిష్టర్, టైమ్ పీస్, విమల వాచీ డ్రస్సింగ్ టేబుల్ మీద కనిపించాయి. అవీ సంచీలోకి వెళ్ళిపోయాయి.

తను మోయగలిగినన్ని రెండు సంచులు నిండే వస్తు

వులు మాత్రమే గోవర్ధన్ తీసుకెళతాడు. ఇత్తడి గిన్నెలు, బాయిలర్, ఫాన్, అలాంటివి ఎత్తుకెళ్ళడు. సామానుపైకి కనిపించకూడదు. అమ్మితే డబ్బు రావాలి. అవి ఖరీదైన చిన్న వస్తువులయి వుండాలి.

ఇల్లంతా వెతికినా తను తీసుకెళ్ళ తగ్గవి మరేవీ కనిపించ లేదు గోవర్ధన్‌కి. గాద్రేజ్ బీరువా తెరిస్తే నగలు, డబ్బు దొరకవచ్చు. అవి తీసుకుంటే తనొచ్చిన పని అయిపో తుంది, అనుకున్నాడు.

గోవర్ధన్ బీరువా తాళం చెవులకోసం బెడ్ రూమ్‌లో వెతకటం మొదలుపెట్టాడు.

తాళం చెవులు కనిపించలేదు.

వీధి తలుపు చప్పుడయింది.

"విమలగారూ! విమలగారూ! తలుపు తియ్యండి," తలుపు తడుతూ ఎవరో అమ్మాయి పిలుస్తున్నది.

గోవర్ధన్ ప్రాణం ఓసారి పైకిపోయి యధాస్థానానికి వచ్చింది.

తలుపు తీయకపోతే బైటున్న అమ్మాయికి అనుమానం వస్తుంది. తీస్తే తన్ని చూస్తుంది. అప్పుడెలా?

తీవ్రంగా ఆలోచించాడు గోవర్ధన్. చివరికి వెళ్ళి తలుపు తీశాడు.

గోవర్ధన్‌ని చూచి, తలుపు బైట నుంచున్న అమ్మాయి, సిగ్గుతో మూడు వంకర్లు తిరిగి ముడుచుకునుంచుంది.

"ఎవరు కావాలి?" గోవర్ధన్ ఇంటి యజమానిలా ఫోజు పెట్టి అడిగాడు.

"విమలగారు లేరాండీ?" బిడియంగా లోపలికి తొంగి చూస్తూ అడిగింది.

"మ్యాట్నీ సినిమాకి వెళ్ళింది. సాయంత్రందాకా రాదు. నేను విమలకు అన్నయ్య నవుతాను. విమల వచ్చింతరువాత చెపుతాను. మీ పేరు చెప్పండి." హుందాగా అన్నాడు గోవర్ధన్.

"బాజీ పుట్టినరోజు. రేపు సాయంత్రం పేరంటానికి తప్పక రమ్మని విమలగారితో చెప్పండి. పేరంటం పిలవ టానికి సావిత్రి వచ్చిందని చెప్పండి చాలు." సావిత్రి గుమ్మానికి కుంకంబరిణలో కుంకంతీసి బొట్టుపెట్టి చెప్పింది.

"అలాగే, విమల రాగానే చెబుతాను."

"తప్పక చెప్పండి, మరచిపోవద్దు," అని సావిత్రి వెళ్ళి పోయింది.

'ఈ పిల్ల వంటిమీద నగలున్నాయి. విమల లోపలుందని చెప్పి, లోపలికి సావిత్రి రాంగానే నగలన్నీ వల్చుకోవచ్చు గిల్ట్ నగలయితే టైమ్ వేస్ట్ తప్ప ప్రయోజనం వుండదు' అనుకుంటూ గోవర్ధన్ తలుపువేసి లోపలికి వెళ్ళాడు.

మరోసారి వెతికినా తాళం చెవులు కనపడలేదు.

గోవర్ధన్ పెరట్లోకి వెళ్ళి బాత్ రూమ్ వద్దకు వచ్చాడు. బాత్ రూమ్ తలుపుపై వేళ్లతో 'టక్, టక్' అంటూ కొట్టాడు.

తను రాజుని తీసుకుని మ్యాట్నీకి వెళ్ళినట్లయితే, తనకి రాజుకి ఈ ఆపద తప్పిపోయేది. సామాను పోతే పోయాయి. క్షేమంగా ఉండేవారు. రాజు ఎలా ఉన్నాడో? ఈ బాత్ రూమ్ ఇంత స్ట్రాంగ్‌గా కట్టించటం ఎంత పొర పాటయింది? ఏడుకొండలవాడా! ఈ ఆపద గడిస్తే కొండ కొచ్చి....' విమల బాత్ రూమ్‌లో దేముడికి దండాలుపెడుతూ కూర్చుంది.

తలుపుపై చప్పుడు విని "ఎవరు?" అంది విమల.

"నేనే. బీరువా తాళంచెవులు ఎక్కడా కనపడలేదు. ఎక్కడున్నాయో త్వరగా చెపితే నా పని పూర్తవుతుంది. మీరు తొందరగా బైటకు రావచ్చు." గోవర్ధన్ అన్నాడు.

బీరువా తాళం చెవులు ఎక్కడున్నాయో తను చెప్పక పోతే పగటి దొంగ తాళం చెవులకోసం వెతుకుతూ ఉండి పోతాడు. దేముడిదయఉంటే ఎవరో ఒకరు రావచ్చు. ఈ ఆపదనుంచి బైటపడవచ్చు. విమల ఆలోచించింది.

"తాళం చెవులు ఎక్కడ పెట్టానో గుర్తులేదు. బెడ్ రూమ్‌లో ఎక్కడో అక్కడ ఉంటాయి వెతకండి." అంది విమల.

"గుర్తు లేదంటే నే నమ్మను. మీ అబ్బాయి క్షేమం కోరే వారయితే తాళం చెవులెక్కడున్నాయో చెప్పండి."

"నిజంగా గుర్తులేదు. వెతికితే కనపడతాయన్నా కదా?"

"మీ అబ్బాయి చిటికెనవేలు కోసి కిటికీలోంచి మీ ముందుపడేస్తాను. అప్పుడు గుర్తొస్తాయి తాళం చెవులెక్కడున్నాయో?"

"వద్దు....వద్దు....ఆ పని చేయవద్దు. తాళం చెవులెక్కడున్నాయో చెపుతాను. బెడ్‌రూమ్ పక్కరూమ్‌లో గోడకి నిలువుటద్దం వుంది. దాని వెనకాతల పడేశాను. తప్పక అక్కడే తాళం చెవులుంటాయి చూడండి."

"గుడ్, వెంటనే అలా నిజం చెపితే నీకూ నాకూ ఏ కష్టం ఉండేది కాదు." అంటూ గోవర్ధన్ ఇంట్లోకివచ్చాడు.

విమల చెప్పినట్లుగానే తాళం చెవులు అద్దం చాటున ఉన్నాయి.

గోవర్ధన్ బెడ్‌రూమ్‌లో ఉన్న గోద్రెజ్ బీరువా తలు

పులు తెరిచాడు. సరీగా అప్పుడే మళ్ళీ వీధి తలుపు చప్పుడయింది.

5

"విమలమ్మా! విమలమ్మా! తలుపు తియ్యి." ముసలాయన గొంతు వినపడింది బైటనుంచి.

గోవర్ధన్‌కి చచ్చే కోపం వచ్చింది.

'అడుగడుగునా ఈ అడ్డంకులేమిటి? తనిప్పటికి పాతిక దొంగతనాలు పట్టపగలు ఘరానావి చేశాడు. ఎర్రటోపీలు తన్నింతవరకు పట్టుకోలేదు. ఎప్పుడు దొంగతనానికి వెళ్ళినా ఇలా వెళ్ళటం అలా వచ్చేయటం క్విక్‌గా జరిగిపోతున్నది. విమలమ్మా! అనుకుంటూ మళ్ళీ ఎవడో వచ్చాడు.'

గోవర్ధన్ ఆలోచించాడు. వెంటనే వంటినున్న షర్టుతీసి వంకెన తగిలించాడు. టర్కీటవల్ భుజాన వేసుకుని ముఖం టవల్‌తో తుడుచుకుంటున్నట్లు నటిస్తూ వీధి తలుపు తీయటానికి వెళ్ళాడు. పాంట్ జేబులో కత్తి రెడీగా ఉంది. బైట వున్న ముసలాయన మళ్ళీ తలుపుతడుతూ "విమలమ్మా! విమలమ్మా!" అంటూ పిలుస్తున్నాడు.

గోవర్ధన్ తలుపు తీశాడు.

విమలమ్మా అంటూ వచ్చి నాయనకు అరవై ఏళ్ళ పైనుంటాయి. మాసి పోయిన ధోవతి, గూడ మీద మాసిక వేసిన లాల్చి, భుజం మీద కండువా, బట్టతల, చవకరకం ఫ్రేమ్ కళ్ళజోడు. బతకలేని బడిపంతులు లాగా వున్నాడు ముమ్మూర్తులా.

"చెల్లాయి లేదండీ," అన్నాడు గోవర్ధన్ టవల్‌తో ముఖం అద్దుకుంటూ.

"ఈ సమయంలో అయితే ఇంట్లో వుంటుందని ఆశపడి

వచ్చాను. ప్చ. లేదన్నమాట....విమలమ్మ ఎక్కడికెళ్ళింది బాబూ?" నిరాశ నిస్పృహలతో అడిగాడు ముసలాయన.

"మ్యాట్నీ సినిమాకి వెళ్ళింది. అటునుండి షాపింగ్‌కి కూడా వెళ్ళి రాత్రి ఏడు ఎనిమిదింటికి వస్తుంది."

"నీ పేరేంటి బాబూ?"

"గో....గోపీనాధ్ అండీ!"

"చూడు నాయనా గోపీనాధ్! విమలమ్మకి అన్న లెవరూ లేరు. నీవు అన్నయ్యనని చెప్పినట్లున్నావు?"

'వీడెమ్మ కడుపు కాల, సీ. ఐ. డీ. ఆఫీసర్‌లా ప్రశ్న వేస్తున్నాడే?' గోవర్ధన్ గతుక్కుమని సర్దుకున్నాడు.

"విమలకు అన్నయ్యనని నే చెప్పలేదండి. చెల్లాయి లేదన్నాను అంతే. నేను విమలకు కజిన్‌ని," నవ్వుతూ చెప్పాడు గోవర్ధన్.

"అలా చెప్పు", అన్నాడు ముసలాయన సర్వం అర్ధమయిపోయినట్లు.

"ఈ శనిగ్రహం ఇంకా కదలదేం?" లోలోపల విసుక్కున్నాడు గోవర్ధన్.

"అయితే విమలమ్మ రాత్రి ఏడుదాటితే తప్పరాదన్న మాట!"

"రాదండి."

"మీదేవూరు గోపీనాధ్?"

"అమలాపురం అండి."

"అమలాపురమా? నా మిత్రుడు ఉమాపతి ఆ వూళ్ళోనే ఉన్నాడు. ఉమాపతి నీకు తెలుసా? ఇంటి పేరు వాద్రేవు వారు."

"ఆ పేరు గలవారు ఎవరూ తెలియరండీ!" విసు

క్కుంటూ అన్నాడు గోవర్ధన్.

"విమలమ్మ వచ్చిం తరువాత వస్తాను. కాస్త మంచి తీర్ధం ఇచ్చావంటే వెళ్ళిపోతాను. దూరం నుంచి నడచి వచ్చానేమో నాలుక పిడచకట్టుకు పోతున్నది." అన్నాడు ముసలాయన, గోవర్ధన్ చిరాకు గమనించి.

"మంచినీళ్ళకేం భాగ్యం, ఉండండి తెచ్చిస్తాను. తాగి వెళుదురుగాని."

'రూపంలో ఉన్న సౌమ్యం మాటలో లేదు. ఈ కాలం పిల్లలకు ఓర్పు, శాంతం బొత్తిగా లేవు.' వెళుతున్న గోవర్ధన్‌ని చూపి అనుకున్నాడు ముసలాయన.

గోవర్ధన్ పెద్ద గ్లాసునిండా చల్లని మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాడు.

"దప్పిక తీర్చటం మించిన పెద్ద దానం మరొకటి లేదన్నారు పెద్దలు. చాలు బాబూ! దాహం తీరిపోయింది. నేవచ్చి వెళ్ళినట్లు విమలతో చెప్పు అన్నట్లు రాత్రి ఎనిమిది గంటలకు వస్తానని చెప్పు." కాళీగ్లాసు ఇస్తూ అన్నాడు ముసలాయన.

"అలాగే తప్పకుండా చెబుతాను."

ముసలాయన వెళ్ళటానికి వెనుదిరిగినవాడు గిరుక్కున మళ్ళీ గోవర్ధన్‌వైపు తిరిగి ఫక్కున నవ్వాడు.

గోవర్ధన్ తెల్లబోయాడు.

"ఎవరొచ్చి వెళ్లారని చెపుతావు గోపీనాధ్?" అన్నాడు ముసలాయన.

"మీ రొచ్చారని చెపుతాను. అరె...." పొరపాటు గ్రహించి నాలుక కొరుక్కున్నాడు. "మీ పేరు అడగటం మరచిపొయ్యాను. పేరు అడగక్కరలేదా? అని చెల్లాయి

నాలుగు ఝాడించేది. రక్షించారు. అన్నట్లు మీపేరు?" అని అడిగాడు గోవర్ధన్ వినయంగా.

"ఈ కాలం అంతా ఇలాగే ఉన్నారు. ఏ మడగాలో తెలియదు. ఎలా మాట్లాడాలో అంతకన్నా తెలియదు. విమలమ్మతో చెప్పు వెంకటప్పయ్య మాస్టారుగారు వచ్చి వెళ్ళారు. రాత్రికి వస్తారని" ముసలాయన తన పేరు చెప్పాడు.

"అలాగే, తప్పకుండా చెపుతాను."

ముసలాయన గేటు దాటి వెళ్ళిపోయిందాకా చూచి, తలుపు గడియ బిగించాడు గోవర్ధన్.

'వీలయినంత తొందరగా పని ముగించుకు వెళ్ళిపోవాలి. వచ్చిన పని కాలేదు. పెద్ద ఇంటాయనలాగా అందరికీ సమాధానం చెప్పి పంపించాల్సి వస్తుంది. ఛాఛా. ఎప్పుడూ ఇలా జరగలేదు' అనుకున్నాడు.

6

గోద్రెజ్ బీరువా తలుపులు తెరిచాడు గోవర్ధన్.

బీరువా అరలన్నీ నిండివున్నాయి.

ఓ అరలో పాంట్లు, షర్టులు, టైలు, లుంగీలు, టవల్స్ అయితే, మరో అరలో విమల చీరలు, బ్లౌజ్‌లతో నిండి వుంది. దుప్పట్లు, కర్టెన్స్ వగైరాలతో మరో అర కిక్కిరిసి వుంది. నాలుగో అరలో వెండిసామాను అంటే గ్లాసులు, గంధంగిన్నెలాటివి, బహుశా పెళ్ళికొచ్చిన ప్రజెంటేషన్స్ అయివుంటాయి, రకరకాలవి చిన్నా పెద్దా వున్నాయి.

విమల నెక్‌లెస్, మ్యాచింగ్ రాళ్ళగాజులు. చెవికమ్మలు, రింగ్ బంగారంవి చిన్న అట్టపెట్టెలో వున్నాయి. మరో

అట్టపెట్టెలో పెద్ద గొలుసు, ఒంటిపేట గొలుసు, న్యూ ఫ్యాషన్ పెద్దసైజు వెడల్పాటి గాజులజత, రాళ్ళగాజులు, మూడునాల్గు రకాల డిజైన్స్ వున్న మరికొన్ని గాజులు బంగారంవి వున్నాయి.

గోవర్ధన్ కళ్ళు మిలమిల మెరిశాయి.

గోవర్ధన్ చకచక ఓ సంచీలో బంగారునగలు సర్దేశాడు. వెండిసామాను అలాగే తీసుకెళితే సంచీ నిండుగా కని పిస్తుందని వెండిసామానుని అణగకొట్టాడు తను తెచ్చిన సుత్తితో.

రెండు సంచులు దాదాపు నిండిపొయ్యాయి.

సామాను కనపడకుండా ఖరీదైన షర్ట్స్ నాలుగు సర్దాడు. వచ్చిన పని అయిపోయింది. ఎక్కడా డబ్బు కనిపించలేదు. ఓ మోస్తరు భాగ్యవంతులే వీళ్ళు. ఇంట్లో పైసా లేకుండా ఎలా వుంటుంది?

గోవర్ధన్ డబ్బుకోసం వెతకటం మొదలుపెట్టాడు.

చాలాసేపటికి బీరువాలోనే ఓ మూలగా వున్న పాత డైరీలో ఎనిమిది వందరూపాయల నోట్లు కనిపించాయి. అవి జేబులో కుక్కుకున్నాడు. విమల చీరలకింద మరో మూడువందలు కనిపించాయి. అవి జేబులోకి వెళ్ళాయి. నగిషీలు చెక్కిన అందమైన చిన్న దంతం భరిణ వుంది. దానిలో చిల్లరడబ్బులు, విడి రూపాయనోట్లు వున్నాయి. చిల్లరంతా కలిపి పదమూడు రూపాయల ఇరవైనాలుగు పైసలు వుంది. పైసా వదిలిపెట్టకుండా అన్నీ జేబులోకి చేర్చాడు.

చివరిసారిగా బీరువా అంతా గాలించటం అయింది. బీరువాలో పట్టుకుపోతగ్గవి ఇంకా ఏమీ కనిపించలేదు.

గోవర్ధన్ బీరువా తలుపులు మూసేశాడు.

బట్టల స్టాండ్ మీద చీరలు ఇస్త్రీవి వున్నాయి. అదే స్టాండ్ కి మూలగా వ్యానిటీ బ్యాగ్ విమలది తలిగించివుంది. వ్యానిటీ బ్యాగ్ గోవర్ధన్ ని ఆకర్షించింది. బ్యాగ్ జిప్ లాగి చూచాడు. ఒక వందరూపాయల నోటు, రెండు రూపాయల చిల్లర వున్నాయి.

"లక్కీ ఫెలో!" తన్ని తాను అభినందించుకుంటూ గోవర్ధన్ బ్యాగ్ లో నోట్లు, చిల్లర తీసుకున్నాడు.

గోవర్ధన్ ఆనందం పట్టలేకపోతున్నాడు. పరుగున పెరట్లోకి వెళ్ళాడు. బాత్ రూమ్ వద్ద ఆగాడు. "నే వచ్చిన పని అయిపోయింది. ఒక్క అయిదు నిమిషాలు ఇంకే 'మయినా దొరుకుతాయేమో ఇల్లంతా గాలించి వెళ్ళేటప్పుడు బాత్ రూమ్ తలుపుతీసి వెళతాను" అని చెప్పి ఇంట్లోకి వచ్చేశాడు.

గోవర్ధన్ వెళ్ళేటప్పుడు బాత్ రూమ్ తలుపుతీసి వెళ్ళ దలుచుకోలేదు. మనిషికి ఆశ కల్పించటం అతని హాబీ అంతే. దొంగతనం చేసి పొట్ట నింపుకోవటం మరో ముఖ్య హాబీ.

గోవర్ధన్ షర్ట్ వేసుకున్నాడు.

7

వీధి తలుపు చప్పుడయింది.

'మళ్ళీ ఎవరో వచ్చారు నా ప్రాణానికి' అనుకున్నాడు గోవర్ధన్.

వచ్చిన పని పూర్తయింది. తనిహ వెళ్ళిపోవడమే. తలుపులు తీసి ఆ వచ్చినవారిని సాగనంపి అటే వెళ్ళి పోవటం మంచిది. వచ్చినవాళ్ళు ముఖ్య అతిథులయితే

సరాసరి ఇంట్లోకి రావచ్చు. అప్పుడు తన పని కష్ట మౌతుంది. నకిలీ పిస్టల్ బెదిరించటానికి వుంది. అవసరం కల్గితే కత్తి వుంది. తన జాగ్రత్తలో తనెలాగూ వుంటాడు.

"ఎవరు?" అన్నాడు గోవర్ధన్ తలుపు తీయకుండానే.

"నేనే, శ్యాంబాబుని" అన్నాడు శ్యాంబాబు.

శ్యాంబాబా! వీడెవడు? రాంబాబు తమ్ముడిలా చెబుతున్నాడు? ఆలోచిస్తూ తలుపు తీశాడు గోవర్ధన్.

శ్యాంబాబు వైట్ ప్యాంట్ మీద ముదురు నీలంరంగు పూలషర్ట్ వేసుకున్నాడు. తెల్లని తెలుపు. అందమైన భారీ విగ్రహం. మొగాళ్ళను కూడా ఆకర్షించే రూపం అతనిది. ముప్పై ఏళ్ళు వుంటాయి.

శ్యాంబాబు గోవర్ధన్‌ని చూచి గతుక్కుమన్నాడు. విమల లోపల వుందేమో అని గోవర్ధన్ భుజాలమీంచి తొంగిచూశాడు.

"ఎవరు కావాలి?" దబాయింపు, అధికారం మిళితం చేస్తూ అడిగాడు గోవర్ధన్.

"విమల....అదే....అదే....విమలగారు కావాలి. పిలవండి" అన్నాడు చూపులు మరల్చుకుంటూ శ్యాంబాబు.

'ముందు విమల అన్నాడు. తర్వాత విమలగారు అంటున్నాడు. ఈ శ్యాంబాబుగాడి ధోరణి చూస్తుంటే విమల ప్రియుడిలా అనిపిస్తున్నది' అనుకున్నాడు గోవర్ధన్.

"విమల మ్యాట్నీ సినిమాకి వెళ్ళింది. అటునుంచి బజారు వెళ్ళి రాత్రికిగాని రాదు."

"ఏ సినిమాకెళ్ళింది?"

"నాకు తెలియదు. ఫ్రెండ్స్‌తో వెళ్ళింది. తెలుగు సినిమాకెళదామా? హిందీ సినిమాకెళదామా? అని విమల,

విమల ఫ్రెండ్స్ వంటింట్లో వాదించుకోటం విన్నాను."

"ఓ గంట కార్డ్స్ ఆడుకుందాం రమ్మని తను నే వచ్చే టప్పటికి పిక్చర్‌కి చెక్కేసిందా? ఈ దఫా చెపుతాను.... మీరేమవుతారండి విమలకు. సారీ. విమలగారికి?"

"విమల పినతల్లి కొడుకుని. అనకాపల్లి మాది. మధ్యాహ్నం వచ్చాను. నన్నింటికి కాపలాపెట్టి తాను సినిమాకి వెళ్ళింది. మీ పేరు చెప్పండి. చెల్లాయి రాంగానే చెపుతాను మీరొచ్చి వెళ్ళినట్లు" గబగబ చెప్పాడు గోవర్ధన్ మరో మాటకు ఆస్కారం లేకుండా.

"శ్యాం వచ్చాడని చెప్పండి చాలు. బలదేవ్‌గారు ఊరి కెళ్ళారు తోచదు, కార్డ్స్ ఆడుకుందాం రమ్మని మొన్న చెప్పింది. లైబ్రరీ బుక్ 'ఎండమావులు' నవల విమల గారికిచ్చాను. ఇవాళ ఆ బుక్ తప్పకుండా లైబ్రరీలో ఇవ్వాలి. చూచి ఇవ్వండి. వెళ్ళిపోతాను."

"చెల్లాయి బుక్ ఎక్కడ పెట్టిందో నాకేం తెలుస్తుంది?"

"ఎక్కడా పెట్టదు, బుక్ షెల్ఫ్‌పై తప్ప. చూడండి అక్కడే వుంటుంది."

ఈ బంకగాడు విమల ప్రియుడులా వున్నాడు. పుస్తకం ఇస్తే తప్ప వదలడు. పుస్తకం ఇస్తే వెళ్ళిపోతాడు. ఓసారి విమల, మరోసారి విమలగారు, వీడి కంగారు మండిపోను. భర్త ఇంట్లో లేదని ప్రియుణ్ని పిలుచుకుంది. పాపం, వీడిని బాత్‌రూమ్‌లో తోసి తలుపు బిగిస్తే నా సామిరంగా....

"ఏంటి మీలో మీరు నవ్వుకుంటున్నారు?" శ్యాంబాబు కంగారుపడిపోతూ అడిగాడు.

"అబ్బే, ఏం లేదు" అని గోవర్ధన్ ఇంట్లోకి నడిచాడు.

శ్యాంబాబు వచ్చి ముందు గదిలో సోఫాలో కూర్చు

న్నాడు.

గోవర్ధన్ బుక్ షెల్ఫ్‌మీద వెతికాడు. 'ఎండమావులు' పుస్తకం దొరికింది. అది తెచ్చి శ్యాంబాబుకిచ్చాడు.

"థ్యాంక్స్ సార్! మిమ్మల్ని శ్రమపెట్టాను. ఓ గ్లాసు చల్లని మంచినీళ్ళు ఇస్తే తాగి వెళతాను" శ్యాంబాబు లేచి నుంచుని అడిగాడు.

"మంచినీళ్ళకేం భాగ్యం, ఇస్తాను" అంటూ గోవర్ధన్ వంటింట్లోకి వెళ్ళాడు.

గోవర్ధన్ వెనుకనే శ్యాంబాబు వచ్చాడు.

"సార్! మీరేమీ అనుకోవద్దు. విమల అదే విమల గారితో చెప్పండి. నేనో మన్తదాకా టూర్ వెళుతున్నాను. ఊరినుంచి వచ్చిం తరువాతే కనపడతానని."

"అలాగే చెపుతాను" అన్నాడు గోవర్ధన్ మంచినీళ్ళ బిందెలో గ్లాసు ముంచుతూ.

గుమ్మంలోనే వుండి మాట్లాడుతున్న శ్యాంబాబు 'ధన్' మని స్పీడ్‌గా వంటింటి తలుపులు వేసి, బైట గడియ వేశాడు.

"దొంగగారూ! ఈ గదికి మరో తలుపులేదు. నే తీసిం దాకా లోపలే వుండండి" అని శ్యాంబాబు గబగబ తతిమ్మా గదులలోకి వెళుతూ "విమలా! విమలా!" అని పిలిచాడు.

జవాబు రాలేదు.

బెడ్‌రూమ్‌లో పక్కపై రాజుని చూచి కంగారుగా "రాజూ! రాజూ!" అని భుజం తట్టి పిలిచాడు.

రాజు పలకలేదు. లేవలేదు. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు వున్నాయి. హాయిగా నిద్రపోతున్నాడు.

"విమలా! విమలా!" అని అరుస్తూ పెరట్లోకి వచ్చాడు శ్యాంబాబు.

బాత్‌రూమ్‌లో వున్న విమల, భర్త బలదేవ్ గొంతు గుర్తుపట్టింది.

"ఏమండీ! ఇక్కడున్నాను. బాత్‌రూమ్‌లో" బాత్‌రూమ్‌లోంచి పెద్దగా అరిచింది విమల.

బలదేవ్ పరుగున వెళ్ళి బాత్‌రూమ్ తలుపుకున్న బోల్ట్ బలవంతానా పైకి లాగాడు.

బాత్‌రూమ్ తలుపులు తెరుచుకున్నాయి.

విమల బైటకు వచ్చింది. వస్తూనే బలదేవ్‌ని కౌగలించుకుని పెద్ద పెట్టున ఏడ్చింది.

క్లుప్తంగా జరిగింది చెప్పింది.

"పద, ఇంట్లోకి వెళదాం విమలా! రాజుకేం ఫరవా లేదు. మత్తుమందు వాసన చూశాడు. దొంగని వంటింట్లో బంధించాను. అసలేం జరిగిందంటే క్యాంప్‌కి వెళ్ళానా? మధ్య దోవలో పోస్ట్‌పోన్ అయింది. వెనక్కు తిరిగి వచ్చాను. దోవలో వెంకటప్పయ్య మాష్టరుగారు కనిపించారు. మనింటినుంచే వస్తున్నట్లు చెప్పి మీ అన్న గోపీనాథ్ అమలాపురంనుండి వచ్చాడు అని కూడా చెప్పాడు. అమలాపురం ముక్కుముఖం మనం ఎరగం. నాకు తెలిసినంతలో నీకెవరూ అన్నవరసయిన వాళ్ళు కూడా లేరు. మరి ఈ గోపీనాథ్ ఎవరు? పాడు మనసు నీపై కించిత్ అనుమానం వచ్చింది. వెంటనే చెంపలేసుకున్నాను. పగటి దొంగ ఎవరైనా నీకేదైనా ఆపద కలిగించి ఇంట్లో

ప్రవేశించి నాటకం ఆడుతున్నాడా? అని కూడా అనుమానం వచ్చింది. సామానేమీ తీసుకురాకుండా, శ్యాంబాబు పేరుతో ఇంటికి వచ్చాను. నీ ప్రియుడిగా అనుమానం వచ్చేటట్లు నటించాను. దొంగగారిని వంటింట్లో బంధించాను" బలదేవ్ చెప్పాడు.

విమల పరుగెత్తుకుంటూ బెడ్ రూమ్‌లోకి వెళ్ళింది.

"క్విక్, చీర మార్చుకుని రాజుని డాక్టరువద్దకు తీసుకెళ్ళు. వీడి సంగతి నే చూస్తాను" బలదేవ్ అన్నాడు.

విమల రాజుని ముద్దుపెట్టుకుని చీర మార్చుకోటంలో పడిపోయింది.

"విమలా! వీడి చూపులు చూడంగానే దొంగని తెలిసిపోయింది. గుమ్మం అవతల కొద్దిగా రక్తం కనిపించింది నేలపై. నా అనుమానం నిర్ధారణ అయింది. మీకే ఆపదన్నా తలపెట్టాడేమో అని భయపడ్డాను. ముఖాముఖి తలపడటం మంచిది కాదని, మాటల్లో దింపి వీడిని బంధించాను."

"దుర్మార్గుడు. ఎంత భయపెట్టాడని? రెండు గంటలు బాత్ రూమ్‌లో నరకం అనుభవించాను" అంటూ చీర మార్చుకుంటూనే విమల వివరంగా చెప్పింది.

"రెండు గంటలు నిన్ను ఖైదులో పెట్టినందుకు ఆ పగటి దొంగగారికి రెండేళ్ళ శిక్ష పడేటట్లు చేస్తాను విమలా!" అన్నాడు బలదేవ్.

విమల సమయానికి దైవంలా వచ్చిన భర్తవైపు కృతజ్ఞతతో చూసింది.

***

మంచులోయల్లో - మరణగండం

డా॥ పెందుర్తి మాస్టర్జీ

హిమాచల ప్రదేశ్—

సిమ్లాకు పదహారు కిలోమీటర్ల దూరంలో కుఫ్రి ప్రాంతం.

స్కేటింగ్ సెంటర్‌గా ప్రసిద్ధి చెందిన కుఫ్రి మంచుతో కప్పబడి వుంటుంది. వుడెన్ హౌస్‌లు, పైన్ చెట్లు పైన మంచు అతికినట్లు వుంటుంది. పైన్ చెట్లపై వున్న మంచు తెల్ల కొయ్యలపై తెల్లపువ్వులు పూసినట్లుంది.

అది సీకింగ్ సీజన్.

సిమ్లా నుండి కుఫ్రికి హిల్ స్టేషన్ ట్రయిన్ దిగారు విజయ్, నళిని. వాళ్ళిద్దరు ప్రేమికులు ఒకప్పుడు. యిప్పుడు భార్యభర్తలు. పెదాలపై చిరునవ్వులు. అవయవాలలో హావ భావాలు తొణికిసలాడుతూ వుంటాయి, నళిని శరీరం చుట్టూ చేయివేసి స్కేటింగ్ ఏరియాకు చేరుకున్నారు. స్లెడ్జెస్

ధరించి జంటలుగా వెళుతున్న. స్కేటింగ్ మనుష్యుల్ని బైనాక్యులర్‌తో చూస్తోంది నళిని.

"హలో మిస్టర్ విజయ్" విష్ చేశాడు దినేష్.

విజయ్ ప్రశ్నార్థకంగా చూశాడు. "ఐయామ్ సారీ మీరు నాకు తెలీదు."

దినేష్ నవ్వాడు. "నెవర్‌మైండ్. నేను మీకు తెలియక పోయినా మీరు నాకు తెలుసు. బొంబాయి లైన్స్ క్లబ్ వారి ఫాన్సీ డ్రెస్‌లో మీరు ఆస్ట్రోనాట్ డ్రెస్ వేసి అందర్ని చకితుల్ని చేశారు."

"ఐ. సి" విజయ్ వాలెట్‌లో నుండి సిగరెట్ తీసి తనొకటి తీసుకొని, దినేష్‌కి ఒకటి అందించాడు.

"థాంక్స్. నేను యిక్కడ వైల్డ్ ఫ్లవర్ హౌస్‌లో మేనేజర్‌గా వుంటున్నాను. మాది నేటివ్ హైదరాబాద్. మీరు అక్కడ వాల్మీకి నగర్‌లో వుంటున్నారు."

"నా గురించి మీకు చాలా తెలుసు."

"ఆఫ్‌కోర్స్ పరిచయం చేసుకోలేక పోయాను. నాది ముఖాపంగల స్వభావం. ఎవరితో ఎక్కువగా మాట్లాడను."

"మీరు ఆంధ్రులా?"

దినేష్ నవ్వాడు. "నూరు పైసల ఆంధ్రుడ్నే. ఉద్యోగ రీత్యా యిక్కడ స్థిరపడిపోయాను. ఈమె మీ మిసెస్ నళిని."

"యస్. యస్. పరిచయం చేశాడు విజయ్.

2

వైల్డ్ ఫ్లవర్ హాలులో ఒకగది—

నారాయణ సిగర్ వెలిగించాడు. అద్దంలో నుండి బయటకు చూస్తున్నాడు. క్రిందకు ఒకొక్క యిల్లు పల్లానికి

కట్టబడి వున్నాయి. వంపు తిరిగిన బాట క్రిందకు పోతుంది. వీధులలో తడిసిన మంచు నలిగిన మంచు కనిపిస్తుంది.

ఓ సారి పైము చూశాడు. గడియారం ఆరుగంటలు కొట్టింది.

బజర్ మ్రోగింది. "కమిన్" అన్నాడు.

దినేష్ లోపలకు నడిచి స్ప్రింగ్ డోర్ వేశాడు. "గుడ్ యీవనింగ్ సర్," అంటూ యల్ ఆకారంలో వున్న సోఫాలో కూర్చున్నాడు.

"ఎంతవరకు వచ్చింది?"

"పరవాలేదు. పిట్టలు వలలో పడ్డాయి. రెండు రోజులుగా వాళ్ళు చాలా ఆప్తు లయ్యారు. నన్ను బాగా నమ్మారు."

"యస్ అదే కావాలి," అంటూ రేక్‌లో నుండి బ్రాంది తీసి రెండు గ్లాసులలో పోసి, ఒకటి అందించాడు.

"ఎప్పుడు బయలుదేరుతున్నారు?"

"రేపు మూడు గంటలకు హిందుస్తాన్ టిబెట్ రోడ్డు పైగా చండీఘర్ వెళ్లవచ్చు. వయా నర్‌కండ్, సట్లెజ్ నది మీదుగా వెళ్ళవచ్చు. అది నా టాక్సీలో పంపుతానన్నాను. దానికి అంగీకరించారు."

"వెరీ వెరీ గుడ్. ఇదిగో యాభై వేలు. నర్‌కండ్ దగ్గర సముద్ర మట్టానికి రెండువేల ఏడువందల అడుగుల ఎత్తు వుంటుంది. అయితే గ్రాస్ సర్కిల్ దగ్గర ఏడు వందల అడుగుల లోతు లోయ లున్నాయి. అక్కడ కుడి వైపు ప్రఖ్యాతి చెందిన యాపిల్ ఆర్చిడ్స్ వున్నాయి. ఎలాగయినా కారుతో సహా ఆ లోయలోనికి యిద్దరిని తోసి వేయాలి. కారుగాని శవంగాని కనిపించదు. పని అయ్యాక మరో యాభై వేలు యిస్తాను."

"యస్. ఐ ట్రైయ్ మై బెస్ట్" అన్నాడు. వాలెట్‌లో నుండి సిగరెట్ తీసి వెలిగించాడు దినేష్. వలయాలుగా పొగ వదిలి. .

3

హిందుస్తాన్ టిబెట్ రోడ్డులో వెళుతోంది అంబాసిడర్ కారు. వెనుక సీట్లో నళిని, విజయ్ కూర్చున్నారు. దినేష్ కారు డ్రైవ్ చేస్తున్నాడు. మెదడులో వందల వ్యూహాలు దాగుడు మూతలాడుతున్నాయి.

మంచు కురుస్తుంది. రోడ్డుపై నిండుగా మంచు. మంచు మీద టాక్సి జరిగిపోతుంది. విజయ్ గ్లోవ్స్ ధరించాడు. నళిని షాల్ కప్పుకుంది. అప్పుడప్పుడు టాక్సినో కారో వస్తున్నాయి.

గ్రాస్ సర్కిల్ సమీపించింది. "సర్ యీ సీనర్ బావుంటుంది" అన్నాడు దినేష్. "వద్దులే దినేష్. చాలా టైర్డ్‌గా వుంది." అన్నాడు విజయ్.

దినేష్ నవ్వి కారు ముందుకు సాగించాడు.

గ్రీన్‌హిల్‌కి హారం వేసినట్లు వున్నరోడ్డు పైవలయంగా తిరిగింది. మరొక కొండ మీద నుండి సాగిపోతుంది.

దినేష్ ఏర్పరచుకున్న రెండవస్థలం. ఇది దాటితే మరొక అవకాశం రాదు. డాష్‌బోర్డు క్రింద తీగెలు లాగివేశాడు. కారాగింది.

"ఏమయింది దినేష్?" ఆతృతగా అడిగాడు.

"జెస్ట్ ఫైవ్‌మినిట్స్" దినేష్ దిగాడు.

విజయ్, నళిని దిగారు. గాలి హాయిగా వీస్తోంది. అందమయిన ప్రకృతి పైన్ చెట్లు వాటి పైన ముద్దలుగా వున్న

మంచు పువ్వుల్లా కనిపిస్తున్నాయి. అస్తమిస్తున్న సూర్యుడు ఎర్రగా మనోహరంగా వున్నాడు. ఎదురుగా కప్‌కేక్‌లా వున్న కొండలో నుండి పారుతూ వచ్చిన ఏరు కనిపిస్తుంది.

బీమ్ డిప్లెస్ మెంట్ 2700 మీటర్లు.

"మాగ్నిఫిసెంట్ పెనొరమ" అంది విజయతో నళిని. ఇద్దరు కొండ అంచుకు వెళ్ళారు. అగాధమయిన లోయ. అక్కడక్కడ మంచు ఆగిపోయింది. "హాని వెదర్" అన్నాడు విజయ్.

వాళ్ళిద్దరికి ఐదు అడుగుల దూరంలో కారు వుంది. కారు వెనుక దినేష్ వున్నాడు. యింతకంటె అవకాశం రాదు. పరధ్యానంగా వున్నవాళ్ళ పైకి కారు తోస్తే, కారుతో పాటు ఇద్దరు లోయలో పడిపోతారు. దినేష్ నిర్ణయం.

కారును వెనుక పట్టి బలంగా తోశాడు. నిదానంగా వాళ్ళకు దగ్గరగా నెట్టి, బలంతో ఒక్కసారి నెట్టివేశాడు.

"నళినీ" అరిచిన విజయ్, నళినిని ప్రక్కకు లాగాడు. టాక్సీ ముందు చక్రాలు వంగాయి. అయితే అప్పటికే టాక్సీ కుడిభాగం వాళ్ళిద్దరినీ ఢీకొనటంతో ఇద్దరు లోయ లోనికి దొర్లారు. టాక్సీ ముందు భాగం క్రిందకు వంగటం వల్ల డిక్కీకి వున్న హాండిల్ దినేష్ షర్టు మడతలో వుండి లాగింది. టాక్సీ సరాసరి లోయలోనికి దూసుకుపోయింది. టాక్సీ వెంట బిగ్గరగా అరుస్తూ దినేష్ కూడా లోయలో పడిపోయాడు.

4

లోయలో పైన్ చెట్టుకొమ్మ పట్టుకొని ఆగాడు విజయ్ అతని చేతుల్లో నళిని వుంది. కొమ్మ భాగం వంగిపోయింది.

క్రింద ఒకరాయి మీద బూటుకాలు ఆనించాడు. గాలి వూళలుగా వీస్తుంది. తలెత్తి పైకి చూశాడు. దాదాపు యాభై మీటర్లు క్రిందకు వుండటంవల్ల పైభాగం కనిపించ టంలేదు.

మంచు తుంపరగా పడుతూంది. చీకటి ఆరంభమవు తుంది.

నళిని ముఖం ప్రాణభయంతో వుంది. క్రిందగా చూశాడు. మూడు మీటర్లు క్రింద భాగంలో కొంచెం పెద్ద రాయివుంది. ఆ రాయి పైన కూర్చోవచ్చు. కాని ఎలా? విజయ్ మెల్లగా నళిని పైటను చూపి "చీరె చెట్టుకు కట్టు యిలా ఎంతసేపు వుండగలను శక్తి అయిపోతుంది." అన్నాడు విజయ్.

నళిని చేతుల్లో నుండి పైట తొలగించి చెట్టుకు కట్టింది. మెల్లగా పిడికిలి వదిలాడు. చేయి వదిలి చీరె పట్టుకొని కాస్త క్రిందకు దిగాడు. చీరె ఒక్కసారిగా పర్రుమని చిరిగింది. అలా చిరగటంతో మరికాస్త క్రిందకు జారి పోయాడు. బాలన్స్ తప్పటంతో నళిని, విజయ్ నుండి వేరయి దొర్లిపోయింది.

"నళిని" పిచ్చిగా అరిచాడు విజయ్.

సమాధానం లేదు. నళిని అగాధంలో పడిపోయింది. తను అనుకున్నరాయి నుండి క్రిందకు జారిపోయాడు. ఒళ్ళు జలదరించసాగింది. శ్రమతో పైకి ఎక్కితే చీరె చిరిగిపోవచ్చు. మెల్లగా చేతులు వదిలి క్రిందకు వచ్చాడు. రెండు మీటర్ల రాయి వుంది. రాయి నిండా మంచు పొదలా వుంది. మెల్లగా ఆ రాయి మీద కూర్చున్నాడు. ఏ మాత్రం జారినా లోయలో పడిపోతాడు.

పై రోడ్డు మీద ఏదో కారు వస్తున్న శబ్దం. తను బిగ్గరగా అరిచాడు కారు వెళ్ళిపోయింది. అరవటం వల్ల తన గొంతు కారులోనికి వినిపించదు. నళిని ఏమయింది? క్రిందకు చూశాడు. లోయ తప్ప ఏమీ కనిపించటం లేదు. దుఃఖం పొర్లుకువచ్చింది, "నళిని....నళిని" పిలిచాడు. సమాధానం రాలేదు. రాయిపై వున్న మంచును చేతితో తోశాడు. జేబులోనుండి సిగరెట్ తీసుకొని వెలిగించాడు.

గంట తరువాత గంట గడిచిపోతుంది.

ఏడు ముప్పై నిమిషాలయింది. మంచు కురవటం ఎక్కువయింది. లోయ యావత్తు చీకటయిపోయింది. ఆకాశంలో మబ్బులు అందంగా కదిలిపోతున్నాయి. దయ్యపు నీడల్లా మంచు పొరలు.

రాళ్ళపై మంచు పేరుకుంటూంది. తన పైన కూడా పడుతూ వుంది. ఇలా ఈ రాత్రి అంతా పడితే మరణమే శరణ్యం. తనకు ఎదురుగా పూర్ణమి చంద్రుడు వస్తున్నాడు. 'టూ డేంజరస్ ఎటెంప్ట్' మనసులో అనుకుని ప్రక్కకు చూశాడు. చెక్కినట్లు వున్న రాయి శివలింగంలావుంది. క్షణం ఆలోచించి నడుం నుండి మూడు అంగుళాల లెదర్ బెల్ట్ తీసి దానికి చుట్టాడు. వలయంగా వున్న బెల్ట్‌కు, పాంట్ విప్పి ఓ మూల బలంగా కట్టాడు. అలా జారితే రెండు మీటర్లు జారచ్చు. ఆ పై రెండు మీటర్లు తన కాళ్లు వుంటాయి. ప్రయత్నించాలి. అనుకొని మెల్లగా క్రిందకు దిగటం ప్రారంభించాడు. కాస్త క్రిందకు దిగాక, కుడివైపు ఓ రాయి అడ్డుగా వుండటంతో దొర్లటం ఆగిపోయిన నళిని శవంలా పడివుంది.

ప్రయత్నం మీద ఆ రాయి మీదికి దిగాడు నాలుగు

మీటర్లు పొడువుంది ఆ రాయి. రాయి మీదికి దిగి "నళినీ.... నళిని" పిలిచాడు. నళిని స్పృహలో లేదు. మంచు మరికాస్త పడివుంటే మనిషి కనిపించక పోయేది. రాయి ఎడ్జి అవటంతో నళిని బ్రతికింది. ఆ రాయికి జీవం వుంటే ధన్యవాదాలు తెలుపుకునేవాడు. నళినిని చేతుల్లోనికి తీసుకొని పొదివి పట్టుకున్నాడు.

లారి ఏదో వస్తున్న శబ్దం. మళ్ళీ అరిచాడు. లారి వెళ్ళి పోయింది.

పైకి ఎక్కలేడు. క్రిందకు దిగలేడు. నళిని స్పృహలో లేదు. తను ఇక్కడ వున్నట్లు ఎవరికి తెలీదు. బ్రతికేటందుకు దారిలేదు.

తేమగాలి వీస్తోంది. మంచు కురుస్తుంది. మబ్బులు చుట్టుముట్టాయి. పొగలా సాగిపోతున్నాయి. వణకుపుట్టుకొస్తుంది లాభంలేదు. లేచి నిలబడి, వంగి లేస్తూ ఎక్సర్ సైజ్ చేయటం ప్రారంభించాడు. కండరాలు కాస్త కదిలి శక్తివంతమయ్యాయి. మళ్ళీ ఆ రాయి చివరకు వచ్చి చూశాడు. అలాగే మరొక రాయి వుంది క్రింది. మూలగా పైన్ చెట్టు వుంది, ఆ కొమ్మ పట్టుకొని మెల్లగా క్రిందకు దిగి చుట్టు చూశాడు.

అక్కడ ఏదో గుహలా వుంది. ముఖం విప్పారింది. అయితే ఆ గుహ ఎక్కడి వరకు వుంది? దారేమయినా వుందా? ఆలోచిస్తూ అగ్గిపుల్ల గీచి వెలిగించాడు. లోపల చీకటిగా వుంది.

మెల్లగా లోపలకు నడిచాడు. పది అడుగుల ఎత్తుగల భయంకరమయిన గుహ. పొడవుగా వున్న చీకటి గుహ. అయితే వెన్నెల వెలుగు పడటంతో కాస్త వెలుగు కని

పిస్తుంది. అడుగులో అడుగు వేసుకుంటూ నడవసాగాడు. పాకుడు పట్టిన బండలు తేమగా వున్నాయి. గబ్బిలాయిల వాసన వేస్తుంది. కీచుమనే శబ్దం. తిరిగి రావటానికి దారి తెలుస్తుందో లేదో అసలు యీ గుహకు ముగింపు ఎక్కడో? అర్థం కావటంలేదు. నడుస్తున్నకొద్ది చీకటి ఎక్కువయింది.

ఒక్కొక్క రాయిని తప్పుకుంటూ మలుపులు తిరుక్కుంటూ నడుస్తున్నాడు. ఎంత దూరం నడిచాడో తెలీదు.

5

కొద్ది దూరం' నడిచాక విశాలంగా వున్న పెద్ద గుహ కనిపించింది. అక్కడ ఆగి చుట్టూ కలయ చూశాడు. ఎదురుగా గుహలో దీపం వెలిగించినట్లు వెలుతురు కనిపిస్తుంది. ఆతృతగా అక్కడకు నడిచాడు.

అది నేలపై పడివున్న టార్చి లైటు.

ఆనందం ఆశ్చర్యం ఒక్కసారిగా కలిగాయి.

ఆతృతగా అందుకున్నాడు. నాలుగు సెల్స్ బాటరీ లైటు అది. ఫుల్ ఫవర్‌తో వెలుగుతుంది. అయితే అది ఆ రాత్రి వెలిగించింది అయివుండాలి. ఎవరో ఈ గుహలోనికి వచ్చారు. అలా వచ్చారంటే ఖచ్చితంగా బయటకు దారి వుండాలి అనుకున్నాడు. లైటు చుట్టూ వేశాడు. నల్ల బండపై నుండి పాము జరజర పాకుతూ పోతుంది. శరీరం జలదరించింది.

గబగబ గుహలో నడవసాగాడు. టార్చి వేస్తూ కొంత దూరం నడిచాడు. ఎదురుగా రాయి పై పడివున్న ఆకారం. టార్చివేసి నిశితంగా చూశాడు. గుండెలో దడ పుట్టుకు వచ్చింది. మెదడు మొద్దుబారిపోయింది.

రక్త సిక్తమయిన మనిషి శవం అది. వళ్ళంతా రక్త మయి వుండటం చేత వికృతంగా వుంది. కళ్ళు తెరచి వున్నాయి. ముఖం రక్తపు ముద్దలా ఎర్రని రక్తం కని పిస్తుంది. బట్టలు చిరిగిపోయి వున్నాయి.

కాలు కదపలేకపోయాడు. ఎవరీ మనిషి? ఎందుకు ఇలా చచ్చిపోయాడు? ఎవరయినా చంపారా? చంపిన వాళ్ళు లోపలే వున్నారా? మతిపోయినట్లయింది విజయ్‌కి. అక్కడ నిలువలేక పోయాడు.

పైనుండి చిన్న చిన్న రాళ్ళు దొర్లుతూ క్రింద పడ్డాయి. లైటు వేసి పైకి చూశాడు. గుండాగిపోయింది. శిలా ప్రతి మలా అయిపోయాడు. పైన ఒకరాయి పైన అటు ఇటు నడుస్తున్న చిరుతపులి వికృతంగా అరిచింది. అది ఎగిరి పైన పడుతుంది. అందులో సందేహం లేదు. గబాలున పరుగు ప్రారంభించాడు. చిరుత దూకినట్లయితే విజయ్‌పై పడివుండేది. చిరుత నిలబడ్డ బండ స్లిప్ అవటం వల్ల బండతో పాటు క్రిందకు దొర్లి వెంబడించింది. కొన్ని క్షణాలు ఆలస్యమయింది.

అది స్నోలియోపర్డ్ (మంచులో వుండే చిరుతపులి) సెంట్రల్ ఆసియాలో కీల్డ్ ఐలెండ్‌లో వుంటాయి. అయితే అరుదుగా హిమాచల ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లో వున్నాయి. ఒకసారి ఎగిరినట్లయితే 9 మీటర్లు దూకగలదు. 4 మీటర్ల ఎత్తు ఎగరగలదు. అదంటే వేటగాళ్ళకు కూడా ఓ రక మయిన భయం.

వెనుకగా దూసుకువస్తున్న చిరుతను చూసి విజయ్. పరుగెత్తి ప్రయోజనం లేదని గబాలున రెండు రాళ్ళమధ్య నక్కాడు. ఒక మీటరు పొడవుగల రాళ్ళమధ్య నక్కాడు.

రాతి ముందు ఒక బండ వెనుక ఒక బండ అడ్డుగా లోపలకు దూరాడు. చేతులు కదల్చడానికి మాత్రం అవకాశం వుంది. శ్వాస ఎక్కువగా పీల్చటానికి ఎదురుగా బండ వుంది.

చిరుత అక్కడే ఆగి గబాలున పంజా విసిరింది. విజయ్ గబాలున లోపలకు ఒదిగిపోయాడు. అయినా గోళ్ళు చీరుకుపోయారు. చిరుత లోపలకు వచ్చే అవకాశం లేదు. చిరుత రెండు కాళ్ళు బండపై పెట్టి అవకాశంకొరకు ఎదురు చూస్తుంది. అక్కడనుండి కదలడం లేదు.

విజయ్ బెంబేలుపడిపోయాడు. మరణావస్తలో నళిని, ఆపదలో తను బ్రతికి బయటపడగలనా? కళ్ళలో నీరు నిండాయి. భగవంతుడ్ని తలుచుకున్నాడు. చిరుత అటు యిటు తిరుగుతుంది,

కాలం నిమిషాలుగా జరిగి తెల్లవారిపోయింది.

ఉదయకిరణాల వెలుగు గుహలోనికి వస్తోంది. ద్వారం దగ్గరే వుండి వుండాలనుకున్నాడు. టార్చితో తనకు పని లేదు. మెల్లగా రెండు చేతులు పైకెత్తి సెల్స్ తీశాడు. సెల్స్ క్రిందవేసి టార్చి పై భాగాన్ని క్రిందవేసి వత్తాడు. రేకుడొప్ప అతుక్కుపోయింది. కత్తిలా పట్టుకొని కాస్త ముందుకు వచ్చాడు. చిరుత మళ్ళీ దగ్గరకు వచ్చింది బిగ్గరగా అరచి మీదకు రాబోయింది. తెరచిన నోట్లో టార్చి బలంగా గుచ్చాడు. వికృతంగా అరచి పారిపోయింది. లోపలకు పరుగెత్తింది.

బయట డప్పులు వినిపిస్తున్నాయి. బయట ఎవరో వున్నారు తనను తప్పక కాపాడతారు అనుకున్నాడు. బాగా వంగి చూశాడు. యాభై అడుగుల దూరంలో గుహ కని

పిస్తుంది. యిదే అవకాశం అనుకున్నాడు. మెల్లగా బయటకు వచ్చి బేరల్‌లోనుండి వచ్చే బుల్లెట్‌లా గుహలో నుండి దూసుకురాసాగాడు. వెనుకగా చిరుత అరుస్తూ వెంబడిం చింది. గుహలోనుండి బయటకు వస్తుండగా ఎవరో ఆపి నట్లు ఆగిపోయాడు. గుహచుట్టూ వేసిన వల తనకు చుట్టుకు పోయింది. వలలో చుట్టుకుపోయాడు విజయ్. చిరుత పంజా ఎత్తి విజయ్‌పై బడింది. చిరుత, విజయ్ ఒకే వలలో చిక్కుకుపోయారు గాని పంజా ఎత్తి చంపేటందుకు చిరుతకు అవకాశంలేదు.

"ఫైర్" అరిచాడు ఎవరో.

"ఢాం"మని తుపాకి పేలింది. క్షణంలో చిరుత తలలో బుల్లెట్ దూసుకుపోయింది. పైకెగిరి పోయింది. నలుగురు ఆత్రుతగా వచ్చి వలను విడదీశారు. విజయ్‌ను చేయి పట్టు కొని పైకి లేపాడు అతను.

"మై నేమ్ యీజ్ బండార్కర్. చిరుత ఈ ప్రాంతంలో తిరుగుతుంటే పట్టుకోటానికి ప్రయత్నించాం. కాని నీ ప్రాణంకొరకు చిరుతను చంపాను. ఎవరు నువ్వు? ఈ గుహలో ఎప్పుడు చేరావ్?" అంటూ బ్రాంది సీసా అందిం చాడు. విజయ్ ఒక పెగ్ త్రాగాడు. వేలెట్‌లోనుండి సిగరెట్ తీసి అందించాడు విజయ్‌కి.

"నా పేరు విజయ్. దినేష్ అనేవాడు లోయలోనికి తోశాడు. అయితే అన్‌లక్కీగా వాడే చచ్చిపోయాడు. యిప్పుడు నా భార్య లోయలో వుంది. బ్రతికి వుందో, లేదో తెలీదు." కళ్ళలో నీరు నిండాయి.

"ఎక్కడ?"

"ఈ గుహలోనుండి దారి వుందా?"

"నేను యిటే వచ్చాను. కాని ఆమె స్పృహలో లేదు. ఈ గుహలోనుండి రావటానికి అవకాశం లేదు."

తన అనుచరులకు ఏదో చెప్పాడు.

హిమాచల్ ప్రదేశ్ ఎమర్జన్సీ హెలికాప్టర్స్, హిల్ క్లైంబర్స్ వచ్చేశారు. షీర్ వాల్స్‌లో తాళ్ళు వేశారు. చాలా గాలించినా కనిపించలేదు. "సారి మీ నళిని కనిపించలేదు."

విజయ్‌కు దుఃఖం పొర్లుకువచ్చింది "ఐ ప్రైయిటు సీ ది రియల్ స్పాట్" అన్నాడు విజయ్. విజయ్‌కు హుక్స్ వేసి లోపలకు దించారు. నళినిని ఎక్కడయితే వదిలివేశాడో అదే స్పాట్‌లోనికి దిగాడు. మంచుతో కప్పపడివున్న నళిని కనిపించింది.

నళినిని నార్ కండ్ హాస్పిటల్‌లో చేర్చాడు.

మినీ విమానంతో లోయలో వెదికితే తునాతునకలయిన కారు కనిపించింది. క్రైంబ్రాంచి ఆఫీసర్ ఫొటోలు తీసి దినేష్ శవాన్ని పైకి తెచ్చారు.

* * *

"ఎంత ఘోరం జరిగింది," నారాయణ అన్నాడు.

"నీలాంటి వాళ్ళు వుంటే ఘోరం జరుగుతాయి మిస్టర్ నారాయణ," క్రైంబ్రాంచి ఆఫీసరు అన్నాడు.

"ఆస్తికొరకు నళినిని చంపాలనుకున్నారు. అయితే దినేష్ నీ మాటలు టేప్ చేసుకొని దగ్గరుంచుకున్నాడు. ఆ టేప్ నిన్ను హంతకుడిగా పట్టించింది. యు ఆర్ అండర్ అరెస్ట్!" అన్నాడు.

ఆ తరువాత విజయ్, నళిని ప్రాణగండం నుండి బయట పడి హైదరాబాద్ చేరుకున్నాడు. మళ్ళీ ఎన్నడూ పరాయి వాళ్ళ కారులో మాత్రం ఎక్కలేదు. ***

ఖైదీ రాంబాబు

ఏ. వీ. మోహన్రావ్

జైలంతా గోలగా వుంది.

అందరూ హడావుడిగా అటూఇటూ పరుగెత్తుతున్నారు. ఏమయిందీ కొందరికి మాత్రమే తెలుసు. వాళ్ళు ఎదుట వాళ్ళకు అడిగినా చెప్పకుండా హడావుడిపడుతూ పరుగులు పెడుతున్నారు.

"ఎలా తప్పించుకున్నాడు?" కళ్ళు బంతునిప్పుల్లా మండు తున్నాయి జైల్ సూపరిండెంటుకు. ఎదురుగా నిల్చున్న కానిస్టేబుల్ కాళ్ళు వొణుకుతున్నాయి.

"లెట్రిన్‌కు వెళ్లాలన్నాడు సార్! తీసుకెళ్ళాను. అక్కడ నన్ను తన్ని నోటినిండా గుడ్డలు క్రుక్కి, నా గన్ లాక్కుని వెళ్ళిపోయాడు" చెప్పాడు.

"పచ్చి నెత్తురు త్రాగే పిచ్చి హంతకుడు అతను. ఆరు హత్యలు చేశాడు. మసాలవడ కోసం ఒకరిని, అగ్గిపెట్టె

కోసం ఇంకొకరిని, అడ్డం వచ్చినందుకు ఒకరిని, అలా చిన్న చిన్న కారణాలకు రెచ్చిపోయి మనుషుల్ని వేటాడి చంపాడా రాంబాబు! వాణ్ణి ఎంతో కష్టపడి పట్టుకున్నారు. నీ తెలివితక్కువ తనంతో అతన్ని వదిలేశావ్. నిన్ను సస్పెండ్ చేస్తున్నాను" అన్నాడు సూపరిండెంటెంటు.

కానిస్టేబుల్ మాట్లాడకుండా నిలబడ్డాడు.

అందర్నీ వెళ్ళిపొమ్మని, ఎక్కడెక్కడికో ఫోన్లు చెయ్యడం ప్రారంభించాడు సూపరెండెంటు.

మరో అరగంటకల్లా రాజమండ్రి, విశాఖపట్టణం, ఏలూరు, మధ్య నున్న పోలీసు బలగమంతా రాంబాబును పట్టుకొనేందుకు సన్నద్ధమయింది.

గంట గంటకు, రాజమండ్రికి రిపోర్టులు అన్నివేపుల నుంచీ వస్తున్నాయి. వాటి సారాంశం రాంబాబు దొరక లేదనే!

"ఆ రాస్కెల్ రాంబాబు పూర్తిగా మందుగుండుతో నింపిన గన్ తీసుకొనిపోయాడు. ఇంకెంతమంది అమాయ కులను హతమారుస్తాడో నని భయంగా వుంది" అన్నాడు జైలు సూపరెండెంటు, తన కెదురుగా వున్న జిల్లా పోలీసు సూపరెండెంటుతో.

"రాంబాబు అంత సులభంగా ఎలా తప్పించుకొన్నాడో అర్థం కావడంలేదు. ప్రహరీ గోడపైన కరెంటు తీగ లున్నాయి. వాటిల్లో ఎప్పుడూ హైవాల్టేజ్‌లో కరెంటు పోతుంటుంది. వాట్ని ఎలా దాటగలిగాడో?" అడిగాడు.

"ఈమధ్య కరెంటు కొరత వచ్చిందిగా. రోజూ రాత్రి ఏడునుంచి ఎనిమిది గంటలదాకా సప్లయి వుండటంలేదు. అది అతను తెలుసుకొని వుండాలి. అందుకే అలా ప్లాన్

వేసుకున్నాడు."

"ఐసీ. అతను పిచ్చివాడని అనుకొన్నా. కానీ తెలివి తేటలున్న పిచ్చివాడనుకోవాలి మనం!" అన్నాడు పోలీసు సూపరెంటెంటు.

తెల్లవారిందాకా ఏవిధమైన సమాచారం అందలేదు.

ఇద్దరికీ నిరుత్సాహంగా వుంది.

"మళ్ళీ ఎలా పట్టుకోవడం అతన్ని!" అర్థంగాక అడిగాడు సూపరిండెంటు.

"ఎక్కడో ఒకచోట అతను హత్య చేస్తాడు. దాంతో అతని ఆచూకీ తెలుస్తుంది. తెలిపిన వెంటనే మనం చుట్టు ప్రక్కల కాపు వెయ్యాలి. అంతకన్నా మరో మార్గం కనుపించడంలేదు!"

జైలు సూపరిండెంటుక్కూడా అంతకన్నా మరో మార్గం కనుపించలేదు.

రెండోరోజు పది గంటల ప్రాంతంలో, ప్రత్తిపాడు రైల్వేస్టేషనులో పని చేసే ఇన్‌ఛార్జి గుమస్తాను గన్‌తో ఎవరో కాల్చినట్లు రిపోర్టు అందింది. అతని దగ్గరున్న కేష్ లోంచి రెండు రూపాయల నలభై ఆరు పైసాలు దొంగిలించినట్లు కూడా తెలిసింది.

పోలీసు బలగమంతా అక్కడకు పరుగెత్తింది. విచారణను మొదలెట్టింది. స్టేషనుకు ఎడమవేపుగా వున్న పొలంలో పని చేసుకొంటున్న రైతు చెప్పిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని, హత్య జరిగాక రాంబాబు ట్రాక్ వెంటపడి, తాడేపల్లిగూడెంవేపు పరుగెత్తిపోయినట్లు దృఢపరుచుకున్నారు. సాయంకాలానికి గూడెంలోని జనమంతా కంగారు పడటం మొదలెట్టారు.

ఎవరి ఇళ్ళు వాళ్ళే వెతుక్కోవడం మొదలెట్టారు. బాత్ రూంలు, లెట్రిన్‌లు, తలుపులు బిగించి తాళాలు వేసి వుంచు కొన్నారు ఒకవేళ రాంబాబు దొంగతనంగా వచ్చి వాటిల్లో ఎక్కడైనా మకాం పెడతాడని.

ఉప్పెనలో మునిగిపోయే ఊరిజనంలో వుండేంత కుతూహలం, కలవరం, తొట్రుపాటు, ఆ రోజు తాడేపల్లిగూడెం జనంలో వున్నాయి.

పోలీస్‌వాన్‌లు మైక్‌లు పెట్టుకొని, అందర్నీ తగిన జాగ్రత్తలో వుండమని హెచ్చరిస్తూ తిరిగాయి.

రాంబాబును ఎవరైనా చూచినా, ఎవరింట్లోనన్నా వున్నట్లు అనుమానించినా వెంటనే పోలీసులకు తెలియ పరచమని ఆదేశించారు.

ఏలూరు, భీమవరం, కొవ్వూరుకు వెళ్ళే రోడ్లకు అడ్డంగా తారు డ్రమ్ములు తెచ్చిపెట్టారు. వాటి ప్రక్కనే పోలీసుల కాపలా ఏర్పాటు చేశారు.

రాంబాబు ఏ మాత్రం తప్పటడుగువేసినా తమకు చిక్కేట్లుగా వ్యూహం పన్ని వుంచారు పోలీసులు.

ఆరోజు ఆదివారం కావటంవల్ల జనం అంతా వాళ్ళ వాళ్ళ ఇళ్ళదగ్గరే వుండిపోయారు. కాపలా కాచుకోవటం సులభంగా వుంది వాళ్ళకు.

సినిమాలు లేవు. హోటళ్ళు లేవు. వెలుపలనుంచి బస్సులు రావటం కానీ, తాడేపల్లిగూడెంనుంచి బస్సులు పోవటంగానీ జరగలేదు. రైళ్ళు మాత్రం యధాప్రకారం నడిచాయి. కానీ స్టేషను నిండా పోలీసులే. ఎక్కేవాళ్ళనూ, దిగేవాళ్ళనూ, శల్య పరీక్షచేసి వదిలారు.

మళ్ళి మరో హత్య జరుగుతుందేమోనని భయంతో

జనం, హంతకుడి ఆచూకీ దొరుకుతుందన్న ఆశతో పోలీసు బలగం వున్నారు. కానీ అలాంటి వార్త ఏదీ తెల్లవారిందాకా రాలేదు.

అందరిలోనూ రాంబాబు గురించిన భయం కొంత తగ్గింది. అసలతను గూడెంవచ్చి వుండడనీ, ఒక వేళ వచ్చినా, ఏ రైల్లోనో ఏలూరుకో, లేకుంటే ఇంకేదైనా ఊరికో వెళ్ళిపోయి వుంటాడని, ఇరవై నాలుగు గంటలసేపు ఇక్కడుండి, ఎవర్నీ చంపకుండా వుండే వీలులేదనేలాంటి వాదనలు, ధోరణులు జనంలో కలిగాయి. సోమవారంనాడు ధైర్యం పుంజుకున్నారు. తమ తమ పనులు మామూలుగా చూసుకునేందుకు సన్నద్ధులైనారు.

తాడేపల్లిగూడెం నుండి నలజర్లుకు పోయేరోడ్‌లో ఊరి కానుకునివున్న సుశీలా స్పన్‌పైప్ కంపెనీ ముందు కారాపి దిగాడు ఓనరు ఓబయ్య. రోడ్‌పైకి ఇనుపకమ్మీలు చిందర వందరగా పడేసి వున్నాయి.

క్రింది అంతస్తుకు వెనుక వేపు షట్టర్సు బిగించి వున్నాయి. అక్కడి గదులనిండా సిమెంటు నింపివుంచారు. ఓబయ్య మెట్లెక్కి పైకి జేరుకున్నాడు.

తాళాలు తీసి, ఒక తాళం వెతికి, రంధ్రంలో పెట్టి త్రిప్పాడు. క్లిక్ మనలేదు. ఇరుక్కుపోయినట్లయింది. రెండు మూడు సార్లు వెనక్కి త్రిప్పి, కొద్దిగా బలం ఉపయోగించి ముందుకు త్రిప్పాడు. అతికష్టంపైన ఊడింది తాళం. తలుపు తెరుచుకొని విశాలమైన గదిలోకి వెళ్ళాడు. వెనుక వేపు గోడకున్న పెద్ద వెంటిలేటరు అద్దం పగిలి పోయినట్లు కనుపించింది. గాజు పెంకులు కొన్ని గదినిండా పడివున్నాయి.

వంగి వాటి కేసి చూశాడు.

అంతకు ముందు రోజు అనగా శనివారం సాయంత్రం ఆ అద్దం బాగానే వున్నది. దాన్ని ఎవరైనా అవతలవేపు నుండి రాయి పెట్టి కొట్టి వుండాలనిపించింది.

ఎవరి పనయివుంటుందాని ఆలోచించ సాగాడు ఓబయ్యా. ఎటూ తేల్చుకోలేక, అక్కడనుంచి వదలి తన గదిలోకి వెళ్లాడు. ఫాన్ వేసుకుని కూర్చున్నాడు కుర్చీలో.

గది తలుపు ఠక్కున మూసిన చప్పుడయింది.

ఓబయ్యా తలెత్తి చూశాడు. నిజంగానే తలుపు మూసి వుంది. వెలుపల నుండి గొళ్ళెం బిగిస్తున్న శబ్దం వినిపించింది. చకచక లేచి తలుపు దగ్గరకువచ్చి "ఎవరది" అరచాడు పెద్దగా.

"నీ మొగుడు!" వెలుపలి నుండి సమాధానం వినిపించింది.

తలుపుకు మధ్యగా అమర్చిన చిన్న అద్దంలోంచి వెలుపలి హాల్లోకి చూశాడు.

ఆరడుగుల ఆజానుబాహు విగ్రహం కనుపించింది.

అతని చేతుల్లో పొడవుపాటి పోలీస్‌గన్ వుండడం కూడా గమనించాడు. బట్టలు ఎర్రగా దుమ్ము కొట్టుకొని వున్నాయి.

"రాంబాబు!" అన్న పేరు ఓబయ్యా పెదాలపైన అప్రయత్నంగానే నృత్యం చేసింది. అతనికి తెలియకుండానే పెద్దగా అన్నాడు.

"అవును! రాంబాబే!" అరుస్తూ తలుపు తీశాడు. ముందు గన్‌ను పైకెత్తి ఓబయ్యాకు గురిపెట్టి "నాచేతి దెబ్బ రుచి చూస్తావా?" అడిగాడు.

"బాబోయ్! నన్ను చంపకు! పిల్లలుగలవాణ్ణి!" అన్నాడు ఓబయ్య.

"నీకు ప్రాణాలంటే చాలా ప్రేమ కదూ?" అడిగాడు రాంబాబు.

"నాకొక్కడికేనా? అందరికీ వుంటుంది ప్రేమ!"

"అది తెలుసు. నీ ప్రాణాలు నిలవాలంటే మర్యాదగా ఆ ఐరన్‌సేఫ్ తలుపులు తెరువు. అందులో వున్న డబ్బు మొత్తం తీసి టేబుల్‌పైన పెట్టు." ఆజ్ఞాపించాడు రాంబాబు.

"నాచేత రాదు తెరవడం!"

"చేతకాదా? ఎందుకని? నువ్వు ప్రొప్రయిటరువుకదా?"

"ప్రొప్రయిటరునే!"

"తాళాలు లేవా?"

"దీనికి తాళాలు అవసరం లేదు. కాంబినేషన్ నెంబర్లతో పనిచేస్తుంది లాక్." అన్నాడు ఓబయ్య.

"అయితే ఇంకా హాయి! త్రిప్పితీసేయ్!"

"ఆ నెంబర్లు నాకు తెలీవు! మా మానేజరు రామనాధం అస్తమానం దాన్ని తీస్తూ వేస్తూ వుంటాడు. వాడు రావాలి!" అన్నాడు ఓబయ్య.

"నీ ఎత్తులు నాదగ్గర పని చెయ్యవు. కంపెనీ నీది. ఐరన్‌సేఫ్ నీది. అందులో వున్న డబ్బు నీది కానీ దాన్ని తెరవడం మాత్రం నీకు తెలీదు. ఆ మాట నన్ను నమ్మమంటావ్? నేనంత వెధవనుగాను!" అంటూ గన్ పైకెత్తి ట్రిగ్గర్‌పైన వేలు పెట్టాడు.

"బాబూ! నా మాట నిజం. ఇంకాసేపటికి రామనాధం వస్తాడు. కావాలంటే అతన్ని అడుగు తెలుస్తుంది. అతను రాగానే తెరిపించి ఉన్న మొత్తం డబ్బు నీకే ఇస్తాను."

అన్నాడు ఓబయ్య.

క్షణకాలం ఏదో ఆలోచించి తక్కున తలుపు మూసి, బయటి నుండి గొళ్ళెం పెట్టాడు రాంబాబు.

బ్రతుకు జీవుడా అనుకుంటూ కుర్చీలో జేరగిలపడ్డాడు ఓబయ్య తాత ముత్తాతలను తలుచుకుంటు.

ఎడంచేతి వారగా టేబుల్‌పై నున్న ఎర్రది టెలిఫోన్ కనుపించింది.

దాంతో ఎవరితోనైనా మాట్లాడవచ్చునన్న విషయం స్ఫురించింది. ఈ రాంబాబు కోసం పోలీసులు ఎంతగా వెతుకుతున్నది, అంతకు ముందు రోజు గమనించి వుండ టంతో, వెంటనే వాళ్ళకు ఫోన్ చేసి రాంబాబు ఇక్కడ వున్నాడని చెప్తేతప్ప తనీ ఆపదలోంచి తప్పుకొనే దారి దొరకదనిపించింది.

రిసీవరు తీసి భుజంపైన వేసుకొని, మెల్లగా ఒకటి, రెండు జీరోలు త్రిప్పాడు. భుజంపై నున్న రిసీవరు తీసి చెవి దగ్గర పెట్టుకున్నాడు. చెవు దగ్గర ఏ విధమైన శబ్దం వినిపించలేదు.

ప్రాణం పోయాక చల్లబడి పోయే శవం శరీరంలా, కనెక్షను కట్ అయ్యాక నిశ్శబ్దంగా వుంది రిసీవరులో. రాంబాబు ఇలాంటి దేదన్నా జరుగుతుందని అనుమానించే కనెక్షను వైర్లు ముందే త్రెంచి వుంచిన వైనం ఓబయ్యకు అంతదాకా తెలీలేదు.

ఓబయ్య కుర్చీలోంచి లేచి తలుపు వోరగ వచ్చి నిలు చున్నాడు. రెండు లారీ లేవో వచ్చి ఆగినట్లయింది.

ఏలూరునుండి సిమెంటు రావలసి వుంది. బహుశా అది వచ్చి వుంటుందనుకున్నాడు. ఆ లారీల డ్రైవర్లిద్దరూ పైకి

వస్తారు. వాళ్ళ రాకను తలచుకొని ధైర్యం కలిగింది ఓబయ్యకు.

రాంబాబు ఏంచేస్తాడు చూద్దామని తలుపుకు ఆనుకుని నిలుచున్నాడు. మెయిన్‌డోర్ బార్లా తెరచి, దాని చాటున గన్ పట్టుకొని నిలుచుని వుండడం గమనించాడు.

డ్రైవర్లిద్దరూ ఏదో మాట్లాడుకుంటూ లోనికొచ్చారు. హాలు మధ్యదాక పోనిచ్చి "చేతులు పైకెత్తి నావేపు తిరగండి! లేకుంటే పిట్టల్ని కాల్చినట్లు కాల్చి పారేస్తాను!" అరిచాడు రాంబాబు.

ఆ అరుపుకు అదరిపడి వెనక్కి తిరిగారు ఇద్దరు డ్రైవర్లూ ఒకేసారి. చేతిలో గన్‌తో అపర యముడిలా నిలుచున్న రాంబాబును చూచి ఒళ్లు వొణికిపోతూనే, చేతులు తల్లోకి పైకెత్తారు.

"ఇద్దరూ అలాగే వెనక్కి నడవండి!" ఆజ్ఞాపించాడు రాంబాబు.

చెప్పినట్లే చేశారు. తిన్నగా వెళ్ళి గోడకు అతుక్కుపోయారు.

"కదిలారంటే కాలుస్తాను! నా సంగతి తెలుసునా?" కాస్త దగ్గరకు వెళ్ళి హెచ్చరించాడు.

"కాల్చొద్దు! కదలకుండా నువ్వు చెప్పినట్టే నిలుచుంటాం!" అన్నారిద్దరూ.

మరో అరగంట గడిచింది.

ఇసుక తెచ్చిన లారీ డ్రైవరు పైకొచ్చి, అంతకు ముందున్న వాళ్ళ ప్రక్కకు చేరుకున్నాడు.

పైపులు కొనేందుకు రాజమండ్రి నుండి వచ్చిన ఇద్దరు కాతాదారులక్కూడా అదేగతి పట్టింది.

గదిలో మొత్తం ఐదుగురు తయారైనారు.

ఓబయ్యను మాత్రం గదిలో పెట్టి తలుపులు మూసి వుంచాడు రాంబాబు.

ఐదుగురు మనుషులకు ఎదురుగా కొద్దిదూరంలో మోకాళ్ళపైన కూర్చుని తుపాకీ గురిపెట్టి వుంచాడు రాంబాబు.

అందరూ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వున్నారు.

"ఓబయ్యా!" పిలిచాడు రాంబాబు.

"ఏంటి బాబూ!" పలికాడు వెంటనే తలుపుల వెనుక నుంచి ఓబయ్య.

"ఆ రామనాథం రాలేదేం?"

"వస్తాడు బాబూ! వస్తాడు!"

"మరో అరగంట చూస్తాను. రాకుంటే అందర్నీ కాల్చి వెళ్ళిపోతాను," అన్నాడు.

"అలా చెయ్యకు. మాలో ఎవరినన్నా వదులు. వెళ్ళి రామనాధాన్ని పిల్చుకొస్తాం!"

"అది జరగదు. ఆ సాకుతో నన్ను పోలీసులకు పట్టిద్దా మనుకుంటున్నారుకదూ!" అడిగాడు రాంబాబు.

"రామ! రామ! అలాంటి పాడు ఆలోచనలు మా కెలా వస్తాయి. ప్రాణాలు పోకుండా వుంటే చాలనుకుంటున్నాం మేము!" అన్నాడు ఓబయ్య.

"అంత తీపే వుంటే, బుర్ర బ్రద్దలుకొట్టుకొని ఆ కాంబినేషన్ నెంబర్లు గుర్తుతెచ్చుకొని, ఐరన్ సేఫ్ తెరచి డబ్బు ఇచ్చెయ్. అంతకన్నా మరో మార్గంలేదు. అరగంట లోపల నీకై నువ్వు ఆ సేఫ్ తెరవనన్నా తెరవాలి! లేదా రామనాథం వచ్చి తెరవాలి! లేకుంటే మీ చావు ఖాయం!" అన్నాడు రాంబాబు.

ఓబయ్యకేం చెయ్యాలో తోచలేదు. నిజంగానే ఆ నెంబర్లు అతనికి గుర్తులేవు. సేఫ్ కొన్నప్పటి బిల్ దొరుకుతుందేమోనని తన రూంలో నున్న కాగితాలన్నీ చకచక తిరగేశాడు. అది కాని ఇరవై సంవత్సరాలు కావడంవల్ల ఆ బిల్లు చిక్కలేదు.

రామనాథాన్ని అరగంట లోపల ఇక్కడికి తీసుకొస్తే, నెమలివాహనంపైన ఊరంతా ఊరేగింపు చేయిస్తానని దేవుడికి మ్రొక్కుకొన్నాడు. తలుపులు లోపలినుండి గొళ్ళెం వేసుకుందా మనుకున్నా లోపలివైపు గొళ్ళెం లాంటిదేదీ లేదు వాటికి.

క్షణాలు మెల్లగా దొర్లుతున్నాయి. అవి నిముషాలుగా మారటానికి మామూలుకన్నా ఎక్కువ వ్యవధి తీసుకొంటున్నట్లుగా అనిపించింది అందరికీ.

మెట్లపైన ఎవరో మనిషి ఎక్కి వస్తున్నట్లు అడుగుల చప్పుడయింది.

రాంబాబు వెనక్కి జరిగి మోకాళ్ళపైన కూర్చున్నాడు. లోపలికొచ్చిన మనిషిని చూడగానే గోడకు అతుక్కుపోయి వున్న ఐదుగురు మనుషులు "మానేజరుగారొచ్చారు!" అన్నారు పెద్దగా.

"మిస్టర్ రామనాథం!" పిలిచాడు రాంబాబు.

రామనాథం అతనివేపు తల త్రిప్పాడు. అతనికంతా అయోమయంగా వుంది. తలుపుల వెనకనున్న ఓబయ్య తన్ను కరుణించి రామనాథాన్ని త్వరగానే అక్కడికి చేర్చినందుకు భగవంతుణ్ణి మనసారా కొనియాడాడు.

"నా చేతిలో ఏముందో చూశావా?" అడిగాడు గన్‌ను పైకెత్తి రాంబాబు.

"చూశాను!" అన్నాడు రామనాథం.

"దీనిముందు నిలుచునే దలానేనా?"

"లేదు!" అంటూ చేతులు రెండూ పైకెత్తాడు రామనాథం.

"మెల్లిగా వెళ్ళి ఆ తలుపు వేసెయ్!" అన్నాడు రాంబాబు చెప్పినట్లే చేశాడు రామనాథం.

"ఎక్కడైనా పొడవుపాటి లావుత్రాడు పట్టుకురా" అన్నాడు.

"చూస్తాను? కానీ ఎందుకు?" అడిగాడు రామనాథం.

"ఎదురు ప్రశ్న వేశావంటే తల ముక్కలవుతుంది. చెప్పినట్లు చెయ్యి!"

"అలాగే!" అంటూ ఓబయ్య గదికి ప్రక్కనున్న గది లోకి వెళ్ళి తాడు తెచ్చాడు.

"ఆ తలుపు తీసి ఓబయ్యను లాక్కురా?" అన్నాడు.

రామనాథం అలాగే చేశాడు.

"అందరి కాళ్ళూ, చేతులూ, కట్టెయ్యాలి నువ్వు." అంటూ రామనాథం వేపు నుంచి మిగిలిన వాళ్ళవేపు తిరిగి "ఒకరి ప్రక్కనొకరు వెల్లకిలా పడుకోండి!" అన్నాడు రాంబాబు.

అందరూ అలానే చేశారు.

ఓబయ్య కూడా పడుకున్నాడు.

"రామనాథం! నీపని మొదలెట్టు. ఏమైనా పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యబోయినట్లు అనుమానించానంటే...." గన్ పైకెత్తి చూపించాడు.

"నువ్వు చెప్పినట్లే చేస్తాను!" అంటూ త్రాడు తీసుకుని కూర్చున్నాడు. తలవేపున కూర్చుని కట్టసాగాడు రామనాథం.

మధ్య మధ్య రాంబాబును గమనించసాగాడు. మోకాళ్ళపైన నిముషానికోసారి బరువు మార్చుకుంటున్నాడతను. అది గమనించాడు రామనాధం. అలా మార్చుకునేప్పుడు తుపాకీని కూడా అటు నుండి ఇటు, ఇటు నుండి అటు మార్చుకుంటున్నాడు. ఆ మార్పిడిలో తుపాకీ పొజిషన్ మారిపోవటం చూచి అతని కళ్ళు మెరిశాయి.

అతని మెదడు వేగంగా పనిచెయ్యటం మొదలెట్టింది. తలలవేపు నుండి కట్లు కట్టడం వల్ల అతనికీ రాంబాబుకు మధ్య దూరం ఎక్కువగా ఉంది. అదే కాళ్ళ వేపు కూర్చుంటే మరో ఆరడుగులు ముందుకు, అంటే అతనికి దగ్గరగా రాగలుగుతాడు. అక్కడకు చేరుకొన్నాక ఇద్దరికీ మధ్యనున్న దూరం మూడడుగుల మించి వుండదు.

రాంబాబు తుపాకీ మార్చే సమయాన్ని అదనుగా తీసుకొని అతను పైకి దూకాలని తీర్మానించుకున్నాడు. కానీ ఆ సాహసం చాలా ప్రమాదకరమైనదని కూడా తెలుసుకున్నాడు. అందర్నీ త్రాటితో, బంధించాక రామనాధం తనొక్కడే అతనిపై దూకి, తుపాకీని దూరంగా తోసేసినా, లాభం వుండదనిపించింది.

కారణం అతనితో కలబడి కొట్లాడి, గెలువగలనన్న నమ్మకం రామనాధంలో లేదు. కనీసం ఇద్దరినన్నా బంధించకుండా వున్న సమయంలో తన ప్రయత్నం సాగిస్తే తప్ప విజయం సమకూరదనిపించింది.

ఆలోచించడం మొదలెట్టాడు రామనాధం.

"రాంబాబూ!" పిలిచాడు రామనాధం.

"ఏమిటి?"

"ఇలా తలలవైపు నిలబడి వీళ్ళను బంధించడం

కష్టంగా వుంది. కాళ్ళవైపు కూర్చుంటే సులభంగా వుండే ట్లుంది."

"అలాగే కానీ! పిచ్చి పిచ్చి వేషాలు మాత్రం వెయ్యకు. పని త్వరగా పూర్తికావాలి!" అన్నాడు రాంబాబు.

ఐదు నిమిషాలు భారంగా గడిచాయి.

లారీ డ్రైవర్లిద్దరిని తప్ప మిగిలిన వాళ్ళను కట్టేశాడు రామనాధం.

రాంబాబు అవతలకాలు పైనుంచి బరువుకు ఇవతలి కాలుపైకి మార్చుకొంటూ తుపాకీని నిటారుగా నిలబెట్టాడు.

అదే అదనుగా చటుక్కున రాంబాబు పైకి దూకాడు రామనాధం. ఆదమరుపులో వున్న రాంబాబు అనుకోని పరిణామానికి ఆశ్చర్యపోయి వెల్లకిలా వెనక్కి పడ్డాడు.

అంతలో క్రింద పడుకొనివున్న డ్రైవర్లిద్దరూ కూడా లేచి రామనాధానికి సాయంగా వెళ్ళారు.

ముగ్గురూ కలిపి రాంబాబును ఘట్టిగా పట్టుకొని తుపాకీ లాక్కున్నారు. విసిరి దాన్ని దూరంగా పారేశారు.

రాంబాబూ వాళ్ళ ఉడుంపట్టు నుండి తప్పించుకోవాలని ఎంతో ప్రయత్నం చేశాడు. కానీ లాభం లేకపోయింది.

డ్రైవర్లిద్దరూ రాంబాబును పట్టుకున్నారు. రామనాధం మిగిలిన వాళ్ళందరి కట్లు విప్పాడు.

మనిషిద్వారా పోలీసులకు కబురంపారు. వాళ్ళు వెంటనే వచ్చి రాంబాబును అదుపులోకి తీసుకున్నారు.

రామనాధాన్ని దగ్గరకు రమ్మని పిలిచాడు. అతను వెళ్ళాడు.

"నువ్వు నా కన్యాయం చేశావ్?" అన్నాడు రాంబాబు.

"నేనా?"

"అవును. ఈ ఓబయ్య కోసం మూడేళ్ళనుండి వెతుకు తున్నాను. విశాఖపట్నం నుండి తప్పించుకు వెళ్ళిపోయాడు. నా తల్లిని నమ్మించి మోసం చేశాడు. ఆ విషయం ఆమె చనిపోయే ముందు చెప్పింది. వీడి ఫోటో నా దగ్గరవుంది. రాజమండ్రి జైల్లో ఈ వూరి దొంగ నాకు కలిశాడు. నా దగ్గరున్న ఫోటో చూచి ఇతని వివరాలు చెప్పాడు. అతని దగ్గర వున్న డబ్బంతా తీసుకొని ఆ తర్వాత నిలువునా కాల్చి చంపాలని వచ్చాను. అది జరగకుండా చేశావ్‌?" అన్నాడు.

రామనాథం మాట్లాడలేదు.

మగవాళ్ళపైనే కోపం పెంచుకున్న రాంబాబు, కనపడ్డ మనిషినల్లా పశువులా ఎందుకు కాల్చాడో అతని మాటల వల్ల అర్థం చేసుకున్నాడు పోలీసు సూపరింటెండెంట్. ***

మంత్రిగారు: ఏంటయ్యా! సెక్రటరీ! నిన్ను పావుగంట స్పీచ్ తయారు చేయమంటే గంట స్పీచ్ తయారుచేశావు. వెధవది మీటింగ్‌లో ప్రతి పావుగంటకు జనం ఒకటే ఈలలు వెయ్యటం, గొడవ చెయ్యటం ఏమిటిదంతా?

సెక్రటరీ: క్షమించాలి సార్! మీరు చెప్పినట్లే పావుగంటకు సరిపడే స్పీచ్ తయారు చేసాను. కాని పొరబాటున దాని నాలుగు కాపీలు ఒకే ఫైల్లో పెట్టాను. మీరది గమనించి ఉండరు.

—సూర్యదేవర్, తెనాలి.

అపాయాలను జయించాలి!

కె. విజయశేఖరరెడ్డి

అప్పుడే విమానం రన్‌వేపైకి వచ్చింది. విమానం 10 నిమిషాలలో బయలుదేర బోతుందని అనౌన్సర్ గొంతు వినిపించింది.

"చెల్లీ! వెళ్ళొస్తానమ్మా!" అన్నాను నేను.

"మంచిదన్నయ్యా! మధ్య మధ్యన లెటర్సు రాస్తుండన్నయ్యా" రాధ గొంతు గద్గదమయ్యింది.

నాలోకూడా ఏదో తెలియని బాధ కలుక్కుమంది.

రాధ భర్త గోపాల్ అచేతనంగా నిలబడి మావైపు చూస్తున్నాడు.

నాకీ ప్రపంచంలో ఉన్నదొక్కరే ఒక్కరు. ఆమె నా ప్రియమైన చెల్లి రాధ. అందుకే నాలో తెలియని బాధ మెదుల్తుంది.

విమానం ఇంకా కొద్ది క్షణాల్లో బయల్దేరబోతుందని

అనౌన్సర్ గొంతు వినగానే "టా!టా!" అని చేతులూపుతూ విమానం ఎక్కాను.

విమానం పైకి లేచింది.

నేను ప్రభుత్వం తరుపున 'బాటని' రిసెర్చికై అమెరికా వెళ్తున్నాను.

ఎయిర్ హోస్టెస్ అందర్ని చిరునవ్వులతో పలుకరిస్తూ కాఫీ, టిఫిన్‌లు అందిస్తుంది.

ఆకాశంలో ఏవో మబ్బులు ఆవిరిస్తున్నాయి. చల్లని గాలి. టైం చూశాను నేను. విమానం బయలుదేరి అరగంట కూడా కాలేదు.

విమానం బయలుదేరినప్పుడు పొడిగానున్న ఆకాశం, ఇప్పుడు కారు మబ్బులతో నిండిపోయింది. తుఫాన్ వచ్చే సూచనలు కనబడసాగాయి. నా గుండెలు గుబగుబలాడాయి.

తుఫాన్ భీకరమై విమానం కూలిపోతే....???

నాకు నేనే ధైర్యము చెప్పుకోసాగాను.

కాని—

నే ననుకున్నట్టుగానే తుఫాను భీకరమైంది.

ఎయిర్ హోస్టెస్ అందరికీ సేఫ్టీ బెల్టులు బిగించసాగింది. ఎయిర్ హోస్టెస్ ముఖంలోకి చూశాను. ఇంతకు ముందు చిరునవ్వుతో వెలిగిన ముఖం ఇప్పుడు భయకంపితమైంది. అందరి వైపొకసారి చూశాను. ఎవరి ముఖాల్లో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు.

2

ఎటు చూసినా కారుచీకటి. చుట్టూ నల్లని మబ్బు తప్పితే వేరే ఇంకేమీ కన్పించుటలేదు. కీచురాళ్ళ శబ్దములే ఎక్కువగా విన్పించసాగాయి. అక్కడక్కడ మిణుగురు పురుగుల

వెలుగులు కన్పిస్తున్నాయి. నాకేమీ గోచరించలేదు.

నేను ఎక్కడున్నానో నాకే తెలియదు. నా శరీరము చాలా నొప్పిగా ఉంది. కదలడానికి వీలులేకుండ ఉన్నది. నాకు చాలా భయంవేసింది.

కాళ్ళు చేతులు వణుకుతున్నాయి చలికి. అడుగున గులక రాళ్ళు గుచ్చుకుంటున్నాయి. నా ప్రక్కన ఎవరో బాధతో మూల్గుతున్నారు.

భయంతో మళ్ళీ కళ్ళుమూసుకున్నాను నేను.

తెల్లవారింది—చిన్నగా మెలకువ వచ్చింది. చుట్టూ చూచాను.

దట్టమైన అడవి అది. కనీసం సూర్యకిరణాలు గూడా పూర్తిగా ప్రసరించడంలేదు అక్కడికి. ఎత్తుచెట్లు, గుబురు చెట్లున్నాయి. ఎత్తు పల్లాలున్నాయి.

అదొక చీకటి ప్రదేశము. ఇంతవరకు ఏ మానవుడు అక్కడికి వచ్చిన సూచనలు కన్పించలేదు.

నాకు ఒక్కొక్కటే గుర్తుకు రాసాగాయి.

తుఫాన్ రావడం, విమానం ఊగడం, క్రింద పడి పోవడం. అంతలోనే స్పృహపోయింది. స్పృహ వచ్చే సరికి తను కారు చీకట్లో ఉన్నాడు.

అవును. అప్పుడు తనకొక మూలుగు విన్పించింది.

చుట్టూ చూశాను.

కొంచెము దూరములో ఒక వ్యక్తి పడివున్నాడు. అతని వైపు పరిశీలనగా చూశాను. దాదాపు ఇరువది ఐదు సంవత్సరాలుంటాయి.

నేను లేవబోయాను. కాని, వొళ్ళంతా నొప్పిగా వుంది. అతి కష్టముతో పైకి లేచి నిల్చున్నాను. ఆకలికూడా

ప్రారంభమయింది. చుట్టూ చూశాను. కొంచెము దూరములో కూలిపోయిన విమానము కన్పించింది. అందులో ఏమైనా ఆహారము ఉంటుందేమోనని ఆశ చిగుర్చేసరికి అటువైపు వెళ్ళాను. విమానము చుట్టూ దాదాపు 100 శవాలు మట్టిలో కలిసివున్నాయి.

విమానముకూడా చాలావరకు విరిగిపోయింది. కాలిపోక పోవడం నా అదృష్టము అనుకున్నాను. విమానము లోపలికి చేరడం చాలా కష్టం. కాని ఆకలిని తీర్చుకోవాలంటే లోప లికి వెళ్ళక తప్పదు. అందుకే బయల్దేరాను.

కాని, లోపలికి ఎలా వెళ్ళాలో తెలియలేదు. ఏమైనా ఆయుధంలాంటిది దొరుకుతుందేమోనని చూశాను. కాని నేనున్నది నట్టడవి అని జ్ఞాపకము వచ్చింది.

వెంటనే నాకొక ఆలోచన తట్టింది. శక్తి కూడదీసుకొని బయల్దేరాను అడవిలోకి. అరగంటలో ఒక నిచ్చెన తయారు చేశాను.

నా ప్రయత్నం ఫలించిందని దేవునికి మ్రొక్కుకున్నాను. నిచ్చెనద్వారా పైకి ఎక్కి విమానం లోపలికి వెళ్ళాను. ఆహారం కొంత దొరికింది. అది నాకు పదిరోజులకు సరిపడా వుంది. ఈలోగా ఈ మట్టిలో కలిసిపోయిన విమా నాన్ని వెదకడానికి వచ్చే హెలికాప్టర్ల సహాయము లభి స్తుంది. కాని లోపల మాత్రము నీరు దొరకలేదు. ఆఖరికి ఒక వాటర్‌బ్యాగ్ దొరికింది.

దొరికిన ఆహారాన్ని తీసుకొని వాటర్‌బ్యాగ్‌తో బయటికి వచ్చాను.

స్పృహలోలేని వ్యక్తివేపు నడిచాను. ముఖంపై కొంత నీరు చల్లాను. కళ్ళు తెరిచాడు. లేచి కూర్చున్నాడతను.

నీరసంగా మూల్గుతున్నాడు.

"నీరసంగా ఉంది. ఆహారం తీసుకోండి." అన్నాను.

"సారీ? ఎవ్వరు మీరు?" అని ఆశ్చర్యంతో అడిగాడు.

"నీతోటే దురదృష్టంలో చిక్కుకున్న సోదరుణ్ణి" అన్నాను.

ఇద్దరము కలిపి తిని, మిగిలివున్న నీరు త్రాగాము.

"మీ పేరేమిటి?" అడిగాను.

"రాజు, మీపేరు" అతనడిగాడు.

"జీవన్" చెప్పాను.

"ఏం చదువుకున్నారు మీరు?" మళ్ళీ అడిగాను.

"ఎం. ఏ. కెమిస్ట్రీతో పాసయ్యాను."

"నేను బాటనీలో రిసెర్చి చేయడానికి అమెరికా వెళ్తున్నాను. మధ్యలో జరిగిన సంఘటన మీకు తెలిసిందే!" అడగకుండానే నన్ను నేను పరిచయము చేసుకున్నాను.

అతను చాలా భయంగా వున్నాడు. బహుశా ఇక్కడి నుండి ఎలా బయటపడాలనో?!! అందుకే అన్నాను—

"బహుశా, త్వరలోనే కూలిపోయిన విమానాన్ని వెదకడానికి హెలికాప్టర్స్ రావచ్చు."

"ఈ లోపల మనము ఏ జంతువుల వాతైనా పడవచ్చును" అతనిలో ఏదో నిరాశ ఆవరించింది.

"మనము ఆత్మరక్షణ చేసుకోవాలి," అన్నాను నిర్భయంగా.

మధ్యాహ్నం ఇద్దరం ఒక చెట్టుకింద పడక ఏర్పాటు చేసుకొని నిద్ర కుపక్రమించాము.

కాని నిర్మానుష్యంగా ఉన్న ఈ అడవిలో భయంకరమైన క్రూర జంతువుల అరుపుల నడుమ అతి భయంకర

మైన ఈ వాతావరణములో ఏ నరునికైనా ఎలా నిద్ర పడ్తుంది?

అనవసరమైన ఆలోచనలతో బుర్ర వేడెక్కింది. భయం అధికం కాసాగింది.

కొంతసేపటికి నేను మగత నిద్రలోకి జారిపోయాను.

ఏదో బుస్సుమన్న శబ్దంతో మెలకువ వచ్చింది నాకు. చుట్టూ చూశాను.

అదిరిపడ్డాను నేను.

చుట్టూ చుట్టుకున్న అడవిపాముతో పెనుగులాడుతున్నాడు రాజు.

ముందుకు వెళ్ళి దాని తోకను పట్టుకుని బలంగాలాగాను. లాభంలేదు. చాలా గట్టిగా చుట్టుకొనిపోయిందా పాము.

దాని తోకను గట్టిగా పట్టుకొని చటుక్కున క్రింద పడిపోయాను. రాజుకూడా అతనికి చుట్టుకున్న పాముతోపాటు పడిపోయాడు.

దొర్లుతూ ముందుకు వెళ్ళసాగాను. అయినా పాము పట్టు విడవలేదు. అలాగే దొర్లసాగాను. పాము పట్టువిడిచి ఒక్కొక్క చుట్టే విడిపోసాగింది. ఆఖరికి అంతా విడిపోయింది.

కాని ఆ పాము ఈసారి నా చుట్టు తోకతో చుట్టుకోసాగింది.

నాకేమి పాలు పోలేదు. సహాయానికి రాజు వైపు చూశాను, లాభం లేదు. రాజు భయంతో ఎప్పుడో స్పృహ కోల్పోయాడు. ఇంకా ఆలస్యం చేస్తే ఈ పాము నన్ను మింగేస్తుంది. ఇక నేనే ఎలాగైనా తప్పించుకోవాలి.

దొర్లుతూనే జేబులో నున్న పెన్‌నైఫ్ తీశాను. నా మెడ

వరకు వచ్చిన పాము తలలో కసిగా గ్రుచ్చసాగాను.

రక్తం వరదలుగా కారసాగింది.

చచ్చిపడిపోయిన పాము వైపు చూశాను.

"అమ్మయ్యా! గండం తప్పింది." అనుకున్నాను మనసులోనే. తర్వాత రాజుకు స్పృహ తెప్పించడములో మునిగిపోయాను.

3

దూరంగా ఒక ఎత్తైన చెట్టుపైన ఎక్కి చుట్టూ పరికించి చూస్తున్నాడు రాజు.

"రాజూ, అక్కడేమి చేస్తున్నావు?"

రాజు అక్కడేమి చేస్తున్నాడో నా కర్థము కాక అలా అడిగాను.

రాజు సమాధాన మివ్వకుండా ఎక్కడో దీక్షగా చూస్తున్నాడు. కాసేపటికి అతని ముఖములో ఆశారేఖ వెలిగింది. గబగబా చెట్టు దిగి వచ్చాడు. చాలా ఆనందంగా వున్నాడు.

"అరమైలు దూరంలో ఏదో పెద్ద సరోవరముంది జీవన్!" పట్టలేని ఆనందంతో చెప్పాడు రాజు.

"నిజంగా?" నాకు ఆశ్చర్యమేసింది.

అంతలోనే—

భయంకరమైన సింహగర్జన విన్పించింది. నేను రాజు అదిరిపడ్డాము. దూరంగా ఒక సింహము గర్జిస్తూ అది మా వైపే వస్తుంది. ఏమి చెయ్యాలో మాకు పాలుపోలేదు.

ప్రక్కనే వున్న చెట్టును చూచి రాజు గబగబా ఎక్కసాగాడు. నేనుకూడా ఎక్కాను. కాని ఆ చెట్టు చాలా చిన్నదిగా వుంది. సింహం మావైపే దూసుకు వస్తుంది.

ఆ చెట్టుపైకి సింహం సులభంగా ఎగురగలదు, ఆ చెట్టు

ఎక్కి చాలా తప్పుపని చేశామనిపించింది నాకు. కాని ఇది తప్ప గత్యంతరము లేదు.

ఆశ్చర్యపోయాను.

సింహము దృష్టిలో మేము పడలేదు.

సింహము కూలిపోయిన విమానంపైపు వెళ్ళసాగింది, అంటే సింహము అక్కడున్న శవాలను పసిగట్టిందన్న మాట.

కొంత సేపటికి సింహము వెళ్ళిపోయింది. మే మిద్దరము చెట్టు దిగాము. మెల్లిగా నీరు కన్పించినవైపు నడవ సాగాము. అప్పటికి సాయంత్రం మూడవుతూంది.

రాజు చేతిలో వాటర్ బ్యాగ్ వుంది. దాదాపు సగం దూరం వచ్చేశాం. నేను ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా నడుస్తున్నాను. రాజు హెచ్చరించేసరికి ఆలోచనలనుండి తేరుకొని చూశాను.

కొంతదూరముతో ఒక ఎలుగుబంటి వస్తుంది. అది మమ్మల్ని చూసి మాకేసి పరుగెత్తుకు రాసాగింది.

అంతే!....

గబగబా ఇద్దరం ప్రక్కనున్న చెట్టు ఎక్కసాగాము. పైన నేను ప్రాకుతున్నాను. వెనుక రాజు వస్తున్నాడు. రాజు పట్టుతప్పి గబాల్న నా కాళ్ళు పట్టుకున్నాడు.

తల వెనక్కి త్రిప్పి చూశాను. రాజు నిరాధారంగా నా కాళ్ళు పట్టుకొని వ్రేళ్ళాడుతున్నాడు. నా కాళ్ళుకూడా పట్టు తప్పాయి.

రాజు నా కాళ్ళపై వ్రేలాడుతున్నాడు. నేను చెట్టు కొమ్మకు వ్రేలాడుతున్నాను,

కాని నేనెంతో సేపు ఇద్దరి బరువును మోస్తూ ఇలా

వ్రేలాడలేను. ఏ క్షణమైనా పట్టు తప్పి పడిపోవచ్చు. క్రింద పడితే పారిపోడానికి ఆస్కారం లేదు. ఎలుగుబంటి మమ్మల్ని చంపుతుంది.

"కమాన్ రాజూ! ఎలుగుబంటి పైకి దూకేయ్," అరిచాను.

వెంటనే రాజూ నిర్భయంగా ఎలుగుబంటిపైకి దూకాడు. ఎలుగుబంటి పట్టుతప్పి క్రిందపడింది. రాజు నిరపాయంగా, ఎలుగుబంటి మీదబడి ప్రక్కకు దొర్లాడు.

ఎలుగుబంటి లేవబోయింది. దానిపైన ఈసారి నేను దూకాను. ఎలుగుబంటి మళ్ళీ పడిపోయింది. ఈసారి ఎలుగుబంటి లేవడానికి కొంత ఆలస్యమౌతుంది.

"కమాన్ రాజూ!" చెట్టుమ్రాను చాటుకు పరుగెత్తాను. రాజు నన్ను అనుసరించాడు.

అది లేచి మాకేసి రౌద్రంగా దూసుకు రాసాగింది.

పెన్‌నైఫ్‌ను గురిచూసి వదిలాను. గురి తప్పలేదు, ఎలుగుబంటి కంటిలో దిగబడింది చాకు.

దాని రెండవ కంటిలో దిగిందొక చాకు. అది రాజు చేతి లోంచి వచ్చింది.

ఎలుగుబంటి ఇప్పుడు గ్రుడ్డిది. దాని దగ్గఱకు వెళ్ళి కంట్లోనుండి చాకు లాగి కసికొద్దీ ఎలుగుబంటి శరీరములో గ్రుచ్చసాగాను. రాజుకూడా నన్నే అనుసరించాడు. ఎలుగు బంటి బాధతో క్రింద పడిపోయి విలవిల్లాడసాగింది.

ఇద్దరము మళ్ళీ నడక సాగించాము. దూరాన నీళ్ళ లాంటివి కన్పించాయి. దగ్గరకి వెళ్ళాము. మా ఆశ ఫలిం చింది. అది మేము చూసిన సరోవరమే.

రాజు పరుగెత్తాడు.

పాంటు, షర్టు విడిచి అందులోకి దుమికాడు. ఈత కొత్తాదేమో!

నేనుకూడా స్నానము చెయ్యాలనుకున్నాను. కాని ప్రకృతి సౌందర్యాన్ని పరికిస్తూ తన్మయుడనై ఉండి పోయాను.

"జీవన్" హృదయ విదారకమైన కేక విన్పించిన వైపు చూశాను.

అదిరిపడ్డాను.

రాజు ఏవో తీగలమధ్య అల్లుకుపోబడ్డాడు.

పిచ్చిగా అరుస్తూ చూస్తున్నాను ఏమి చేసేదిలేక.

రాజు ఎప్పుడో శవమైపోయాడు.

అంటే!—

ప్రకృతిలో కొన్ని మొక్కలు నైట్రేటులను భూమి నుండి గ్రహించలేక కీటకములను భక్షిస్తాయి. కొన్ని పెద్ద జంతువులను-అంటే మనుష్యులను, పశువులను భక్షిస్తాయి. వాటి జాతికి చెందినవే నెపెంథిస్, యుట్రిక్ లేరియా మొదలగు నీటిమొక్కలు.

మనుష్యులను చంపగల మొక్కలుకూడా ఉంటాయని ఇదివరకు ఎవ్వరూ కనుక్కోలేదు. ఇప్పుడిప్పుడే వాటిమీద పరిశోధనలు జరుగుతున్నాయి.

రాజు లేడన్న దిగులు నన్ను పూర్తిగా ఆవరించింది' బాధతో అలాగే కూర్చుండిపోయాను.

నాలో ఎక్కడలేని పట్టుదల ఆవరించింది. ఎలాగైనా ఆ మొక్కల గురించి తెలుసుకోవాలనుకున్నాను అదృష్ట వశాత్తు నేను రిసెర్చి చేసేదికూడా కీటకాహారి మొక్కల పైనే.

వెంటనే బయల్దేరాను ఏవైనా చిన్న జంతువులకొరకు. కొంతసేపటికి నాకొక అడవిమేకల జంట కన్పించింది. పెన్ నైఫ్‌తో రెంటిని చంపి తీసుకువచ్చాను.

చచ్చిన రెండు మేకలను సరోవరం దగ్గఱకు తెచ్చాను.

ఒక మేకను సరోవరములోకి విసిరాను. ఐదు నిమిషాలలో మేక గుజ్జుగా మారి నీళ్ళల్లో కలిసిపోయింది.

రెండవ మేకను విసిరాను. కాని నే ననుకున్నట్లుగా ఈ సారి మేకను తీగలు చుట్టుకోలేదు. ఇదేమిటో నా కర్థము కాలేదు. ఇంతలోనే జ్ఞాపకము వచ్చింది నాకు.

జంతువులను తినే మొక్కలు ఒక జంతువును తిన్న వెంటనే మరొక జంతువును తినటానికి కొంత టైం తీసుకుంటుందేమోనని. దానిక్కారణము అవి తాము తీసుకున్న ఆహారాన్ని జీర్ణము చేసుకొనే వరకు మళ్ళీ ఆహారాన్ని తీసుకోవు.

అలాగే మేకవైపు చూస్తుండిపోయాను.

అరగంట గడిచింది.

తీగలు మెల్లగా మేకను చుట్టుకోసాగాయి. కొద్దిసేపట్లో మేక నుజ్జుగా మారిపోయింది.

అంటే!—

ఈ మొక్క ఆహారాన్ని తీసుకునే మధ్య సమయం అరగంట. ఈ సమయాన్ని వినియోగించుకోవాలనుకున్నాను నేను.

వెంటనే నీళ్ళలో దూకాను. సరోవరము మధ్యలో ఉన్నాయి తీగెలు.

మెల్లిగా ఒక తీగెను అందుకున్నాను. పెన్‌నైఫ్‌తో నరుకబోయాను. కాని బయటనుండి కన్పించనంత లేతగా లేవు. ఆ తీగలు. కోయసాగాను.

ఐదునిమిషాల తర్వాత నా ప్రయత్నము ఫలించింది. తీగ తెగింది. తీగ మధ్యనుండి రక్తం చివ్వున చిమ్మ సాగింది.

బాప్‌రే! అదిరిపోయాను.

అలా నాలుగైదు తీగలు కోసుకొని బయటకు ఈదాను. ప్రక్కనే ఉన్న వాటర్ బ్యాగ్‌లో తీగలు చుట్టిపెట్టాను. మూతను గట్టిగా బిగించాను.

అంతలో, ఏదో శబ్దం వినిపించసాగింది.

తల ఎత్తి చూశాను. పైన విమానాన్ని వెదుకుతున్న హెలికాప్టర్లు కన్పించాయి. ఆనందంతో చేతులూపుతూ కూలి పోయిన విమానంకేసి పరుగెత్తాను. ***

ఓ భిక్షగాడు "ధర్మం చేయండి బాబూ" అంటూ అర గంటనుండి వెంటబడుతున్నాడు.

రామక్రిష్ణ వాని పీడ వదిలించుకుందామని ఎంత త్వరగా నడచినా; ఆ భిక్షగాడు వదల కుండా వెంటబడుతూనే వున్నాడు. ఇక సహించ లేక "ఇక్కడా నడిరోడ్డుమీద భిక్షమడిగేది" అంటూ ఆ దగ్గర్లో వున్న హోటల్లో కెళ్ళి "హమ్మయ్యా!" అనుకుంటూ కూర్చున్నాడు రామకృష్ణ.

"బాబూ ధర్మం చెయ్యండి" అంటూ ఆ భిక్ష గాడు రామకృష్ణ కెదురుగా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

—శ్రీమతి ఎమ్. ఎన్. ప్రకాశరావు,
సికింద్రాబాదు.

జువిూలియా

ముద్దా సురేష్

బెడ్ రూమ్‌లో కాత్యాయిని ఒళ్ళో తలవాల్చి ఆమె చెప్పే కమ్మటి కబుర్లు వింటున్నాను.

"ఏవండీ! కాశ్మీర్ ప్రయాణం" అంది కాత్యాయిని అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డ్‌లా.

"ఆలోచిద్దాం" అన్నాను కాత్యాయిని చేతిని నా చేతిలోకి తీసుకొంటూ.

కాత్యాయిని తన చేతిని విదలించుకొని నా బుర్రను పరుపుమీదకు తోసింది.

"మీవన్నీ నీటిమాటలు! గాలివ్రాతలు!" అంది ముఖం నిండా కోపాన్ని పులుముకుంటూ.

"కాత్యా! నువ్వు కోపంలో సత్యభామకంటె బాగుంటావ్" అన్నాను ఆమెను ఉబ్బేయాలని.

"కా....శ్మీ....ర్!" అంది కాత్యాయిని విక్రమార్కుడి చెల్లి లా.

కాత్యాని ముఖం మీదకు లాక్కుని ముద్దు పెట్టుకొన్నాను. "మేడమ్! రేపు సాయంత్రం అయిదు గంటలకల్లా మనం కాశ్మీర్‌లో డ్యూయెట్లు పాడుకుంటూ ఉంటాం. డాల్‌లేక్‌లో బోటు విహారం....సరేనా."

కాత్యాయిని ముఖం ఆపియా మ్యాపంత అయింది. "నిజంగా!" అంది నా ముఖాన్ని మళ్ళీ తన ఒడిలో రీప్లేస్ చేసి జుట్టు నిమురుతూ.

"తప్పుతుందా దేవీ? నీకోసం ఎందెందో వెదకి కడకు నా యదృష్టవశంబున గదా నిన్ను చూడగలిగితిని....పెళ్లాడ గలిగితిని...."

"బాగుంది మీరు పౌరాణిక సినిమాల్లో హీరోగా తప్ప కుండా పనికి వస్తారు." అది కాత్యాయిని నా ముక్కు పట్టుకొని ఊపుతూ.

"థాంక్యూ మేడమ్" అని కాత్యాని ఆప్యాయంగా హృదయానికి హత్తుకొన్నాను. అమాయకంగా ఉండే కాత్యా ముఖంలోకి చూస్తూ, సవాలు చేస్తున్న ఆమె చెర్రీస్ పెదిమలపై మరో వెచ్చటి ముద్ర వేశాను.

సరిగ్గా అదే సమయంలో....

టీపాయ్‌మీది డీలక్స్ ఫోన్ పొలికేక పెట్టింది. ఇద్దరం ఈ లోకంలోకి వచ్చాము. "కాత్యా! స్వర్గంలో దోమ" అన్నాను విసుగ్గా ఆమె కౌగిలి నుండి రైలు పెట్టెలా విడిపోతూ.

కాత్యాయిని నవ్వుకుంటూ వెళ్ళి ఫోన్ అందుకొంది. మరుక్షణంలోనే "ఏమండీ! ట్రంకాల్ ఫ్రం ఢిల్లీ!" అంది రిసీవర్ నా కందిస్తూ.

నాలో మత్తు విరిగిపోయింది. చటుక్కున ఫోన్

అందుకున్నాను.

"ఎస్. బి. డైరెక్టర్ కురువీర్ స్పీకింగ్." అంది అవతలి కంఠం.

"ఓహ్! గుడ్‌మార్నింగ్ సర్! డిటెక్టివ్ నరేష్ దిసెండ్" అన్నాను వినయంగా.

"బాడ్ మోర్నింగ్ మిస్టర్ నరేష్. బొంబాయి నగరంలో ఒక రోడ్ మీద మా ఏజంట్ దేగర్ శవం పడి ఉంది."

కురువీర్ గంభీరమైన కంఠంలో సన్నని ఆవేదనాజీర నేను కనిపెట్టక పోలేదు. రెండు క్షణాలు ఆశ్చర్యంతో ఏమీ మాట్లాడలేక పోయాను. "కురువీర్ సర్! దేగర్ ఎంత సమర్థుడో నాకు తెలుసు. పవిత్ర భారతదేశ వీరుల శరీరంలోంచి ఒలికే ప్రతి రక్తపు బొట్టులోంచి ఒకో అభిమన్యుడు పుట్టుకొస్తాడు. వివరాలు చెప్పండి సర్! ఎనీథింగ్ రాంగ్ ఫ్రమ్ ఎబ్రాడ్? విదేశగూఢ...."

"నో మిస్టర్ నరేష్. విషయాన్కి వస్తున్నాను. దేశ ద్రోహి, స్మగ్లింగ్ క్వీన్ మిస్. జూమీలియా మైసా చట్టపు కబంధ హస్తాలనుండి తప్పించుకు పారిపోయింది. బాంబే లోని ఆమె భవనం పోలీసుల ఆధీనంలో ఉంది. ఆమెను షాడో చేస్తున్న మా ఏజంట్ దేగర్ బాంద్రా ప్రాంతంలోని ఓ వీధిలో నిర్దాక్షిణ్యంగా హత్య చేయబడ్డాడు. ఈ సంఘ టన జరిగి ఇంకా ఎంతోసేపు కాలేదు...."

"సర్! కేసు హేండిల్ చేస్తున్నాను. బాంబేలోని కాన్ స్పిరసీ ప్లేస్‌కి నేను వెళ్ళే వరకూ దేగర్ మృతదేహం కదలకూడదు. సమర్థుడైన దేగర్ ఏదో క్లూ వదలకుండా అనామకుడిలా మరణించడని ఊహిస్తున్నాను."

"మేబి మిస్టర్ నరేష్! ఆ ఏర్పాట్లు నేను చేస్తాను. కేసు

ఊకప్ చేసి నందుకు ఐ విష్యు గుడ్‌లక్! కాని మిస్టర్ నరేష్! మీరు వేసే ప్రతి అడుగు ఆలోచించి వెయ్యాలని సలహా ఇస్తున్నాను. స్మగ్లింగ్ క్వీన్ జూలియా ఆడది కాదు. కోడెత్రాచు లాంటిది."

"కురువీర్ సర్! జూలియా ఎంతటి క్రూరమైన కోబ్రా అయినా కోబ్రా డాన్స్ చేయించడానికి మన వద్ద నాగ స్వరాలు ఉంటయ్."

"వెల్ మిస్టర్ నరేష్! మీ సామర్థ్యం మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. మరో విషయం యు ఆరే ఫాస్ట్ డిటెక్టివ్. దానికి తగ్గట్టు నేను సదుపాయాలు చేయాలి. అందుకే మీరు తక్షణం బయలుదేరేందుకు వీలుగా స్పెషల్ ఫ్లయిట్ ఏర్పాటు చేస్తాను."

"థాంక్స్ ఫర్ ఎవ్విరిథింగ్ సర్! మరో పావుగంటలో మీనంబాకం నుండి ఎగురుతాను."

"ఓ. కె. మిష్టర్ నరేష్. ఐవిల్ రిమైన్‌డెన్."

లైన్ కట్ అయింది. ఫోన్ క్రెడిల్ చేసి వెనక్కి తిరిగాను. కాత్యాయిని నా వైపు విశేషమైన కోపంతో చూస్తోంది.

ఆమె దగ్గరగా నడిచి నడుం చుట్టూ చేతులు బిగించాను. "సారీ కాత్యా! నిన్ను కాశ్మీర్ తీసుకెళ్ళమన్నావ్. విధి నన్ను బొంబే లాక్కెళుతోంది. ఏం చేస్తాం? కొద్ది రోజులు మన తోటలో కూర్చొని కాశ్మీర్ అనుకో విరహగీతాలు ఆలాపించు మన ప్రేమ భోగిమంటలా పెరుగుతుంది." అన్నాను నవ్వుతూ.

కాత్యాయిని ఉరుముతూ చూస్తోంది.

"ప్లీజ్ మేడమ్! నా బాధ్యతల్ని నువ్వు అర్థం చేసుకో

వాలి. నాతో పాటు బొంబాయి వస్తానంటే అభ్యంతరం లేదు."

"శవాలంటే నాకు భయమండీ" గుండెలమీద చెయ్యి వేసుకొంది కాత్యాయిని.

"కాత్యా! శవాలు గాంధీగారి శిష్యుల్లాంటివి. ఎవర్నీ ఏమీ చెయ్యవ్." అన్నాను నవ్వుతూ.

2

ట్రెయిన్ ఆగి రెండు నిముషాలయింది.

క్రిక్కిరిసిన ప్రయాణీకులతో మద్రాస్ సెంట్రల్ స్టేషన్ కోలాహలంగా ఉంది. ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ నుంచి ఓ అందమైన మినీస్కర్టు యువతి ప్లాట్‌ఫాం మీద పాదం మోపింది. కూలింగ్ గ్లాసెస్ గుండా ఆమె కళ్ళు ఓసారి పరిసరాలు పరికించాయ్. ఆమె చేతిలో ఓ ఎఱ్ఱటి రంగు ఎటాచీ ఉంది.

హైహీల్స్ టకటక లాడించుకుంటూ ఆమె ముఖద్వారం వైపు నడిచింది. హిగ్గిన్‌బాదమ్స్ ముందాగి, ఎటాచీ నేల మీద పెట్టి డిస్‌ప్లే చెయ్యబడ్డ పుస్తకాల వైపు చూడ సాగిం దామె.

"వాట్ డుయు వాంట్ మాడమ్?" అడిగాడు కౌంటర్ లోని వ్యక్తి.

"ఎనీ లేటెస్ట్ ఫ్రంది పెన్ ఆఫ్ హెరాల్డ్ రాబిన్స్?" అంది నవ్వుతూ. అతను తల ఊపి రాక్ వైపు కదిలాడు.

సరిగ్గా అదే సమయంలో ఓ యువకుడు వచ్చి ఆమె వెనుకగా సెటిల్ అయ్యాడు. తన చేతిలోని ఎఱ్ఱటి ఎటాచీని ఆమె ఎటాచీ ప్రక్కగా పెట్టాడు. ఆమె వెనుక తాపీగా పుస్తకాలు పరీక్షిస్తున్నట్లు నిలబడి క్షణంలో ఆమె ఎటాచీని

తన చేతిలోకి తీసుకున్నాడు. వెనక్కి తిరగబోతుండగా అతని భుజం మీద టక్కున ఓ చెయ్యి పడింది.

అదిరిపడుతూ వెనక్కి చూసాడా యువకుడు. అతని చంప ఛెళ్ళుమంది.

"య్యూబ్లడీథీఫ్! హౌడేర్ యుటచ్ మై బాగేజ్."

ఆ యువకుడు గడగడ లాడిపోయాడు.

"క్షమించండి మేడమ్! ప్లీజ్, వదిలెయ్యండి." అన్నాడు గొణుగుతున్నట్లుగా, ప్రాధేయపడుతూ.

ఆ యువతి అతనివైపు రెండు క్షణాలు మౌనంగా చూసింది. ఆమె మెదడులో ఏవో ఆలోచనలు కదిలాయ్. తాను తీసుకున్న పుస్తకానికి డబ్బు చెల్లించి అతన్ని బయటగా ఉన్న మెట్లవేపు లాక్కెళ్ళింది.

"ఎవరు నువ్వు?" అడిగిందామె.

"దొంగని" అన్నాడతను ధైర్యం తెచ్చుకుంటూ.

"అది తెలుస్తూనే ఉంది. పేరు?"

"రతన్."

"నీకు పెళ్ళయ్యిందా?"

"లేదు" అన్నాడతను వింతగా చూస్తూ.

"తల్లి తండ్రి?"

"నేనొక యేకాకిని. ఓ అనాధాశ్రమంలో పెరిగాను. ఇరవై మూడేళ్ళ పాటు అటూ ఇటూ తిరిగి ఈ ఉద్యోగంలో చేరాను."

"నువ్వు పోతే ఏడ్చేవాళ్ళెవ్వరూ లేరన్నమాట."

"పోతూ పోతూ నేనే ఏడవాలి" అన్నాడతను నవ్వుతూ.

రెండు క్షణాలు మౌనం రాజ్యం చేసింది.

"రతన్! నీ సహాయం కావాలి!" అందామె ఉన్నట్లుండి.

రతన్ ఉలిక్కిపడి ఆమె వేపు ఆశ్చర్యంగా చూసేడు.

"మేడమ్! నన్ను పోలీస్ లాఠీ దెబ్బలనుండి తప్పించారు. మీ కోసం ఎల్. ఐ. సి. బిల్డింగ్ మీంచి దూకుతాను. అడగండి" అన్నాడు రతన్ హంటర్ సిగరెట్ వెల్గించుకుంటూ.

"రతన్! నువ్వు నన్ను 'మీరు' అని సంబోంధించనక్కరలేదు. పోతే, కొద్ది రోజులు నీవు నా కాశ్రయం ఇవ్వాలి."

"విత్ ప్లెషర్" అన్నాడు రతన్ "ఇంతకూ యిలా ఒంటరిగా వచ్చేయడాన్కి కారణం తెల్సుకోవచ్చా?"

"కమాన్ రతన్! ఇప్పటికే ఎక్కువసేపు మాట్లాడుకొన్నాం. మిగతా ఇంటి దగ్గర."

ఇద్దరూ మెట్లు దిగారు.

"టాక్సీ!" అర్చిందామె. ఓ పసుపు రంగు టాక్సీ రయ్యిమంటూ చిన్న జర్కుతో వారి ముందాగింది.

"ఇంతకీ మీ....ఓహ్, నీ పేరు?" అడిగాడు రతన్.

టాక్సీ తలుపు తెరవబోతూ వెనక్కి చూసింది.

"జు....మీ....లి....యా"....అందామె చిన్నగా.

యిద్దరూ టాక్సీ ఎక్కారు.

"ఎక్కడికి సార్?"

"సైదాపేట" అన్నాడు రతన్.

టాక్సీ కదిలింది. "స్వీట్ నేమ్" గొణుక్కున్నాడు రతన్.

"సైదాపేటా?" అంది నవ్వుతూ జూమీలియా.

3

శాంతాక్రజ్ ఎయిర్‌పోర్ట్!

"నరేష్ గారూ! వెల్ కమ్ టు బాంబే!" అన్నాడు ఇన్

స్పెక్టర్ రూజ్‌వెల్ట్.

బ్రీఫ్‌కేస్ ఊపుకుంటూ టార్‌మెక్ మీంచి పాసింజర్ లాంజ్‌లోకి పెద్ద పెద్ద అడుగులేశాను. "బ్రదర్! అందర్నీ దేవుడు నడిపిస్తాడు. మనకి మృత దేహాలు మార్గం చూపుతాయ్" అన్నాను అతనితో కరచాలనం చేస్తూ.

ఇద్దరం బయటికి వచ్చి పోలీస్ జీపు ఎక్కాం. డ్రైవర్ జీపుని ముందుకు ఉరికించాడు.

"బ్రదర్ వివరంగా చెప్పు." అన్నాను పాల్‌మాల్ సిగరెట్ ముట్టించి మరోటి రూజ్‌వెల్టుకి ఆఫర్ చేస్తూ.

"చెప్పాల్సిందంతగా లేదు. మనం చెయ్యాల్సిందే ఉంది. సంఘం దృష్టిలో జూమీలియా వ్యాపారవేత్త. సింగపూర్ నుంచి విలువైన కొత్తరకం వస్త్రాలు తెప్పిస్తోంది. మైసా చట్టం వచ్చింది. జూమీలియా వైభోగంమీద పోలీసుల కళ్ళు పడ్డాయి. పరిశోధనలకు దిగాం. విచిత్రం!! బట్టల బండిల్స్‌లో మడతకు మడతకు మధ్య హషీష్ ఆకులు దొరికాయ్."

సిగరెట్ చటుక్కున నోట్లోంచితీసాను. "హ...షీ...ష్. యు మీన్ దట్ బిలాంగ్స్ టు డ్రగ్స్?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఎక్సాక్ట్లీ వాట్ యు సెడ్. ఆకు విలువ ఒక్కొక్కటి 500 రూపాయలు ఉంటుంది. ఆ ఆకులని ప్రోసెస్ చేసి టాబ్లెట్ల రూపంలోకి తీసుకొస్తారు. రహస్యం బట్టబయలైంది. నిద్రపోతున్న కస్టమ్స్ అధికారుల కుర్చీలు ఖాళీ అయ్యాయి. నిన్న మధ్యాహ్నం జూమీలియా భవనాన్ని రెయిడ్ చేసాం. సీక్రెట్ అండర్‌గ్రౌండ్‌లో రకరకాల మత్తుపదార్థాలే కాకుండా విదేశాల్లో తయారైన వాకీటాకీలు, లైసెన్సుల్లేని పిస్టల్స్ మొ॥నవి దొరికాయ్.

సుమారు మూడు లక్షలు విలువచేసే గోల్డ్ బులియన్స్ కూడా దొరికాయ్."

"నరేష్‌గారూ! దాదాపు కొన్ని సంవత్సరాలుగా పోలీసుల కళ్ళు కప్పగలిగిన స్మగ్లింగ్ క్వీన్ జూమీలియాను అభినందించకుండా ఉండలేకపోతున్నాను. మా రెయిడ్ విషయం ఆమె ఎలాగో తెల్సుకొంది. నేర్పుగా నరసంచారం లేని ఖాళీ భవనాన్ని మా ముందు పెట్టింది. ఆమెను నీడలా వెన్నంటి తిరుగుతున్న సీక్రెంట్ బ్రాంచి మనిషి డేగర్‌ను నడి రోడ్డుమీద నిర్దాక్షిణ్యంగా కాల్చి మాయమైంది."

జీప్ ఒక వీధిలో ఆగింది. నాలో ఆలోచనలు ఆగి పోయాయి. దృష్టి ముందుకు సారించాను. ముందే జాగ్రత్త పడ్డారులా వుంది. నీలం దుస్తులు ధరించిన కానిస్టేబుల్స్ తప్ప ఆ వీధిలో మరెవ్వరూలేరు.

ఇద్దరూ జీపులోంచి దిగాం. ఇన్‌స్పెక్టర్ రూజ్‌వెల్ట్ ఏదో సైగచేసాడు. మరుక్షణం ఇద్దరు కానిస్టేబుల్స్ శవంపై ఉన్న గ్లాస్‌కేసుని పైకెత్తారు. మోకాళ్ళపై కూర్చొని శవాన్ని నిశితంగా పరీక్షించసాగాను.

డేగర్ నల్లటి పాంట్‌మీద తెల్లచొక్కా ధరించాడు. శవం వెల్లకితలా కాకుండా మామూలుగా మనిషి పడుకొన్నట్లు, ఎడమప్రక్కకు ఒరిగి ఉంది. గుండె ప్రాంతంలో రెండు రంధ్రాలు కనిపించాయ్. రక్తం నేలమీద గడ్డకట్టి ఉన్నది. మృతదేహంపై చీమలు పాకుతున్నాయి.

ఉన్నట్లుండి నా మెదడులో ఏదో మెరిసింది.

"బ్రదర్! ఇది గమనించావా?" చిన్నగా అర్చాను.

ఇన్‌స్పెక్టర్ రూజ్‌వెల్ట్ నా దగ్గరగా వచ్చాడు. "ఏమిటిది?"

"డేగర్ ఎడం చెయ్యి కాలర్‌ని పట్టుకొని ఉంది."

ఇన్‌స్పెక్టర్ నా వైపు అదోలా చూశాడు.

"మీ ఉద్దేశం నాకు బోధపడలేదు. శవం ఒత్తిగిలి ఉండడంవల్ల చెయ్యి ఆ పోజిషన్‌లోకి రావచ్చుగా. రిగర్ మార్టిస్ ప్రారంభమైన తర్వాత చెయ్యి అలా బిగుసుకుపోయి ఉండొచ్చు. చొక్కా జేబులు, పాంటు జేబులు చెక్ చేసాం. నథింగ్ యూస్."

ఇన్‌స్పెక్టర్‌వైపు నవ్వుతూ చూసాను. "బ్రదర్స్ సహేతుకంగా ఆలోచిద్దాం. డేగర్ ముందుకు పరిగెడుతున్నాడు. అతని ముందుభాగంవైపు నుండి గుండెల్లో రెండు తూటాలు ప్రవేశించాయి. సాధారణంగా అలాంటప్పుడు ఏ వ్యక్తయినా గాయంమీద ఎడంచేత్తో అదుముకుంటాడు బాధగా. ఆ పొజిషన్‌లో ప్రాణాలు కోల్పోయి ఉంటే డేగర్ ఎడంచెయ్యి గాయాన్ని అదిమి ఉంటుంది. కాని మరణించే ముందు మనకు ఏదో చెప్పజూసాడు. అందుకే అతని చెయ్యి మరో పొజిషన్‌లో ఉంది."

"మిస్టర్ నరేష్! మీ లాజిక్ ఒప్పుకుంటున్నాను. గో ఆన్." అన్నాడు రూజ్‌వెల్టు.

"శవాన్ని వెల్లకితలా తిప్పాను. కాలర్ చివరికోణం వైపు చెయ్యి బిగుసుకుపోయి ఇంకా అలాగే ఉంది. నెమ్మదిగా కాలర్ వెనక్కి నా చేతిని పోనిచ్చాను. నా చేతికి ఏదో తగిలింది.

ఇన్‌స్పెక్టర్ రూజ్‌వెల్టు ఆసక్తిగా ముందుకు వంగాడు. కాలర్‌కి వెనుకభాగాన టెన్షన్‌కోసం ప్లాస్టిక్ కాలర్ బోన్ పెట్టుకోడానికి ఓ సన్నపాటి సాకెట్ ఉంది. అందులో నొశతపెట్టబడిన చిన్న చీటీ వుంది. దాన్ని బయటకు లాగి

విప్పాను. అందులో రెండు లైన్లలో ఏవో అక్షరాలు ఉన్నాయి. శ్రద్ధగా వాటిని గమనించాను. అర్థంకాలేదు.

"నాకేం అర్థం కావడంలేదు." అన్నాడు రూజ్‌వెల్ట్ టోపీ తీసి బుర్ర గోక్కుంటూ.

"కోడ్‌లో లిఖించాడు. దీన్ని డీనోడ్ చేస్తేనేగాని మన పరిశోధన ముందుకు వెళ్ళదు బ్రదర్." అన్నాను పైకి లేస్తూ.

"నేను చేయవలసిందేమన్నా ఉందా?"

"ముందు శవాన్ని పోస్టుమార్టంకు పంపు. ఈ చీటీని కాపీ చేసుకో. నాకంటే ముందు నువ్వు డీకోడ్ చేస్తే వెంటనే నాకు ఫోన్ చెయ్యి."

ఇన్‌స్పెక్టర్ ఆ అక్షరాల్ని డైరీలో నోట్ చేసుకొన్నాడు. ఏదో అడగబోయాను.

"హోటల్ హిమాలయా. రూం నెంబర్ 177 మీకోసం రిజర్వ్‌చేయబడింది," అన్నాడు ఇన్‌స్పెక్టర్ తాళం చెవు లిస్తూ.

4

ఆ గదిలో కాలం బరువుగా దొర్లుతోంది.

జూలియా నులకమంచంమీద అలసటగా కూర్చొని ఉంది. రతన్ కాల్చిన రొట్టె, పాలగ్లాసు ఆమె ముందుగా ఓ స్టూల్‌మీద పెట్టాడు. అతను లుంగీ బనియన్ ధరించాడు. "థాంక్యూ రతన్!" అందామె బ్రెడ్‌లోఫ్ చప్పరిస్తూ.

"జూలీ! ఇప్పటికైనా నీ వివరాలు చెప్పు. నే చెయ్య గలిగేదేమైనా ఉంటే తప్పక చేస్తాను," అన్నాడు రతన్, సిగరెట్ ముట్టించి చాపమీద చతికిలపడుతూ.

జూలియా అతనివేపు చూస్తూ తన ప్రక్కన కూర్చో

మన్నట్లు సైగజేసింది. అతను ఆమె చెప్పినట్లుచేసాడు.

"ఇప్పుడు చెప్పు. నా గురించి నీ వూహించిన విషయాలు." అంది జూమీలియా అతని సిగరెట్ తీసుకుని ఓ దమ్ము పీల్చి తిరిగి ఇస్తూ.

రెండుక్షణాలు సాలోచనగా మౌనం వహించాడు రతన్.

"ముందు ఫెయిలయిన ప్రేమవ్యవహారం అనుకున్నాను. కాని నీ మాటలద్వారా తప్పించుకొచ్చిన నేరస్థురాలివేమో నని అనుమానం వచ్చింది." అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

గ్లాసులోని పాలు త్రాగడం పూర్తి చేసింది జూమీలియా. "రతన్! నీ అనుమానం నిజమైతే నన్ను పోలీసులకు అప్పగిస్తావా?" అడిగిందామె.

రతన్ భుజాలెగరేసాడు. "ఆ పని నేను చేయలేనని నీకు బాగా తెల్సుండాలి," అన్నాడు నవ్వుతూ.

"నీ వూహించింది కరెక్ట్ రతన్! సారా అమ్మిన ఊళ్లో సోడా అమ్మలేం! అందుకే పారిపోయి వచ్చాను. నా ప్రయాణంలో ఇదొక మజిలీ."

ఉలిక్కిపడ్డాడు రతన్. "అంటే!....ఎక్కడికి పోదామని?" అడిగాడు అప్రయత్నంగా.

"ఈ దేశం దాటి." తల పైకెత్తి శూన్యంలోకి చూస్తూ పలికింది జూమీలియా.

"ఎందుకు?"

జూమీలియా తన కథ క్లుప్తంగా చెప్పింది.

"వ్వాట్! నువ్వు హత్య చేసావా? నేను నమ్మలేను" ఆశ్చర్యంగా అడిగాడు రతన్.

జూమీలియా వేదాంతిలా నవ్వింది.

"పిచ్చి రతన్! ఎవరికీ హానిచెయ్యకుండా ఏ మానవుడూ ఈ లోకంలో జీవించలేడు. నువ్వు మటన్ తింటావ్. అంతే కోళ్ళు, మేకలు నీ పొట్టకోసం చంపబడుతున్నాయ్. నువ్వు తినే కూరగాయల్లో కూడ ప్రాణం ఉంది. ఒక విధంగా ఇవన్నీ హత్యలే. అది చెయ్యకుండా నువ్ క్షణం కూడా జీవించలేవ్.

"రతన్! నీతో ఒక నిజం చెబుతున్నాను. ఈ మద్రాసులో హోటల్ సయామీ నేను కట్టించిందే. అక్కడ్నుంచే నేను విదేశాలకు వెళ్ళిపోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నువ్వు నాకు హృదయపూర్వకమైన ఆతిథ్యం యిచ్చావ్. నీ ఋణం ఉంచుకోను...." అంటూ జూమీలియా ఏదో ఇంజక్షన్ బయటికి తీసింది.

5

హోటల్ గదిలో కూర్చొని గూఢచారి అందించిన క్లూతో కుస్తీ పడుతున్నాను. క్వార్టర్ బాటిల్ విస్కీ ఖాళీ అయింది. అరగంట తర్వాత నా శ్రమ ఫలించింది. ఎగిరి గంతేసి ఫోన్ అందుకున్నాను. డయల్ గిరగిరా తిరిగింది.

"ఇన్‌స్పెక్టర్ రూజ్‌వెల్ట్" అంది అవతలి కంఠం.

"బ్రదర్! డిటెక్టివ్ నరేష్. డీకోడ్ చేసావా?"

"ఫూలిష్ కొశ్చన్ అంటారింగ్లీషులో. ఆ పని పూర్తయితే ఈ పాటికి ఫోన్‌లో నీకు చెప్పనూ?"

చిన్నగా నవ్వుకున్నాను. "ఆల్‌రైట్. నాకు దొరికింది సొల్యూషన్. చెప్తాను, శ్రద్ధగా విను.

"మాయలాడి జూమీలియా మద్రాసు పారిపోవడానికి పథకం వేసింది. ఆమెను వెంటాడుతున్నాను. అదీసారాంశం. ఇన్‌స్పెక్టర్! నేను వెంటనే మద్రాసు వెళుతున్నాను. ఇక్క-

డికి నా అసిస్టెంట్ మిస్. నాడియా వస్తుంది." అంటూ రెండు నిముషాలు మాట్లాడి ముగించాను,

అరగంట తర్వాత ట్రంక్ బుకింగ్ కాల్ వచ్చింది.

"మిస్. నాడియా స్పీకింగ్" అంది అవతలి కంఠం.

"మిస్! డిటెక్టివ్ నరేష్ ఉన్నారా?" అడిగాను నవ్వుతూ.

"నో సర్."

"ఎక్కడికి వెళ్ళారు?"

"ప్రస్తుతం నాతో ఫోన్‌లో మాట్లాడుతున్నారు."

"వెల్ మైడియర్. కంఠం గుర్తుపట్టావన్నమాట."

"బాస్. యూ్య కాన్ట్ ఫూల్ మి. ఎందాక వచ్చింది పరిశోధన?"

"పీకలదాకా వచ్చింది."

"అది విస్కీ అయ్యుంటుంది. ఏమిటి ఆర్డర్స్?"

నాడియాకు జరిగిందంతా క్లుప్తంగా చెప్పాను.

"డియర్! నువ్వు వెంటనే వచ్చి జూలీలియా భవనాన్ని శల్యపరీక్ష చేయాలి — పోలీసులకు కనబడనిదేదో నాకు ప్రత్యక్షం కావాలి. లేకపోతే నీ ఉద్యోగం ఊడుతుంది."

"మొదటిది నేను చెయ్యగలపని. రెండోది మీరు చెయ్యలేని పని. ఎనీవే, ఈ క్షణంనుంచీ ఆ విషయం గురించి ఆలోచిస్తాను."

"గుడ్ లక్." ఫోన్ పెట్టేసి బ్రాండ్ కేస్‌వేపు చూసాను.

6

రతన్ ఉలిక్కిపడ్డాడు.

జూలీలియా తొడపై ఏదో మందు సెల్ఫ్ ఇంజక్షన్ చేసుకోబోతోంది. పచ్చగా మెరుస్తున్న ఆమె తొడపై ఇంతకు ముందు ఇంజక్షన్లు చేయబడ్డ గుర్తులు కనపడు

తున్నాయి. రతన్ ముందుకి పరిగెట్టి ఆమె చేతిని పట్టుకున్నాడు.

"జూమీ! ఏమిటది!" కోపంగా అడిగాడు.

జూమీలియా నవ్వింది తియ్యగా. "ఎల్. ఎస్. డి. పేరు విన్నావా ఎప్పుడైనా?"

"తెలుసు. లైసర్జిక్ యాసిడ్ డై ఎథిలమైడ్ డేంజరస్ డ్రగ్. డామిట్! నీకీ అలవాటు ఉందా?" కంగారుగా అన్నాడు రతన్.

"వెల్ నీకు చాల విషయాలు తెల్సు." మౌనంగా సూదిని శరీరంలో గుచ్చింది జూమీలియా.

రతన్ జూమీలియా ముఖం చుట్టూ చేతులు వేశాడు.

"జూమీ. ఈ అలవాటు మానలేవా? శరీరం అతి త్వరలో శిధిలం కావడాన్కి దగ్గర మార్గం ఇది."

నిస్సహాయంగా తల ఊపింది జూమీలియా.

"నో రతన్! ఇప్పటికే ఆలస్యమై బాగా అలవాటయి పోయింది. రోజుకు రెండు పూట్లా ఈ మందు తీసుకోపోతే పిచ్చెక్కినట్లుంటుంది. నరాలు తోడుకుపోతాయి. గెట్ఎవే!"

"వద్దు జూమీ! ఇవాళనుంచి నీవీ అలవాటు మానుకోవాలి." అన్నాడు రతన్ ఆమె చెయ్యి పట్టుకుని.

"రతన్! అడ్డు తప్పుకో. యిలాంటి సమయాల్లో నేనేం చేస్తానో, చెయ్యబోతానో నాకే తెలియదు."

"వీల్లేదు జూమీలియా. నువ్వు మానాలి. ఇలాంటలవాట్లతో మీ బొంబాయి సినీ తారలు కొందరు గ్లామర్ పోగొట్టుకొని, ఈ మందు కోసం పిచ్చి కుక్కల్లా రోడ్లవెంట పడ్డారు."

జూమీలియా సహనం కోల్పోయింది. ఆమె శరీరం

దేనికోసమో తపిస్తోంది.

"డోంట్ టీచ్ మీ ఫూల్. గెట్ లాస్ట్," అంటూ అతని చెంపమీద వాయించింది.

రతన్ బుగ్గ మీద చెయ్యివేసుకొని నిశ్చేష్టుడయ్యాడు.

జూమీలియా మౌనంగా యింజక్షన్ పూర్తి చేసి సిరెంజి బైటకు లాగింది.

ఆమెలో వింత వింత మార్పులు రాసాగాయి. ఆమె కళ్ళ ముందు రకరకాల ఆకారాలు, పిచ్చిపిచ్చిగా అలుము కున్న రంగులు తాండవమాడ నారంభించాయి. ఏవో లోకాల్లోకి తేలిపోతున్నట్లు ఆమె మనస్సు, ఉరకలు పరుగులు పెట్టనారంభించింది. జూమీలియా నెమ్మదిగా పైకి లేచి డాన్సు చేస్తున్నట్లుగా తూలుకుంటూ వెళ్ళి మంచం మీద వాలిపోయింది.

8

"హెలో! ఈజిట్ హోటల్ సయామీ?"

"య్యేస్. మేనేజర్ గఫార్ ఖాన్ స్పీకింగ్."

"గఫార్! జాంబేక్విన్!"

"మేడమ్! మీరా! ఎక్కడ్నుంచి మాట్లాడతున్నారు?"

"గఫార్! ఓ పబ్లిక్ టెలిఫోన్ బూత్ లోంచి మాట్లాడు తున్నాను. ఎలా ఉన్నాయ్ పరిస్థితులు?"

"మేడమ్! మద్రాసు వీధులనిండా మఫ్టీ పోలీసులు మీ కోసం వలలు పట్టుకొని నిలబడ్డారు. మీ కోసమే ఎదురు చూస్తున్నాను. ఎక్కడ ఉన్నారు ఇంతవరక్కు? మద్రాసు వచ్చిన వెంటనే మన హోటల్ కి ఎందుకు రాలేదు?"

"గఫార్! యు ఆర్ మాడ్. ఎవరైనా పారిపోతే పోలీసులు మొదట కన్నువేసేది హోటల్స్ మీదనే. మరో

సురక్షిత ప్రదేశంలో ఉన్నా ఇప్పటిదాకా! అది సరే నే చెప్పిన పని ఏం చేసావ్?"

"ఎవ్విరిథింగ్ ఈజ్ ఓకే మేడమ్! అంతా రెడీ చేసు కొని మీరు ఫోన్ కాల్ చేసే క్షణం కోసం ఎదురు చూస్తు న్నాను. ఈ మధ్యాహ్నం మద్రాస్ హార్బర్ నుండి సింగ పోర్ ప్రయాణం చెయ్యబోయే ఒక యువతిని మాయం చేసాం. అవసరమైన పేపర్సన్నీ రెడీగా ఉన్నాయ్. ఆమె వేషంలో మీరు సింగపోర్ వెళ్తారు. షిప్ రెండు గంటలకు బయలుదేరుతుంది. సో యు హావ్ టు కమ్ ఎట్ వన్స్ మేడమ్."

జూలియా టెలిఫోన్ బూత్ ఉన్న గుర్తులు చెప్పింది. "గఫార్! కారు పంపు అందులో మారువేషానికి కావలసిన సామాగ్రి ఉండాలి."

"అయిదు నిముషాల్లో ఎర్రప్లిమత్ మీ ముందుంటుంది మేడమ్! ఆదాబ్ అర్జ్ హై."

జూలియా ఫోన్ పెట్టేసి నుదుటి మీద స్వేదం తుడుచుకొంది.

9

మధ్యాహ్నం పన్నెండూ పది నిముషాలయింది.

స్పెషల్ ప్లేన్‌లో మీనంబాకంలో దిగి, నన్ను రిసీవ్ చేసుకోడానికి వచ్చిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేలుమణితో కల్సి జీప్ ఎక్కాను. జీపు స్టార్టయింది.

పది నిముషాల తర్వాత సెంట్రల్‌లో ఆగింది జీప్.

నేనూ, సర్కిల్ వేలుమణి కల్సి ప్రతీ టాక్సీ డ్రైవర్‌నీ ఇంటర్వ్యూ చేయడం ప్రారంభించాం. పావు గంట తర్వాత నా శ్రమ ఫలించింది. టాక్సీ డ్రయివర్ బాలమురుగన్

నే చూపించిన ఫోటోవంక ఎక్కువ సేపు చూసాడు. "సార్! ఈవిడతో మరో వ్యక్తి వున్నాడు. సైదాపేటలో దిగి నడుచుకొంటూ వెళ్ళారు." అన్నాడు బాలమురుగన్.

"డామిట్! ఇంటి అడ్రసు తెలియకుండా జాగ్రత్తపడిం దన్నమాట!" నా నొసలు ముడిపడ్డాయి. అతను జూలీయా ముఠాకు సంబంధించిన వ్యక్తా!

"మురుగన్! అతని గురించి నువ్వింకా ఏం చెప్ప గలవ్?" అడిగాను.

"సార్! అతను నాకు బాగా గుర్తు. చాలాసార్లు సెంట్రల్ స్టేషన్‌లోనే కనబడేవాడు అతన్ని గురించి హిగ్గిన్ బాదమ్స్ బుక్‌స్టాల్‌లో అడిగితే ఫలితం ఉండొచ్చు. వాళ్ళు రోజూ అక్కడే ఉంటారు కాబట్టి."

"దెన్ కమాన్ మురుగన్!" ముగ్గురం అటువేపు నడిచేం.

"మేం పారిస్ బూతు బొమ్మల పుస్తకాలు అమ్మడం లేదు సార్!" అన్నాడు బుక్ స్టాల్‌లోని వ్యక్తి భయంగా.

"అదికాదు. మాకో వ్యక్తి గురించి ఇన్‌ఫర్మేషన్ కావాలి. అతను చాలసార్లు ఈ స్టేషన్‌లో నీకు కనబడి ఉంటాడు." అన్నాడు సర్కిల్ వేణుమణి లాఠీ ఊపు కుంటూ.

"అడగండి సార్." అన్నాడతను.

నేను మురుగన్ వేపు చూసేను. అతను ఆ వ్యక్తి గురించి వర్ణించి చెప్పాడు.

"వాడా! రతన్. వాడోదొంగ సార్! వాళ్ళకి చిన్న ముఠా ఉంటుంది సార్. అందుకే మేం కలుగజేసుకోం."

"అతని ఇంటి ఎడ్రస్ తెలుసా!" అడిగాడు వేలుమణి.

"సైదాపేటలో కుమారస్వామి గుడి ఎదురుగా అని విన్నాను సార్!"

టాక్సీ డ్రయివర్ బాలమురుగన్‌కీ, బుక్‌స్టాలతనికీ థాంక్స్ చెప్పాను.

"కమాన్ హరియప్ ఇన్‌స్పెక్టర్!" అంటూ జీపువేపు పెద్ద పెద్ద అంగలతో నడిచాను.

ఐదు నిముషాలలో జీపు ఓ పెంకుటింటి ముందాగింది.

దొంగలు చిక్కారన్న ఆనందంలో సి. ఐ. వేలుమణి నా వేపు గర్వంగా చూసి పరిగెత్తుకుంటూ వెళ్ళి తలుపు గుద్దేడు మోకాల్తో.

తలుపులు దగ్గరగా వేసి ఉండడంవల్ల అవి వెంటనే తెరుచుకున్నాయ్.

ఇద్దరం లోపలికి నడిచాం.

నా కాళ్ళు ఠక్కున ఆగిపోయాయి!!

ఎదురుగా ఓ వ్యక్తి శవం పడివుంది.

'అతనే రతన్ అయ్యుండాలి' అనుకున్నాను బాల మురుగన్ చెప్పిన పోలికలుబట్టి.

"మైగాడ్! ఒక ఆడది చేసిన రెండో హత్య" అన్నాడు వేలుమణి విస్తుపోతూ.

శవం చెయ్యి పట్టుకొని వదిలేశాను. రిగర్ మార్టిస్ ప్రారంభమైంది. అంటే జూమీలియా ఈ పాటికి చాలదూరం పారిపోయి ఉండాలి.

రతన్‌ని జూమీలియాయే చంపి ఉండాలి. హంతకుడు మూడో వ్యక్తి అయితే జూమీలియాని కూడా చంపి ఉండాలి.

"మిస్టర్ నరేష్! ఎందుకు చంపినట్లు జూమీలియా?" అడిగాడు సి. ఐ. వేలుమణి.

"బ్రదర్! ఇద్దరు నేరస్తుల మధ్య సాధారణంగా సఖ్యత వుండదు. ఒకరిని ఒకరు నమ్మరు. హత్యకు రీజన్ ఊహించుకోడాన్కి మనకదొక్కటే ఆధారం."

అంతలో జీప్ డ్రయివర్ లోపలికి వచ్చి "సార్! వైర్ లెస్ కాల్!" అన్నాడు.

ఇద్దరం జీపు వేపు నడిచేం. కీక్! కీక్! మంటోంది వైర్లెస్ సెట్ స్విచ్ ఆన్ చేసేను.

"నాడియా రిపోర్టింగ్ ఫ్రం జుహూస్టేషన్, బాంబే, డిటెక్టివ్ నరేష్ రిక్వయర్డ్...."

"డిటెక్టివ్ నరేష్ ది సెండ్....డిటెక్టివ్ నరేష్ దిసెండ్ స్పీకప్ ఓవర్."

"బాస్! జుమీలియా భవనాన్ని ప్రతీ అంగుళం వెదికేను. బాత్ రూమ్‌లో పాలరాతితో నిర్మించబడ్డ గోడలో సీక్రెట్ ఆల్మైరా ఉంది. బాస్! అందులో కొన్ని ఉత్తరాలు దొరికాయ్. దాన్నిబట్టి జుమీలియాకీ మద్రాసులో ఉన్న సయామీ హోటల్‌కీ ఏవో డీలింగ్స్ ఉన్నాయని తెలుసుకున్నాను. దటాన్సల్ ఓవర్."

"వెల్‌డన్ నాడియా! థాంక్యూ వెరీమచ్. యుమే కమ్ బాక్ ఓవర్." ట్రాన్స్మిషన్ క్లోజ్ చేసాను.

సి. ఐ. వేలుమణి రతన్ శవానికి పోస్ట్‌మార్టమ్ బాధ్యలు వహించడాన్కి సైదాపేట సబ్ ఇన్‌స్పెక్టర్‌కి ఫోన్ చేసి తాను మూడు నిముషాలలో బయలుదేరుతానన్నాడు.

ఇక్కడి పనులూ రాకెట్ వేగంతో ముగించుకొని. బలగంతో హోటల్ సయామీకి రమ్మన్నాను.

చటుక్కున జీపు ఎక్కాను.

"డ్రైవర్! నీకు ప్రొమోషన్ వస్తుంది. యాక్సిలేటర్

మీంచి కాలు తీయకుండా జీప్‌ని పోనివ్వాలి. క్విక్ హోటల్ సయామీ!" అన్నాను గంభీరంగా.

జీపు జంబోజెట్‌లా కదిలింది.

10

హోటల్ సయామీ!!

జీప్‌లోంచి కిందకు దూకాను. గబగబా రిసెప్షన్ వేపు నడిచేను. కౌంటర్‌లో యువతి నవ్వుతూ చూసింది. "వాట్ కెన్ అయ్‌డు ఫర్ యూ సర్?"

"అయామ్ డిటెక్టివ్ నరేష్. మేనేజర్ గది ఎక్కడ?" హిట్లర్‌లా అరిచేను.

ఆమె ముఖం నల్లబడింది. "ఆయన లేరు" అంది తడబడుతూ.

రివాల్వర్ బయటకి తీసాను. "మిస్! ఇది పోలీసు వ్యవహారం. రెండు నిముషాల్లో చెప్పకపోతే నీ అందం ఇక స్వర్గంలో నృత్యం చెయ్యడానికే పనికొస్తుంది."

ఆమె భయపడుతూ నా వేపు చూసింది. "సర్! ఆయన టాప్‌ఫ్లోర్ రూమ్ నంబర్ 222లో ఉన్నారు. ఎవరినైనా పైకి పంపితే నేను నడిరోడ్డుమీద సగం ప్రాణాలతో పడి ఉంటానన్నారు."

"డోంట్ వర్రీ! నీవు అక్కడ ఉండేలోపల మీ మానేజర్ యిరుకైన జైలు గదిలో ఉంటాడు" చెయ్యి ముందుకు చాచి రిసెప్షనిస్టు ముందున్న టెలిఫోన్ లైన్ల కనక్షన్లు బలంగా తెంపి చకచకా లిఫ్టువైపు నడిచేను.

ఏడో అంతస్థులో లిఫ్టు దిగి రెండడుగులు ముందుకు వేసాను.

అంతే! ఎవరో మోకాలి వెనుకభాగంలో తన్నారు. గభా

లున తూలి ముందుకు పడ్డాను. చేతులు నేలమీద ఆన్చాను. లేకపోతే టూత్‌వేస్టు అవసరం ఇకపై లేకపోయేది. తల వెనక్కి తిప్పి చూసాను.

ఇద్దరు ధృడకాయులు నడుంమీద చేతులుపెట్టుకొని పకపకా నవ్వుతున్నారు. నవ్వేటప్పుడు నడుంమీద చేతులు పెట్టుకోవాలని నాకు తెలియదు. మడతబందుకాలు నొప్పి పెడుతోంది.

"ఏమిటీ అన్యాయం? మీరెవరు?" అన్నాను అమాయకంగా.

"జవాబు చెప్పాల్సింది నువ్వు. ఎందుకొచ్చావిక్కడికి?" అన్నాడొకడు ముందుకు కదుల్తూ.

"చచ్చు ప్రశ్న. హోటల్‌కి ఎంతోమంది వస్తూ పోతూ ఉంటారు."

నా చెంప ఛెళ్ళుమంది. "ఈ అంతస్థుల్లో మేనేజర్, అతనికి సంబంధించిన మనుషుల గదులుమాత్రం ఉంటాయి. కొత్తవాడివి నువ్వొచ్చావ్. అంటే నువ్వు పోలీసు మనిషి వన్నమాట."

చెంప నిమురుకున్నాను. "తర్కశాస్త్రం చదువుకోవాల్సిన దౌర్భాగ్యులు. కిరాయివెధవలకింద తయారయ్యారు," అన్నాను కవ్వింపుగా.

రెండోవ్యక్తి విసురుగా నామీదకు వచ్చాడు.

చేతులు ఉక్కులా బిగించి మెరుపులా మోకాళ్ళమీద లేస్తూ యిద్దరి చేతులు దగ్గరికి లాగాను.

వారి బోడిగుళ్ళు రెండూ పర్వతాల్లా ఢీకొన్నాయి. ఇద్దరూ తల విదిలించుకున్నారు.

నే నాలశ్యం చేయలేదు. ఒకడి చెయ్యి వెనక్కి మెలి

పెట్టి మోకాలితో బలంగా తన్నాను. వాడు దూసుకుంటూ వెళ్ళి గోడకు గుద్దుకొన్నాడు.

తలమీద రెండో దెబ్బ! అతను స్పృహతప్పిపోయాడు.

రెండోవ్యక్తి పిడికిళ్ళు బిగించి భంగుతాగిన కోతిలా నావేపు గెంతుకుంటూ వచ్చాడు.

గోడ వారగా జరిగాను.

అతని గద్దలాంటి చెయ్యి గాలిలోకి లేచింది.

చటుక్కున తల తిప్పాను. అతని పిడికిలి గోడకు గుద్దుకుంది!

చటుక్కున రివాల్వర్ తీసి అతని తలమీద మోదాను!

ఆ ఏనుగుగాడు పీనుగులా నేలమీద వాలిపోయాడు.

పెద్ద పెద్ద అంగలతో ముందుకు నడిచాను.

11

రూమ్ నెంబర్ 222!

పిస్తోలు పట్టుకొని తలుపులు తోసుకుంటూ లోపలికి అడుగేశాను. అద్దం ముందు నిలబడి మారువేషపు మేకప్ చేసుకొంటున్న జూమీలియా ఉలిక్కిపడింది.

"ప్లీజ్ హాండ్సప్ మిస్. హాండ్సప్ జూమీలియా! నిన్ను చూడగలిగినందుకు చాల సంతోషంగా ఉంది. మీ మానేజర్ ఎక్కడ?"

జూమిలియా ఛటుక్కున పక్కకు తప్పుకొంది. అదే క్షణంలో నా వీపులో ఏదో గుచ్చుకొంది.

"మానేజర్ గఫార్‌ఖాన్ యిక్కడే ఉన్నాడు డిటెక్టివ్ నరేష్! చేయి కదిలితే ట్రిగ్గర్ కదుల్తుంది." అంటూ వెనక నుంచి నా పిస్తోలు చటుక్కున లాక్కున్నాడు గఫార్‌ఖాన్.

"మిస్. జూమీలియా! మీ మానేజర్ తలుపు వెనకాల

దాక్కోవటంలో బాగా నేర్పరి. కిందటి జన్మలో గోరీల దగ్గర నక్కగా పుట్టి వుంటాడు." అన్నాను యీజీగా నిలబడుతూ.

జూమీలియా అద్దంలో తాపీగా తుదిమెరుగులు దిద్దుకుంటూ నవ్వింది. "మీమీద నాకు వ్యక్తిగతంగా ఎలాంటి ద్వేషంలేదు. ఆ కుర్చీలో కూర్చోండి మిస్టర్ నరేష్! నో ఫన్నీ బిజినెస్ ప్లీజ్." అందామె తన పని చేసుకొంటూ.

ప్రక్కగా ఉన్న కుర్చీలో కూలబడ్డాను. గఫార్‌ఖాన్ చేతిలోని పిస్తోలుతో నన్ను గుంటనక్కలా గమనిస్తున్నాడు.

"మిస్టర్ నరేష్ ఇప్పుడు టైమెంత?" అంది జూమీలియా ఉన్నట్టుండి కంగారుగా.

వాచ్ చూసి 'ఒకటిన్నర' అన్నాను వింతగా ఆమె వేపు చూస్తూ.

"మైగాడ్! గఫార్‌ఖాన్. మందుకి టైమ్ అయింది. త్వరగా ఆ సూట్‌కేసులోని ఎల్. ఎస్. డి. అందుకో" అందామె గఫార్‌ఖాన్ ప్రక్కగా స్టూల్‌మీద ఉన్న సూట్‌కేసు వైపు చూపిస్తూ.

"మేడమ్! మీకు మతిపోతోంది. అరగంటలో మీరు హార్బర్‌కు వెళ్ళాలి. లేకపోతే మన ప్రోగ్రాం అభాసుపాలవుతుంది." అన్నాడు గఫార్‌ఖాన్ బంగారు రంగు పిస్తోలు నా వైపే ఉంచుతూ.

నాకు విషయం అర్థమైంది."ప్లీజ్ గఫార్! ప్రశ్నలతో నన్ను వేధించకు. ఈ టైములో చిన్న డోసు తీసుకోవాలి. లేకపోతే నేను మృగంలా ప్రవర్తిస్తాను." అంది అసహనంగా తల పట్టుకొని.

ఆమె ఒంట్లో ప్రతి అణువూ ఎల్. ఎస్. డి. కోసం నాలుకలు తెరుచుకొని ఎదురు చూస్తోంది.

"మేడమ్! మీ మంచి కోసం నేను చెబుతున్నాను. ఇప్పటి దాకా ఈ డిటెక్టివ్‌తో మాట్లాడి టైమ్ వేస్ట్‌చేసారు. మనం ఇతన్ని బంధించి వెంటనే బయలుదేరాలి."

వింత సన్నివేశాన్ని ఆసక్తిగా గమనిస్తున్నాను నేను.

"స్టాప్ యువర్ రబ్బిష్ గఫార్! ఇది నా ఆర్డర్ వెంటనే ఆ లిక్విడ్ బాటిల్ తియ్యి. లేకపోతే ఆ రతన్‌గాడికి పట్టిన గతే నీకూ పడుతుంది. క్విక్!!"

"ప్లీజ్! మేడమ్...." ఇంకా ఏదో అనబోతున్నాడతను.

"య్యూ బ్లడీ ఇడియ్యట్"....జూమీలియా పిచ్చిదానిలా పరిగెట్టుకుంటూ వచ్చి గఫార్ చేతిలోని పిస్తోలు లాక్కొని అతన్ని టపా టపా కాల్చింది. అయిదుగుళ్ళు అతని శరీరంలో చోటు చేసుకొన్నాయి.

కనీసం నేను కూడా ఊహించని పరిణామం అది!

12

డ్రగ్ హేబిట్ లక్షణమే అది! అతి సున్నితమైన మెదడు ఆపరేషన్‌లకు ఉపయోగించడానికి సృష్టించబడిన ఎల్. ఎస్. డి. ని మనిషి పతనావస్థ కోసం దుర్వినియోగం చేసుకుంటున్నాడు. చరస్, హషీష్, మార్జువానా, పెథిడ్రిన్ ఎల్. ఎస్. డి. లాంటి మత్తు పదార్థాలు మానవుణ్ని బానిసగానూ, ఒక్కొక్కప్పుడు చెలరేగిన మృగంగానూ మారుస్తాయి.

ఆలోచనల్లోంచి తేరుకుంటూ జూమీలియాను చూసాను. ఆమె స్మాల్ డోస్ ఇంజక్షన్ ముగించి సూట్‌కేసు తీసుకొని లేచి నిలబడింది. అప్పటి వరకు గఫార్‌ను చంపిన

గోల్డ్ కలర్ పిస్తోలు నా వేపు గురిపెట్టబడే ఉంది.

"గుడ్ బై మిస్టర్ నరేష్" అంది సూట్ కేసుతో గుమ్మం వైపు కదుల్తూ. కొద్దిగా తూలుతూందామె.

చిన్నగా నవ్వాను. "జూమీలియా! డిటెక్టివ్ నరేష్‌ను చాల తక్కువగా అంచనా వేస్తున్నావ్. నేను తలచుకుంటే రెండు క్షణాల్లో నిన్ను శవంగా మార్చి మోసుకుపోగలను. కాని నా ప్రయత్నం అది కాదు. నా వంటి మీద బట్ట నలగకుండా నిన్ను పోలీసు అధికారుల ముందుంచాలి. అదే నా లక్ష్యం. నా ఓర్పుని, బలహీనతగా తీసుకొని పిచ్చి ప్రయత్నాలు చెయ్యకు. ఇప్పటిదాకా నువ్వు చేసిన నేరాలు ఓసారి తలుచుకొని పరివర్తన చెందు వెంటనే లొంగిపో సరెండర్ యువర్ సెల్ఫ్" అన్నాను చివరి మాటలు నొక్కి పలుకుతూ.

"ఇంపాసిబుల్ మిస్టర్ నరేష్. జూమీలియా కుక్కలా మీ కూడా వస్తుందని కలలో కూడా ఊహించకండి." అంటూ తలుపులు దభాలున వేసి బయటకు పరిగెట్టింది జూమీలియా.

కుర్చీలోంచి మెరుపులా లేచి తలుపులు ఢీకొన్నాను. 'ధన్' మంటూ విరిగిపడ్డాయి అవి. క్షణంలో బయటకు దూసుకుపోయాను.

జూమీలియా ఓపెన్ టెర్రేస్‌లో పరిగెడుతోంది పిట్ట గోడవైపు. నడుముకు సూట్ కేస్ వ్రేలాడుతోంది. చేతిలో గోల్డ్ కలర్ పిస్తోలు.

తారాజువ్వలా ఆమె వెనుక పరిగెట్టాను. అప్పటికే ఆమె పిట్ట గోడనుంచి అవతలికి దిగింది.

వేగంగా వెళ్ళి పిట్ట గోడను చేరుకున్నాను. ఏడు

అంతస్థుల క్రిందుగా రోడ్డుమీద హోటల్ చుట్టూ సాయుధు లైన పోలీసులు నిలబడి ఉన్నారు. సర్కిల్ వేలుమణి టెలిస్కోపిక్ రైఫిల్‌తో జీపు మీద నిలబడి పైకి చూస్తున్నాడు.

జుమీలియా మత్తు నిండిన కళ్ళతో నీటి గొట్టం పట్టుకొని క్రిందకు పాకుతోంది. ఆమె కుడి చేతిలో గోల్డ్ కలర్ పిస్తోలుకొన నా వైపే ఉంది.

జుమీలియా! నీవేం చేస్తున్నావో నీకు తెలియడంలేదు. నువ్వు తప్పించుకోడం ఇంపాసిబుల్. దయచేసి పైకిరా!" కంగారుగా అన్నాను పిట్ట గోడ అవతలివైపు ఉన్న నీటి గొట్టం మీద కాలుపెడుతూ.

జుమీలియా చేతులు ఒరుసుకు పోతున్నాయ్. అప్పటికే పది అడుగుల దాకా క్రిందికి పాకింది. ఒక్క క్షణం ఆగి నా వేపు పైకి చూసింది జుమీలియా. "మిస్టర్ నరేష్! ఆ గోడ మీదే నిలబడి ఉండండి క్రిందకు దిగే ప్రయత్నం చేస్తే మీ ప్రాణాలు దక్కవ్!" అంది మెల్లిగా క్రింధకు పాకుతూ. గొట్టంమీద ఆమె చేతులు వణుకుతున్నాయ్. మత్తు తలను పూర్తి ఆక్రమించుకుంది.

వాటర్ పైప్ చుట్టూ ఉన్న జుమీలియా చేతులు పట్లు సడలాయ్. అంతే!

స్మగ్లింగ్‌క్వీన్ జుమీలియా ఏడంతస్తుల భవనం మీంచి రబ్బరు బొమ్మలా గాలిలో తేలుతూ రోడ్డుమీద పడింది.

"పూర్ జుమీలియా" నా కళ్ళ వెంట రెండు నీటి బొట్లు రాలి పడ్డాయి.

పాల్‌మార్ సిగరెట్ వెల్గించుకొని భారంగా లిఫ్టు వైపు నడిచేను.

***

మన్ను తిన్న పాము

బెల్లంకొండ నాగేశ్వరరావు

అగ్గిపెట్టె వుంటే యిస్తారూ?

ఎడమ చేతిలోని లాటీని కుడిచేతిలోనికి మార్చుకుంటూ జేబులోని అగ్గి పెట్టె తీశాడు కోటయ్య.

"ఏమిటి? ఏదన్నా రిపేరా?" అంటూ బానెట్ లోనికి వంగాడు.

ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న నేను క్లోరోఫారంతో తడిపిన చేతి గుడ్డను కోటయ్య ముఖముపై వేసి బలంగా అదిమాను,

క్షణకాలం గిలగిలలాడుతూ, తలవాల్చాడు కోటయ్య.

చుట్టూ పరికించాను. అది మైన్ రోడ్డు అయినప్పటికి తెల్లవారుఝాము కావడం వలన ఎవ్వరూ వస్తున్న జాడ కనుపించలేదు.

గుబురుగా వున్న చెట్ల మధ్యకు కోటయ్యను యీడ్చుక

వెళ్లాను. గబ గబా ప్యాంటు, షర్టు తీసి, కోటయ్య బట్టలు విప్పి నా వంటికి తగిలించుకున్నాను. కాలికున్న పాయింట్ షూని వదలి, కోటయ్య కాళ్ళ కున్న బూట్లు వేసుకొని క్రింద పడివున్న కోటయ్య హ్యాట్ ని తలకు పెట్టుకొని. నా డ్రస్సు షూ, నా ఫియట్ లో పడవేశాను-కావాల్సిన సామాన్లు కారు నుండి అందుకొని క్రింద పడివున్న లాటీని చేతిలోనికి తీసుకొని, ఫియట్ లాక్ చేసి బ్యాంక్ కేసి బయలుదేరాను.

వెళ్తూ వెళ్తూ ఓసారి వెనక్కు తిరిగి ఫియట్ కేసి చూశాను. గ్రీసుపూసి దుమ్ముకొట్టిన నంబరు ప్లేటులు నే చేయబోయే పనేమిటో అర్థంకాక తెల్లమొహం లేశాయి.

చకచకా బ్యాంకు కేసి నడవసాగాను, చేతికున్న వాచీ అంత చీకటిలోను వెలుగు చూపుతూ పచ్చని తన రేడి-యంను గుర్తుచేస్తుంది.

చిన్నగా నవ్వుకుంటూ వాచీ వూడబీకి ప్యాంటు జేబులో పదిలంగా కుక్కాను.

నా ప్రియురాలు గీత ప్రేమతో బహూకరించిన ఆ వాచీ వెనుక నా అడ్రసు అంతా ఇంగ్లీషులో చెక్కబడి వుంది. ముందు జాగ్రత్తతో నేను చేసిన పనికి మునిసిపాలిటీవారి లైటు మూగపోయి వుంది. బ్యాంకు వరండాలోని లైటు వెలుతురు నా మొఖంమీద పడకుండా తలమీద టోపీని మరింతగా ముందుకు లాగి చేతిలోని లాటి వూపుకుంటూ బ్యాంకు మైన్ గేటు చేరాను.

అక్కడే ఆశీనుడై వున్న రెండవ వాచ్ మన్ నరసింహులు "ఏరా కోటిగా! తొందరగానే తగలడ్డావే! ఈడ కూకోని ఏడుపు! నేను టీ తాగి బేగివత్తాను." అంటూ బీడి దమ్ము గట్టిగా లాగి గాలిలోకి వూదుకుంటూ నా సమాధానంకొరకు

ఎదురు చూడకుండా వెళ్ళాడు.

వెళ్తున్న నరసింహాల్ని చూస్తూ రెండు నిమిషాలలాగే నిలబడ్డాను.

జేబులోని తాళాల గుత్తితో బ్యాంక్ ముఖద్వారాన్ని తేలిగ్గానే తీయగలిగాను.

దడదడలాడే గుండెలతో లోన ప్రవేశించి, చేతిలోని టార్చిలైటును ఫోకస్ చేశాను.

కుడిచేతి ప్రక్కగా ఆఫీసురూం, దాని ప్రక్కనే సేఫ్టీ లాకర్ రూము. ఆ ప్రక్కనే బ్యాంక్ ఏజంట్ రూము వున్నాయి. గబగబా ఐరన్ సేఫ్ రూంకేసి నడిచాను. డూప్లికేటు తాళాలు పెట్టి త్రిప్పసాగాను. అరచేతులు చెమటలు పడుతున్నాయి. నరసింహాలు రావడానికి దాదాపు గంట పైనే పడుతుంది. చాలా రోజులుగా యీ వాచ్‌మేన్ దినచర్యలు గమనిస్తున్నాను గనుక యిప్పట్లో నరసింహాలు వస్తాడన్న భయంలేదు.

కాని ఎందుకో కాళ్ళు చేతులు నామాట వినడంలేదు. కొద్ది క్షణాల్లో నా చేతి కందబోయే లక్షల ఖరీదుచేసే వజ్రాలను తలచుకుంటూ, చేతిలోని తాళాన్ని గిరగిరా పట్టుతో త్రిప్పాను. 'క్లిక్' మంటూ ఊడి తాళం నా చేతికొచ్చింది. రెండు అంగలలో సేఫ్‌వద్దకు నడిచాను.

ఐరన్ సేఫ్‌ను ఓమారు పరీక్షించి చేతిని వేయబోయి ఎందుకో ఆగిపోయాను. జేబులోనుండి ఎలక్ట్రికల్ టెష్టర్‌ను తీసి సేఫ్‌ని టెస్ట్‌చేశాను.

కరంటు పాస్ అవుతూనే వుంది. నేను ఏమాత్రం ఏమరుపాటున దానిపై చేయివేసివున్నా, ఎటువంటి రికమండేషన్ లేకుండా పాస్‌పోర్టు పుట్టేది.

ప్యాంటు జేబునుండి వైర్ తీస్తూ స్విచ్‌బోర్డుకేసి నడచాను.

నా చేతిలోని టార్చితో స్విచ్ బోర్డుపై ఫోకస్‌చేశాను.

పూలదండతో ఆహ్వానిస్తున్న అదృష్ట దేవతలా నన్నాహ్వానించింది స్విచ్‌బోర్డు ప్లగ్.

చేతిలోని వైర్ రెండువైపుల కొసలను ప్లగ్ పిన్నులో గుచ్చాను.

చక్‌మంటూ లేచింది పెద్ద వెలుగుతో ఫ్యూజు.

టార్చి ఫోకస్ సహాయంతో చేతిలోని టెస్టర్‌తో మరోమారు టెస్ట్ చేశాను ఐరన్ సేఫ్‌ను. బొజ్జగణపతిలా నిండుగా నిర్మలంగా వుంది సేఫ్!

అది ఆటోమాటిక్ డైలింగ్ టైప్ లాకర్ U.S.A. మేడ్.

క్రితం రోజు రాత్రి బ్యాంక్ ఏజంటు యింట్లో డైరీలో చూపిన సేఫ్ నంబరు మరోమారు గుర్తుచేసుకొంటూ నంబర్లు త్రిప్పసాగాను. మతిమరుపు ఉద్యోగులు ఇలాంటి రహస్యాలను కాగితాలపై కెక్కించటంతో మాలాంటివారి పనులు తేలిగ్గా జరుగుతుంటాయి. నంబరు సరిగా పెట్టి సేఫ్ లోపల భాగంలో అమర్చబడిన హాండిల్‌ని చూస్తూ నా చేతిలోని స్క్రూడ్రైవరుతో బలంగా నెట్టాను.

టక్‌మంటూ ఒన్‌వే బేడి ఆటోమాటిక్‌గా స్క్రూడ్రైవరుతో సహా లాకైపోయింది. ఆ హాండిల్‌పై నేనే చేయి వేసివుంటే ఆ బేడీ నా చేతికే పడివుండేది. ప్రొద్దున్నే బ్యాంక్ ఏజంటు వచ్చి లాక్‌తీసేదాకా నేనలానే సేఫ్‌వద్ద కూర్చుండి పోవడమో లేదా ఆ చేయి అంతవరకు కట్ చేసుకొని వెళ్ళవలసివచ్చేది.

నెమ్మదిగా సేఫ్ తలుపులు తెరచాను.

స్మాల్ సైజు షో బాక్సులో వజ్రాలు పెట్టబడివున్నాయి. దొంతర దొంతర్లుగా కరెన్సీ పేర్చబడివుంది. నా కళ్ళు జగేల్ మన్నాయి. కాని నాకు కావలసిన వజ్రాలపెట్టి పట్టుకొని వడివడిగా బయటకు నడిచాను.

ముఖద్వారం తలుపులు దగ్గరకు లాగి గడియవేసి మెయిన్ రోడ్డువైపుకు దృష్టి సారించాను. గుండె ఆగినంత పని అయింది.

బ్యాంకికి కొద్ది దూరంలో ఎవరో కూర్చొని పాస్ పోసు కుంటున్నాడు. పిల్లిలా వెళ్ళి మెయిన్‌గేటువద్ద స్టూల్ పై కూర్చున్నాను.

చేతులకున్న గ్లవ్‌సులు తీసి దాచేశాను.

అక్కడ కూర్చున్న వ్యక్తి నరసింహులే అయితే నేను పట్టుపడడం ఖాయం. ధైర్యంగా ప్యాంటు జేబులోని నైఫ్ తీసి ఓపెన్ చేసి ఎందుకైనా మంచిదని కాలిక్రింద రడీగా వుంచాను!

అవతల వ్యక్తి లేచి నిలబట్టాడు. ప్యాంట్ గుండీలు పెట్టుకొంటూ నాకేసి రాసాగాడు. పరీక్షగా చూశాను. అత గాడు వాచ్ మేన్ నరసింహులు కాదు. మెయిన్ రోడ్డుపై కొట్లకు కాపలాకాసే ఘూర్కా.

ఏదో ఆలోచిస్తున్నవాడిలా లాటీనీ స్టూలుపై మోపి కొంత క్రిందిభాగానికి అసరాగా పెట్టుకొని, టోపీని ముందుకు లాగాను నా మొహాన్ని చాటుచేసుకుంటానికి.

"అరే భాయ్ జరా అంగార్ డబ్బీ దేవ్" అంటూ తన చేతిని చాపాడు. నా జేబులో వున్న అగ్గిపెట్టి యిస్తే, ఆ వెలుగుద్వారా నన్ను గుర్తిస్తాడనే అనుమానంతో అగ్గిపెట్టె

లేదని సైగచేశాను చేతితో.

"క్యావ్యార్ బాకతరతేనై" అంటూ నా బుజంపై చేయి వేశాడు. నా గుండెలదిరాయి. ఈ బ్యాంక్ వాచ్ మేన్స్‌కి యితగానికి ఎటువంటి స్నేహసంబంధాలున్నాయో నాకు తెలియదు. పైగా యీ నేపాలీ పీపుల్ చాలా కరెక్టు! ఉద్యోగ బాధ్యతలో తమ ప్రాణాలను యివ్వడానికైనా వెన కాడరు. తెగింపుగా కాలిక్రింద కత్తికోరకు చేయి జరిపాను.

ఇంతలో ఎవరో వ్యక్తి బ్యాంకు ముందుగా, చేతిలో ఎర్రగా కాలుతున్న సిగరెట్టుతో వెళుతుండటం గమనించిన ఘూర్కా పరుగున వెళ్ళి, సిగిరెట్టు వెలిగించుకొని "అరే యారో మేవహాం తలక్ జాతాహూం"అంటూ పెద్దగా శబ్దం చేస్తూ లాటి ఊపుకుంటూ వెళ్ళాడు.

బ్రతికానురా భగవంతుడా అనుకుంటూ పరుగున వెళ్ళి ఫియట్‌లో పడ్డాను. మెయిన్ రోడ్డుగుండా వెళితే నర సింహులు ఎదురౌతాడేమోనని ప్రక్క రోడ్డుగుండా నా ప్రియురాలు గీత ఇంటికి పరుగుతీయించాను ఫియట్‌ను.

* * *

చెమటతో తడిసిన శరీరం చన్నీటి స్నానంతో పన్నీటి జల్లులా ఎంతో హాయిని కలిగించింది.

డ్రస్ చేసుకొని గీత తెచ్చే కాఫీ కోసం ఎదురు చూస్తూ సోఫాలో కూర్చున్నాను.

"టంగ్" మంటూ మ్రోగింది గోడగడియారం.

అలవాటుగా యెడం చేతి వాచీ కేసి చూసుకున్నాను. గుండె ఆగినంత పనయ్యింది. చేతికి వాచీలేదు. గతం ఒక్క సారి సినిమా రీలులా కళ్ళముందు మెదిలింది. పరుగున బాత్‌రూంలోకి వెళ్ళి కోటయ్య బట్టలు వెతికాను. వాచీ కను

పించలేదు. నాలో కంగారు మరింత బయలుదేరింది. ఏం చేయాలా అని ఆలోచిస్తూ బాత్ రూం నుండి బయట పడ్డాను వంటికి పట్టిన చెమటను చేతిగుడ్డతో తుడుచుకుంటూ.

కిచన్ గదిలో నుంచి వచ్చిన గీత తన చేతిలోని కాఫీ కప్పు నాచేతి కందించింది. కమ్మగా వుండవలసిన కాఫీ పాషాణంలా తోచింది.

ఆ బాధను గమనించిన గీత "వ్వాట్ రవీ! వ్వాట్ హాఫెండ్'' అంటూ నన్ను ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసింది. మన కొంపలంటుకున్నాయి. నువ్వు నాకు ప్రజెంటు చేసిన వాచీ బ్యాంకులో జారిపోయింది. దానిపై అడ్రసు ప్రకారం పోలీసులు నా కోసం రావచ్చు.

క్షణకాలం ఆ గదిలో నిశ్శబ్దం రాజ్యం చేసింది.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ తలుపుమీద ఎవరో కొట్టిన శబ్దం వినవచ్చింది.

చంగున లేడిలా తప్పుకుంటూ తలుపులు తీయమని గీతకి సైగ చేశాను.

తడబడే అడుగులతో తలుపు తీసింది గీత.

ఇంట్లోకి వస్తున్న పోలీస్ ఇనస్పెక్టరుని చూసిన నాకు, రాజమండ్రి జైలు గుర్తుకొచ్చింది. జారిపోతున్న గుండెల్ని ఎగదోసుకుంటూ కర్టన్స్ ప్రక్కకి తప్పుకున్నాను.

ఇనస్పెక్టరును లోనికి ఆహ్వానించి సోఫాలో కూర్చో బెట్టింది గీత. తన చేతిలోని పాకెట్టును గీతకందిస్తూ ఏదో చెప్పుతున్నాడు ఇనస్పెక్టరు గీతతో. ఎంత ప్రయత్నించినా నాకు వినిపించలేదు.

క్షణకాలం తరువాత ప్రయత్నించినా నాకు వినిపించ లేదు.

క్షణకాలం తరువాత ప్రతి నమస్కారం చేస్తూ వెళ్ళి పోయాడు ఇన్‌స్పెక్టరు.

పరుగులాంటి నడకతో గీతను సమీపించాను.

గీత బర్త్‌డేకు రాలేని వాళ్ళ అన్నయ్య తన స్నేహితుడైన యీ ఇనస్పెక్టరు ద్వారా ప్రజంటేషన్ పంపాడట. దాంతో గుండెలు కాస్తంత కుదుట పడ్డాయి.

మెరుపులా ఓ ఆలోచన తట్టింది. ప్రక్కనే వున్న ఫోన్ అందుకొని పోలీస్ స్టేషన్‌కు రింగు చేశాను. "రాత్రి పబ్లిక్ పార్కులో నా వాచిపోయినట్లు దానిపైనా అడ్రసు ఇంగ్లీషులో స్పష్టంగా చెక్కబడి వున్నట్లు" రిపోర్టు చేసి అడ్రసు చెప్పి రిసీవర్ క్రెడిల్ చేశాను.

"గీతా క్విక్! వెంటనే బయలుదేరాలి. మంజూ గార్డెన్ కమ్ రెస్టారెంటులో మనం అర్జంటుగా ఓ వ్యక్తిని కలుసుకోవాలి. యీ వజ్రాలను మననుండి ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిది."

కిచిన్ రూములోని కిరోసిన్ కోటయ్య బట్టలపై వేసి అగ్గిపుల్ల గీసి వేశాను. క్షణకాలంలో బూడిదగా మారాయి.

నేను పని పూర్తి చేసి వచ్చేటప్పటికి, గీత కూడా అందంగా అలంకరించుకొని "అయామ్ రడీ" అంటూ చేతిలోని హ్యాండ్ బ్యాగ్ ఇంకా అందంగా ఊపింది.

వజ్రాల పెట్టెను గీత హ్యాండు బ్యాగులో వేశాను. మా ఫియిట్ మంజూ బార్‌కేసి వేగంగా దూసుకుపోయింది.

* * *

బేరర్....తెచ్చిన స్వీట్స్ తీసుకుంటూ కూర్చుండి పోయాము.

"సర్....ఆర్ యు రవికుమార్" బేరర్ దగ్గరగా వచ్చి

అడిగాడు.

"యస్."

"మీకు టెలిఫోన్ కాల్."

గబగబా వెళ్ళి కౌంటరులోని రిసీవరు అందుకున్నాను.

"రవికుమార్ స్పీకింగ్ హియిర్."

"వెళ్ళిన పని ఏమైంది?" అవతలి వ్యక్తి ప్రశ్నించాడు.

"సక్సెస్."

"వెంటనే అవి తీసుకొని ఊరి వెలుపల ఉన్న పాడు బడిన బంగళాకురా."

నా సమాధానం కోసం ఎదురు చూడకుండా లైను కట్ చేసాడు. గీతతో కలిసి బయలుదేరాను మా ఫియట్‌లో.

బాణంలా దూసుకుపోతూంది మా ఫియట్.

గీతను అక్కడకు తీసుకవెళ్ళటమా మానటమా ఆలోచిస్తున్నాను.

సిటీ లిమిట్స్ దాటింది మా ఫియట్.

కారు ఆపమన్నట్లుగా చేయి ఊపుతున్న ఇనస్పెక్టరును చూస్తూనే నా గుండెలు ఆగినంత పనైంది. అనుకోకుండా యాక్సిలేటరుపై కాలు తీసి బ్రేక్ పెడల్‌పై వేశాను. కీచుమంటూ ఆగింది మా ఫియట్.

రోడ్డు ప్రక్కన ఉన్న జీపు వద్దనుండి కారువైపు వస్తున్నారు నలుగురు పోలీసులు.

మా కారుకు దగ్గరగా వచ్చాడు ఇనస్పెక్టరు. నా కుడి చేయి ప్యాంటు జేబులోని రివాల్వర్‌పై బిగుసుకుంది.

"సారీ మిస్టర్ మా జీపులో పెట్రోలు అయిపోయింది. మీ వద్ద పెట్రోలు స్పేరుగా వుంటే" అర్ధోక్తిలో ఆగిపోయాడు ఇనస్పెక్టరు.

కుదుటపడిన గుండెతో నా భుజంపై తలవాల్చింది గీత.

"ఇట్సాల్ రైట్" నాలోని భయాన్ని కన్పడనీయకుండా డిక్కీలోని పెట్రోల్ టిన్ అందించాను. అంత సేపు ఇన్‌స్పెక్టర్ తదేకంగా కారునే చూస్తున్నాడు.

"ధ్యాంక్స్ ...." చెపుతూ ఇన్‌స్పెక్టర్ చేయి సాచాడు షేక్‌హ్యాండ్ కోసం.

ధైర్యాన్ని కూడ దీసుకుంటూ కుడిచేయి కలిపాను. నా చేతిని అలానే గట్టిగా పట్టుకొని "మిస్టర్, యూ ఆర్ అండర్ అరెస్ట్" పిడుగులా ఉరిమాడు ఇన్‌స్పెక్టర్.

కొయ్యబొమ్మలా నిలబడిపోయింది గీత.

మెరుపులా తప్పుకోబోయాను. 'ఢన్' మంటూ ప్రేలింది రివాల్వర్. కుడికాల్లో నిప్పు కణిక దూర్చినట్లయింది.

కుప్పలా కూలిపోయాను, అలా పడటములో నా చేతి లోని హ్యాండ్‌బ్యాగ్ ఎగిరి ఇనస్పెక్టరు కాళ్ళ వద్ద పడి ఓపెన్ అయింది.

దానిలోని వజ్రాలు ఆ ప్రాంతమంతా పడి ధగధగా మెరవసాగాయి.

"మిస్టర్! ఎంత తెలివిగల నేరస్తుడైనా ఏవో చిన్న చిన్న పొరపాట్లవల్ల పట్టుబడుతుంటారు. నీవు వాచ్‌మెన్ కోటయ్యను స్పృహ పోగొట్టావుకాని, చంపలేదు. అతనికి స్పృహ రాగానే మా దగ్గరకు వచ్చి రిపోర్టు చేశాడు. నిన్ను నీ కారును వర్ణించి చెప్పాడు. ఇప్పుడు నీ కారును చూడ గానే అనుమానం వచ్చింది. అనుకోకుండా పట్టుబడ్డావు." చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

చేసేదేమీ లేక, మన్ను తిన్న పాములా, తలొంచుకొని ఇన్‌స్పెక్టర్‌ను అనుసరించాను.

యుద్ధంలో విజయం సాధించిన వీర జవానులా వేగంగా ముందుకు కదిలింది పోలీసు జీపు. ***

లోకంతో పనిలేదు!

వి. ఎస్. తెన్నేటి

ఆ పెదవులపైన చిరునవ్వు, ఆ కళ్ళల్లో కాంతి, ఆ ముఖంలో ఆనందం గమనించి ఆశ్చర్యపోయింది జానకి.

పీక్కుపోయిన ముఖంతో అలసి సొలసి నీరసంగా ఇంటికొచ్చి నిరాశతో నిట్టూర్చే భాస్కర్ యీ రోజు ఆనందానికి కారణం ఏమై ఉంటుందో ఊహించటానికి ప్రయత్నించింది. ఉద్యోగం దొరికి ఉంటుందా? ఆమెకు తట్టిన విషయం.

భాస్కర్ జానకి వైపు ఓసారి ఎగాదిగా చూసాడు. క్షణకాలం అతని హృదయం చివుక్కుమంది.

పెళ్ళయిన క్రొత్తలో జానకి ఎంతో అందంగా ఉండేది. మెట్రిక్యులేషన్ పాసయ్యి, ఉద్యోగాన్వేషణలో కాలం గడుపుతున్న తనకు సంబంధం కుదిర్చి పెళ్ళి చేసిన తండ్రి

మీద కోపం కలిగినా, జానకి అందం చూడగానే చప్పున చల్లబడిపోయింది.

తనకు పెళ్ళయ్యి రెండు సంవత్సరాలైనా తనకు కలిగిన సంతానం ఒక్కటే అయినా, నీరసంతో కృశించి పోయిన జానకి ముఖం పదిమంది పిల్లల తల్లిలాగ కనిపిస్తుంది, సరియైన తిండిలేదు. శుభ్రమైన బట్టలులేవు. చిరిగిన దుస్తుల్లో, చెదిరిన జీవితం యింతకాలం గడిపింది జానకి.

ఇక తన జానకికి ఏ లోటూ రాకుండా చూసుకోవాలి. యింతకాలం అనుభవించిన కష్టాలన్నిటిని మర్చిపోయి, జీవితం హాయిగా సాగిపోవాలి.

"జానకి—యిక మనకి నిరాశా జీవితం అనవసరం. చాలీ చాలని చింకి దుస్తులతో, గంజి నీళ్ళతో రొట్టె ముక్కలతో పొట్టనింపుకుని జీవితాన్ని లాక్కుపోవాల్సిన అవసరం యికలేదు జానకి. మన కష్టాలన్నీ గట్టెక్కాయి—" అన్నాడు భాస్కర్ ఆనందంగా భార్యను కౌగలించుకుంటూ.

"ఏమిటండి? ఉద్యోగం దొరికిందా?—" అంది జానకి.

కౌగిలి విడిచి, క్షణకాలం మౌనం వహించాడు.

"ఉద్యోగం! ఔను—నాకు ఉద్యోగం దొరికింది జానకి. కాదు—ఉద్యోగం కాదు—వ్యాపారం! ఊఁహుఁ! వ్యాపారమూ కాదు! వ్యాపారంలాంటి ఉద్యోగం! ఉద్యోగంలాంటి వ్యాపారం!"—అని పకపక నవ్వి, మళ్ళీ గభాలున ఆమెను కౌగలించుకుని, పైకెత్తుకొని గిరగిర తిప్పాడు.

"చూడు జానకి. యిదిగో—" అంటూ జేబులోంచి నోట్లకట్ట బైటికి తీసాడు. అన్నీ వందరూపాయల నోట్లే!

"చూశావా? ఎంత డబ్బో!" అన్నాడు భాస్కర్. అంత

డబ్బువైపు ఆశ్చర్యంగా చూసింది జానకి. భర్తవైపు అను మానంగా చూసింది.

"ఎక్కడిదండి—ఇంత డబ్బు. నాకేదో భయంగా ఉంది. ఎలా సంపాదించారు? నిజం చెప్పండి—" అంది ఆమె.

నొసలు చిట్లించాడు భాస్కర్, "వ్వాట్? భయంగా ఉందా? డబ్బు చూస్తే భయమేస్తోందా జానకి!" అని నవ్వి, "డోంట్ బీ సిల్లీ డియర్. డబ్బు—ఎలా సంపాదించారని కాదు అడగాల్సింది? ఎంత సంపాదించారు అని అడుగు-తక్కున చెబుతాను. మొత్తం పదివేలు!

టెన్ థౌజెండ్ రుపీస్! జానకి! ఈ డబ్బు ఉంటే ప్రపంచంలో ఏదైనా కొనుక్కోవచ్చు - ఎంతటి కార్యాన్నైనా సులభంగా సాధించవచ్చు. యింతకాలం చావలేక బ్రతక లేక, నానాయాతనలు పడుతూ, కష్టాలు అనుభవిస్తూ బ్రతికిన మనల్ని ఎలా జీవిస్తున్నారో ఎవరైనా అడిగారా? ఎవరు ఎలా జీవిస్తున్నారో, ఎందుకు జీవిస్తున్నారో లోకానికి అనవసరం జానకి! అందుకే మనకి కూడ ఈ లోకంతో పనిలేదు! డబ్బుతో పని! డబ్బుంటే చాలు అంతే—" అన్నాడు.

భాస్కర్ జేబులోంచి ఫోర్‌స్క్వేర్ సిగరెట్ పాకెట్ తీసి, ఓ సిగరెట్ వెలిగించుకున్నాడు. బీడిముక్కను బిగపట్టిన పెదాలను చూసింది జానకి ఇన్నాళ్ళు. అవే పెదాలు విలాసంగా సిగరెట్ పీలుస్తుంటే తదేకంగా చూస్తూండి పోయింది.

2

ఆ హోటల్లో పదకొండు గంటల నుండి కూర్చున్నాడు భాస్కర్. సరిగ్గా పన్నెండు గంటలకి జనార్ధన్ వస్తానన్నా

డని ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

జనార్ధన్ సహాయం తను ఈ జన్మలో మర్చిపోలేడు. తను ఈనాడు యింత గొప్ప హోటల్లో టెరీకాటన్ దుస్తులు ధరించి, ఫోర్‌స్క్వేర్ సిగరెట్‌లు ఇంత దర్జాగా పీలుస్తూ కూర్చున్నాడంటే—అంతా ఆ జనార్ధన్ వల్లనే. జనార్ధన్ తన పాలిట దైవం.

పన్నెండు గంటలు కొట్టింది ఆ హోటల్‌లోని గోడ గడియారం. ఆ తర్వాత మరో ఐదునిముషాలు కూడ గడిచి పోయాయి. అప్పుడే ఓ సెర్వర్ వచ్చి.

"సార్. భాస్కర్‌గారు మీరేనా?" అని అడిగాడు.

"ఔను. ఏం?"

"మీ కోసం ఫోనులో ఎవరో పిలుస్తున్నారు సర్."

"అలాగా" అంటూ లేచి నిల్చున్నాడు భాస్కర్. కౌంటర్ దగ్గరకి వెళ్ళగానే మేనేజర్ రిసీవర్ అందించాడు.

"హల్లో—" అన్నాడు భాస్కర్.

"హలో—భాస్కర్. నేను జనార్ధన్‌ని పన్నెండు గంటలకి నాకు పనుండి రాలేకపోయాను. అయినా ఫర్వా లేదులే. నేను మళ్ళీ నాగభూషణం గారితో మాట్లాడాను. మొన్న ఇల్లు చూసావుగా. నువ్వు ఆయనింటికి వెళ్లు. ఆయన తప్పకుండా ఏదో పని చెబుతారు. వినయంగా ఒప్పుకుని, రహస్యంగా పూర్తి చేసి, కాష్ పుచ్చుకో—"

"సర్లేగాని...." ఏదో అనబోయాడు భాస్కర్,

"ష్....నువ్వేం మాట్లాడకు. గాలికి చెవులుంటాయి. నేను చెప్పింది చెయ్యి అంతే. ఆయనతో అతిగా మాట్లా డకు. టైంబాంబ్‌లాంటి మనిషి—చాల జాగ్రత్తగా ఉండు. ఆయన చెప్పిన దానికి 'ఊఁ' అను అంతే. కౌంటర్

క్వెశ్చన్స్ వెయ్యకు. వాగకు సుమా, అవాకులు చవాకులు వాగావంటే ప్రమాదం.

ఇటువంటి వ్యవహారాలన్నీ గుట్టు చప్పుడు కాకుండా జరిగిపోవాలి. ఆయన చేతిక్రింద మరో ఆరునెలలు పని జేస్తే నువ్వు కూడ నాలాగ బంగళా, కార్లు, ఓ సినిమా థియేటరు సొంతం చేసుకోవచ్చు. బీ డేరింగ్ ఐసే. బీ ఆక్టివ్ ఓ. కే?"—

"ఓ. కే!" అన్నాడు భాస్కర్. వెంటనే రిసీవర్ పెట్టేసిన చప్పుడు స్పష్టంగా వినిపించింది.

3

ఈస్ట్ మారెడ్‌పల్లి ప్రశాంతమైన ప్రదేశం. ధనవంతుల నివాస ప్రాంతం అది.

'శ్రీనికేతన్' అని గేటు ప్రక్కనే తెల్లని రాతిపలకమీద నల్లని అక్షరాలు చెక్కబడి వున్నాయి. గేటు ప్రక్కన బల్ల మీద ఖాకీ దుస్తులు ధరించిన వ్యక్తి కూర్చున్నాడు. దగ్గర కెళ్ళి "అయ్యగారు 'ప్రత్యేకంగా' రమ్మన్నారు—"అన్నాడు. అలా చెప్పిన వాళ్ళని లోనికి వెళ్ళనిస్తాడు. లోనికి వెళ్లాడు.

సువిశాలమైన గార్డెన్, చుట్టూ సిమ్మెంటు గోడ. పచ్చటి గడ్డి రంగురంగుల పూల మొక్కలు.

మూడు మెట్లు ఎక్కి వరండాలోకి వచ్చాడు.

ఓ నౌకర్ వచ్చి—"ఏం కావాల"ని అడిగాడు. క్రితం సారి వచ్చినప్పటి వ్యక్తి కాదు, ఎవడో కొత్తవాడు కాబోలు.

"అయ్యగారెక్కడున్నారు?" అని అడిగాడు.

"అదిగో—ఆ గదిలోపల—" అని అన్నాడు.

ఆ గదివైపు నడిచాడు భాస్కర్. స్వింగ్ డోర్స్

తెరిచాడు. లోనికి అడుగు పెట్టాడు.

ఎయిర్ కండిషన్డు గది అది. అధునాతన అలంకరణతో అత్యంత ఆకర్షణీయంగా కన్పిస్తున్న ఆ గది మధ్యన డెకాలం టేబిల్. టేబిల్ వెనుక రివాల్వింగ్ చెయిర్. రివాల్వింగ్ చెయిర్‌లో కూర్చుని వున్నారు నాగభూషణం గారు. వీపు తన వైపే వుంది.

క్షణకాలం ఏం చెయ్యాలో బోధపడలేదు భాస్కర్‌కు.

టేబిల్‌కి ఆన్చి వున్న రెండు కర్రలవైపు చూసాడు భాస్కర్. నాగభూషణంగారికి ఎడంకాలు లేదు. పాపం! అతనికి ఏడెనిమిది సంవత్సరాల క్రితం ఏదో ఏక్సిడెంటులో పోయిందట. అతను చంకల క్రింద ఆ కర్రలు పెట్టుకుని నడుస్తాడు.

ధైర్యంచేసి, "నమస్కారం సార్"— అన్నాడు భాస్కర్.

సమాధానం వెంటనే రాలేదు. అతని చేతి వేళ్ళ మధ్య ఎర్రగా, డేంజర్ సిగ్నల్‌లా కాలుతోంది నల్లని సిగార్. గుప్పుమని పొగ సీలింగ్ వైపుకి వదలి, "భాస్కర్! వచ్చావన్నమాట—గుడ్—" అన్నారు.

"నిన్నెవరు పంపించారు?" మళ్ళీ అడిగాడు.

"జనార్ధన్‌గారు—"

"వెరీగుడ్.... క్రితం సారి చెప్పిన పని చక్కగా చేశావు—"

"థాంక్స్ సర్—"

మళ్ళీ గుప్పుమని పొగ వదిలి—"ఈసారి అంతకంటే చాకచక్యంగా చేసుకురావలసిన పనొకటి ఉంది. నీ నేర్పు, చాతుర్యం అంతా ఉపయోగించి, మరో కంటికి తెలీకుండా

రాత్రికల్లా పని పూర్తి చేసుకురావాలి. అర్ధమయ్యిందా?" అన్నాడు నాగభూషణంగారు.

"ఈసారి నువ్వు చెయ్యవలసింది ఒక్క హత్యకాదు. ఎనభై లక్షలు విలువచేసే వజ్రాల నెక్లెస్‌ని భద్రపరచిన ఒక పెట్టెను అపహరించాలి—! ఈ విషయంలో అడ్డు తగిలిన వాళ్ళను నరికి పారెయ్యాలి—అర్ధమయ్యిందా?"

"యస్ సార్."

"బై దిబై. క్రితం సారి చలపతిరావుగారిని హత్య చేసి నప్పుడు నువ్వొక పొరపాటు చేశావు గుర్తుందా?"

"ఏమిటి సార్?"

"పోలీసు డిపార్ట్‌మెంట్ ఇంకా అంత ఫార్వర్డ్ కాలేదు కాబట్టి సరిపోయింది. పొరపాటు గ్రహించి ఉంటే, నువ్వు నీతోపాటు నేను, జనార్ధన్ కూడా ఎరెస్ట్ అయ్యేవాళ్ళం—"

"నాకు అర్ధం కావటంలేదు సర్—"

"దటీజ్ ఎసింబల్ ఆఫ్ ఇన్ ఎక్స్‌పీరియన్స్—

"జరిగినదంతా గుర్తు తెచ్చుకో. నీకే తెలుస్తుంది—" అన్నారు నాగభూషణంగారు సిగార్ పీలుస్తూ.

భాస్కర్ జరిగినదంతా గుర్తు తెచ్చుకున్నాడు. తను చేసిన పొరపాటేమిటో అర్ధంకాలేదు.

ఐదు నిముషాలు గడిచాయి.

"ఏం? గుర్తుకు రాలేదా?" గంభీరంగా రెట్టించాడు.

"లేదు సర్—"భాస్కర్ గొంతు వణికింది.

"నేను చెప్పినట్లే చేశావా?"

"చేసాను సర్—"

"ఏం చేశావు? నేను చెప్పిందేమిటి—నువ్వు చేసిం దేమిటి?"

"డాక్టర్ చలపతిరావు గారింట్లో ఎవరూ ఉండరని, ఉద్యోగం కోసం అడగమని చెప్పారు. మీరు చెప్పిన ప్రకారంగా లెటర్ చూపించి, మీరు పంపించారని చెప్పి, ఉద్యోగం కోసం అడిగాను. అతను వివరాలు అడుగుతున్నప్పుడు గదిలో ఎవ్వరూ లేరు. జేబులోంచి మీరిచ్చిన సీసాను తీసాను. సీసాలోంచి సైనైడ్ పూసిన సూది తీసి, అమాంతంగా అతని జబ్బలో గుచ్చేసాను. అతను అరవకుండా గభాలున అతని నోరు నొక్కేను. ఆ గదిలో సీలింగ్ ఫాన్ చప్పుడు తప్ప మరేం లేదు. అతని ప్రాణం పోయింది. మీరు చెప్పిన ప్రకారంగా చేతికి గ్లవ్స్ తొడుక్కున్నాను. మీరు చెప్పిన విధంగానే అతని జేబులోంచి తాళాలు తీసి, బీరువాలోని 'కాన్ఫిడెంషియల్' ఫైలు జాగ్రత్తగా సూట్ కేసులో పెట్టుకుని తీసుకొచ్చాను...."

"అంతేనా?"

"ఆ తర్వాత బైటికొచ్చి జనార్ధన్‌గారు పంపించిన కారులో వచ్చేశాం. ఇందులో నేను చేసిన పొరపాటేమిటో....నాకు....అర్థం కాలేదు—", భాస్కర్ గుండె దడదడలాడుతూ ఉంటే—అతని పెదాలు వణికాయి. గొంతు జీరబోయింది.

"ఇప్పుడైనా అర్థమయ్యిందా మిస్టర్ భాస్కర్!"

గుర్రుమని తిరిగింది రివాల్వింగ్ చెయిర్. కుర్చీలో కూర్చున్న వ్యక్తి వైపు చూపి అదిరిపడ్డాడు!

అతను నాగభూషణంలాగే తెల్లని దుస్తులు ధరించాడు. నాగభూషణంలాగే పైకి దువ్వుకున్నాడు. నాగభూషణంలాగే అతని జుట్టు నెరిసి వుంది. కంఠంకూడా—ముమ్మూర్తులా

నాగభూషణంలాగే ఉంది!

కాని—అతను నాగభూషణం కాదు! ఎవరో ఆగంతకుడు!

"హ్యాండ్సప్ మిస్టర్ భాస్కర్!" వెనుక నుండి పవన్ కుమార్ రివాల్వర్ పట్టుకుని నిల్చున్నాడు.

"మీరు చెప్పిన మాటలన్నీ టేప్‌రికార్డరులో సురక్షితంగా వున్నాయి మిస్టర్ భాస్కర్. యు ఆర్ అండర్ ఎరెస్ట్. మిస్టర్ పవన్! మన అనుమానం కరెక్టేనని తేలింది.

"యు కెన్ అరెస్ట్ మిస్టర్ నాగభూషణం ఎండ్ 'కమల్' థియేటర్ ప్రొప్రయిటర్ మిస్టర్ జనార్ధన్ టూ—" అన్నాడు నాగభూషణంలా నటించిన డిటెక్టివ్ పవన్ జేబులోంచి 'డన్‌హిల్' సిగరెట్ పాకెట్టు బైటికి తీస్తూ.

4

చలపతి యిండియన్ రిసెర్చి లేబరేటరీస్‌లో 'టాప్ సీక్రెట్' సెల్‌లో బాధ్యతగల ఉద్యోగి. భారత ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని రహస్య పత్రాలు—ఆ రోజు ఢిల్లీ నుంచి వచ్చిన సీక్రెట్ అఫీషియల్ ద్వారా అతనికి అందాయి.

అవి యింటిలోనే యిరవైయ్యో తారీకు వరకు ఉంచుకుని, వాటితోపాటు మరో డాక్యుమెంట్ కూడా జతపరచి, 'హైయ్యర్ అఫీషియల్స్'కి పంపించ వలసిన బాధ్యత అతనికి ఉంది. ఆ విషయం ఎలాగో తెలుసుకున్నాడు నాగభూషణం. తనకు బాగా పరిచయమున్న 'డిగ్నిఫైడ్ క్రూక్' జనార్ధన్‌తో 'టెర్మ్స్' కుదుర్చుకుని, ఆ పనికి నియమించాడు.

జనార్ధన్, తన దగ్గరకి ఉద్యోగం కోసం వచ్చిన

భాస్కర్‌తో చిన్న తగువు సృష్టించుకుని, అతని ఆవేశాన్ని పరీక్షించి, అతని సామర్థ్యాన్ని ఊహించి, డబ్బు ఆశజూపి, రంగంలోకి చాకచక్యంగా దింపాడు.

ఆవేశం ఎంతటి సద్గుణ శాలినైనా పెడదారి పట్టిస్తుంది. తప్పటడుగు వెయ్యిస్తుంది. భాస్కర్‌ని పీడిస్తున్న నిరుద్యోగ సమస్య, పేదరికం—అతనిలో ఆవేశానికి ఆజ్యం పోసింది. అతనిలో పైశాచిక శక్తి విజృంభించింది. డబ్బు కోసం చలపతిరావుని నిర్భయంగా మర్డర్ చేశాడు, సీక్రెట్ డాక్యుమెంట్స్ కాజేసాడు.

హత్య జరిగిన తర్వాత పోలీసులు వచ్చి, శవాన్ని పరీక్షించి, చేసిన ఇన్వెస్టిగేషన్ ఫలితంగా. ఓ మంచి ఆధారం లభించింది.

ఒక వ్యక్తి హడావుడిగా నాగభూషణంగారి ఇంట్లోంచి బైటికి వచ్చి, కాంపౌండ్ దగ్గరలో వున్న చెట్టు ప్రక్కన ఆగివున్న నీలంరంగు చెవర్లెట్ కారు ఎక్కగానే, కారు శర వేగంతో దూసుకుపోవటం అప్రయత్నంగా చూసిన పాన్ షాప్ ఓనర్ బషీర్ చెప్పాడు! పరిశోధనలో ఆకారు నాగ భూషణంగారిదని తేలింది. బషీర్ చెప్పిన వర్ణనలు బట్టి భాస్కర్‌ను కూడా గుర్తించారు పోలీసులు.

సంఘంలో పెద్దమనిషిలా చెలామణి ఔతూ, తెరచాటు నుండి అక్రమాలకు, అన్యాయాలకు, దౌర్జన్యాలకు చేయూత నిస్తున్న నాగభూషణంగారిపైన పోలీస్ డిపార్ట్‌మెంటుకి ముందునుంచే అనుమానముంది. కానీ సాక్ష్యం దొరకక పోవటం వలన అతన్ని ఎరెస్ట్ చెయ్యలేక పోయారు.

సుప్రసిద్ధ డిటెక్టివ్ పవన్‌కుమార్ సహాయం కోరారు.

క్లిష్ట సమస్యల్ని అవలీలగా పరిష్కరించగల చక్కటి

పథకాలు రూపొందించటంలో తనకు తానే సాటి అనిపించు కున్న పవన్‌కుమార్-కేసుని సింపుల్‌గా సాల్వ్‌చేసేసాడు.

నాగభూషణంగారిని-అర్జంటుగా-'హోటల్ ఎమరాల్డ్'కు రమ్మని ఫోన్ చేశాడు. రాగానే తనెవ్వరో తెలియకుండా-ఎవరో రౌడీలు బంధించినట్లుగా, అతన్ని బంధించాడు. అతని స్థానంలో అవతరించాడు పవన్‌కుమార్.

భాస్కర్ వచ్చి వలలో చిక్కాడు. నాగభూషణానికి-'కమల్' థియేటర్ ప్రొప్రయిటర్ జనార్థన్ కుడి భుజం లాంటి వాడన్న మరో సత్యం బైటపడింది.

లోకంతో పనిలేదనుకుని-హత్య చెయ్యటానికి వెనుకాడ లేదు భాస్కర్- కానీ లోకానికి అతనితో ఎంతో పని ఉంటుందన్న విషయం మరిచి తప్పటడుగు వేశాడు; మహా పరాధం చేశాడు! చివరికి చట్టానికి తలవంచి, కటకటాల వెనుకకు చేరుకున్నాడు!!

***

ఒక భారతీయుడ్ని కొందరు విదేశీయులు కల్సు కొని''మీ దేశములో ప్రజలు నల్లగ, ఎర్రగ, చాలా రంగుల్లో ఉంటారు. మా దేశములో అందరము ఒకే రంగులో ఉంటాము. ఇల్లెందుకండి'' అని అన్నారు.

అతను చిరునవ్వుతో ''అవునండి! గుఱ్ఱాలు రంగు రంగులో ఉంటవి, కాని గాడిదలు మాత్రం ఒకే రంగులో ఉంటావి కదూ!'' అన్నాడు.

—కె. గంగాధర్, దిలావర్‌పూర్.

దిగంబర శవాలు!!

డాక్టర్ పెందుర్తి మాస్టర్జీ

వాసు ఒంటరిగా హోటల్ బారెక్స్‌లో బ్రాంది త్రాగుతూ ఆలోచిస్తున్నాడు. తను చూసిన భయంకరమయిన దృశ్యం బలి కోరుతుంది, తనలో రక్తం కాగుతుంది. ఏమిటి చెయ్యటం? ఎలా చెయ్యటం? తన భార్య ఒక కులట అని కలలో కూడా వూహించలేదు.

ఆలోచనలు! ఆలోచనలు! తెగని ఆలోచనలు!!

జుట్టు రేగివుంది. ముఖంలో కండరాలు బిగుసుకున్నాయి. కళ్ళు గుంటలు పడి ఎర్రబారాయి. సుడిగాలిలో పండు టాకులా వణికిపోతున్నాడు. శరీరం ముద్దయి పోయింది.

బరువుగా అడుగులు వేస్తూ యిల్లు చేరాడు.

లోపల నుండి మాటలు వినిపిస్తున్నాయి. చెవులు

రిక్కించి విన్నాడు.

"నిన్ను చంపితే నాకేం వస్తుంది మాధవి. నీవు ఎన్ని సుఖాలు ఆశించి వాసును చేసుకున్నావ్? వాసుతో జీవితం సుఖం లేదు. అందుకే చందన్‌లాల్‌తో ప్రారంభించావ్. ఇంకా ఎందరో," నవ్వుతున్న మగ గొంతు.

"ప్లీజ్ రాజు! అలా మాట్లాడక."

వ్యంగ్యమయిన నవ్వు "నిన్ను చంపటానికి రాలేదు మాధవి."

"మరెందుకొచ్చావ్?"

"నిన్ను, నీ మనసును అర్థం చేసుకున్నాను. అందుకే ఒక్కసారి నిన్ను అనుభవించి వెళ్లాలని వచ్చాను. ఎందరో అనుభవించిన నీ సుందరమయిన శరీరం ఒక్కసారి నా ముందు వుంచు. అంతే!"

"ఇంకా నన్ను ప్రేమిస్తున్నావా?"

"ఛి....ఛి! నీతో ప్రేమేమిటి? నీవు నన్ను కాదని శేఖర్‌తో తిరిగినప్పుడే నీ ప్రేమను పాడిపై కట్టి శ్మశానంలో తగలబెట్టాను. ఇప్పుడు వున్నది ప్రేమ కాదు. కేవలం వాంఛ. ఓ పది విసిరి వెలయాలును కొనలేను కాబట్టి నీతో గడపాలి. రా, యీ ఛాన్స్ మళ్ళీ రాదు."

"ప్లీజ్ రాజు! ఇప్పుడు కాదు. ఆయన బయటకు వెళ్లారు. ఏ క్షణంలో నయినా రావచ్చు. రేపు రాత్రి ఆయన గుంటూరు కాంప్ వెళతారు. రా నీ కోర్కె తీరుస్తాను."

"గుడ్ మంచమ్మాయివి," అతను వస్తున్న అడుగుల చప్పుడు. వాసు చెట్టు చాటుకు వెళ్ళాడు. అతను వెళ్ళిపోయాడు. వాసు పిడికిళ్ళు బిగుసుకున్నాయ్.

2

సాయంకాలం ఏడుగంట లయింది.

కిటికీ అద్దాలను సబ్బు నీళ్ళతో తుడుస్తుంది యింటి నౌకరు వరలక్ష్మి. మెల్లగా, కిటికీ దగ్గరగా వరలక్ష్మి దగ్గరగా నడిచాడు వాసు.

వరలక్ష్మి తొట్రుపడుతూ చూసింది.

"వరలక్ష్మి! నేను లేనపుడు, నీకు తెలిసి ఎందరితో వుండేది?"

"ఎవరండీ?" తెలియనట్లడిగింది.

"తెలియనట్లు అడగబోక, మాధవి కోసం ఎందరు వచ్చేవారు?"

గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. అంతలో వెనుకగా వస్తున్న మాధవిని చూసి "అమ్మగారు" అంది కంగారుగా. వాసు తల తిప్పి, మాధవిని చూసి నవ్వాడు.

లెదర్ కేసు సిద్ధం చేసుకొని రెండు సూట్లు సర్దాడు.

"ఎక్కడికండీ?" ప్రశ్నించింది మాధవి.

"కాంప్, మొన్న చెప్పానుగా గుంటూరని."

"అవును" అంది నవ్వి. వాసు టూత్ పేస్టు, దువ్వెన, టర్కీ టవల్ సర్దుకున్నాడు. మరొక సొరుగులో వున్న రివాల్వర్ తీశాడు.

"అదెందుకండీ?"

"నీవు ఒంటరిగా వున్నప్పుడు యిది యింట్లో ఉండటం మంచిదికాదు. ఓ. కె" అంటూ బాక్స్‌లో వుంచుకున్నాడు.

మాధవి కాస్త ఆశ్చర్యంగా చూసింది.

ఏనాడు లేనిది యీ రివాల్వర్‌తో ప్రయాణం ఏమిటా

అనుకుంది.

వాసు నవ్వాడు. ఆమె విషయం తనకు తెలిసినట్లులేదు. తెలిసేలా తను ప్రవర్తించలేదు. "మరి వస్తాను," అన్నాడు సూట్ కేస్ తీసుకొని.

"మళ్ళీ ఎప్పుడొస్తారు?"

"నేను వచ్చేటప్పుడు నీవు వుంటావా?" నిశితంగా అన్నాడు.

"వుండనా?" కంగారుగా అంది.

"ఐ మీన్ ఏ స్నేహితురాలి యింటికి అయినా వెళతావేమో అని" నవ్వి కదిలాడు. వరలక్ష్మి సంభాషణ వింటూ తప్పుకుంది. ఆమె కళ్ళలోనికి నిశితంగా చూపి బయటకు నడిచాడు వాసు.

3

మాధవి భుజంపై చెయివేసి లోపలకు నడిచాడు రాజు. మాధవి తలుపు లోపలవైపు తాళంవేసింది.

"ఎందుకు?" ప్రశ్నించాడు రాజు.

"ఈ గదికి ఈ తాళం అవసరం. ఇవి రెండే వుంటాయి. ఒకటి నా దగ్గర, రెండవది మా వాసు దగ్గర" అంటూ తాళం టీపాయ్‌మీద పెట్టింది.

"మీ వాసు ఎప్పుడొస్తాడు?"

"రేపు సాయంకాలం. డియర్ రాజూ, యీ రాత్రి నీ యిష్టం! ఈ రాత్రి తెల్లవారితే మన యిద్దరం ఎవరికి ఎవరో తెలియకూడదు. జీవితంలో నన్ను మళ్ళీ ఆశించకూడదు."

రాజు నవ్వాడు.

ఆ గదిలో పాల నురుగులాంటి పరుపు ఒకటి, పరుపు మీద దిగంబరంగా వున్న ఆ యిద్దరు పాముల్లా, లతల్లా

పెనవేసుకుపోయారు. కోర్కెలతో బుస కొడుతున్న శరీరాలు, మత్తెక్కిన అధరాలు. నిముషాలు, గంటలు దొర్లుతున్నాయి.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

రాజు ఆమె పెదవులతో పెదవులు కలిపాడు. "ఇంకా చాలదా? నిద్రపో రాజు" అంది గోముగా.

"నిద్ర" చిలిపిగా నవ్వాడు. "ఉమర్ ఖయ్యాం ఏమన్నాడో తెలుసా? తెల్లవారుజామున కోడి కూస్తూంటే క్రొత్తరోజు రాబోతుందని కాదు. దేవుడు సుఖపడమని నీకు యిచ్చిన రోజులలో ఒకరోజు అయిపోయిందని, యీ రాత్రి తెల్లవారకుండా, యీరేయి యీలాగే వుంటే యీ సుఖం శాశ్వతం కదూ!"

ఆమె గుండెలపై ఎత్తులను నిమురుతున్నాడు.

తలుపు తెరుచుకునట్లుంది, మాధవి ఆశ్చర్యంగా చూసింది. రాజు అదంతా గమనించే స్థితిలో లేడు. మోహావేశంలో మురిసిపోతున్నాడు. మాధవి నిశితంగా చూసింది. తలుపు మరికాస్త తెరుచుకుంది.

రాజుకు ఏదో చెప్పాలని ప్రయత్నించింది.

"ధాం....ధాం...." అన్న శబ్దం అయింది. ఒక బుల్లెట్ రాజు వీపులో మరొకటి మాధవి గుండెల్లో గుచ్చుకుపోయాయి.

4

ప్రఖ్యాత డిటెక్టివ్ లాయర్ పి. జె. అసిస్టెంట్ ధర్మ అప్పుడే యింపాలా కారులోనుండి దిగారు. అసిస్టెంట్ ధర్మ బయట కారి డాల్ లో సోఫాలో కూర్చున్న ఆకారాన్ని చూశాడు. అతను దృష్టిని బట్టి పి. జె. చూశాడు.

ఇద్దరు పోర్టికో నుండి అతని దగ్గరకు నడిచారు.

స్ట్రెచ్ లాన్ ప్యాంట్, టెరికాటన్ షర్ట్, చైనా షూ వేసు న్నకు ఆ మనిషి గడ్డం పెరిగి, కళ్ళు ఎర్రబారి లోతుకుపోయి వున్నాయి. చెంపలు గుంటలు పడ్డాయి. తైల సంస్కారం లేని తల.

"పారిపోయిన నేరస్తుడులా వున్నాడు." ధర్మ రహస్యంగా అన్నాడు.

వాళ్ళిద్దరిని చూసిన వాసు రెండు చేతులతో నమస్కరించాడు. అప్పటికే కళ్ళనుండి నీటి బొట్లు రాలాయి. "నాపేరు వాసు. మెడికల్ రిప్రజెంటేటివ్‌ని. విజయవాడ నా నివాసం. విజయవాడ నుండి హైద్రాబాదు పారిపోయి వచ్చాను. కేవలం మీతో మాట్లాడటానికి."

పి. జె. నిట్టూర్చాడు. జేబులో నుండి సిగరెట్ తీసి అతని ఎదురుగా కూర్చున్నాడు. "సిగరెట్ ఒకటి యిస్తారా?" వాసు అడిగాడు. పి. జె. ధర్మవైపు చూశాడు. ధర్మలోపలికి వెళ్ళాడు. "సిగరెట్ తరువాత యిస్తాను" అంటూ సిగరెట్ ప్రక్కన పెట్టాడు. వాసు విస్తుపోయాడు.

ధర్మ బ్రెడ్, జామ్, కొన్ని బిస్కెట్స్ ముందు పెట్టాడు. వాసు ఆశ్చర్యంగా చూశాడు. "ఇందులో ఆశ్చర్య పడవలసిందేమీలేదు, నీవు సిగరెట్టే తాగలేదంటే పావలా నీ దగ్గర లేదన్నమాట. అలాంటప్పుడు ఏమీ భోంచేసి వుండవు. ముందు అవి తీసుకో," అన్నాడు.

"థాంక్స్" కన్నీళ్ళు తుడుచుకున్నాడు. "ఏడ్చే మగవాడిని నవ్వే ఆడదానిని నమ్మకూడదంటారు. నేను ఏడుస్తున్నాను. నా స్థితిలో ఎవరయినా వుంటే యింత కంటే ఏం చెయ్యలేరు."

వాసు తినటం ముగించాడు.

"ఇప్పుడు చెప్పు నీకేసేమిటి?"

"నా భార్య మాధవిని ఎవరో హత్య చేశారు. అనుమానం మీద పోలీసులు నన్ను అరెస్ట్ చెయ్యబోగా పారిపోయి వచ్చాను. నేను యీహత్య చేశాననటానికి చాలా ఆధారాలున్నాయి. కాని చేయలేదనటానికి ఏమీ ఆధారం లేదు. అది నా దురదృష్టం. మిమ్మల్ని మాటలతో తప్ప ఏ విధంగా యీ హత్య నేను చేయలేదు అని ఒప్పించలేను."

"అసలు జరిగిందేమిటి?"

వాసు చెప్పటం ప్రారంభించాడు. పి, జె. కళ్ళు మూసుకొని వింటున్నాడు, ధర్మ వ్రాసుకుంటున్నాడు.

5

తొమ్మిది నలభై ఐదు నిమిషాలయింది.

లాయర్ గౌనులో పి. జె. కోర్టు కారిడార్‌లో బూట్లు చప్పుడు చేస్తూ నడుస్తూ వుంటే, ఆ హుందాతనం ఆ గంభీరత ఎవరికీ లేదనిపిస్తుంది. పత్రిక విలేఖర్లు, ఫోటోగ్రాఫర్లతో పి. జె. ను చుట్టుముట్టి కేసువివరాలు అడగసాగారు.

పి. జె. సమాధానం చెప్పి లోపలకి నడిచాడు. ప్రాసిక్యూటర్ పార్వతీశం పి. జెను చూసి ఆశ్చర్యపోయాడు. పలకరింపుగా నవ్వాడు పి. జె.

కోర్టంతా కోలాహలంగా వుంది. రకరకాల మనుషులు. విభిన్న అభిప్రాయాలతో కూర్చున్నారు. కొందరు పి. జె. క్రాసు ఎగ్జామినేషన్ కొరకు కుతూహలంగా వున్నారు. "పి. జె మాట్లాడుతూవున్నా. క్రాస్ చేస్తున్న డ్రామా

చూస్తున్నట్లుంటుంది" అంటున్నారెవరో.

"వాసు హత్య చేయలేదంటావా?"

"పి. జె. అతని తరపును వాదిస్తుంటే లేదనే అనుకోవాలి."

"కేసు చాలా క్లిష్టంగా వుంటుందేమో" యిలాంటి రకరకాల మాటలు వినిపిస్తున్నాయి. పి. జె మౌనంగా కేసు ఆలోచిస్తున్నాడు.

"సైలెన్స్ యిన్‌ది కోర్ట్....సైలెన్స్ యిన్‌ది కోర్ట్" బంట్రోతు అనడంతో అందరు వినయంగా లేచి నిలబడ్డారు.

గడియారం పది గంటలు కొట్టింది.

న్యాయమూర్తి హరిచంద్రరావు న్యాయ సింహాసనం అధిష్టించారు. అందరు కూర్చున్నారు.

"క్రిమినల్ కేసు నెంబర్ 292....ముద్దాయి వాసు....హతులు రాజు, మాధవి" వివరించాడు కోర్టు గుమస్తా, "75 మార్చి 3 తేది హత్యలు."

వాసును డాక్‌లో నిలబెట్టి యిద్దరు పోలీసులు రెండు వైపుల నిలబడ్డారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ పార్వతీశం లేచి గంభీరంగా చుట్టూ కలయ చూసి, డాక్‌లో నిలబడ్డ ముద్దాయి వాసు దగ్గరకు నడిచాడు.

"మిలార్డ్! ది జంటల్ మన్ ఆఫ్ ది జ్యూరి!! మానవుడు ఆవేశంతోనో, క్రోధంతోనో స్వార్థం కొరకో హత్యలు చేస్తాడు? కొందరు అనాలోచితంగా ఆవేశంతో హత్య చేస్తారు, అయితె రాజు, మాధవిల హత్య డాక్‌లో నిలబడ్డ ముద్దాయి ఉద్దేశపూర్వకంగా చేశాడని, యిది ఫస్ట్ డిగ్రి మర్డర్ అని ప్రాసిక్యూషన్ చెపుతుంది. యీ రెండు

హత్యలు వాసు తన తండ్రి రివాల్వర్‌తో కాల్చి హత్య చేశాడని అభియోగంతో మర్డర్ చార్జి దాఖలు చేసింది. యీ కేసులో ఎన్నతగిన సాక్షులు, రుజువులు ప్రాసిక్యూషన్ ప్రవేశ పెడుతుంది కాబట్టి కోర్టువారు అనుమతించ వలసినదిగా కోరుతున్నాను."

"మిస్టర్ వాసు నీ తరుపున లాయరున్నారా? లేక ఎవరి కయినా స్టేట్ బ్రీఫ్ యివ్వమంటారా?" న్యాయమూర్తి ప్రశ్న.

పి. జె. లేచి నిలబడ్డాడు. "వాసు తరపున వాదించ టానికి నేను సిద్ధంగా వున్నాను. ఐ మేబి పర్‌మిటెడ్ టు డిఫెండ్ ది ఎక్యూస్డ్ యువర్ ఆనర్!" అన్నాడు.

"ప్రొసీడ్" అన్నాడు న్యాయమూర్తి.

"మిలార్డ్! ముద్దాయి వాసుకు, హతురాలు మాధవికి 1974 లో వివాహమయింది. వివాహమయ్యాక వారిద్దరు చాలా అన్యోన్యంగా వున్నారు అనుకోవాలి. అయితే కొన్నాళ్ళ నుండి వారి యిద్దరిలో ఓ రకమయిన భేదాభిప్రాయాలు. ఒకరిపై ఒకరికి అయిష్టత ఏర్పడింది. హతురాలు మాధవి లాయరు మార్కండేయ వద్దకు వెళ్ళ తనకు వాసుతో గడపటం యిష్టం లేదని, విడాకులు యిప్పించమని కోరింది. బలమయిన కారణాలు లేనందున వారిద్దరికి విడా యివ్వవీలుపడలేదు. యీ విషయం వాసుకు తెలిసివుండాలి.

తరువాత ఏమయింది? స్త్రీ స్థితిని బట్టి పరపురుషుడ్ని ఆశిస్తుంది. ఆ రాత్రే వాసు గుంటూరు వెళ్ళటం తెలిసిన మాధవి మాజి ప్రేమికుడయిన రాజును ఆహ్వానించింది. వారిద్దరు శారీరకంగా మానసికంగా చేరువయ్యారు.

ఇలా జరుగుతుందని తెలిసిన వాసు, వారిద్దరిని చంపా

లని ఆశించాడు. అప్పటికే అతని వద్ద ఒక రివాల్వర్ వుంది. వాస్తవంగా అది వాసు తండ్రిది. ఆయన చని పోయాక ఆ రివాల్వర్ అప్పగించాలి. కాని అప్పగించలేదు. ఇక్కడే మర్డర్ యింటెన్షన్ ముద్దాయిలో వుందని అను కోవాలి. గవర్నమెంట్‌కు హాండోవర్ చేయవలసిన రివాల్వర్ తన దగ్గరే వుంచుకొని, యీ రెండు హత్యలు చేశాడు.

గుంటూరు నుండి ఆ రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో విజయవాడకు వచ్చాడు. తిన్నగా యింటికి వెళ్ళి తన దగ్గర వున్న రెండవ తాళంతో తలుపు తెరిచాడు! ఇక్కడ చెప్పవలసిన విషయం ఏమంటే ఆ యింటి ద్వారానికి వున్నవి రెండు తాళాలు. అందులో ఒకటి వాసు దగ్గర వుంది, రెండవది మాధవి దగ్గర వుంది. ఈ విషయంలో చాలా తేలికగా తెలిసిపోయిన విషయం యిది. లోపలికి ప్రవేశించి .32 కోల్ట్ రివాల్వర్‌తో రెండు హత్యలు చేశాడు.

మిలార్డ్! మొదటి హత్యకు మోటివ్ వుంది, వాటీజ్ ది మోటివ్ ఆఫ్‌ది సెకండ్ మర్డర్. రాజు కూడా వ్యక్తి గతంగా ఒక రకమయిన విరోధి ఎలా? ఒకటి తన భార్యతో సుఖిస్తున్న మనిషి, రెండు మాధవిని చంపటం చూసిన వ్యక్తి, యీ కారణాల్ని క్రోడీకరించుకొని రాజును హత్య చేశాడు. యీ రెండు హత్యలు చేయటానికి మోటివ్‌లు యివి.

మిలార్డ్! ముద్దాయి అమాయకుడు కాదు అనటానికి యీపై నిదర్శనాలు గాక మరి కొన్ని వున్నాయి, వాటిలో ముఖ్యమయింది రివాల్వర్ కనిపించక పోవడం. అది యీ ప్రాసిక్యూషన్ కేసులో మర్డర్ వెపన్‌గా చూపలేక

పోతున్నాం. కారణం ఫస్ట్ డిగ్రీమర్డర్. ఫస్ట్ డిగ్రీమర్డర్‌లో ముద్దాయి ఆలోచించి హత్య చేయటం జరుగుతుంది. కాబట్టి హత్యాయుధాన్ని ముద్దాయి దాచటం, ముద్దాయి ఆ మర్డర్ వెపన్ తెలియ చేయక పోవటం జరుగుతుంది. యీ కేసులో అదే జరిగింది, హత్యకు వినియోగించిన .32 కోల్ట్ రివాల్వర్ ముద్దాయి ఎక్కడో దాచిపెట్టాడు. ఎక్కడ అన్నది మిగిలి పోయిన ప్రశ్న?

మిలార్డ్! ఈ కేసులో ఎన్నతగిన సాక్ష్యాలు, ఋజువులు ప్రాసిక్యూషన్ ప్రవేశపెడుతుంది. ప్రాసిక్యూషన్ ప్రధమ సాక్షిగా ఆ యింటి నౌకరు వరలక్ష్మిని కోర్టువారి అనుమతితో పిలుస్తున్నాను" ప్రాసిక్యూటర్ గాగుల్స్ తీశాడు.

"వరలక్ష్మి....వరలక్ష్మి...." కోర్టు గుమస్తా పిలిచాడు.

వరలక్ష్మి విట్నెస్ బాక్స్‌లో నిలబడి దేవుడు ఎదుట ప్రమాణం చేసి "నిజం చెవుతాను. అబద్ధం చెప్పను" అంటూ గ్రంధంమీద ప్రమాణం చేసింది. పి. పి. ఆమె దగ్గరగా నడిచాడు.

"నీ పేరు వరలక్ష్మి కదూ? ఏం పని చేస్తున్నావు?"

"అవునండి. వాసుగారి యింట్లో నౌకరిని."

"హత్యకు ముందు సాయంకాలం ముద్దాయి వాసు ఏమన్నాడు?"

"కిటికీ అద్దాల్ని సబ్బు నీళ్ళతో తుడుస్తుంటే వాసుగారు బయటనుండి సరాసరి నా దగ్గరకు వచ్చారు. వచ్చి, నీకు తెలిసి అమ్మగారి దగ్గరకు ఎందరు వస్తారు? ఎందరితో వుండేది? అని అడిగారు. నేను భయంతో వణికిపోయాను. కంగారు పడ్డాను. అప్పుడే వెనుకగా మాధవి రావటంతో మళ్ళీ ఆ ప్రస్తావన రాలేదు."

"ఆ తరువాత ఎప్పుడు చూశావు?"

"గుంటూరు బయలుదేరినప్పుడు."

"అప్పుడు టైమెంతయింది?"

"ఆరుగంట లయింది. సాయంకాలం ఆరుగంటలకు జత బట్టలు, టూత్ పేస్ట్ అన్నీ పెట్టెలో సర్దుకు బయలు దేరారు."

"అప్పుడు రివాల్వర్ ఏమయినా చూశావా?"

"చూశాను. రివాల్వర్ కేసు పెట్టెలో పెట్టుకుంటే మాధవి అడిగింది, ఎందుకండీ అని. అవసరం అని చెప్పి తీసుకున్నారు."

"ఆ తరువాత ఏమయినా మాట్లాడారా?"

"ఆఁ మళ్ళీ ఎప్పుడు వస్తారు, అని మాధవి అడిగింది. నేను వచ్చేవరకు నీవు వుంటావా? అని నవ్వి వెళ్ళి పోయారు."

"చివరి ప్రశ్న శవాల్ని మొదటిసారి నీవు చూశావు. అప్పుడు తాళం తీసివుందా? వేసివుందా."

"తాళం తీసివుంది, వేలుతో నెడితే తలుపు తెరుచు కుంది. ఆ తరువాత లోపలకు వెళ్ళాను. రెండు శవాలు కని పించినవి. భయంతో పోలీసులకు తెలియబరచాను."

"క్రాసు చేసుకోవచ్చు" పి. పి. అన్నాడు.

"నీవు ఎన్నాళ్ళుగా పని చేస్తున్నావు?" పి. జె. ప్రశ్నిం చాడు.

"షుమారు ఆరు నెలలునుండి చేస్తున్నాను."

"ఈ ఆరునెలల కాలంలో మాధవికొరకు స్నేహితులు గాని, పరిచయస్తులు గాని, ప్రేమికులుగాని ఎందరొస్తుం టారు?"

"ఇంటి వెనుక భ్రమరాంబ, సరోజా అనే అమ్మాయి, యింకా కొందరు వచ్చేవాళ్ళు. ఈమధ్య భ్రమరాంబ తప్ప ఎవ్వరూ రావటంలేదు."

"కారణం?" పి. జె. ప్రశ్న.

"మాధవి ప్రవర్తన గురించి అందరికి తెలియటంతో రావటం మానివేశారు."

"గుడ్. వాసు నిన్ను అడిగింది నేను లేనవుడు ఎందరితో వుండేది అనే ప్రశ్న యిదివరకు వచ్చినవాళ్లు ఇప్పుడు వస్తున్నారా అని గాని, లేదా మాధవికి స్నేహితులు ఎందరు అనే ప్రశ్న గాని కావచ్చు కదా?"

"కావచ్చు."

"తరువాత రివాల్వర్ తీసుకెళ్ళటం చూశా నన్నావు. రివాల్వర్ తీసుకువెళ్లటం చూశావా? లేక రివాల్వర్ కేసు తీసుకువెళ్ళటం చూశావా?"

"అబ్జక్షన్ యువర్ ఆనర్. రివాల్వర్ లేకుండా రివాల్వర్ కేసు ఎందుకు తీసుకువెళతాడు?" పి. పి. క్రాస్ చేశాడు.

పి. జె. నవ్వి "నేను అడిగింది ఏం తీసుకువెళ్ళటం చూశావని. జెస్ట్ ఎ మినిట్ వరలక్ష్మి చెప్పు."

"రివాల్వర్ కేసు తీసుకువెళ్ళటం చూశాను."

"అందులో రివాల్వర్ వుందో, లేదో నీకు తెలుసా?"

"తెలీదు" వరలక్ష్మి అంది.

"దట్సాల్. మిలార్డ్ రివాల్వర్ కేసు తీసుకువెళ్ళటం చూసింది. కాని రివాల్వర్ కాదు. మై లెర్నెడ్ ఫ్రండ్ అడిగినట్లు రివాల్వర్ కేసు ఎందుకు తీసుకువెళతాడని? అందులో రివాల్వర్ వుంది అని వరలక్ష్మి అనుకున్నట్లు,

వాసు ఎందుకు అనుకొని వుండకూడదు."

"అభ్యంతరం త్రోసిపుచ్చుతున్నాను."

"థాంక్యూ. ఇకపోతే వాసు అడిగిన మూడవ ప్రశ్న. 'నేను వచ్చేవరకు నీవు వుంటావా?' వాసు దృష్టిలో నేను వచ్చేవరకు నీవు ఏ స్నేహితురాళ్ళతో పార్టీలకు వెళతావో అన్నది అభిప్రాయం కావచ్చు. ఆలోచించి చెప్పు." పి. జె. అడిగాడు.

"అబ్జక్షన్ యువర్ ఆనర్. 'ఫేస్ యీజ్ ఇండెక్స్ ఆఫ్ ద మైండ్' అన్నారు. అతని మాటనుబట్టి వరలక్ష్మి వూహించవచ్చు."

"అదే వూహ మాధవికి రాలేదా? నో యువర్ ఆనర్. కొన్ని సంవత్సరాలు కాపురం చేసిన భార్యకే ఆ మాట అభిప్రాయం తెలియనపుడు, ఆరు నెలలు నౌకరి చేస్తున్న ఆమె తెలుసు అనటం హాస్యాస్పదం!"

"అభ్యంతరం త్రోసి పుచ్చుతున్నాను."

"నో. క్వచన్ మిలార్డ్" అన్నాడు పి. జె.

పి. పి. తరువాత సాక్షిగా ఇనస్పెక్టర్ విజయ్ విట్నెస్ బాక్స్‌లో నిలబడి ఉద్యోగార్హతల్ని తెలిపి, ప్రమాణం స్వీకరించి, కేసు వివరాలు చెప్పటానికి ఉపక్రమించాడు.

డైరీ తీశాడు. "1975 మార్చి 3 తేదిన క్రొత్త అజిత్ సింగ్ నగర్ ఫిలిప్స్ రోడ్డులో హత్య జరిగిందని తెలియటంతో హుటాహుటిగా అక్కడకు వెళ్ళాను. అక్కడ చిన్న మేడలో రెండు హత్యలు జరిగాయి. ఇంటి చుట్టూ చాలామంది గుమికూడి వున్నారు. లోపలకు వెళ్ళేముందు తలుపు చూశాను. తలుపు తాళం తీసి వుంది. ఆ తాళం చాలా ఖరీదయింది. దానిని లోపలనుండి తీయటానికి

వేయటానికి అవకాశం వుంది. గవర్నమెంట్ లేబరేటరి చీఫ్ టెక్నిషియన్ ఆ తాళం చూసి యిది డూప్లికేటు తాళంతో తీయబడలేదని, అలాంటి తాళంతో యీ తలుపు రాదని చెప్పాడు. ఆ తలుపు హాండిల్ మీద పాథాలజిష్టు వేలిముద్రలు తీశాడు. ముద్దాయి వాసు వేలిముద్రలు కూడా తీశాడు. అవి, ముద్దాయి వాసు వేలిముద్రలు ఒక్కటే అని చెప్పబడ్డాయి."

"ఆ తరువాత శవాల్ని చూశారా?"

"ఆ చూశాను. లోపల బెడ్ రూములో అస్తవ్యస్తంగా హృదయ విదారకమయిన దృశ్యంతోవున్న రెండు శవాలు. ఒకటి రాజు, రెండు మాధవి, ఇద్దరూ రివాల్వర్‌తో కాల్చి చంపబడ్డారు."

"ఆ తరువాత?"

"ఆ గదంతా వెదికాను. బెడ్ ప్రక్కన నేలమీద టేబుల్ గడియారం పడివుంది. దీనినిబట్టి, ఇందులో ఆగి పోయిన టైమునుబట్టి హత్య 12-30 నిమిషాలకు జరిగిందని వూహించాను. ఆ తరువాత గదంతా వెదికాను. గోడకు యినుప బీరువా చిన్నది వుంది, దాని తాళం తెరిచే వుంది. ఆ గదిలో ఏ వస్తువు దొంగిలించబడలేదని నిర్ణయించాను. కిటికి బయట అడుగుజాడలు వున్నాయి. అవి ముద్దాయి వాసు అడుగుజాడలు."

"ఏ రివాల్వర్‌తో చంపబడ్డారు?"

".32 కోల్ట్ రివాల్వర్‌తో హత్యలు జరిగాయి."

"ఆ బుల్లెట్స్ యివేనా?"

"యస్! ఇవే వీటిపై క్రైం బ్రాంచికి సంబంధించిన గుర్తులు వుంచాను. ఇవి 'ఎక్సిబిట్ ఏ'గా ప్రవేశపెట్టటం

జరిగింది."

"గుడ్. రివాల్వర్ లభించిందా?"

"లేదు. ఇది పథకం ప్రకారం జరిగిన హత్య కాబట్టి రివాల్వర్ లభించే అవకాశం లేదు. ఎంత ప్రయత్నించినా ముద్దాయిచేత యీ విషయం చెప్పించలేకపోయాం."

"ఇంట్లో అడుగుజాడ లేమయినా లభించాయా?"

"లేదు. ఎన్నో అడుగుజాడలు ఆ యింట్లో వున్నాయి. హత్య జరిగిందని తెలియటంతో క్రిమినల్ మైండ్ లేని చాలామంది ఆ గదిలోనికి వెళ్లటంవల్ల ఆ గదిలో అడుగు జాడలు లేవు."

"ముద్దాయిని ఎప్పుడు అరెస్టు చేశారు?"

"కొంత దర్యాప్తు తరువాత ముద్దాయి వాసు హత్య చేశాడని నిర్ణయించి పోలీసు సిబ్బందిని పంపాను. కాని ముద్దాయి వారి నుండి తప్పించుకు పారిపోయాడు."

"అప్పుడు ముద్దాయిలో వుద్దేశం ఏమయివుంటుంది?"

"ముద్దాయి దగ్గర హత్యాయుధం వుండి వుండాలి. అందుకే పారిపోయి, తిరిగి రెండవ రోజు సరెండర్ అయ్యాడు."

"గురుమూర్తి ఎవరు?"

"టాక్సీ డ్రైవర్. అతను హత్య జరిగిన రాత్రి పద కొండు గంటల ప్రాంతంలో ముద్దాయిని తన టాక్సీలో గుంటూరు నుండి తీసుకువచ్చాడు."

"గుడ్ క్రాసు చేసుకోవచ్చు," పి.పి అన్నాడు.

డిటెక్టివ్ లాయరు పి. జె లేచి ఇన్‌స్పెక్టర్ దగ్గరకు నడిచాడు. "హతురాలు మాధవి గురించి చాలా చక్కగా దర్యాప్తు చేశారు. అయితే, ఆ యింట్లో అదే సమయంలో

హత్య చేయబడ్డ రాజు ఎవరు?"

పి.పి గబాలున లేచాడు. "మిలార్డ్! అతని గురించి వివరాలు తెలిసి వుంటే తెలియపరచేవాళ్ళమే. అతని తరుపున నా అనేవాళ్ళు ఎవరు లేరు అని నిర్ణయించాము. అతను అనామకుడు."

పి. జె నవ్వాడు. "ఇనస్పెక్టర్! ఆ ఇంట్లో ఇనుప బీరువా వుంది. తాళం తెరిచేవుంది. సామాను పోలేదు అని అన్నారు. మీకెలా తెలుసు?"

"వరలక్ష్మి చెప్పింది."

"వరలక్ష్మి చెప్పింది నిజం ఎలా అవుతుంది. మీరు వాసును ఆడగలేదు. మాధవి చెప్పలేదు. వరలక్ష్మి ఓ నెక్లెస్ దాచుకొని వుంటే? పోనీ ఆ ఇనుప్పెట్టి తాళం లభించిందా?"

"లేదు. కనిపించలేదు."

"కాబట్టి ఆ ఇంట్లో దొంగతనం జరిగిందో, లేదో ఖచ్చితంగా మీరు చెప్పలేరు."

"సారీ చెప్పలేను."

ఏ.పి. గబాలున లేచి "ఇనస్పెక్టర్! దొంగతనం జరిగినా అది వాసు చేయటానికి అవకాశం వుందా?"

పి.జె నవ్వాడు. "మిలార్డ్! మై లెర్నెడ్ ఫ్రండ్ వాసును ముద్దాయిగా చేయటంవల్ల అతనే చేశాడు అనటం అసమంజసంగా వుంది. పోతే ఇనస్పెక్టర్! దొంగతనం జరిగిందో లేదో ఏమి దొంగిలించారో మీకు తెలీదు?"

"అవును."

"గుడ్ ఆ గదిలో కిటికీ దగ్గర అడుగు జాడలున్నాయా?"

"అవును. కిటికీదగ్గరకు వచ్చి లోపల ఏం జరిగిందో చూశాడు."

"అని మీ అభిప్రాయం?"

"కాదు. అతని అడుగుజాడలున్నాయి."

"వరలక్ష్మి కిటికి అద్దం తుడుస్తున్నప్పుడు వరలక్ష్మి దగ్గరకు వెళ్ళి ఒక ప్రశ్న వేశాడు వాసు. అప్పుడు వాసు అడుగుజాడలు ఆ కిటికీ దగ్గర పడి వుండొచ్చుకదా!" పి.జె ప్రశ్నకు ఇనస్పెక్టర్ తటపటాయించాడు.

"రెండు తాళాలున్నాయి. ఒకటి ముద్దాయి దగ్గరవుంది. రెండో తాళం ఎక్కడ వుంది?"

"హతురాలి గదిలో గోడకు తగిలించి వుంది."

"గుడ్. ఆ గోడ దగ్గర కిటికీలు తెరచి వున్నాయా?"

"లేదు. వెంటిలేటరు తెరచి వుంది."

"అక్కడేమయినా అడుగుజాడలకు ప్రయత్నించారో" పి.జె ప్రశ్నించాడు.

"అనవసరమనిపించింది."

పి.జె నవ్వాడు. "ముద్దాయిని పోలీసు అధికార్లు పట్టుకోవటం హఠాత్తుగా జరిగిందా?"

"అవును. ఆ తరువాత పారిపోయాడు."

"ఆ తరువాత పారిపోయాడంటే అప్పటి వరకు ఎందుకు పారిపోలేదు."

"అబ్జక్షన్ మిలార్డ్! పోలీసు అధికార్ల కళ్ళు కప్పాలని ప్రయత్నించవచ్చు. రహస్యం తెలిపిందని పారిపోయి వుండొచ్చు."

"అభ్యంతరం అంగీకరిస్తున్నాను."

"పారిపోయే ముందు రివాల్వర్ దొరకలేదు?" పి. పి ప్రశ్న.

"అవును."

"నొ. క్వచన్ మిలార్డ్" అన్నాడు పి.జె.

పోలీస్ సర్జన్ ప్రాసికూ్యషన్ సాక్షిగా ప్రమాణం స్వీకారం చేసి, వుద్యోగార్హతల్ని తెలియచేశాడు.

ప్రాసికూ్యటర్ డైరెక్ట్ ఎగ్జామినేషన్ ప్రారంభించాడు. "1975 మార్చి 3 వ తేది జరిగిన రాజు, మాధవి హత్యల గురించి వివరాలు చెప్పగలరా?"

"చెప్పగలను. ఆ రోజు ఉదయం ఏడు ముప్పై గంటలకు క్రొత్త సింగ్ నగర్, ఫిలిప్స్ రోడ్‌లో హత్య జరిగింది రమ్మన్నారు. ఏకాఎకిన అక్కడకు వెళ్లాను. బెడ్‌మీద అస్త వ్యస్తంగా, దిగంబరంగా వున్న రెండు శవాల్ని పరీక్షించాను."

"పరీక్ష చేశాక ఏం నిర్ణయించారు?"

"ఇవి ఓరకంగా పోస్టు మార్టం పరీక్ష వివరాలు. ఒక శవం గుండెలో ఐమీన్ మాధవి ఎడమరొమ్మునుండి రాజు కుడి భుజంలో నుండి స్వల్ప వ్యవధిలో గుండ్లు దూసుకు పోయాయి."

పి.పి రెండు గుళ్ళు చేతిలో పట్టుకొని చూపి,"ఇవ్వేనా?" అడిగాడు.

డాక్టర్ చూసి "ఇవే వీటి వల్లే ప్రాణం పోయింది. వీటిపై కత్తితో గుర్తులు కూడా వుంచాను. ఎక్సిబిట్ ఏగా ఇవి దాఖలు చేశాను."

"రెండు గుండ్లు స్వల్ప వ్యవధి అన్నారు ఎలా?"

"వెరిసింపుల్ మాధవి గుండెలో నుండి గుండు రెండవ మనిషి వూపిరి తిత్తులోనుండి దూసుకుపోయింది. అది దిగిన వెంటనే ప్రాణం పోయివుండాలి."

"ఆ రెండింటిలో ఏది ముందు కాల్చబడిందో చెప్ప గలరా?"

"మాధవినే ముందు కాల్చి వుండాలి. ఎందువల్లనంటే మాధవి ముఖం ద్వారానికి ఎదురుగా వుంది. తలుపు తెరచి ఎవరయినా లోపలకు ప్రవేశించినపుడు చూసే అవకాశం మాధవికి వుంది కాబట్టి, మాధవిని ముందు కాల్చివుండాలి. యీ కారణం తప్ప వేరే కారణం చెప్పలేము."

"హత్య ఎప్పుడు జరిగిందో ఎలా నిర్ణయించారు?"

"రిగర్ మార్టెస్ లక్షణాలనుబట్టి, పోష్టు మార్టం స్టెయినింగ్ గుర్తులనుబట్టి హత్య 12. 30 కి 12. 50 కి మధ్య జరిగి వుండాలి. అదిగాక, హతురాలు బెడ్ ప్రక్కన టీపాయి మీద టేబుల్ వాచి క్రిందపడి వుంది. దానిపై రక్తపు చుక్కలయ్యాయి."

"అవి చిందిపడ్డ రక్తపు చుక్కలా."

"కాదు. రాజు ప్రాణం కొన్ని క్షణాలుఉండి వుంటుంది. చెయిచాపి లేవాలని ప్రయత్నించటంవల్ల ఆ చెయ్యి తగిలి వాచి క్రిందపడింది అప్పుడు టైము 12. 35."

"చివరి సారిగా ఒక్క ప్రశ్న ఆ రెండు హత్యలు అక్కడే జరిగాయా?"

"కారిన రక్తాన్నిబట్టి ఆ హత్యలు అక్కడే జరిగాయి."

"క్రాసు చేసుకోవచ్చు." అన్నాడు పి.పి.

పి.జె లేచి డాక్టర్ దగ్గరకు నడిచాడు. "వాళ్ళిద్దరు లైంగికంగా ఏ స్థితిలో వున్నారు? అంటే రాజు ఆమెను బలాత్కరించటంగాని, లేదా మత్తులాంటి పదార్థం ఇచ్చి నట్లుగాని చెప్పగలరా?" ప్రశ్నించాడు.

"లేదు. రాజు మాత్రం కొద్దిగా బ్రాంది తీసుకున్నాడు. భోజనం కూడా చాలా కొద్దిగా తీసుకోవటం జరిగింది."

"ఎందువల్ల?" పి.జె ప్రశ్నించాడు.

"అతనికి అపెండిసైటిస్ ఆపరేషన్ జరిగింది. యీ కారణంగా అతను కొద్దిగా తీసుకున్నాడు. అతను ఆమెను బలాత్కారించలేదు. ఇద్దరు ఇష్టంగానే లైంగికంగా చేరువయ్యారు."

"నొ. క్వశ్చన్" అన్నాడు పి. జె కూర్చుంటూ.

న్యాయమూర్తి పైమ చూశాడు.

"కేసు వాయిదా వేస్తున్నాను" అనటంతో అందరు వినయంగా లేచి నిలబడ్డారు. పి.జె ముఖ్యమయిన పాయింట్స్ బుక్‌లో నోట్ చేసుకున్నాడు. ఒక్కొక్కరు కోర్టు నుండి నిష్క్రమించారు.

"డిఫెన్స్‌విట్నెసులు ఏమయినా లభించాయా?" పి. పి. ప్రశ్నించాడు. పి. జె నవ్వాడు. "ఇంకా లేదు. మీ విట్నెసులు ముగియాలి కదా!"

6

"గుడ్ యీవినింగ్ సర్" అన్నాడు ధర్మ. పి.జె తలెత్తి "గుడ్ యీవినింగ్ కోర్టులో నుండి వెళ్ళిపోయావేం ధర్మ. నీవు ఒక ముఖ్యమయిన పని చెయ్యాలి. రాజుకు అపెండిసైటిస్ ఆపరేషన్ జరిగింది. రాజు అని పేరుగల వాళ్ళెవరికి ఏ డాక్టరు ఆపరేషన్ చేసింది ప్రతి డాక్టర్‌ని కలుసుకోవాలి."

ధర్మ నవ్వాడు. "డాక్టర్ చెప్పాక అదే ప్రయత్నంమీద బయలుదేరాను. అతను రాజు కరెక్టే, అతను టంగుటూర్ ప్రకాశం రోడ్‌లో వున్న ఒక నర్సింగ్ హోమ్‌లో ఆపరేషన్ చేసుకున్నాడు. డాక్టర్ ఫోటో చూసిన వెంటనే గుర్తించాడు. అతను రామాటాకీస్ కుడి వైపు మూడవ రోడ్‌లో వుంటున్నట్లుగా అడ్రసు వుంది."

పి.జె ఆశ్చర్యపోయాడు. అసిస్టెంట్ తెలివికి మనసులో

అభినందించాడు.

"మనం వెంటనే అక్కడకు బయలుదేరాలి."

పదిహేను నిమిషాల తరువాత పి.జె., అసిస్టెంట్ ధర్మ బయలుదేరిన కారు రామాటాకీస్ మూడవ రోడ్డు మలుపు తిరిగింది.

ఉలిక్కిపడ్డాడు పి. జె. ధర్మ తలవంచి నవ్వుతున్నాడు.

వరుసగా సీతాకోక చిలుకలలాంటి అమ్మాయిలు డాబా గేట్ల ముందు నిలబడి పలకరిస్తున్నారు. "క్లాస్ సరుకు" అన్నాడు ధర్మ.

పి.జె పెదవులు బిగించి, తల విదిలించి కారు డోర్ తెరిచాడు.

"రండి సర్! క్రొత్తమ్మాయి వచ్చింది ఫ్లామిగర్ల్." అంటూ స్తంభంలా వున్న ఆమె ఆతృతగా వచ్చింది.

"వయసెంత?" ధర్మ అడిగాడు.

"పదహేరేళ్ళు."

"ఆ అమ్మాయికి కాదు, నీకు?'' అన్నాడు ధర్మ. ఆమె పైట కొస్త నవరించుకొని "పదిహేడు" అంది.

పి.జె నవ్వాడు. జేబులో నుండి ఐదురూపాయలనోటు తీపి అందించాడు. ''ఇక్కడ రాజు అనే అతను వుండేది ఎక్కడ?''

ఆమె ముఖం రంగు మారిపోయింది. గబగబ వెళ్ళిపోయింది.

పి.జె మెల్లగా మరోమ్మాయి దగ్గరకు వెళ్ళాడు. "రాజు ఎక్కడ వుండేది?" పదిరూపాయలు అందించాడు. ఆమెతో పాటు ఆ మాట విన్న చాలా మంది వెళ్ళిపోయారు. పి.జె పెదవులు మడతపెట్టాడు. మరొక వైపు చూశాడు.

ఒకమ్మాయి ఆగివుంది. ఆమెను సమీపించాడు.

పి.జె ఆమెను సమీపించాడు. "ఎవరుకావాలి?" అడిగింది నవ్వి.

"యీ వీధిలో రాజు అనేమనిషి వుండేవాడుట."

"వుండేవాడు హత్యచేశారు. మీరు పోలీసులా?"

"అవును." అన్నాడు పి. జె.

"నన్ను మీతోపాటు తీసుకు వెళితే ఒక రహస్యం చెబుతాను." అంది పి.జె. ధర్మ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"నన్ను ఇక్కడ అమ్మేశారు. యీ వృత్తి నాకు ఇష్టం లేదు. ఎవరయినా అడ్డగిస్తే మీరు కాపాడి నన్ను తీసుకు వెళ్ళండి" అంది కళ్ళవెంట నీరు రాలుస్తూ.

"ఓ.కె. వచ్చెయ్" అన్నాడు పి.జె. ఆమె కదలింది.

"ఏయ్ ఎక్కడికే" అన్నాడు లోపలవున్న ధృడకాయుడు. పి.జె చూశాడు. ఆమె ధర్మ చాటుకు వచ్చింది. ఆమెను గబాలున లాగబోయాడు.

పి.జె చేయి మెలిపెట్టి మెడమీద గుద్దాడు. రెండోవైపు ధర్మ మరొక ప్రక్క గుద్దాడు. తూలి క్రిందపడ్డ మనిషి లేవబోయాడు. పి.జె జేబులో నుండి రివాల్వర్ తీశాడు. "జాగ్రత్త! పోలీసులతో పేచి మంచిది కాదు," అన్నాడు. ఆ మనిషి బిగుసుకుపోయాడు.

ఆమె ఇద్దరి మధ్య రెండు ఇండ్లు దాటి మూడో ఇంటి ముందు ఆగి "ఈ గదిలో రాజు వుండేవాడు," అంది. ఇంటికి గాడ్రేజ్ తాళం వేసి వుంది. "ఇంటి ఓనర్ ఎవరు?"

"ప్రక్క ఇంట్లో వున్నాడు." అంది. ధర్మ వెళ్ళి ఓనర్‌తో మాట్లాడి వెంటబెట్టుకు వచ్చాడు. "నేను ఇప్పటి

వరకు తాళం తీయలేదు. మీరు హామీ కాగితం వ్రాసి తెరుచుకోండి," అన్నాడు.

పి.జె కాగితం వ్రాశాడు. ధర్మ ఆమె తలలో పక్క-పిన్ను తీసి తాళం తెరిచాడు. అది చిన్నగది. ఓమూల చిన్న బెడ్, మరొక వైపు టీపాయి, కొన్ని కుర్చీలు, మూలగా బ్రాంది సీసాలు వున్నాయి. టేబులు పైన కొన్ని పుస్తకాలు, అల్మరాలో రకరకాల కాగితాలు, జాక్‌పాట్ గైడ్, ప్లెయింగ్ కార్డ్స్ వున్నాయి. ఇంకా చిందర వందరగావున్న కాగితాలు కొన్ని.

"ఈ గదంతా ఎవరో వెతికినట్లుంది?'' ధర్మ అన్నాడు.

"యస్. ఎవరో వెతికారు, ఎందుకోసమయి ఉంటుంది?"

ఆమె ముఖంలోనికి చూశాడు. "రాజు శ్రీమంతులు మాలాంటి వాళ్ళ దగ్గరకు వచ్చినపుడు ఫొటోలు తీసి, బ్లాక్ మెయిల్ చేసేవాడు'' అంది.

ఆమె చెపుతానన్న రహస్యం అదే అనుకున్నాడు. "ఎవరెవరో తెలుసా?"

"అదేం తెలీదు. అలా చేస్తున్నానని ఒక రోజు నాతో అన్నాడు.''

పి.జె పెదవులు మడచి గదంతా పరికించాడు. "ధర్మ, ఇంకా వెదుకు ఏమయినా ఆధారాలు దొరకవచ్చు," అన్నాడు.

ఇద్దరు ప్రతి అణువు వెతికారు. అయితే ఏమీ కనిపించలేదు.

టేబులు మీద వున్న మూడు పెద్ద పుస్తకాలపై దృష్టి సారించాడు పి.జె. ఏదో జ్ఞాపకం వచ్చినట్లు గబగబ పుస్తకాలు తిరగవేశాడు.

మూడవ పుస్తకంలో మధ్య కాగితాలు చదరంగా కోసి

వాటి మధ్య ఫోటోలు పెట్టి వుంచాడు. పి.జె. ముఖం విప్పారింది.

7

మరునాడు కేసు ప్రారంభమయింది.

టాక్సీ డ్రైవరు తరువాత విట్నెస్‌గా ప్రాసిక్యూటర్ ప్రవేశపెట్టాడు. టాక్సి డ్రైవర్ గుంటూరునుండి తీసుకు వచ్చానని వివరించి చెప్పాడు. పి. జె. అతన్నేమి క్రాసు చేయలేదు. క్రాసు చేయవలసిన పాయింట్స్ లేవు.

ప్రాసిక్యూషన్ తరువాత సాక్షిగా లాయరు మార్కండేయ విట్నెస్ బాక్స్‌లో ప్రమాణం స్వీకరించాడు. "మిస్టర్ మార్కండేయ్. మాధవి మీదగ్గరకు ఒకసారి వచ్చింది కదూ!" పి. పి. ప్రశ్నించాడు.

"ఫిబ్రవరి ఒకటవ తారీకు అని ఎలా ఖచ్చితంగా గుర్తుందంటే నేను ప్రతిరోజు వచ్చిన క్లయింట్స్ గురించి డైరీలో వ్రాస్తాను. ఆ రోజు వచ్చి తన భర్తనుండి విడాకులు కావాలంది?"

"కారణం అడిగారా?"

"అడిగాను. ఆయనతో కాపురం చేయటం యిష్టం లేదని, ఆయనతో జీవితం బోర్ కొడుతుందని చెప్పింది."

"విడాకులకు ఆ కారణాలు చాలవని అతని ప్రవర్తనలో లోపం చూపాలని చెప్పాను ఆమె ఆలోచించి రేపు చెపుతానంది. మళ్ళీ రాలేదు."

"క్రాసు చేసుకోవచ్చు."

"చూడండి. వాసుతో ఆమెకు జీవితం బోర్‌గా వుందని మాత్రమే చెప్పింది కాని, అతను మంచి మనిషి కాదని, తనను చిత్రహింసలు పెడతాడని చెప్పలేదా" పి. జె.

ప్రశ్నించాడు.

"అవును. అలాంటివి వుంటే చెప్పేది."

"దట్సాల్ యువర్ ఆనర్."

ఆ తరువాత పారిపోయాడని నిర్వచించేటందుకు ఇద్దరు పోలీసు అధికారుల విట్నెస్‌లు ప్రవేశపెట్టబడ్డాయి. తరువాత కేసు వాయిదా వేయటం జరిగింది.

8

భ్రమరాంబ ముంటిముందు కారాగింది. రెండు గదులు గల, రెల్లు గడ్డి పరిచిన యిల్లు అది. లోపల చిన్న రేడియో బల్ల ఒక ప్రక్క కుట్టు మిషను వున్నాయి. వరండాలో పేము కుర్చీలు, ఆ యింటినుండి చూస్తుంటే మాధవి ఇల్లు కనిపిస్తుంది. ధర్మ యిల్లంతా కలయ చూశాడు.

లోపలనుండి భ్రమరాంబ వచ్చి "కూర్చోండి" అంది.

కూర్చున్నాడు.

"ఈ ఫోటో చూడండి," అందించాడు.

వణకిపోయింది. "ఈ ఫోటో మీకెలా వచ్చింది?" కంగారుగా అంది.

"తీగె కదిపితే డొంకంతా కదులుతుంది. రాజు మీకు తెలుసా?"

"తెలుసు. అతనే యీ ఫోటోలు తీశాడు."

"మీకు పెళ్ళి అయిందా?" ఈ ప్రశ్నకు వులిక్కి పడింది. "అయింది. ఇప్పుడు నా వయసు ముప్పై ఎనిమిది. నా భర్త మూడేళ్ళ క్రితం చనిపోయాడు" ఈ మాట కొరకే ప్రశ్నించిన ధర్మ తలూపాడు. మిగిలిన ఫోటోలు అందించాడు. "వీళ్ళెవరో తెలుసా?"

"తెలీదు" అంది. ఆ ఫోటోలు నిర్లక్ష్యంగా చూసిందని

ధర్మకు తెలుసు.

"రాజు మీ దగ్గర ఎంత డబ్బు తీసుకున్నాడు?"

"నేను యివ్వలేదు."

"ఈ ఫోటోలో వున్న ఆ వ్యక్తి ఎవరు?" సూటిగా అడిగాడు.

"ఆ రోజు బొంబాయినుండి వచ్చారు. అప్పుడే వెళ్ళి పోయాడు. వివరాలు నాకు తెలియవు." అంది ఖచ్చితంగా. ధర్మ తల వూపి లేచాడు.

ఇంతలో సుడిగాలిలా వచ్చాడు ఆమె కొడుకు. రావటం ఆమె చేతిలో ఫోటో లాక్కోవటం క్షణాలలో జరిగింది. భ్రమరాంబ వారిస్తుంది. అయినా కోతిలా గెంతుతూ ఆ ఫోటోలు చూపి "అమ్మా! ఏమిటి యిలా వున్నావు సిగ్గు లేదు" అన్నాడు. ధర్మకు నవ్వు వచ్చింది.

"అమ్మా! ముకుందం బాబాయ్ వున్నాడు."

ధర్మ గభాలున చూశాడు. భ్రమరాంబ బిత్తరపోయింది.

"ఈయన నీకు తెలుసా?"

"తెలుసండి. ముకుందం బాబాయ్ సత్యన్నారాయణ పురం పార్కు దగ్గర యిల్లు. నేను చాలాసార్లు వెళ్ళాను" అన్నాడు అమాయకంగా.

"వీళ్ళెవరయినా తెలుసేమో చూడు."

"బుజ్జి" కటువుగా అరిచింది భ్రమరాంబ. బుజ్జి వెకిలిగా నవ్వి, "యీ బొమ్మలు బావున్నాయి. వీళ్ళెవరో నాకు తెలీదు. ఈ బొమ్మలు నాకిస్తారా? ఎంత డబ్బయినా యిస్తాను."

"ఐదువేలు అవుతుంది."

"అయినా ఫరవాలేదు. అమ్మ యిస్తుంది. అమ్మ దగ్గర

బోలెడంత డబ్బు వుంది" ధర్మ వింటున్నాడు. భ్రమరాంబ ముఖం ముఖాన రంగులయింది.

9

కోర్టులో—

డిఫెన్స్ ప్రథమ సాక్షిగా రమణి బోనెక్కింది.

రమణి తను రామ టాకీస్ మూడవ వీధిలో వేశ్యగా వున్నానని, తనకు రాజు మూడు సంవత్సరాలుగా తెలుసునని, రాజు చాలా మందిని ఫోటోలు తీసి బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజేవాడని, వివరించి చెప్పింది.

ప్రాసిక్యూటర్ ఆమెనేమి క్రాసు చేయలేదు.

"డిఫెన్స్ ఎక్సిబిట్ 'బి' కాష్ బుక్ అంటూ అందించాడు. మిలార్డ్! హత్యకు ముందురోజు మాధవి పదివేల రూపాయలు బాంక్‌లో వేసింది. దీనిని బట్టి ఆలోచిస్తే మాధవి దగ్గర పదివేలు వుందని ఎవరికయినా తెలిసి వుండాలి. ఆ డబ్బుకొరకే యిద్దర్ని హత్య చేసి వుండాలి అని మా అనుమానం."

న్యాయమూర్తి వ్రాసుకున్నాడు.

"ఇకపోతే డిఫెన్స్ తరువాత సాక్షి గుంటూరు హోటల్ కౌంటర్ మాన్ మురళిని కోర్టువారు అనుమతితో పిలుస్తున్నాను."

మురళి విట్నస్ బాక్స్‌లో నిలబడి ప్రమాణం స్వీకరించాడు.

"మిస్టర్ మురళి, వాసు మీకు ఎన్ని రోజులుగా తెలుసు?"

"ఆయన రిప్రెజెంటెటివ్‌గా చేరినప్పటి నుంచి తరచు మా హోటలికి వస్తూవుండేవాడు, అంతకంటె తెలీదు."

"1975 మార్చి 3 వ తేదిన ఏం జరిగింది?" పి. జె ప్రశ్నించాడు.

"పదకొండు గంటల ప్రాంతంలో విజయవాడ నుండి ఫోను వచ్చింది. వాసును పిలిచాను. వాసు మాట్లాడాడు. తన భార్యను ఎవరో చంపబోతున్నారని, అర్జంటుగా రమ్మని ఫోన్ చేశారట. అది వాసు ముఖభంగిమను బట్టి అడిగితే చెప్పాడు. వెంటనే బయలుదేరి వెళ్ళి తిరిగి రెండు గంటలకు వచ్చాడు."

"క్రాసు చేసుకోవచ్చు."

పి. పి. అడిగాడు. వాసు ఏం మాట్లాడారో వినలేదు కదూ!"

"అవును. చెప్పాను కదా వినలేదు."

"మిలార్డ్! ముద్దాయి పథకం అయితే ఆ పథకంలో ఎవరితోనయినా ఫోన్ చేయించి కౌంటర్ మనిషితో విట్నస్ చూపించవచ్చు కదా!"

పి. జె. నవ్వాడు. "అది మీ వూహ. మీ దర్యాప్తులో యీ విట్నస్ వివరాలు తెలియపరచ లేదు. తెలియపరచ లేదంటే మీకు తెలీదు. హంతకుడే యిలా ఫోన్ చేసి హత్యా సమయానికి వాసు అక్కడ వున్నట్లు ఎందుకు నిరూపించాలని ప్రయత్నించకూడదు. యీ హత్య కేసులో ఒక వలయంలో ముద్దాయిగా వాసును నిలిపి కేసు అల్లిక జరిగింది."

న్యాయమూర్తి షైము చూపి కేసు వాయిదా వేశాడు.

10

కొన్నిరోజులు ఖైదీగా అయ్యాక ఆ రోజు సాయంకాలం విడుదలయ్యాడు వాసు. తలార స్నానంచేసి,

హాయిగా భుజించి, సిగరెట్ వెలిగించి, పడక కుర్చీలో కూర్చొని కళ్ళు మూసుకున్నాడు.

అలారం మ్రోగింది. ఉలిక్కిపడి బీరువాలోనుండి పాంటు, షర్ట్ తీసుకున్నాడు. వాటిని ధరించి, టీపాయిమీద వున్న కత్తి అందుకున్నాడు. కత్తి లైటు వెలుతురులో తళతళ మెరుస్తుంది. పెదవులు బిగించి, కత్తి బెల్ట్‌కు తగిలించాడు. లైట్లు ఆర్పి బయటకు నడిచాడు.

ఒక యింటిముందు ఆగి, వెనుకవైపు డోర్ తట్టాడు. చుట్టూ నిర్మానుష్యం, నిశ్శబ్దంగా వుంది. కీచురాళ్ళ అరుపులు, చెట్లపై కబోదిపక్షులు.

మళ్ళీ తలుపు తట్టాడు. బుజ్జి తలుపు తెరిచాడు.

"కెవ్వు" మని అంటూ క్రింద పడిపోయాడు బుజ్జి. మెడ కోసినట్లు రక్తం కారుతుంది. "ఎవరు? ఎవరు?" కంగారుగా అంది భ్రమరాంబ. అంటూనే లైటువేసి వచ్చింది.

చేతులో నెత్తురు తడిసిన కత్తితోవున్న వాసును చూసిన భ్రమరాంబ గుండాగిపోయినట్లయింది.

"నువ్వా!"

"అవును. నేనే! నాకు యీ లోకంలో యేమీలేదు. అమాయకంగా భార్యను చంపిన నేరంతో జైలుకు వెళ్ళేకంటే, యీ హత్య చేసి జైలుకు వెళ్ళటం మంచిది. అందుకే చేశాను."

"నా బుజ్జిని చంపావా?" బావురుమంది.

"అవును. నిన్ను చంపటానికి సిద్ధంగా వున్నాను."

వణికిపోయింది, "నన్నెందుకు చంపేది, నాకేం తెలీదు, నా మాట నమ్ము." ముఖమంతా చెమటలు పోశాయి.

"తెలుసు" కటువుగా అన్నాడు. "నీకంతా తెలుసు. నీవేం చెప్పినా విననుు" అంటూ ఎగిరి దూకాడు. "కెవ్వు"న అరచి పారిపోబోయింది.

"అందరికి రహస్యలుంటాయి. నీకున్నాయి. నీ రహస్యంతో నన్ను హంతకుడ్ని చేశావు. అందుకే చావాలి." అంటూ అడుగువేశాడు.

"వాసు నేను చంపలేదు." అంది భయంగా మూలగా నిలబడి.

"మరెవరు?" కసిగా అడిగాడు.

"యింకెవరు? నేనే!" వెనుక డోర్ దగ్గర నిలబడ్డ ముకుందం అన్నాడు.

"మిస్టర్ వాసు. పంజరంలో పక్షిలా నా చేతికి చిక్కావు. నా నుండి తప్పించుకోలేవు. యిదిగో నీ అందమయిన రివాల్వర్, రెండు హత్యలు చేసిన నీ రివాల్వర్ మూడో హత్య చేయటానికి సిద్ధంగా వుంది."

వాసు చేతిలో కత్తి జారిపోయింది.

"దిక్కులు చూడకు వాసు. పి. జె నిన్ను కాపాడడు. వాడు నిన్ను వెంటాడతాడేమోనని వేయికళ్ళతో వెదుకుతూ నాలుగు వీధులలో నలుగుర్ని నిలిపే వచ్చాను. యీ ఐదు క్షణాలలో పి. జె రాడు. చిత్ర మేమిటంటే నీవు నన్ను చంపాలనుకున్నావు. కాని నేనే నిన్ను చంపేస్తున్నాను." రివాల్వర్ పేల్చబోయాడు.

పి. జె చెయ్యి బలంగా పట్టుకుని పైకెత్తాడు.

ముకుందం విస్తుపోయాడు. ప్రక్కనే ఇన్‌స్పెక్టర్ విజయ్, అసిస్టెంట్ ధర్మ చుట్టు ముట్టారు.

"మిస్టర్ ముకుందం. నీవు యిప్పుడు వచ్చావ్, మేము

ఎప్పుడో వచ్చి చెట్టుపై పక్షుల్లా కూర్చున్నాం. మిస్టర్ బుజ్జి."

"లేవనా అండి," అంటూ లేచాడు.

భ్రమరాంబ గభాలున బుజ్జిని కౌగిలించుకుంది.

"నేను చావలేదే, పి. జె. గారు అలా చేయమన్నారు. ఇలా చేశాను. అలా అలా ముకుందం బాబాయ్ దొరికి పోయాడు."

ముకుందం పళ్ళు కొరికాడు. "మిస్టర్ ఇన్‌స్పెక్టర్! ముకుందం వేలి ముద్రలతో సహా రివాల్వర్ చెకప్ చేయండి- బాలిస్టిక్ ఎక్స్‌పర్ట్‌తో చెకప్ చేయండి."

అలాగే అంటూ ముకుందాన్ని జీపులో ఎక్కించాడు విజయ్.

* * *

డిటెక్టివ్ పి. జె. ఎయిర్ కండిషన్ రూములో కూర్చున్నాడు ఎదురుగా యస్. పి. క్రైంబ్రాంచి ఇన్‌స్పెక్టర్ విజయ్, వాసు, చందన్‌లాల్, ధర్మ కూర్చున్నారు.

"జరిగింది క్లుప్తంగా చెప్పండి."

పి. జె. సిగరెట్ వెలిగించి చెప్పటం ప్రారంభించాడు. అందరూ కుతూహలంగా చూస్తున్నారు.

"ఇది గొప్ప హత్యకేసుకాదు. అందరికీ కొన్ని రకాలయిన రహస్యాలుంటాయి. అలాగే ముకుందానికి, భ్రమరాంబకు, వరలక్ష్మికి, మాధవికి వున్నాయి. యీ అందరి రహస్యాలకు కారణమయింది రాజు. రాజు, మాధవిని ఆశించక పోయినట్లయితే యీ హత్య మరోలా జరిగివుండేది. ముగింపు మరోలా వుండేది.

రాజు, మాధవి దగ్గరకు వస్తున్నట్లు వరలక్ష్మికి తెలుసు. ముకుందం యిచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం, రాజు బాధ తప్పించుకోవాలని భ్రమరాంబ, వరలక్ష్మి సహాయంతో రివాల్వర్ తీసుకొని అందులో డమ్మీపిస్టల్ పెట్టింది. ఆ రివాల్వర్ కేసుతో వాసు వెళ్ళిపోయాడు.

యిక పోతే తాళం. యిది చిత్రమయిన విషయమే' లోపల తాళం వేసిన మాధవి ఆ తాళాలు టీపాయి పైన పెట్టింది. అప్పటికే వరలక్ష్మి కిటికీ తెరచి వుంచటం చేత కిటికీలోనుండి వూచసహాయంతో టీపాయి మీద తాళాలు కాజేసింది భ్రమరాంబ. ఆ తాళంతోనే తలుపు తెరచి హత్య చేశాక అక్కడ వుంచాడు ముకుందరావు.

హంతకుడు ఒకడు, సహకరించింది యిద్దరు. అసలు రాజు ఎవరో తెలియకపోయినట్లయితే యీ కేసులో ముద్దాయిగా వున్న వాసును విడిపించటం చాలా కష్ట మయ్యేది."

ప్రాసిక్యూటర్, ఇనస్పెక్టర్ వైపు చూశాడు. "వాసుపై కేసు ఉపసంహరించుకుంటాము. ముద్దాయి ముకుందంపై మర్డర్ చార్జీ పుటప్ చేస్తాం. ఏది ఏమైనా మిస్టర్ పి.జె మీరు యీ రంగంలోనికి దిగకపోతే వాసుకు తప్పక జైలుశిక్ష పడి వుండేది."

పి. జె నవ్వాడు.

"కంగ్రాచ్యులేషన్స్" అంటూ చెప్పలేని ఆనందాన్ని కళ్ళతో చెప్పాడు వాసు. ***

శత్రు శేషం?

మిస్. సురేఖ

షడన్ బ్రేకుతో 'కీచు' మంటూ ఆగింది ప్లిమత్.

"ఏం చావాలని ఉందా? వెనక కారు వస్తుంటే తప్పు కోవాలని తెలియదూ?" పరుషంగా విన్పించి, కారులోకి తలెత్తి చూశాడు చంద్రశేఖర్.

"ఇలా బ్రతికేకంటే చావడం ఎంతో మేలు. మీ కారు ఆగకుండా నాపైనుంచి వెళ్ళివుంటే సంతోషించేవాడిని" దుబ్బలా పెరిగిన మాసిన గడ్డాన్ని నిమురుకుంటూ, నీరసంగా అన్నాడతను.

కారు డోర్ తెరుచుకుని బయటికివచ్చాడు శ్రీనివాస రావు. కూలింగ్ గ్లాసెస్ సరిచేసుకుంటూ అతడికేసి విచిత్రంగా చూశాడు.

బాగా పొడుగ్గా వున్నాడు అతను. బాగా పెరిగి మాసిపోయిన గడ్డం, అరిగిపోయి చినిగిపోవడానికి సిద్ధంగావున్న

బాటా చెప్పులు, అక్కడక్కడా మాసికలు వేసిన నల్లటి పాంటు, అటువంటి కండిషన్‌లోనే వున్న తెల్ల షర్టు, నలిగిపోయి, నీరసంగా వున్న మనిషి. పాతిక సంవత్స రాలు దాటని వయసు.

"పిచ్చివాడిలా వున్నావే? ఇంత చిన్నవయసులోనే చావాలని కలలు కంటున్నావు! అన్‌ఎంప్లాయర్‌వా?" అతడ్నే చూస్తూ అడిగాడు శ్రీనివాసరావు.

కొద్దిగా ఆశ్చర్యపోయాడు అతడు. "బాగా కనిపెట్టారు. అయినా ఈ కాలంలో చావాలని ఎవరనుకుంటారు, నా లాంటి నిరుద్యోగులు గాక!"

"అంతగా చావాలని కోరుకుంటున్నావు. వెనకా ముందు ఏమీ లేదా?" అతడ్నే పరిశీలిస్తూ అడిగాడు శ్రీనివాసరావు.

"హు! మీరడుగుతున్నది ఆస్తి గురించా?" చిన్నగా, నీరసంగా అడిగాడు అతను. "ఆస్తే కాదు, ఛస్తే ఏడ్చేందుకు నా అనేవారు ఎవరూ లేరు. ఒంటిప్రాణం కనుకనే ఇంత మొండిగా వుంది" అన్నాడు నిరాశగా.

"ఎంతవరకూ చదివావు?" అడిగాడు శ్రీనివాసరావు.

"బి. ఏ. ఫస్టు క్లాసు" ఆశగా చూశాడు అతడివైపు ఆ యువకుడు.

"బి. ఏ. ఫస్టు క్లాస్? అన్ ఎంప్లాయర్! వాట్ ఎ పిటిబిల్ థింగ్! ఇంతకూ నీ పేరేమిటి?" ప్రశ్నించాడు శ్రీనివాసరావు.

"చంద్రశేఖర్!" చెప్పాడు అతడు.

ఉలిక్కిపడి ఓ క్షణం అతడివైపు చూశాడు శ్రీనివాస రావు. కలవరపాటును కప్పి పుచ్చుకుంటూ "మీ యింటి పేరు? మీ నాన్నగారు ఎవరు?" అని ప్రశ్నించాడు.

"చనుమోలు. చనుమోలు రాజశేఖరంగారి అబ్బాయిని" అన్నాడు చంద్రశేఖర్.

తత్తరపోయాడు శ్రీనివాసరావు. "ఏమన్నావ్? నువ్వు చనుమోలు....చనుమోలు రాజశేఖరం కొడుకువా?" అంటూ ముందుకి దూకి చంద్రశేఖరాన్ని బలంగా కౌగలించుకున్నాడు.

"ఏమండీ! ఏమండి! మీరు....మీరు....?" ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో కూడా తెలియక తడబడిపోయాడు చంద్రశేఖర్.

"ఓరి! నీవట్రా? ఎవరో అనుకున్నాను. ఎప్పుడో చిన్నప్పుడు చూశాను నిన్ను. మీ నాన్నా. నేనూ ప్రాణస్నేహితులం. ఎలా ఉన్నాడు రాజు? అదే మీ నాన్న. మీ అమ్మగారు బాగున్నారా? అవునూ! మీ నాన్న మధ్యప్రదేశ్‌కు మకాం మార్చాడు గదా అప్పట్లో! మద్రాసుకు యెప్పుడొచ్చావు? ఇలా తయారయ్యావేంటి?" ప్రశ్నలవర్షం కురిపించాడు శ్రీనివాసరావు.

"అమ్మ పోయి పదేండ్లయింది! నాన్నగారు రెండేళ్ళ క్రితమే పోయారు. ఆయన పోగానే ఆంధ్రాకు తిరిగి వచ్చాను. ఈ రెండేళ్ళు ఆంధ్ర అంతా తిరిగాను. చిన్న ఉద్యోగంకూడా దొరకలేదు. చివరకు మద్రాసు వచ్చాను. తిరగని స్థలం, ఎక్కని గుమ్మం, అడగని మనిషి లేడు. కానీ ఇక్కడా ఏ ఉద్యోగము దొరకలేదు. దగ్గరవున్న డబ్బుకూడా అయిపోయింది. వారంరోజులుగా ...." అంటూ ఆపేశాడు చంద్రశేఖర్.

అంతా విని తల పంకించాడు శ్రీనివాసరావు. "అలాగా! నువ్వు పడ్డ కష్టాలకు ఇది 'లాస్ట్ స్టెప్' అనుకో. ఇంక

నీకేమీ భయంలేదు. అన్నిటికి నేనున్నాను. రా! లోపలికి" అంటూ కారులోకి ఎక్కి కూర్చున్నాడు.

చంద్రశేఖర్ మొహమాటంగా శ్రీనివాసరావుకేసి చూశాడు. పేవ్‌మెంట్ మీదినుంచి కదల్లేదు.

"రమ్మంటుంటే నిన్ను కాదూ! అంతా మీ నాన్న పోలికే" అంటూ చెయ్యి ముందుకు చాచి, చంద్రశేఖరాన్ని కారులోకి లాగి, కారు స్టార్టు చేశాడు.

'ఉడిపి' ముందు కారు ఆపాడు. రకరకాల పదార్థాలతో చంద్రశేఖర్ భోజనం అయింది.

'వెంకటేశ్వరా హెయిర్ కటింగ్ సెలూన్' ముందు ఆపాడు, వెంట్రుకల దుబ్బంతా వదిలి చంద్రశేఖరం నున్నటి గడ్డంతో, సన్నటి మీసంతో నీట్‌గా బయటికి వచ్చాడు.

కారు మళ్ళీ కదిలింది.

'హైక్లాస్ బ్యూటీ రెడీమేడ్' దగ్గర ఆగింది. అరడజను పాంట్లు, అరడజను షర్ట్లు, అరడజను లుంగీలు, అరడజను బనియన్లు, అరడజను జేబురుమాళ్ళు తీయబడ్డాయి. శ్రీనివాసరావు వాలెట్‌లోని కొత్త వందరూపాయల నోట్లు పదిహేను మాయమైనాయి.

తిరిగి కారు కదిలింది.

'నవీన్' షూ స్టోర్సు ముందు ఆగింది. నాలుగురకాల బూట్లు, చెప్పులు చంద్రశేఖర్ సొంతమైనాయి.

కారు బయలుదేరింది. అరగంట ప్రయాణం తరువాత ఆకుపచ్చని బిల్డింగ్ ముందు ఆగింది. గేటు తెరుచుకుంది. కారు నేరుగా షెడ్‌లోకి వెళ్ళి ఆగింది. ఇద్దరూ క్రిందికి దిగారు.

తలగుడ్డతో ఒకడు వాళ్ళదగ్గరకు పరిగెత్తాడు.

"ఇతడు తోటమాలి రంగయ్య. రంగయ్యా! ఈ అబ్బాయి ఇకనుంచి యిక్కడే వుంటాడు. పేరు చంద్ర శేఖర్! నాలాగే చూచుకోవాలి! తెలిసిందా?" అన్నాడు శ్రీనివాసరావు.

"అలాగేనయ్యా!" అన్నాడు రంగయ్య, చంద్రశేఖర్ వైపు తేరిపార చూస్తూ.

శ్రీనివాసరావు, చంద్రశేఖర్ మేడ లోపలికి వెళ్ళారు.

రంగయ్య, చంద్రశేఖర్ లోపలికి వెళ్ళేదాకా అలాగే చూస్తూ నిలబడ్డాడు. తరువాత భుజంమీది కండువాతో 'కళ్ళు' ఒత్తుకుంటూ తోటలోకి వెళ్ళిపోయాడు.

2

చంద్రశేఖర్ చల్లగాలికి తోటలో నిలబడ్డాడు.

చందమామ ఆకాశంలో నవ్వుతున్నాడు. తెల్లనివెన్నెల భూమిపై చల్లగా మెరుస్తోంది. రకరకాల పూలమొక్కలు సువాసనలు వెదజల్లుతున్నాయి.

వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా వుంది.

చంద్రశేఖర్‌కు జరిగిందంతా ఒక రంగుల కలలాగా వున్నది. మధ్యాహ్నంవరకు తను రోడ్లవెంట తిరిగే ఒక బికారి. కానీ ఇప్పుడు? ఒక పిల్ల జమీందారు హోదాలో మెరిసిపోతున్నాడు. అతడికి నవ్వు వచ్చింది. విధి వైచిత్రానికి ఆశ్చర్యమూ కలిగింది.

చంద్రశేఖర్‌కు శ్రీనివాసరావు భోజనాలదగ్గర అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

"శేఖర్! మీ నాన్నగారు లేరన్న మాటే మనసులోకి రానీయకు! నీకు నేనున్నాను. నా భార్య కూడా ఈమధ్యే

పోయింది. నా అనేవాళ్ళు నా కెవరూ లేరు! నువ్వే నా కొడుకు వనుకుంటాను. నా దగ్గర ఉండిపో! ఇకనుంచి నీ మంచి, చెడ్డలు నావి! ఓ. కే."

చంద్రశేఖర్ కళ్ళు ఆర్ద్రింతో తడిశాయి. హేండ్ కర్చీప్‌తో కళ్ళు ఒత్తుకున్నాడు.

శ్రీనివాసరావు తన పాలిటి దేవుడు! తిండికి గతిలేని తనను అందలానికి ఎత్తేశాడు! నిజానికి స్నేహితులలో ఇటువంటి మహానుభావులు కూడా ఉంటారా? నాన్నగారితో తనకున్న స్నేహాన్ని పురస్కరించుకుని తనకు ఇంతగా సహాయపడ్డాడంటే....నిజంగా ఆ దేవుడి కంటే శ్రీనివాస రావుగారే ఎంతో ఎక్కువ! ఇటువంటి దేవతలవల్లే ఈ లోకం నాశనం కాకుండా నిలబడి ఉంది. ఇంతగా తనకు సహాయం చేసినా, తను కృతజ్ఞత తెలుపబోతే, "పిచ్చి వాడా! నా మిత్రుడి కుమారుడికి ఈ మాత్రం సహాయం చేయడం కూడా గొప్ప పనేనా? ఇది నా విధి" అన్న శ్రీని వాసరావు గొప్పతనాన్ని వర్ణించాలంటే ఎవరి తరము?

చంద్రశేఖర్ కళ్ళముందు శ్రీనివాసరావు విగ్రహము మెదిలింది. రెండు చేతులా పైకెత్తి మనసులోనే శ్రీనివాస రావుకు నమస్కారం పెట్టుకున్నాడు.

ఉల్లాసంగా పూలమొక్కలవైపుకు నాలుగు అడుగులు వేశాడు.

ఆకులు గల గలమన్నాయి. ఎండిన పుల్లలు పట, పట విరిగిన చప్పుడైంది. దూరంగా ఎవరో నడిచిన శబ్దం విని పించింది.

శేఖర్ ఆశ్చర్యంగా ఆ వైపుకు చూశాడు.

ఏదో ఆకారం దూరంగా ఉన్న మామిడిచెట్టుదగ్గర నిల

బడి ఉంది. చేతులు ఊపుతున్నది, తనను దగ్గరకు రమ్మన మని.

చంద్రశేఖర్ అనుమానంగానే అటువైపుకు అడుగులు వేశాడు.

ఆ ఆకారం చెట్టు నీడలోనుంచి కొద్దిగా ముందుకు వచ్చింది. చంద్రశేఖర్ ఆ ఆకారాన్ని గుర్తుపట్టి ఆశ్చర్య పోయాడు. ఆ ఆకారం ఎవరిదో కాదు. తోటమాలి రంగయ్యే!

రంగయ్య గబ, గబా ముందుకు వచ్చాడు.

చంద్రశేఖర్ అతడివైపు చూస్తూ "ఎందుకు పిలిచావు?" అని అడిగాడు.

రంగయ్య దానికేమీ సమాధానం చెప్పకుండా రెండు క్షణాలు చంద్రశేఖర్‌ను చూస్తూ నిలబడ్డాడు.

"బాబూ! నువ్వెవరో అమాయకుడిలా వున్నావు. తెల్లని వన్నీ పాలనుకోకు! శ్రీనివాసరావును దేవుడిగా భావించు కుంటూ ఉండవచ్చు. కానీ శ్రీనివాసరావు తేనె పూసిన కత్తి. నీ ప్రాణం దక్కాలంటే వెంటనే ఇక్కడ్నుంచి పారిపో!" రంగయ్య గొంతులో ఖంగారు ధ్వనించింది.

"ఏమిటి నువ్వంటున్నది? శ్రీనివాసరావుగారు దుర్మా ర్గుడా? నేనిక్కడ ఉంటే నాకు ప్రాణాభయమా? నీకేమైనా పిచ్చి పట్టలేదు కదా?" అనుమానంగా ఆశ్చర్యంగా అడిగాడు చంద్రశేఖర్.

"నువ్వెవరో పిచ్చివాడిలాగా ఉన్నావు. నీతో తీరిగ్గా మాట్లాడే ఓపిక గాని, సమయం గాని నాకు లేవు. నీతో నన్ను గనుక ఎవరైనా చూస్తే నీకు తోడుగా నేనూ పైకి రావలసి ఉంటుంది. నీమీద ఎందుకో అభిమానం కలిగింది.

అందుకే నిన్ను హెచ్చరిస్తున్నాను. నీకు చావాలని లేకుంటే వెంటనే ఇక్కడినుంచి పారిపో! శ్రీనివాసరావు ఇప్పుడు భవనంలో లేడు. ఇదే నీకు అనుకూలమైన సమయం! ఈ మేడ మనుషు లుండే మేడ కాదు. స్వార్థంకోసం తోటి మనిషి పచ్చి రక్తం త్రాగే నరరూప రాక్షసులుండే మేడ! ఇంత కంటే నీకు చెప్పగలిగిందీ, చెప్పవలసిందీ ఏమీ లేదు" ఇలా అంటూ రంగయ్య చటుక్కున వెనక్కు తిరిగి, గబ, గబా వెళ్ళిపోయాడు.

అయిదు నిముషాలు అలాగే రాయిలాగా, చలనం లేకుండా నిలబడి పోయాడు చంద్రశేఖర్! రంగయ్య మాటలుఅతడి చెవుల్లోమారు మ్రోగుతున్నాయి.

రంగయ్య మాటలు నిజమా? తను దేవుడి కంటే ఎక్కువగా భావించిన శ్రీనివాసరావు, వీధుల్లో బికారిగా తిరిగే స్నేహితుడి కొడుకును అందలం ఎక్కించిన శ్రీని వాసరావు నరహంతకుడా! తనను చంపాలనే ఉద్దేశపూర్వ కంగానే తనకు ఇంత మేలూ చేశాడా? అయినా తను ఏ అపకారం చేశాడు అతడికి! తనను చంపాలని అవసరం ఏమిటి?

తల తిరిగినంత పనైంది చంద్రశేఖర్‌కు! చివరకు రంగయ్య చెప్పినట్లే చేయడం మంచిదిగా కనబడింది. నిజా నికి ఈ శ్రీనివాసరావు ఎవరో తనకు తెలియదు. ఇతడు రమ్మనగానే గుడ్డెద్దు చేలో బడ్డట్టు, తను వెనకా ముందూ చూడకుండా సరాసరి ఇక్కడకు రావడం చాలా పొర పాటు.

ఇంక ఒక్క క్షణం అక్కడ నిలబడలేకపోయాడు. గబ, గబా గేటువైపు అడుగులేశాడు. గేటు మూసి ఉంది.

తెరిచేందుకు గేటుపై చెయ్యి వేశాడు.

"ఎవరది?" ఆ ప్రశ్నతోబాటు ఆరడుగుల మొరటు విగ్రహం ఇవతలకు వచ్చింది.

"మీరా శేఖరం బాబూ? ఇలా వచ్చారేమిటి?" మామూలుగా మాట్లాడినట్లున్నా, ఆ కంఠంలోని కఠినత్వం గమనించాడు శేఖర్!

"కొద్దిగా బయటికి వెళ్ళిరావాలి!"

"క్షమించాలి: పది గంటలు తాటిన తరువాత లోపలి వాళ్ళు బయటికి పోగూడదు. గేటు తలుపులు తెరవడానికి వీల్లేదు" అన్నాడు కాపలావాడు.

అతడి గొంతులో వినిపించిన స్థిరత్వం అర్థం చేసుకున్నాడు చంద్రశేఖర్. తను ఇక ఎంతగా చెప్పినా గేటు తెరవడు. అందులో సందేహం లేదు. రంగయ్య చెప్పిందే నిజం.

చంద్రశేఖర్ ఒక నిశ్చయానికి వచ్చాడు. గేటు దగ్గర నుంచి వెనక్కి వచ్చాడు. ప్రహరీ గోడను పరీక్షించాడు.

ఏడడుగుల ఎత్తున్నది. పైన గాజు పెంకులు గుచ్చబడి వున్నాయి. చేతులు పెడితే గుచ్చుకోవడం తథ్యం. తను తప్పుకోవాలంటే అందుకు ఓర్చుకోక తప్పదు.

చుట్టూ చూశాడు. ఆ చుట్టుప్రక్కల ఎవరూ కనిపించ లేదు.

శబ్దం కాకుండా గోడ దగ్గరికి వెళ్ళేడు. ఎగిరితే కాని గోడ అంచు అందదు.

చంద్రశేఖర్ తెగించాడు. పైకి ఎగిరి గోడ అంచులు పట్టుకున్నాడు. అదృష్టం బాగుండి అక్కడ గాజుపెంకులు ఎక్కువగా లేవు. కుడిచేతికి ఏమీ గుచ్చుకోలేదు. కానీ

ఎడమచేతిలో ఒక గాజుపెంకు దిగబడింది.

ఒళ్ళు జల్లుమన్నది శేఖర్‌కు. నర నరమూ లాగినట్లయి నది. పళ్ళ బిగువున ఆ బాధ ఓర్చుకుని పైకెక్కాడు. చేయి చూసుకున్నాడు. అరచేయి మొత్తం ఎర్రగా తయారైంది. రక్తం ఇంకా బొట బొట కారుతున్నది.

ఎగిరి అవతలకు దూకేశాడు. 'దబ్' మని శబ్దం అయింది.

"పట్టుకో....పట్టుకో....పారిపోతున్నాడు" అన్న గొంతు వినబడింది. నలుగురైదుగురు లోపలనించి బయటికి పరిగెత్తిన చప్పుడు వినిపించింది.

చటుక్కున పైకి లేచి, కనిపించిన దారిలో పరిగెత్తడం ప్రారంభించాడు చంద్రశేఖర్. అతడికి కొద్ది దూరంలో మనుషులు తన వెనకే పరిగెత్తుకొస్తున్న శబ్దం వినిపించింది.

చుట్టూ చూశాడు. కనుచూపుమేర దూరంలో ఒక్క యిల్లు కూడా కనిపించలేదు. దాదాపు ఊరికి మైలు దూరంలో ఉన్నదా మేడ!

ఊపిరి బిగబట్టి ఇంకా వేగంగా ముందుకు పరిగెత్తసాగాడు చంద్రశేఖర్. అలుపు వస్తోంది. గుండెలు మండుతున్నాయి. కాళ్ళు పట్టుకుంటున్నాయి. ఒళ్ళంతా చెమటతో తడిపి ముద్దయింది. ఆయాసం తన్నుకొస్తోంది. అయినా ఆగదల్చుకోలేదు.

శక్తినంతా కూడదీసుకొని ఆ తారు రోడ్డుమీద ముందుకు పరిగెడుతున్నాడు. వెనక తరుముకొస్తున్న మనుషుల బూట్ల చప్పుడు తారు రోడ్డుమీద భయంకరంగా ధన, ధన మని చప్పుడు చేస్తూ శేఖర్ గుండెల్లో రైళ్ళు పరిగెత్తి

స్తున్నవి.

హఠాత్తుగా కాంతిబడింది చంద్రశేఖర్‌పై. ఉలికిపాటుతో ఆ వైపుకు చూశాడు. ఏదో కారు తనవైపుకే వస్తోన్నది.

ఆశగా ముందుకు పరిగెత్తాడు చేతులెత్తి "హెల్ప్.... హెల్ప్" అని అరుస్తూ.

కారు వేగంగా ముందుకు వచ్చి షడన్ బ్రేకుతో అతడి ముందు ఆగింది. చంద్రశేఖర్ ఫ్రంటుడోర్ వైపు పరిగెత్తాడు.

అదే క్షణంలో డోర్ తెరుచుకొని శ్రీనివాసరావు బయటికి వచ్చాడు. అతడి చేతిలో నల్లని రివాల్వర్, తెల్లని వెన్నెలలో మిలమిల మెరిసింది. అతడి కళ్ళు క్రూరంగా ఉన్నాయి.

పక్కలో నాగుపామును చూచినట్లుగా 'షాక్'తిన్నాడు. చంద్రశేఖర్....'నో....నో....నో' అంటూ పిచ్చిపట్టినవాడిలాగా అరుస్తూ వెనక్కు తిరిగి పరిగెత్తబోయాడు.

శ్రీనివాసరావు గభాలున ముందుకు వచ్చి రివాల్వర్ పిడితో తలపై బాదాడు. చంద్రశేఖర్ కిక్కురుమనకుండా దభాలుమని నేలపై పడిపోయాడు.

3

డిటెక్టివ్ కిశోర్, ఆ వ్యక్తి వైపు చూశాడు.

దాదాపు యాభైఏళ్ళుంటవి అతడికి మాసిన పంచె, అదే స్థితిలో ఉన్న మల్లు చొక్కా, పైన పొడుగాటి కండువా. మనిషి బాగా నలిగి ఉన్నాడు.

కిశోర్ తనవైపు చూడగానే అతడు రెండడుగులు ముందుకు వేసి చేతులెత్తి దండం పెడుతూ "అయ్యా! తమలాంటోళ్ళను చూచే అర్హత కూడా నాకు లేదు. చాలా పేద

వాడ్ని! నన్ను తోటమాలి రంగయ్య అంటారు. మీకు ఏమీ ఇచ్చుకోలేను. మీపేరు విన్నాను. ఆ కుర్రాడ్ని మీరే రక్షించాలి! జీవితాంతం మీ పేరు తలుచుకొని దీపం పెట్టుకుంటాను," అన్నాడు వినయంగా.

అసిస్టెంట్ రాజు రంగయ్య వైపు విచిత్రంగా చూశాడు.

కిశోర్ డ్రాయరులాగి, పొడుగాటి చుట్ట ఒకటి బయటికి తీసి వెలిగించి, పొగ వదులుతూ "రంగయ్యా! డబ్బేమా వృత్తి అనుకోకు! విషయం ఏమిటో వివరంగా చెప్పు! నా చేతనైన సహాయం చేస్తాను" అన్నాడు గంభీరంగా.

రాజు పుస్తకం తెరిచి వివరాలు రాసుకునేందుకు సిద్ధంగా కూర్చున్నాడు.

"ఆ కుర్రాడు నిన్న మధ్యాహ్నం శ్రీనివాసబాబుగారితో మేడలోకి వచ్చాడు. అతడి పేరు చంద్రశేఖరమని బాబుగారు చెప్పారు. రాత్రి మామూలుగా తోటలో తిరుగుతూ పూల మొక్కలకేసి వెళ్ళాను. అక్కడ శ్రీనివాస బాబుగారు, మరో ఇద్దరు రౌడీల లాటివారు ఉన్నారు. ఆ ఇద్దరినీ నేను ఇంతకుముందు ఎప్పుడూ చూడలేదు. ఆ ముగ్గురూ నన్ను చూడలేదు. నాకు ఏదో అనుమానం కలిగి పూల మొక్కలకు ప్రక్కగా వెళ్ళి నిలబడ్డాను.

"ఆ కుర్రాడి పేరు చంద్రశేఖర్. ఆ కుర్రాడ్ని భవనంలోనుంచి బయటకి పోనీకండి. ఎటువంటి పరిస్థితుల్లోనూ అతడు భవనం దాటి పోగూడదు. అంతగా అతడు మొండికి పడితే ఎముకలు విరగ్గొట్టి లోపల పారేయండి! అతడు తప్పుకుపోయాడంటే మీ ప్రాణాలు తీస్తాను" అంటున్నాడు శ్రీనివాసరావు. ఆ ఇద్దరూ తలలూపారు.

ఆ తరువాత ముగ్గురూ అక్కడ్నించి అవతలకు వెళ్ళి

పోయారు. కొంచెం సేపటికి కారులో శ్రీనివాసరావు బయటికి వెళ్ళిపోయాడు. ఆ కుర్రాడికి ఉన్న సంబంధం ఏమిటో నాకు తెలియదు కానీ, వాళ్ళ మాటలు విన్న తరువాత శ్రీనివాసరావు, ఆ కుర్రాడ్ని నమ్మకంగా నాశనం చేయదలుచుకున్నట్లు అర్థమైంది.

పది, పదకొండు గంటలప్పుడు ఆ కుర్రాడు తోటలోకి వచ్చినప్పుడు ఆ కుర్రాడ్ని అక్కడ్నించి వెళ్ళిపొమ్మనీ' అక్కడ వుంటే ప్రాణాలు దక్కవనీ హెచ్చరించాను. తరువాత ఏం జరిగిందీ నాకు తెలియదు. మరొక అరగంట తరువాత శ్రీనివాసరావుగారి కారు లోపలికి వచ్చింది. ఆ కారులో నుంచి శ్రీనివాసరావు, మరి నలుగురూ క్రిందికి దిగారు. అందులో ఇద్దరు కారులోనుంచి స్పృహ లేకుండా పడిఉన్న ఆ కుర్రాణ్ని బయటికి లాగారు. అందరూ భవనం లోనికి వెళ్లారు.

ఆ కుర్రాడు పారిపోతూ వాళ్ళకి చిక్కిఉంటాడని, అతడ్ని చావగొట్టి తిరిగి భవనంలోనికి తీసుకువచ్చి ఉంటారని అనుకున్నాను. నేనుగా వాళ్ళని ఏమీ చేయలేను గనుక మీ దగ్గరికి పరిగెత్తుకు వచ్చాను. ఆ కుర్రాడ్ని ఎలాగైనా మీరే రక్షించాలి" అంటూ ఆగాడు రంగయ్య.

"అయితే ఆ కుర్రాడు ఎవరో నీకు తెలియదన్నమాట!" చుట్ట పొగ రింగులు వదులుతూ ప్రశ్నించాడు కిశోర్.

"నాకు తెలియదు. ఆ కుర్రాణ్ని ఇవ్వాళే చూశాను." అన్నాడు రంగయ్య.

"ఆ కుర్రాడు ఎవరో నీకు తెలియదు. మరి అతడ్ని కాపాడాలని ఇంతగా ఎందుకు తాపత్రయ పడుతున్నావు?" అడిగాడు కిశోర్.

రంగయ్య రెండు క్షణాలు మాట్లాడలేదు. తరువాత కండువాతో చెమ్మగిల్లిన కళ్ళు వత్తుకున్నాడు.

"ఆ కుర్రాడెవరో నిజంగా నాకు తెలియదు. ఇంతకు ముందు ఎప్పుడూ అతడ్ని చూడలేదు. కానీ....ఆ కుర్రాడు అచ్చం చనిపోయిన నా కొడుకు లాగే ఉన్నాడు. ఆ అబ్బాయిని చూడగానే చచ్చిపోయిన నా కొడుకే బ్రతికివచ్చినట్లయినది." రంగయ్య గొంతు జీరపోయింది.

చిన్నగా నిట్టూర్చాడు కిశోర్. "ఈ శ్రీనివాసరావు ఎవరు?" అడిగాడు.

"రెండేళ్ళ క్రిందటి వరకూ వీధుల్లో తిరిగినవాడే ఈ శ్రీనివాసరావు. మీరు వినాయకరావుని గురించి వినే ఉంటారు. రెండేళ్ళక్రితం వరకు ఆయన దేశదేశాలు తిరిగి వ్యాపారం చేసినవాడే! నీలకంఠంగారి పెద్దబ్బాయి. ఈ మధ్యనే రెండు చేతులా సంపాదించి ఇక్కడికి వచ్చాడు.

ఆయనకూ ఈ శ్రీనివాసరావుకి చిన్నప్పటి స్నేహితం ఉన్నదంట! శ్రీనివాసరావుని తన వ్యవహారాలు చూసుకునేందుకు నియమించుకున్నాడు. ఆయన వ్యవహారాలన్నీ శ్రీనివాసరావే చూస్తుంటాడు. వినాయకరావుగారే బీచి కవతల ఊరికి దూరంగా ఉన్న మేడనుకొని శ్రీనివాసరావు ఉండడానికి ఇచ్చాడు. శ్రీనివాసరావు ఆ మేడలో ఉంటూ వినాయకరావుగారి వ్యవహారాలన్నీ చూస్తుంటాడు. ఆ భవనంలోనే ఆ కుర్రాడ్ని బంధించాడు శ్రీనివాసరావు" అన్నాడు రంగయ్య.

"శ్రీనివాసరావు ఎటువంటివాడు?" అడిగాడు కిశోర్.

"ఆయన గురించి నాకు పెద్దగా తెలియదు. ఆ భవనంలోకి వచ్చిం తరువాత నేను అక్కడ తోటమాలిగా చేరాను.

అంతకుముందు శ్రీనివాసరావుగారు ఎవరో గూడా నాకు తెలియదు. తరువాత వాళ్ళు చెప్పుకునే మాటల్ని బట్టి శ్రీనివాసరావు మొన్నటిదాకా రకరకాల పనులు చేస్తూ వీధుల్లో బలాదూరుగా తిరిగేవాడనీ, ఈ వినాయక రావుగారు వచ్చిన తరువాత ఆయనకు, ఈయనకు ఉన్న స్నేహాన్ని బట్టి తన వ్యవహారాలు చూడడానికి శ్రీనివాసరావుగార్ని తన దగ్గిఱ ఉంచుకొని, ఈ మేడకొని శ్రీనివాసరావు ఉండేందుకు ఇచ్చాడని మాత్రం తెలుసు. ఈ రెండేళ్ళలో ఆయన ఎటువంటి ఎదవ పనీ చేయగా మాత్రం నేను చూళ్ళేదు." అన్నాడు రంగయ్య.

"అలాగా! బీచికి ఉత్తరంగా ఉండే మేడలోనే గదూ ఆ యువకుడ్ని బంధించింది?" అడిగాడు కిశోర్.

"అవును" అన్నాడు రంగయ్య.

"సరే! రంగయ్యా! ఆ యువకుడ్ని విడిపించేపని మేము చూస్తాము. నీవు మాత్రం మామూలుగా శ్రీనివాసరావు దగ్గఱకు వెళ్ళు! నీ పని నీవు చేసుకో. ఇలా మా వద్దకు వచ్చినట్లు ఎవరికి తెలియనివ్వకు" అన్నాడు కిశోర్.

"అలాగే బాబయ్యా! ఆ కుర్రాడి ప్రాణాలు మీ చేతుల్లో పెట్టాను. ఇక మీ దయ, ఆ కుర్రాడి ప్రాప్తం" అంటూ వంగి నమస్కరిస్తూ రంగయ్య బయటికి వెళ్ళిపోయాడు.

కిశోర్, రాజు కేసి చూశాడు. రాజు తల ఎగరవేసి "చాలా విచిత్రంగా వుంది సార్! ఆ కుర్రాడ్ని శ్రీనివాస రావు చంపాలని ఏందుకు అనుకున్నాడు? ఆ యువకుడు తనపట్ల అంతగా శత్రుత్వం కలిగివున్న శ్రీనివాసరావుతోటి ఆ భవనంలోనికి ఎలా వచ్చాడు? ఇంతకూ ఆ కుర్రాడెవరు? అతడికీ శ్రీనివాసరావుకు ఏమిటి సంబంధం? ఈ కేసు

చూస్తుంటే చిన్న రకం పద్మవ్యూహంలా ఉన్నది" అన్నాడు.

కిశోర్ సాలోచనగా తల పంకిస్తూ "నిజమే రాజూ! ఈ కేసు తమాషాగానే ఉన్నది. మనం మరికొంత లోపలికి పోతే గానీ ఈ కేసుకు ఒకరూపం ఏర్పడేటట్లు లేదు. శ్రీనివాసరావు ఏదో పెద్ద ప్లానులో ఉన్నట్లున్నాడు. రాజూ! నువ్వు బీచికి దూరంగావున్న భవనం దగ్గరకు వెళ్ళి చంద్రశేఖర్ విషయం కనుక్కో, నాకు కొన్ని అనుమానా లున్నాయి. వినాయకరావు దగ్గరికి వెళ్ళివస్తాను" అన్నాడు.

"అలాగే సార్!" అంటూ రాజు బయటకు వెళ్ళి పోయాడు.

4

సంజెచీకట్లు క్రమక్రమంగా దట్టమై, ప్రపంచాన్ని పల్చటి చీకటితెరలో కప్పివేశాయి.

రాజు ప్రహరీగోడను పరీక్షగా చూశాడు. దాదాపు ఏడడుగుల ఎత్తున్నది. పైన గాజుపెంకులు గుచ్చబడి ఉన్నవి.

చుట్టూ పరీక్షగా చూశాడు. ఎవరూ కనిపించలేదు. చీకటి దట్టంగా కమ్ముకుని వున్నది. ఇంకా వెన్నెల రాలేదు.

రాజు ఎగిరి గోడ అంచులు పట్టుకున్నాడు. చేతులు కొద్దిగా గీసుకుపోయాయి. మెల్లిగా పైకి ఎక్కాడు. శబ్దం గాకుండా లోనికి దూకాడు. చెట్ల నీడల్లో కలిసిపోయి భవనం దగ్గరకు చేరుకున్నాడు.

అంతా నిశ్శబ్దంగా వున్నది. భవనం చుట్టూ పరిశీలనగా ఒక ప్రదక్షిణ చేశాడు, వాటర్ పైప్ కనబడింది.

బూట్లు ఊడదీసి దగ్గరగావున్న ఒక పొదలో దాచాడు.

కాలితో నేలమీద సున్నాలు చుట్టాడు. వాటర్‌పైప్ పట్టుకుని మెల్లిగా పైకి ఎగబ్రాకాడు. అద్దాల విండో పగలగొట్టి భవనంలోకి ప్రవేశించాడు.

ఆ గదిని పరిశీలనగా చూశాడు. బాత్‌రూమ్ అది. ఎవరో అప్పుడే వాడినట్లు తడిగా ఉన్నది. తలుపులు వేసివున్నాయి.

మెల్లగా తలుపుల దగ్గరికి వెళ్ళి చిన్నగా లాగి చూశాడు. అవతలప్రక్క గడియ వేసి ఉన్నట్లున్నది. రాలేదు. జేబులో చేయిపెట్టి స్క్రూడ్రైవర్ బయటికి తీశాడు. మెల్లిగా స్క్రూలు ఊడదీసి తలుపులు తెరిచాడు.

తల కొద్దిగా బయటపెట్టి చూశాడు. విశాలమైన నడవా! ఎవరూ లేరు. మెల్లిగా నడవాలోనికి వచ్చాడు.

ఒక్కొక్క గది చూసుకుంటూ చివరి గదివద్దకు వచ్చాడు. ఆ గదిని తెరిచి లోనికి అడుగుపెట్టాడు. అలాగే ఆగిపోయాడు.

రాజుకు ఎదురుగా గదిలో ఒకప్రక్కగా కుర్చీలో ఒక యువకుడు కట్టేసి వున్నాడు. నోట్లో ఎర్రటి జేబురుమాలు కుక్కబడి వున్నది. తల పూర్తిగా చెదిరిపోయి వున్నది. షర్టులేని అతడి ఒంటిమీద తాళ్ళు ఒరుసుకుపోయిన గుర్తులున్నాయి.

అతడికి కొంచం దూరంలో రౌడీలాంటి నల్లటి, పొడుగాటి వ్యక్తి నేలమీద కూర్చొని తూగుతున్నాడు. అతని ప్రక్కనే బాణా కర్ర ఉన్నది. ఆ వ్యక్తి రాజును గమనించలేదు.

రాజుకు రంగయ్య చెప్పిన యువకుడు అతడే అయి వుండవచ్చుననిపించింది. మెల్లిగా శబ్దం కాకుండా ముందుకు నడిచాడు. అరచేయి కత్తిలా బిగించి రౌడీలాంటి నల్లటి

వ్యక్తి మెడమీద బలంగా కొట్టాడు. ఆ వ్యక్తి అలాగే నేలపై పడిపోయాడు.

రాజు ఒంగి ఆ వ్యక్తిని పరిశీలనగా చూశాడు. అతడు ఎప్పుడూ, ఏ కేసులోనూ తమకు ఎదురుపడలేదు. క్రొత్త వ్యక్తి.

మెల్లిగా కట్టేసి ఉన్న ఆ వ్యక్తి వైపు చూశాడు. ఆ యువకుడు ఆశ్చర్యంగా రాజును చూస్తున్నాడు. రాజు ఆ యువకుడి దగ్గరకు నడిచి నోట్లోని రుమాలు లాగి, 'మీ పేరు' అని అడిగాడు.

"చంద్రశేఖర్!" అన్నాడా యువకుడు నీరసంగా.

"అలాగా! మీ కోసమే నేను వచ్చాను. నా పేరు రాజు. డిటెక్టివ్ కిశోర్ అసిస్టెంటును...." గభాలున వెనక్కు తిరిగాడు రాజు. అప్పటి ఆలశ్యమైంది.

రాజు తలపై బలంగా దెబ్బపడింది. రాజు కళ్ళముందు మెరుపులు మెరిశాయి. నేలపై పడిపోయాడు.

5

కారు నున్నని తారురోడ్డు మీద పాములా శబ్దంలేకుండా పరుగెత్తుతున్నది. డిటెక్టివ్ కిశోర్ చేతుల్లో స్టీరింగ్ మృదువుగా కదులుతోంది.

కిశోర్ మనసులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

వినాయకరావుగారితో మాట్లాడిన తరువాత కేసుకు ఒక స్వరూపం ఏర్పడింది. శ్రీనివాసరావు నిజస్వరూపం కళ్ళ ముందు స్పష్టంగా నిలబడింది. తను ఇంతవరకూ చూడని శ్రీనివాసరావు, అతడిచేత బంధింపబడిన ఆ యువకుడు వాళ్ల మధ్య ఏర్పడిన కక్షలకు కారణం కళ్ళకు కట్టినట్లు అవుపిస్తున్నది. రాజు వెళ్ళి రెండు గంటలు దాటినా అప్పటి

వరకు తిరిగి రాలేదు. ఏమైనట్లు?

మరొక పదినిముషాలలో కారు మద్రాసుకు దూరంగా వున్న శ్రీనివాసరావు మేడకు ఒక ఫర్లాంగు దూరంలో ఆగింది. ఇంజన్ ఆఫ్ చేసి, కిశోర్ మెల్లిగా క్రిందకు దిగాడు. చిన్నగా అడుగులేస్తూ ఆ భవనం కేసి బయలు దేరాడు.

ప్రహారీని సమీపించాడు. చుట్టూ చూశాడు. అంతటా పూర్తి నిశ్శబ్దం. గాలి కదలిక కీచురాళ్ళ ధ్వని ఆ నిశ్శబ్దంలో ప్రత్యేకంగా వినిపిస్తోన్నాయి. ఆ నిర్జన వాతావరణంలో ఆకాశంలోకి నిక్కి చూస్తున్నట్లుగా ఠీవిగా చలనం లేకుండా ఉన్నది ఆ మేడ.

మేడ పైభాగాన దీపాలు వెలుగుతున్నాయి. అంటే ఎవరో పైన మేల్కొని ఉండి ఉండవచ్చు. రాజు లోనికి ప్రవేశించి ఉండాలి. అయినా ఇంతసేపు తను లోపల ఏం చేస్తున్నట్లు? ఒకవేళ శ్రీనివాసరావుకు చిక్కిపోలేదు గదా!

కిశోర్ గేటువైపు చూశాడు.

వాచ్ మెన్ గేటు దగ్గర నిలబడి బీడి వెలిగించబోతు న్నాడు. కిశోర్ శబ్దం కాకుండా అతడివైపుకు దూసుకు పోయాడు,

వాచ్ మెన్ దగ్గరగా వినబడిన అలికిడికి ఖంగారుగా తల పైకెత్తే లోపలే బరువైన ఇనుపగుండు మెడమీద పడ్డట్లయినది. కిక్కురుమనకుండా తల వాల్చేశాడు అతడు. క్రిందపడేవాడ్ని పడకుండా పట్టుకుని ప్రక్కనే ఉన్న స్టూలు మీద కూర్చోబెట్టాడు కిశోర్.

చూసేవాళ్ళకు వాచ్ మెన్ స్టూలుమీద కూర్చుని వెనక్కి వాలి నిద్రపోతున్నాడనిపిస్తుంది.

కిశోర్ గేటు తెరిచి లోనికి అడుగు పెట్టి, తిరిగి గేటు మూశాడు.

గబగబ చెట్ల మధ్యగా శబ్దం గాకుండా నడుస్తూ భవనం వైపు కదిలాడు. వీలైనంత వరకు చెట్ల చాటుగా నడుస్తూ భవనాన్ని సమీపించాడు. వాటర్ పైప్‌ను చేరుకుని క్రిందకు చూశాడు. వెన్నెల్లో క్రింద నేలమీద అస్పష్టంగా గుండ్రంగా గీసిన గీతలు కనిపించాయి. రాజు భవనంలోకి ప్రవేశించాడని అర్థం చేసుకున్నాడు కిశోర్. బూట్లు ఊడదీసి దూరంగా ఉన్న ముళ్ళ పొదలో వేస్తూ, అంతకు ముందు రాజు అక్కడ పడేసిన బూట్లు చూశాడు.

తిరిగి వాటర్ పైప్ దగ్గరకు వచ్చి దాన్ని పట్టుకు మెల్లిగా పైకి పాకాడు. రాజు పగలగొట్టిన గ్లాస్ విండో చేరుకుని మెల్లిగా బాతురూమ్‌లోకి దూకాడు.

తలుపులు మూసి వున్నాయి. నేలమీద తాళ్ళతో కట్టబడి ఒళ్ళంతా వాతలతో, అక్కడక్కడ నెత్తురు మరకలతోనే నేలమీద వెల్లకిలా పడి వున్నాడు రాజు. నోట్లో మాట్లాడటానికి వీలులేకుండా రుమాలు కుక్కబడి ఉంది. రాజు కళ్ళు మూసుకుని ఉన్నాడు. గదిలో అలికిడి వినపడగానే కళ్ళు తెరిచి ఓరగా చూశాడు. కిశోర్‌ని చూడగానే రాజు కళ్ళు మెరిశాయి.

కిశోర్ గబాలున ముందుకు వచ్చి గబగబా రాజు కట్లు విప్పాడు. రాజు ఒళ్ళు విరుచుకొని లేచి నిలబడి "సార్! ఆ యువకుడు ఇక్కడే ఉన్నాడు. ఈ రాత్రికే అతడ్ని చంపుతారట! పాపం! రంగయ్యను చితకబాది ఆ యువకుడు ఉన్న గదిలోనే పడేశారు. సమయానికి మీరు వచ్చారు. ఆలశ్యం చేస్తే పరిస్థితి చేజారిపోతుంది" అన్నాడు.

కిశోర్, రాజును చూసి "ఇక్కడ పడేశారేమిటి నిన్ను?" అన్నాడు.

"శ్రీనివాసరావు ఆ యువకుడ్ని చంపేటప్పుడు నేను వుంటే బెడిసి కొడ్తుందని కాబోలు, నన్ను బాగా ఉతికి, ఈ బాత్‌రూమ్‌లో నానేశారు" అన్నాడు నవ్వుతూ రాజు.

అదే క్షణంలో గది బయట ఎవరిదో అడుగులు చప్పుడు వినబడింది. కిశోర్. రాజుకు సైగచేసి. గభాలున తలుపు ప్రక్కకు తప్పుకున్నాడు.

రాజు నేలమీద ఎప్పటి మాదిరిగా పడుకుని, కళ్ళు మూసుకున్నాడు.

6

తలుపు దభాలుమని తెరుచుకుంది. ఒక మొరటు విగ్రహంలోనికి వచ్చి భుజం మీదున్న బరువును నేలమీదకు విసిరేసింది. ఆ బరువు నేలమీద 'ధన్'మని పడింది.

అతడు రంగయ్య. ఒళ్ళంతా వాతలతో తేలి, నెత్తురుతో భయంకరంగా ఉన్నాడు.

ఆ రౌడీ అప్పుడు చూశాడు రాజుని పరీక్షగా. రాజు ఒంటిమీద తాళ్ళు లేవు. అవి నేలమీద పడివున్నవి.

రాజును అలా చూడగానే ఆ రౌడీ కంగారుతో ముందుకు వచ్చి రాజుపై చెయ్యివేశాడు.

అదే క్షణంలో కిశోర్ చెయ్యి అతడి భుజంమీద పడింది. అతడు ఉలిక్కిపడి వెనక్కు తిరిగి కిశోర్‌వైపు చూసి ఆశ్చర్యంతో అరవబోయాడు. కిశోర్ అరచేయి విసురుగా అతడి ముఖాన్ని తాకింది. ఆ రౌడీ కళ్ళు తేలేసి క్రింద పడబోయాడు. కిశోర్ గభాలున వాడ్ని పట్టుకుని నేలమీద పండబెట్టాడు.

రాజు లేచి అంతకుముందు తన్ను కట్టేసిన తాళ్ళతో ఆ రౌడీని కదలకుండా కట్టేసి, నోట్లో రుమాలు కుక్కాడు.

కిశోర్ రంగయ్య దగ్గరకు వెళ్ళి కట్లు ఊడదీశాడు. ప్రక్కన తొట్టిలోని నీళ్ళను దోసిళ్ళతో అతడి ముఖంమీద కొట్టాడు.

రెండు నిముషాల తరువాత రంగయ్య కళ్ళు తెరిచాడు. ఎదురుగా కిశోర్, రాజు కనిపించారు.

"ఆ అబ్బాయిని రక్షించండి .... ఆ అబ్బాయిని రక్షించండి" నీరసంగా అన్నాడు రంగయ్య.

కాని, కిశోర్ రంగయ్య మాట వినడంలేదు. అతడి ఆలోచనలు ఆ రూమ్‌మీద వున్నాయి. రాజును, రంగయ్యను కట్టేయడంవరకు బాగానే వున్నది. కానీ ఈ రూమ్‌లో పడ వేయడమేమిటి? ఈ బాత్‌రూమ్‌లోనే వీళ్ళిద్దరినీ యెందుకు పడవేశారు? మామూలుగా పడవేశారా? లేక....లేక.... హఠాత్తుగా మనసులో మెరుపు మెరిసింది. అవును. అందుకే ఈ గదిలో పడవేశారు, అనుకుంటూ చెవులు నిక్కబొడుచుకున్నాడు కిశోర్.

ఆ గదిలో ఒకమూలనుండి టిక్ టిక్ టిక్ మన్న ధ్వని విన్పించసాగింది. గభాలున ఆ మూలవైపు గెంతాడు.

చిన్నరకం టైంబాంబు నిమ్మకాయ సైజులో వున్నది మూలగా అమర్చబడి వున్నది.

కిశోర్ ఒంగి ఆ బాంబ్‌ను అందుకొని బయటకు వ్రేలాడుతున్న పసుపుపచ్చని జానెడు పొడుగున్న వైరును బలంగా లాగేశాడు. కనెక్షన్ కట్ అవడంతో టిక్ టిక్ మన్న ధ్వనిగూడా ఆటోమాటిక్‌గా ఆగిపోయింది. ప్రశాంతంగా ఊపిరి పీల్చి వదిలాడు కిశోర్.

రంగయ్యను అక్కడే వుండమని, ఇద్దరూ తలుపులు తెరుచుకు గది బయటికి వచ్చారు. రాజు వరండాలో చివరగా వున్న గదివైపు చెయ్యి చూపి సైగచేశాడు. కిశోర్ తల పంకించి ఆ వైపుకు మెల్లగా అడుగులువేశాడు. ఇద్దరూ ఆ గదిని సమీపించేసరికి ఏవో మాటలు వినబడ్డాయి.

కిశోర్, రాజును ఆపి జేబులోకి చెయ్యిపెట్టి, మినీ టేప్‌రికార్డర్ స్విచ్ ఆన్ చేశాడు.

టేప్‌రికార్డర్ తిరగసాగింది. కిశోర్, రాజులు తలుపులకు ప్రక్కగా లోపలికి తొంగిచూశారు.

"అతడే శ్రీనివాసరావు" అన్నాడు రాజు, శ్రీనివాసరావును చూపిస్తూ.

చంద్రశేఖర్ కుర్చీలో కట్టివేయబడి వున్నాడు. ఒంటిపై షర్టు లేదు. కుడిరొమ్ముపై పదిపైసలంత నల్లని పుట్టుమచ్చ వున్నది. ఎదురుగా శ్రీనివాసరావు చేతిలో రివాల్వర్‌తో నిలబడి వున్నాడు. నలుగురు వస్తాదులు కర్రలతో శ్రీనివాసరావు ప్రక్కనే నిలిబడి వున్నారు.

వికటంగా నవ్వాడు శ్రీనివాసరావు. "చంద్రశేఖర్ నిన్ను చంపక తప్పదు" అన్నాడు.

"అదే అడుగుతున్నాను. ఇందాక నుంచీ, కాదు కాదు నన్ను బంధించిన దగ్గఱనుంచీ అడుగుతున్నాను. నన్ను చంపాల్సిన అవసరం ఏమిటి? నీకు నేనేం ద్రోహం చేశాను? నువ్వెవరో కూడా నాకు తెలియదే? అటువంటి నన్ను చంపాల్సిన అవసరం ఏమిటి?" ఉక్రోషంగా అడిగాడు చంద్రశేఖర్.

పగలబడి నవ్వాడు శ్రీనివాసరావు. చటుక్కున నవ్వాపి, "నే నెవరో నీకు తెలియకపోవచ్చు. కానీ, నువ్వెవరో నాకు

తెలుసు. నువ్వు నువ్వేనని నీ రొమ్ముమీది పుట్టుమచ్చ రుజువు చేయగలదనీ నాకు తెలుసు. కనుకనే నిన్ను చంపక తప్పదు. ఆ చంపే సమయమూ దగ్గరపడింది, ఎందుకు చస్తున్నావోకూడా తెలియకుండా నువ్వు అసంతృప్తితో చావడం నా కిష్టంలేదు. ఎంతైనా మీనాన్న, నా ప్రాణస్నేహితుడు గదా!

నీకు కథంతా అర్థం కావాలంటే ఓ కథ చెప్తాను విను.

కొన్నాళ్ళ క్రితం నీలకంఠం అనే బిజినెస్ మాగ్నెట్ మద్రాసులో హై పవర్‌లో వున్నాడు. అతడికి వినాయకరావు, రాజశేఖరం అని ఇద్దరు కొడుకులు. రాజశేఖరం వర్ణాంతర వివాహం చేసుకుని ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. వినాయకరావుకు తమ్ముడిమీద ఎంతో ప్రేమ! అయినా తండ్రి మాట మీరి తమ్ముడ్ని ఇంటికి పిలవలేకపోయాడు.

కొంతకాలానికి రాజశేఖరానికి కొడుకు పుట్టాడు. వినాయకరావు దొంగతనంగా తండ్రికి తెలియకుండా తన స్నేహితుడైన శ్రీనివాసరావును వెంటబెట్టుకుని తమ్ముడ్ని చూడ్డానికి వెళ్ళాడు. రాజశేఖరం అన్నను చూసి సంతోషించి, చంద్రశేఖరని పేరు పెట్టుకున్న తన కొడుకుని చూపించాడు. వినాయకరావు, శ్రీనివాసరావు ఆ పిల్లవాడి రొమ్ముమీదున్న పెద్ద పుట్టుమచ్చను చూసి అదృష్టజాతకుడవుతాడని మురిసిపోయారు.

తరువాత కొన్నాళ్ళకు రాజశేఖరం మద్రాసునుంచి ఎవరికీ తెలియకుండా మకాం ఎత్తేశాడు. మరో అయిదేళ్ళకు నీలకంఠంగారు టపా కట్టేశారు. మరి కొంతకాలానికి వినాయకరావుకూడా భార్యతో మద్రాసునుంచి విదేశాలకు

వెళ్ళిపోయాడు. తిరిగి రెండేళ్ళ క్రితం భార్య పోగా ఒంటిగా డైన వినాయకరావు పాతికలక్షల ఆస్తితో మద్రాసు వచ్చాడు. తనవాళ్ళంటూ ఎవరూలేని వినాయకరావు తను చిన్నప్పుడు చూసిన తమ్ముడి కొడుక్కు ఆస్తినంతా అప్ప గించాలనే ఉద్దేశానికి వచ్చాడు. కాని వాళ్ళు యెక్కడ ఉన్నదీ తెలియదు. తన చిన్నప్పటి స్నేహితుడైన శ్రీనివాస రావును తనదగ్గర వుంచుకొని, తన తమ్ముడి విషయం ఆరా తీయడానికి అతడ్ని నియమించాడు.

ఇంకా దాపరిక మెందుకు? వినాయకరావు తమ్ముడు రాజశేఖరం కొడుకువి నువ్వే! దానికి స్పష్టమైన నిదర్శనం నీ రొమ్ముమీద పుట్టుమచ్చ! వినాయకరావు, ఒక విధంగా నేను వెతికేది నిన్నే!" అన్నాడు శ్రీనివాసరావు వికటంగా.

"వినాయకరావుగారు మా పెదనాన్నగారా? మా నాన్న గారి అన్నగారా? అయితే నన్ను చంపడం దేనికి? నేను లేకపోయినా ఆస్తి నీకు రాదుగా!" అన్నాడు చంద్రశేఖర్! అతడికి ఇప్పుడిప్పుడే విషయం అర్థం కాసాగింది.

"పిచ్చివాడా! ఆస్తి విషయం దేవుడెరుగు! నీవు వారసుడిగా వినాయకరావు దగ్గర చేరితే నాకు జైలుశిక్ష తప్పదు. డాక్టర్‌ను లోబరచుకొని వినాయకరావును ఎప్పుడూ మత్తులో ఉండేటట్లు, వీలైతే పైకి పంపడానికీ వీలుగా ప్రతిరోజు మార్ఫియా అతి స్వల్ప డోసులో ఇప్పిస్తున్నాను. వినాయకరావు మత్తుకు అలవాటు పడ్డాడు. అసలే వయసులో పెద్దవాడు కావడంతో తొందరలోనే మంచంలో పడ్డాడు.

నేనీలోగా అయిదారు లక్షలు ఇంటికి చేరవేసుకున్నాను దొంగలెక్కలు కూడికలతో. మత్తులో వినాయకరావు అది గమనించలేదు. కానీ వినాయకరావుకు తమ్ముడి

కొడుకు పిచ్చి బాగా పట్టుకుంది. రాజశేఖరం ప్రాణస్నేహితుడ్ని కనుక ఆ విషయం నామీదనే పెట్టేడు.

నేను ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నట్లు, రాజశేఖరం విషయం తెలియనట్లు మంచంలో వున్న వినాయకరావును సులభంగా నమ్మించగలిగాను. కానీ ఇన్నాళ్ళకు నువ్వు అనుకోకుండా తటస్థ పడ్డావు. రుణశేషం, శత్రుశేషం వుంచకూడదంటారు....." అంటూ రివాల్వర్ చంద్రశేఖర్‌కు గురిపెట్టాడు శ్రీనివాసరావు.

"విషయం నీకు తెలిసింది. ఇక నీ చావుకు ఆలస్యం అనవసరం" అన్నాడు కఠినంగా ట్రిగ్గర్‌పై వేలు నొక్కుతూ శ్రీనివాసరావు.

అదే క్షణంలో కిశోర్ చేతిలోని రివాల్వర్ 'ఢన్' మని పేలింది,

"అబ్బా!" అంటూ చేయి పట్టుకుని క్రింద కూలబడ్డాడు శ్రీనివాసరావు.

రౌడీలు కర్రలతో ముందుకు దూకబోయారు. కానీ కిశోర్, రాజుల చేతిలోని రివాల్వర్స్ వాళ్ళను ముందుకు కదలనివ్వలేదు.

7

"కిశోర్‌గారూ! మీ రుణం జన్మలో మరిచిపోలేను. ఇంక కనపడదనుకున్న నా తమ్ముడి కొడుకును ప్రాణాప్రాయ నుంచి తప్పించి, నా కప్పగించారు. నాతో ఆఖరనుకున్న నా వంశానికి జీవం పోశారు. మీ రుణం దీనితో తీరుతుందని కాదు, కానీ ఈ పాతికవేలు మా చిరు కానుకగా స్వీకరించండి. శేఖర్! ఆ చెక్కు కిశోర్‌కి ఇవ్వు నాయనా!" అన్నాడు వినాయకరావు. చంద్రశేఖర్‌ను చూసిన ఉత్సాహం

అతడి అణువణువులోనూ కనబడుతున్నది.

చంద్రశేఖర్ చెక్కును కిశోర్‌కు అందిస్తూ "కిశోర్ గారూ! మీరు చేసిన సహాయం ఈ జన్మలో మరచిపోలేను. నాకు మరో జన్మ నిచ్చారు. శ్రీనివాసరావు ఇంతటి మోసగా డనుకోలేదు. అభిమానం చూపించే ప్రతి మనిషీ ఆత్మీ యుడు కాదనే విషయం అనుభవపూర్వకంగా తెలుసు కున్నాను" అన్నాడు కృతజ్ఞతగా.

కిశోర్ చిన్నగా నవ్వాడు.

"వినాయకరావుగారూ! నిజానికి ఈ కేసులో నేను పడిన కష్టమేమీ లేదు. ఈ కేసును విడదీసింది బయటికి లాగింది తోటమాలి రంగయ్య. అతడే గనుక చంద్రశేఖర్ విషయం నాకు తెలుపకపోతే, శ్రీనివాసరావు దుర్మార్గమే గెలిచి ఉండేది" అన్నాడు కిశోర్.

"కిశోర్‌గారూ! రంగయ్య చేసిన మేలును నేను మరచి పోతానా? రంగయ్య ఇకనుంచి నావద్దే ఉండిపోతాడు. అతడ్ని నా తండ్రికంటే మిన్నగా చూసుకుంటాను" అన్నాడు చంద్రశేఖర్ చెమర్చిన కన్నులు ఒత్తు కుంటూ.

***

టీచరు: ఒకే రెండు సర్వనామములు చెప్పరా?

విద్యార్థి: ఎవరు? నేనా?

టీచరు: రైట్! కూర్చో.

—బద్దిగం పాండురంగారెడ్డి, విశ్వనాథపురం.

"ఎందుకూ? తెలివివచ్చిన దగ్గరినుండి అతి తెలివి చూపిస్తాడు. ఇలాగే నరికేయండి." అంది నాగిణి.

మురళి గుండె భగ్గుమంది. స్పృహలేని వ్యక్తిని చంపడానికి పంధకం చేసుకుంటున్న వారిని కనీసం దానవులు అనడానికి కూడా మనసొప్పలేదు. అంతకన్నా కిరాతకులు, నీచులు అనుకున్నాడు.

"నాగిణీ! వీడు కదులుతున్నట్లున్నాడు. స్పృహ వచ్చిందేమో?" అనుమానం వెలిబుచ్చాడు ఒకడు.

ఉలిక్కిపడ్డాడు మురళి. 'హాట్సాఫ్ యువర్ డేగ కన్నులూ!' అనుకున్నాడు.

"మిష్టర్ మురళీ" తట్టి పిలిచింది నాగిణి.

చలనం లేనట్లు అలాగే పడివున్నాడు మురళి. చటుక్కున మీదకు వంగింది నాగిణి. మరుక్షణం ఆమె పెదాలు బలంగా మురళిని ముద్దాడాయి.

మురళి నరాలలో టెన్షన్ పెరిగింది. అయినా విగ్రహంగా అణగద్రొక్కుకొని చలనరాహిత్యమే ప్రదర్శించాడు.

"పూర్ ఫెలో! ఇంత తేలికగా దొరుకుతాడనుకోలేదు"

నవ్వుతూ అంది నాగిణి.

"త్వరగా కానివ్వండి. ఇంకా ఆలశ్యం ఎందుకు?" అసహనంగా అరిచాడొక వ్యక్తి.

కారుడోర్ తెరిచారు. మురళి కళ్ళు గట్టిగ మూసుకున్నాడు. శరీరం ఉక్కు కడ్డీలా బిగించాడు. అవకాశంకోసం ఎదురు చూడసాగాడు.

ఒకతను మురళి రెండుకాళ్ళు పట్టుకొని చటుక్కున జీప్ లోంచి క్రిందకులాగాడు. ధన్‌మంటూ జీప్‌లోంచి క్రింద పడ్డాడు. పడటంలో క్రిందవున్న రాళ్ళు వీపుకు బలంగా తగిలాయి! 'అమ్మా' అనబోయి ఎంతో ప్రయత్నంమీద నిగ్రహించుకున్నాడు.

ఇరువురు వ్యక్తులు క్రిందపడిన మురళిని చెరొకవైపు పట్టుకొని ఈడ్చుకు వెళ్ళసాగారు. క్రింద ముళ్ళు గుచ్చుకొని శరీరంనుండి రక్తం చిమ్ముతోంది. శరీరమంతా పుండు అయిపోయింది.

ఇక సహించలేకపోయాడు మురళి. మెల్లగా ఒకకన్ను తెరిచిచూశాడు. ఇద్దరూ చెరోకాలు పుచ్చుకొని బలిపశువును యీడ్చుకెళ్ళినట్లు యీడ్చుకెళుతున్నారు. క్రింద తగులుతున్న వత్తిడినిబట్టి బాక్‌పాకెట్‌లో రివాల్వర్ అలాగే వుందని గమనించాడు. రివాల్వర్‌ను దుండగులు తీసివేయనందుకు మరోసారి థాంక్స్ చెప్పుకున్నాడు భగవంతునికి.

వెంటనే ఎదుర్కొనవలెనని భావించాడు గానీ అంత మందిని ఎలా ఎదుర్కోవాలో అర్థంకాలేదు. అక్కడ ఎంత మంది వున్నారో ఒక్కసారి మననం చేసుకున్నాడు.

నాగిణి, ముగ్గురు వ్యక్తులు, సబ్‌ఇనస్పెక్టర్ రూపంలో వచ్చిన వ్యక్తి, ముగ్గురు కానిస్టేబుల్స్ మొత్తం ఎనిమిది

మంది. తన రివాల్వర్‌లో ఆరు బుల్లెట్లు వుంటాయి. తను తిరగబడగానే వారిలో ఎవరో ఒకరు రివాల్వర్‌తో షూట్ చేయవచ్చును. ఏం చేయాలి? ఇలాగే వూరుకుంటే తనను క్రైమా చేసేస్తారన్నది ఖాయం!

చివరకు ఓ నిర్ణయానికి వచ్చాడు మురళి. ఎలాగూ మరణం తప్పదు. మరణించే ముందు కొద్దిమంది శత్రువులనైనా మట్టుబెట్టి వీరమరణం పొందవచ్చును!

వాళ్ళు అశ్రద్ధగా వున్న తరుణం కనిపెట్టి ఒక్కసారి రెండు కాళ్ళూ గట్టిగా విదిలించాడు. చప్పున వాళ్ళ పట్టు జారిపోయింది. ఇద్దరూ గిరుక్కున వెనక్కు తిరిగారు. అంతే రెండు కాళ్ళను జాడించి ఇద్దరినీ తగలరానిచోట తగిలేటట్లు తన్నాడు.

అంతే! ఆ ఇద్దరూ 'బాప్‌రే' అంటూ అరుస్తూ క్రింద పడిపోయారు.

చటుక్కుని లేచి హిప్ పాకెట్‌లోని రివాల్వర్ తీశాడు. ఈ హడావుడికి సబ్ ఇనస్పెక్టర్ వేషంలో వున్న వ్యక్తి, ముగ్గురు కానిస్టేబుల్స్, డ్రైవింగ్ సీటులోవున్న వ్యక్తి అదిరిపోయి ముందుకు దూకబోయారు.

క్షణంకూడా ఆలశ్యం చేయలేదు మురళి. వాళ్ళప్రాణాలు పోతాయని వీసమెత్తుకూడా సంకోచించలేదు. రివాల్వర్ ఆ అయిదుగురికి గురిపెట్టి టపటప ప్రేల్చేశాడు. అంతే, ఆ అయిదుగురు భీకరంగా అరుస్తూ క్రిందపడిపోయారు.

అనుకోని ఈ హఠాత్సంఘటనకు ఆశ్చర్యపోతూ రివాల్వర్‌కోసం హాండ్‌బాగ్‌లో చేయిపెట్టబోతున్న నాగిణి "హాండ్సప్!" అన్న గర్జనతో అదిరిపడి తలెత్తింది.

"మిస్ రాగిణీ వురఫ్ నాగిణీ! నీకోసం ఈ రివాల్వర్‌లో

ఒకే ఒక బుల్లెట్ వుంది స్వీకరిస్తావా?" పరిహాసంగా అన్నాడు మురళి.

నాగిణి ముఖం పాలిపోయింది. ఒకే ఒక్క నిమిషంలో ఏడుగురు వ్యక్తులను దెబ్బతీశాడు అంటే అసలు నమ్మలేక పోతోంది.

రివాల్వర్‌ను పోజిషన్‌లో వుంచుకొని ఆమెను చేరుకున్నాడు మురళి. గట్టిగా ఆమెను పొదివిపట్టుకొని అన్నాడు.

"క్విక్! బాగ్ జిప్ తెరువు. అందులో రివాల్వర్ నాకు కావాలి" గర్జించాడు.

మౌనంగా బాగ్ జిప్ తెరిచింది. మురళి బాగ్‌లో చేయి పెట్టి రివాల్వర్ తీసుకున్నాడు.

ముందు దెబ్బతిన్న ఇద్దరూ మెల్లగా లేవబోతున్నారు.

మురళి చేతిలోని రివాల్వర్ మరో రెండుసార్లు నిప్పులు గక్కింది. ఆ యిద్దరూ అలాగే నేలమీదకు వాలిపోయారు.

"ఛీ! దుర్మార్గుడా! అంతమందిని అంత క్రూరంగా కాలుస్తావా?" అసహ్యంగా చూస్తూ అంది నాగిణి.

చిన్నగా నవ్వాడు మురళి.

"మిస్ నాగిణీ! దుర్మార్గం! క్రూరం!! ఎనిమిదిమంది కలిసి ఒక్కడ్ని మాయోపాయంతో బంధించి చంపడానికి ప్రయత్నించటం న్యాయంకదూ! అది క్రూరం కాదుకదూ! పశువులా రాళ్ళమీద యీడ్చినప్పుడు ఈ అన్యాయం ఏమయింది? నాలో ఎంత కసి పేరుకొని ఈ రివాల్వర్ గుండా బయటకు వచ్చిందో తెలుసా?"

ఏమీ మాట్లాడలేదు నాగిణి. ఆమె హృదయం తీరని అవమానంతో, పగతో ప్రజ్వరిల్లుతోంది.

చటుక్కున ఏదో గుర్తుకువచ్చింది మురళికి.

"మిస్! ఇటురా!" పిలిచాడు.

ఆమె దగ్గరగా వచ్చింది.

"జాగ్రత్తగా వెళ్ళి నీ అనుచరులవద్దనున్న ఆయుధాలు తీసి బయట పడేయ్! ఎలాంటి పిచ్చివేషాలు వేసినా, యీ రివాల్వర్‌లోని ఆరు బుల్లెట్లు నీ గుండెలో చోటు చేసు కుంటాయి" ఆజ్ఞాపించాడు.

మారు మాట్లాడకుండా కదిలింది నాగిణి.

మొత్తం ఏడుగురు వ్యక్తుల దగ్గరనుండి ఆయుధాలు తీసివేసింది. ఏడు రివాల్వర్లు, అయిదు చిన్న కత్తులు వున్నాయి.

"నీపైట కొంగు చింపు."

తలెత్తి మురళివైపు తీవ్రంగా చూసింది నాగిణి.

"క్విక్! ఆలోచించడానికి సమయంలేదు. నీ పైటకొంగు చింపి అందులో ఆ ఆయుధాలన్నీ వేసి మూటగట్టు" అరిచాడు మురళి.

సర్రున పైట చింపి మురళి చెప్పినట్లు చేసింది.

"థాంక్యూ! నా బాగ్‌లో వైర్లు వుంటాయి. అవితీయ్!"

'ఎందుకు?' అన్నట్లు చూసింది.

"చెబుతాను. ముందు ఆ వైర్లు బయటకు తీసుకురా!"

మాట్లాడకుండా బాగ్ తెరిచి వైర్లు తీసుకువచ్చింది.

"వెరీగుడ్! ఈ వైర్లతో ఆ ఏడుగురిని గట్టిగా బంధించు."

తెల్లబోయి చూసింది నాగిణి, ఇంతకు ముందు తాము యీ పని చేయనందుకు సిగ్గుపడింది.

"మిష్టర్ మురళి, చాలా ఘోరంగా ట్రీట్ చేస్తున్నావ్?" గొంతు పెగుల్చుకుంటూ అంది.

"లేదు నాగిణీ! మళ్ళీ పొరబాటు సంభవించకుండా జాగ్రత్త తీసుకుంటున్నాను."

"అన్యాయం!"

"నో, ఇదే న్యాయం! రోజు లెప్పుడూ నీవికావు, యిష్టమొచ్చినట్లు ఆడటానికి."

"అది నువ్వు గూడా గుర్తుంచుకో మురళీ! రోజు లెప్పుడూ నీవే కావు!" వ్యంగ్యంగా అంది నాగిణి.

ఆమె తెగింపుకు ఆశ్చర్యపోయాడు మురళి.

"లేదు మిస్ నాగిణీ! రోజులెప్పుడూ ధర్మానివే! ఇందులో సందేహం లేదు. ప్రతీకళక్తులకు తాత్కాలిక విజయం సిద్ధించినప్పటికీ అంతిమ విజయం ధర్మానిదే! అయినా నీతో అనవసర ప్రసంగం వ్యర్థం! మర్యాదగా చెప్పినట్లు చెయ్యి! లేదా నిన్నూ వాళ్ళతో కలిపి ఆ పని నేనేచేస్తాను" గంభీరంగా అన్నాడు మురళి.

నాగిణి మళ్ళీ మాట్లాడకుండా వైర్లు తీసుకొని ముందుకు నడిచింది. రివాల్వర్ గురి మార్చకుండా వెంట నడిచాడు మురళి.

ఏడుగురినీ వైర్లతో కాళ్ళూ చేతులు బంధించింది. నోటికి ప్లాస్టర్ అంటించింది. వాళ్ళకు గాయాలనుండి రక్తం స్రవిస్తోంది. ఆ రక్తాన్ని చూడగానే నాగిణి గుండె ద్రవించింది.

26

చేతిలో రివాల్వర్ పట్టుకొని బాత్‌రూం తలుపు హాండిల్ త్రిప్పి చిన్నగా నెట్టాడు డిటెక్టివ్ ధర్మేంద్ర! తలుపు తెరుచుకోలేదు. ఇంకొంచం గట్టిగా నెట్టాడు.

లోపల 'ధబ్'మన్న శబ్దం విన్పించింది. తలుపు చిన్నగా

అపరాధ పరిశోధన పోటీ-93 [ఫలితాలు]

ఏప్రెల్ '76 నెల "అపరాధ పరిశోధన పోటీ-93" కి సరియైన సమాధానాలు :

1. అవినీతిని.
2. ప్రాణత్యాగం.
3. తేనెటీగ.
4. కోతి.
5. బిచ్చగాళ్ళకు.

పై జవాబుల ప్రకారం ఇద్దరు మాత్రమే ఆల్ కరక్టుగా పంపారు. వీరికి జులై '76 నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేతలు :

(1) కుమారి టి. విజయలక్ష్మిబాయి,
కేరాఫ్—టి. ఎస్. శంకరరావ్ (జర్నలిస్ట్),
సౌకార్ పేట,
పామిడి—పోస్టు,
(అనంతపురం జిల్లా.)

(2) శ్రీ పోచంపెల్లి నారాయణ,
సత్య భవన్,
చావల్ నెం. 18, రూమ్ నెం. 38,
ఎన్. ఎమ్. జోషి మార్గ్,
బొంబాయి—400 013.

తెరుచుకుంది. జాగ్రత్తగా లోపలకు నడిచాడు.

అంతే! లోపలి దృశ్యం చూసి ఒక్కసారి నిశ్చేష్టుడై పోయాడు. అతనిలో హృదయ స్పందన ఒక్క క్షణం నిలిచిపోయింది.

ధర్మేంద్ర వూహించని దృశ్యం ఎదురుగా కన్పించింది. అయిదు క్షణాల తర్వాత తెలివి తెచ్చుకున్నాడు. కర్తవ్యం స్ఫురణకు వచ్చింది. చకచక ముందుకు నడిచి పరీక్షగా చూశాడు.

ఒక అపరిచిత వ్యక్తి నేలపై వెల్లకిలా పడి వున్నాడు. అతని గుండెలో బలంగా కత్తి దించబడి వుంది. చేయి పట్టుకొని చూశాడు. ఇంకా వెచ్చగానే వుంది. బహూశా ప్రాణంపోయి ఎంతో సేపయి వుండదు.

శవం బాత్ రూంలోకి ఎలా వచ్చింది. తాము రాకముందే శతృవులకి తాము సరిగ్గా రూం నంబర్ 60 లోనే దిగుతామని ఎలా తెలుసు? ముందుగా రిజర్వేషన్ చేయించుకున్నది కాదు కదా! అయితే తాము రూంలోకి ప్రవేశించిన తరువాతనే ఈ ఘాతుకం జరిగిందా?

బాత్ రూం మొత్తాన్ని పరీక్షగా పరిశీలించాడు. పైన వెంటిలేటర్ కన్పించింది. వెంటిలేటర్ కున్న గ్లాస్ వూడదీసి వుంది.

ఆ వెంటిలేటర్ గుండా శవాన్ని లోపలకు దింపడానికి అవకాశం వుందా? ఏమో? ఇక ఆలోచించలేక పోయాడు. అయినా మస్తిష్కం వూరుకోలేదు. మళ్ళీ ఆలోచనలు ముసురుకున్నాయి.

"ఇతనిని ఎప్పుడు హత్యచేశారు? ఎవరు చేశారు? ఏదైనా తమకు రహశ్యం అందచేయడానికి దొంగచాటుగా

చెప్పుకోండి చూద్దాం?

1. పేల్చబడిన ఒక బుల్లెట్ అయిస్ గడ్డను చీల్చుకుంటూ వెళ్ళగల్గుతుందా?

2. రివాల్వర్‌కు సైలెన్సర్ అమర్చిన తర్వాత దాని "ఒరిజినల్" స్పీడులో ఏదయినా మార్పు కల్గుతుందా?

3. హిస్టీరియా జబ్బు వుండి నిద్రలో తనకు తెలియకుండానే హత్యలు చేయవచ్చునేమో ననుకున్న ఒక వ్యక్తి గురించి డాక్టరుకు తెలిసివుండికూడా పోలీసులకు రిపోర్టు చేయకపోవడం నేరమవుతుందా?

4. ఒక దళసరి రేకుపలక చాటుగా వున్న వ్యక్తిని, ఆ రేకును చీల్చుకుంటూ వెళ్ళిన బుల్లెట్ తగల కలుగుతుందా?

5. పేల్చబడిన ఒక బుల్లెట్ శరీరంలోకి ఎంతదూరం వెళ్ళగలదు?

6. కాలిన బూడిదను పరీక్షించి అది దేనివల్ల ఏర్పడిన బూడిదో తెల్సుకోవచ్చా?

7. రీలీజ్ అయిన ఒక బుల్లెట్ తల వెంట్రుకలకు తగులుతూ దూసుకుపోయింది. అపుడు ఆ వెంట్రుకలకు ఏవయినా ప్రమాదమా?

—కె. చందర్‌రావ్.

జవాబులు :

1. కొంచెందూరం వెళ్ళి మధ్యలోనే ఆగిపోతుంది. 2. కల్గదు. దాని స్పీడే ఉంటుంది. 3. నేరమే. 4. తగలదు. దానికి ఎముక తగిలేంతవరకు. 6. స్పెక్ట్రోస్కోపిక్ "ఎనాలిసిస్" వల్లా తెల్సుకోవచ్చు. 7. బుల్లెట్ తగిలిన మేరకు వెంట్రుకలు కాలిపోతాయి.

వస్తున్న ఇతనిని వెంబడించి బాత్‌రూంలోనే హత్యచేశారా? లేక తమను భయపెట్టడానికి ఎక్కడో హత్య చేసి శవాన్ని 'షో' చేస్తున్నారా?

వెంటిలేటర్ గుండా బయటకు చూశాడు. ప్రక్కనే స్టీల్ వాటర్ పైప్ క్రిందవరకూ వుంది. శవాన్ని ఎత్తుకొని వాటర్‌పైప్ ద్వారా పైకి రావడం అసంభవం! ఇకపోతే ఇతన్ని బాత్‌రూంలోనే హత్యచేసి హంతకుడు వాటర్‌పైప్ ద్వారా క్రిందకు దిగి పారిపోవడానికి అవకాశం వుంది.

చటుక్కున ధర్మేంద్ర దృష్టి ఒక చోటు ఆగిపోయింది. అక్కడ సగం త్రాగి వదిలేసిన సిగరెట్ పీక వుంది. బహుశా హతుడుకానీ, హంతకుడుగానీ వెంటిలేటర్ గ్లాసు వూడదీస్తూ మధ్యలో త్రాగుతున్న సిగరెట్ అక్కడ పెట్టి మర్చిపోయి వుంటాడు!

మెల్లగా కర్చీఫ్‌తో సిగరెట్ పీకను తీసి జేబులో వేసుకున్నాడు.

గదిలోకి వచ్చి జరిగినదంతా చెప్పాడు ధరేంద్ర.

బాత్‌రూంలోకి వెళ్ళి శవాన్ని నిశితంగా పరిశీలించిన ఎస్. బి. డి. కమల్‌నాథ్ అదిరిపోయాడు.

"మిష్టర్ ధర్మేంద్ర!" అన్నాడు కంగారుగా ఆయన ముఖం ఆశ్చర్యంతో పెద్దదయింది.

"వాట్‌సార్? అంత ఆశ్చర్యపోతున్నారు. కొంపతీసి ఇతను...."ఆందోళనగా అడిగాడు ధర్మేంద్ర.

"ఎస్ మిష్టర్ ధర్మేంద్ర! ఇతను మా ఏజంట్! అంతే కాదు, X లైట్ వివరాలు తెలుసుకోవడానికి నియమించిన స్పెషల్ స్క్వాడ్‌లో ద్వితీయ సభ్యుడితను. ఇటీవలే కొన్ని

సప్లిమెంట్ పోటీ-19 [ఫలితాలు]

ఏప్రిల్ '76 నెల "సప్లిమెంట్ పోటీ_19" కి సరియైన జవాబు :

S	T	Q	R	P

పై విధంగా సరియైన జవాబు ఒకే ఒక్కరు వ్రాశారు. వీరికి జూలై '76 నెల నుండి ఒక ఏడాది పాటు "సప్లిమెంట్" ఉచితంగా పంపగలము.

బహుమతి పొందిన విజేత:—

శ్రీ వి. కృష్ణమూర్తి,
ప్రిన్సిపాల్,
శ్రీ లక్ష్మీచెన్నకేశవ టైప్ రైటింగ్ అండ్
షార్టుహాండ్ ఇన్‌స్టిట్యూట్,
శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ - 518102,
(కర్నూలు జిల్లా.)

నూతన విషయాలు కనుక్కున్నానని, వాటికి పటిష్టమైన ఆధారాల కొరకు అన్వేషిస్తున్నానని హెడ్ క్వార్టర్స్‌కు మేసేజ్ పంపాడు. ఆ తరువాత అతని దగ్గరనుండి ఏ విధమైన సమాచారం అందలేదు. చివరకు ఏజంట్ నంబర్ టూ ఈ రకంగా కన్పించడం చాలా దురదృష్టకరం" కమల్‌నాథ్ కంఠంలో బాధ ప్రతిధ్వనించింది.

"అయామ్ వెరీసారీ మిష్టర్ కమల్‌నాథ్!" అన్నాడు ధర్మేంద్ర.

ఇరువురూ రెండు క్షణాలు మౌనం వహించారు.

"మిష్టర్ కమల్‌నాథ్! ఏజంట్ నంబర్ టు X లైట్ గురించి ఏదో ముఖ్యమైన సమాచారమునే తెలుసుకున్నాడు. ఆ సమాచారమును మనకు అందచేయాలనే ప్రయత్నంలో వుండగానే దుండగులు వెంటాడి వేటాడారు. చివరకు వారి ధ్యేయం నెరవేరింది. మనల్ని కలుసుకోలేక పోయాడు" తీవ్రంగా ఆలోచిస్తూ అన్నాడు ధర్మేంద్ర.

అదే సమయంలో గణగణమంటూ ఫోన్ మ్రోగింది. విసురుగా వెళ్ళి రిసీవర్ అందుకున్నాడు ధర్మేంద్ర.

"హల్లో ధర్మేంద్ర!మా బహుమానం అందుకున్నారుగా!" బొంగురు గొంతు విన్పించింది నవ్వుతూ.

"మిష్టర్! ఎందుకంత ఘోరంగా అతన్ని హత్య చేశారు?" ప్రశ్నించాడు ధర్మేంద్ర.

పకపక నవ్వాడు ఆ వ్యక్తి. "రాస్కెల్! మా గురించి కూపీ తీయడానికి ప్రయత్నించాడు. చివరకు కుక్కచావు చచ్చాడు. మాకు ఎదురు తిరిగి ప్రవర్తించేవారు ఇలాగే పరలోకానికి సోపానాలు వేసుకోవలసినదే!''

"అంటే నన్ను బెదిరిస్తున్నావా?''

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 లకే మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇప్పటికి వెయ్యికి పైగా సభ్యులు చేరారు. వెంటనే మీరూ చేరండి.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు రు. 5/- లు పంపవలసి వుంటుంది. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 (అన్నిఖర్చులతో)లకే ప్రతి నెలా వి.పి. ద్వారాగాని, మా ఏజెంట్ ద్వారాగాని పంపుతాము. మీ ఇంటిదగ్గరే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చు.

4. కాపీలు మీకు నెల నెలా రెగ్యులర్‌గా పంపబడతాయి. ఏ నెలలోనైనా కాపీలు తీసుకోకపోతే మీ సభ్యత్వం రద్దవుతుంది.

5. మీ చిరునామా మారితే వెంటనే తెలియజేయాలి.

6. సభ్యులకు ఏవైనా పాతకాపీలు కావలిస్తే వాటిని కూడ వి. పి. ద్వారా పంపగలము.

7. ప్రస్తుతము ఈ క్రింది సెంటర్లలో ఏజెంట్ ద్వారా 'హోమ్ డెలివరీ' ఏర్పాటు వున్నది: రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణం, హైద్రాబాదు, అనకాపల్లి, తెనాలి, వరంగల్, కరీంనగర్, సీలేరు ప్రాజెక్టు, శ్రీశైలం ప్రాజెక్టు, విజయవాడ, హిందూపురం, తాడేపల్లిగూడెం, గుంటూరు, నెల్లూరు, భీమవరం, బెల్లంపల్లి, నంద్యాల, సూర్యాపేట, కర్నూలు.

"బెదిరించడం లేదు. లాలిస్తున్నాను. ఇకనైనా నువ్వు కేసు నుండి విరమించుకో!"

"ఛీ! దుర్మార్గుడా! మా ఏజంట్‌ను అంత దారుణంగా హత్యచేసిన మిమ్మల్ని సజీవంగా పట్టుకొని వురికంబానికి ఎక్కించకపోతే, అప్పుడు విరమించుకుంటాను కేసునుండి దీనికి ఫలితం త్వరలోనే అనుభవిస్తావ్!"

"ఆల్‌రైట్! నీతో మాట్లాడటం గుడ్డివాడికి నక్షత్రాలు చూపడమే! ఆవేశపడకు. నీకు మరో ఛాన్స్ ఇద్దామనివుంది. శక్తి వుంటే కాచుకో! ఈ రోజు రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకు పాత బస్తీలోని సేట్ రతన్‌లాల్ వజ్రాల షాపును దోచుకుంటాం! చేతనైతే నీ సత్తా అక్కడ చూపించు గుడ్‌బై."

అవతలవైపు క్లిక్‌మనగానే అసహనంగా ఫోన్ పెట్టేశాడు ధర్మేంద్ర! అతని మనస్సు పరిపరివిధాల ఆలోచిస్తోంది. వెంటనే మళ్ళీ ఫోన్ వద్దకు వెళ్ళి పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌చేసి ఇనస్పెక్టర్ రంజన్‌ని నూతన బలగంతో సహా వెంటనే రమ్మని చెప్పాడు.

సీక్రెట్ బ్రాంచ్ డైరెక్టర్ ఏజంట్ శవాన్ని నిశితంగా పరిశీలిస్తున్నాడు. ఆ వ్యక్తి ముఖం నిశ్చలంగా వుంది. గుండెలపై కత్తితో రెండు పోట్లు పొడిచి, మూడోసారి కత్తిని బలంగా గుండెల్లోకి దింపాడు.

అప్పటికే అతని ప్యాంటు జేబులూ, కోటు జేబులూ సెర్చ్‌చేశారు. అవసరమైన కాగితాలు ఒక్కటీ దొరకలేదు. పాకెట్స్ అన్నీ కాళీగా వున్నాయి. బహుశా అన్నీ హంతకుడు తీసుకెళ్ళిపోయి వుంటాడు.

"అన్నట్లు మరిచాను సార్! బాత్‌రూంలో వెంటిలేటర్

అపరాధ పరిశోధన పోటీ-95

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-6-'76 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '76 నెల సంచికలో ప్రకటిస్తాము. *

1. మొట్టమొదటిసారిగా 'గ్రామఫోన్ రికార్డు'ను కనిపెట్టిన దెవరు? (బెర్లినర్, గ్రీనే.)

2. సినిమాకు వెళ్ళితే అవస్థ___? (పిల్లలతో, ఒంటరిగా.)

3. వీళ్ళు 'జలగ' లాంటి వాళ్ళు___? (అధిక సంతానం, అప్పులవాళ్ళు.)

4. 'పత్రిక' పెట్టాలంటే ఇది కావాలి___? (పెట్టుబడి, పలుకుబడి.)

5. ఇది ఎక్కువైతే తట్టుకోలేరు కొందరు___? (సంతోషం, దుఃఖం.)

వద్ద ఒక సిగరెట్ పీక దొరికింది. ఈ బ్రాండ్ మీ ఏజంట్ ఉపయోగించేదేనా? కాకపోతే దీనిపై వేలి ముద్రల ద్వారా హంతకుని ఆచూకీ తీయవచ్చు" కోటు జేబులోనుండి కర్చీఫుతో ఆ సిగరెట్ పీకను తీసి టీపాయ్ మీద పడేశాడు ధర్మేంద్ర.

ఆ సిగరెట్ పీకను చూశాడు కమల్‌నాధ్. విల్స్‌ఫిల్టర్! పరీక్షగా చూశాడు. ప్రక్కన 'ఎస్' వుంది. ఏజంట్స్ ఏ సిగరెట్ వాడినా ప్రక్కన 'ఎస్' అనే అక్షరం నోట్ చేస్తుంటారు. అది వాళ్ళ కోడ్ సింబల్!

"ఇది మా ఏజంట్ వాడిన సిగరెట్. ఇందులో సందేహం లేదు."

"బాడ్‌లక్! కనీసం హంతకుడి గురించి ఒక క్లూ అన్నా ఈ సిగరెట్ పీక ఇస్తుందని ఆశపడ్డాను. అయితే ఇది వృధా అన్నమాట!" ఆష్‌ట్రేలో కుక్కబోయాడు ధర్మేంద్ర!

ఏదో గరగరమంది. చటుక్కున ఆగిపోయాడు. ఆశ్చర్యంగా సిగరెట్ పీకను పైకి తీశాడు. ఫిల్టర్ చుట్టూ వున్న కాగితాన్ని వేరు చేశాడు. లోపల చిన్న మైక్రోఫిల్మ్‌రోల్ అంగుళం సైజులో వుంది.

ధర్మేంద్ర కళ్ళు మెరిశాయి.

"కమల్‌నాధ్!" ఆనందంగా అరిచాడు.

"మిష్టర్ కమల్‌నాధ్! ఏజంటు నంబర్ టూ తన కర్తవ్య నిర్వహణలో విజయం సాధించాడు. తను అందచేయ దలచుకున్న సమాచారాన్ని మైక్రోఫిల్మ్ ద్వారా సిగరెట్ పీకలో అమర్చి, ప్రమాదాన్ని శంకించి వెంటిలేటర్ వద్దనే వదిలేశాడు." అంటూ ఆ ఫిల్మ్‌ను ఎస్. బి. డి. కి అందించాడు ధర్మేంద్ర.

(సశేషం)

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల10వ తేదీలోపల మాకు చేరేట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హో౦.డె. సభ్యులు తమ నెంబరును స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమవ్యాఖ్యలతో 30 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. ★

గత నెల పోటీ ఫలితాలు

(1) మే '76 నెల "అపరాధ పరిశోధన" మాస పత్రిక ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

మనిషి అంతరిక్షంలో!

మృగం అంతిమక్షణంలో!!

పంపినవారు: శ్రీ కాసారపు సంజీవయ్య, 5-3-18, పోచమ్మవాడ, జగిత్యాల, కరీంనగర్ జిల్లా.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

కలిగెను మోహం!

రగిలెను క్రోధం!!

పంపినవారు: శ్రీమతి పి. రత్నకుమారి, కేరాఫ్— పి.ఎల్.ఎస్.బాబా, బి.కాం., అకివీడు, (ప.గో.జిల్లా.)

తెలుపులు

ఈ నెల "అపన"లో చాలా భారీ ఎత్తున మార్పు తీసుకొచ్చారు. శీర్షికలు తీసివేసి, అన్నీ కథలు ప్రింటు చెయ్యడం బావుంది. కాని బొమ్మలు లేకపోవడం వలన కొద్దిగా వెలితిగా వున్నట్లు అనిపించింది. ఏమైనా ధైర్యంగా ఈ మార్పులు తీసుకువచ్చినందుకు మీరు అభినందనీయులు.

—సి. హెచ్. శ్యాంబాబు, విజయవాడ.

మే 76 నెల "అపన" పత్రిక ఎంపైర్‌లీ క్రైమ్ స్టోరీస్ మ్యాగజైన్‌లా వుండటం ఎంతో సంతోషపరిచింది. కథల్లో మాకు నచ్చినవి—రక్తంలేని శవాలు, నకిలీ హత్య, నిరుద్యోగి - దొంగ సర్టిఫికెట్. సప్లిమెంట్ నవలలన్నీ ఆణిముత్యాల్లాంటివి.

—సి. హెచ్. గంగరాజం, బొంబాయి-8

"అపన"లో మీరు ప్రవేశపెట్టిన మార్పులు చాలా బాగున్నవి. మిమ్ములను ఎలా అభినందించాలో తెలియటం లేదు. కొన్ని శీర్షికలు లేనంత మాత్రాన బాధపడవలసిన పని లేదు. పత్రికా రంగంలో మీరు తీసుకొస్తున్న కొత్త కొత్త పద్ధతులకు చాలా థాంక్స్.

—జె. ఆర్. కలాగ్గి, చీరాల.

మే నెల "అపన" చూచి ఆశ్చర్యపోయాను. మామూలు శీర్షికలు లేవు. అన్నీ కథలే. పదకొండు కథలు వేసి పాఠ